# దిగంబర కవులు



నగ్నముని
నిఖిలేశ్వర్
జ్వాలాముఖి
చెరబండరాజు
భైరవయ్య
మహాస్వప్న

సాహితీమిత్రులు

Regd. No. 48/2012/IV

మూడు కవితా సంకలనాల ఏకైక సంపుటి

# దిగంబర కవులు

నగ్నముని
నిఖిలేశ్వర్
జ్వాలాముఖి
చెరబండరాజు
భైరవయ్య
మహాస్వప్న

"మానసిక దిగంబరత్వం కోసం నిత్య సచేతన ఆత్మస్ఫూర్తితో జీవించడమే మా అశయం. శ్వాసించే ప్రతి వ్యక్తితో సారూప్యం చెంది, వ్యక్తి అస్తిత్వ పరిరక్షణ కోసం, అంతరంగంలో అణగి పడి వున్న ఆరాటాన్ని, అసంతోషాన్ని, విసుగును అక్షరాల్లో వ్యక్తీకరించి నూతన విశ్వాసాన్ని, ఆశను కలిగించాలని మా తత్పరత."

– *దిగంబర కవులు.*

సాహితీమిత్రులు
Regd. No. 48/2012/IV విజయవాడ.

**DIGAMBARA KAVULU**
Free verse
by
Nagnamuni, Nikhileswar, Jwalamuki,
Cherabandaraju, Bhairavayya and Maha Swapna

*First Volume* : May 1965
*Second Volume* : Dec. 1966
*Third Volume* : June 1968

Three numbers in one volume : *March 1971*
*Published by : M. Seshachalam & Co., Madras*

*Recent volume : 28th August 2016*
*Published by :*
**SAHITI MITRULU** - VIJAYAWADA
28-10-16, Maszid Street, Arundalpet,
Karlmarx Road, VIJAYAWADA - 520 002
Ph. : 0866 2433359, Cell : 93929 71359

*Cover Design :* A. GIRIDHAR

*For Copies* :
**Navodaya Publishers**, Karl Marx Road, Vijayawada - 2 Ph. 0866 2573500
**Navodaya Book House**, Kachiguda, Hyderabad
**Prajasakti Book House, A.P.** and its All Branches
**Visalandhra Publishing House, A.P.** and its All Branches
*e book : www.kinige.com*

*Printed at :*
**Sri Sri Printers**
VIJAYAWADA - 520 002
Cell : 9490 63 4849

**₹ 200**
**$ 10**

# యాభై ఏళ్ళ చరిత్ర
# నలభై అయిదేళ్ళ నిరీక్షణ...

తెలుగు ఆధునిక కవిత్వంలో దిగంబర కవిత్వం చూపిన ప్రభావం, ఇచ్చిన ప్రేరణ, కలిగించిన సంచలనం మరిచిపోలేనిది. దిగంబర కవిత్వం ఆరుగురుతో మొదలైనా ఇరుగుపొరుగు భాషల్లోకి ప్రవహించింది. ఒక అర్థశతాబ్ది చరిత్ర కలిగిన ఒక ఉద్యమ కవిత్వం నిరంతరం పాఠకులకు అందుబాటులో ఉన్నప్పుడు మాత్రమే ఆ సమాజ, సాహిత్యాలు ఆరోగ్యకరంగా ఉన్నట్లు లెక్క. దిక్‌ల పేరిట దిగంబరకవులు వెలువరించిన మూడు సంపుటాలను కలిపి యం. శేషాచలం అండ్ కంపెనీ ఒకే సంపుటిగా ప్రచురించింది. కనీసం నాలుగు దశాబ్దాలుగా దిగంబర కవిత్వం ఒక సంపుటిగా అందుబాటులో లేకుండా పోయింది. కవిత్వాభిమానులైన వ్యక్తుల దగ్గర, పేరు, ప్రఖ్యాతులు గల గ్రంథాలయాల్లో తప్ప దిగంబర కవిత్వం దొరకటం లేదు. ఈ స్థితి సాహితీమిత్రులను అమితంగా కలవరపరిచింది.

నేడు తెలుగు సాహిత్య సంవేదనలు ప్రాంతీయమైపోయాయి. పెట్టుబడిదారీ సమాజం కార్పొరేట్ శక్తుల పెను విజృంభణతో మహావేగంగా విస్తరించి ఉనికిని చాటుతోంది. ఉదార ప్రజాస్వామ్యం వ్యక్తుల, వ్యవస్థల పోరాటాలను నీరుగార్చి, నిర్వీర్యం చేసింది. ఈ నిర్వీర్యత మీద, నిష్ఫలత్వం మీద, సమాజ, సాహిత్య, రాజకీయ దృక్పథాల డొల్లతనం మీద దిగంబరులు నిర్దయగా తమ అసంతృప్తిని చాటారు. ఈ అర్థ శతాబ్ది కాలంలో ప్రవర్తిల్లిన భిన్న సామాజిక, సాహిత్య వాదాలు, ఉద్యమాలు, దోరణులలో దిగంబరత్వం దర్శనమిస్తూనే ఉన్నది.

గుర్తింపు రాజకీయ ఉద్యమాలు సైతం పోరాడినంతకాలం పోరాడి భావజాల అలసటకు గురైన వాతావరణం నేటి సాహిత్యంలో కనిపిస్తున్నది. దిగంబరులలాగా విస్ఫోటించే ఉద్యమమొకటి తెలుగు సమాజ, సాహిత్యాలకు బహుధాఅవసరం. అటువంటి ఉద్యమం వెల్లువెత్తుతుందనే ఆశ ఒకటి మాలో మిగిలే ఉంది.

దిగంబర కవిత్వం పట్ల ఎంతో ప్రేమతోనూ, ఈనాటి సాహిత్య అవసరం దృష్ట్యానూ సాహితీమిత్రులు ఈ కవిత్వాన్ని ప్రచురిస్తున్నది. కొత్త తరహా కవిత్వం రావడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. కొత్త మలుపు తిప్పే కవిత్వ శక్తి, సామర్థ్యాలున్న కవులు ఎందరో ఉన్నారు. కొత్త కవులు సరికొత్తగా పుడుతున్నారు. అయినా ఏదో తెలీని నిస్త్రాణ, నిర్లిప్తత. జఢత్వాన్ని దూరం చేస్తూ వెర్రి గొంతుక ఒకటి నినదించాల్సి ఉంది. ఈ గొంతును అన్వేషించే మార్గంలోనే దిగంబరులు దొరికారు. నిజమే దిగంబరులది పైత్యం కాదు కవిత్వం! అవున్నిజమే దిగంబరులు బాగు చేస్తే తప్ప బాగు కానంతగా సమాజం పతనమై ఉంది.

అటువంటి బాగును ఆశించి ఈ సంపుటి ప్రచురిస్తున్నాం. ఇందుకు మాకు సహకరించిన నగ్నముని, నిఖిలేశ్వర్ గార్లకు ప్రత్యేక కృతజ్ఞతలు.

**– విశ్వేశ్వరరావు**

# వాళ్ళారుగురు... మనం నలుగురుం... ఇంకా అనేకులు...

1955 జూలై 30, 31 తేదీల్లో విజయవాడ షాహెన్‌షా మహల్లో ఆంధ్ర అభ్యుదయ రచయితల ఐదవ మహాసభ జరిగింది. ఈ మహాసభకు శ్రీశ్రీ అధ్యక్షులు. తన అధ్యక్షోపన్యాసం ప్రారంభంలోనే ఆయన ఈ విధంగా ఆనాటి పరిస్థితులను వివరించారు. "ఎటు తిరిగినా ఏదో నిస్త్రాణా, ఏదో నిస్పృహ! ఫౌల్ చేసి, గోల్ చేసి గెలిచిన ప్రతీపశక్తులు పట్టపగ్గాలు లేకుండా విజృంభిస్తున్నాయి. అయిదారేళ్లకు పూర్వం అభ్యుదయ రచయితల సభల్లో పువ్వుల దండల్ని వేయించుకొని పెళ్ళి కొడుకుల్ని చేయించుకొని జయజయ ధ్వానాల మధ్యన ఊరేగిన మిత్రులు కొందరీనాడు క్షుద్ర ప్రయోజనాల మరు మరీచికల వెంటపడి ఉద్యమ విచ్ఛిత్తికి దారితీస్తున్నారు. సరియైన నేతృత్వం లోపించడం వల్ల యువకుల తరంలో కూడా ప్రమాద భరితమైన ఒకానొక నిరుత్సాహ నిరాశా ధోరణి తలయెత్తుతూన్న సూచనలు కనబడుతున్నాయి"[1]

దిగంబర కవుల రాకడకు ముందు దశాబ్దంలోని పరిస్థితులు ఏమిటో శ్రీశ్రీ వ్యాఖ్యానం ద్వారా తేటతెల్లమవుతున్నాయి. తెలుగు సాహిత్య చరిత్రలో 1955 ఒక కొండగుర్తు. 1955–1964 వరకు ఒక దశాబ్ది కాలం వరకు పరిస్థితులలో పెద్దగా మార్పులు ఏమీ లేవు అని నిర్ధారించటం తొందరపాటవుతుంది కాని, సాహిత్యంలో ఒక నిలకడస్థితి, దృక్పథ రాహిత్యం. రెండూ కవులను బాధించాయి.

ఒక దశాబ్దపు దృక్పథ రాహిత్య భారాన్ని మోసిన దిగంబరకవులు
“అభ్యుదయ కవీ నల్లమందు తిని నిద్రపోయావ్
నయాగారా జలపాతంలో
దూకలేకపోయిన అన్నయ్యా
గుడ్ బై! మీ కందరికి సలామ్ వాలేకమ్
వచనం లేదు!
కవిత్వం అంతకంటే లేదు”   (నిఖిలేశ్వర్ – ఆత్మమోని)

అని నిర్ద్వంద్వంగా ప్రకటించడంలో వెనుకాడలేదు.

జ్వాలాముఖి :

“నాగరికత నిగనిగల కౌగిలిలో
మైమరచి మైకం కమ్మిన, నేటి వ్యామోహపు
పతిత జాతికి చేరచి చూపాలనుంది;
జాగృతికై ధ్వంసరచన చేయాలనుంది” అన్నాడు.

భైరవయ్య :

“మనిషిలో అట్టడుగున బురదగుంట్లో
పడివున్న మనీషిని లేవదియ్యడం
ఎముకల లోతుల్లో ధ్వనించే
స్వచ్ఛమైన గీతాల్ని ప్రతిధ్వనించడం
కళ్ళ వెనుక దాగివున్న
సిసలైన కన్నీళ్ళని ప్రసరించడం
సహజమైన భావాల్ని ఒడుపుగా పట్టడం
పెదాల కొసల్లో
చిక్కటి చిరునవ్వుల్ని మొలిపించడం
నిజాన్ని నిజంగా నగ్నంగా చెప్పడం”గా పేర్కొన్నాడు

ఆయనే మరికొంత వివరించాడు

“ఇవి నిజాలు

నిత్యం మండే యదార్థాలు
ఆడదాని ప్రసూతి వేదనలా
జీన్ వార్జీన్ ఆకలిమంటలా
ఎదిగి చేతికందిన కొడుకు
యముడి పరమైతే
తల్లడిల్లే విధవ తల్లి గర్భ శోకంలా
సూటిగా నగ్నంగా చెప్పబడే సత్యాలు" (భైరవయ్య - దిగంబరి)

చెరబండ రాజు :

"కలాలు కాగితాలు సర్దుకోండి
లా బుక్కుల్లో నా సందేహాలు వ్రాసుకోండి
న్యాయానికి దేశాలేమిటి? యెల్లలేమిటి?
మనిషీ, రక్తం, ప్రాణం ముఖ్యం
లింగభేదాలు వాదాలు తప్పితే
మందిర్, మజ్జిద్, చర్చి
మతాధికారులు మతాలు యెందుకు?
ఆకలి, కామం, కలలూ, కన్నీళ్ళు,
మనిషిలోని మర్మజ్ఞానమంతా ఒక్కటే
దేశమేదైతేనేం? మట్టంతా ఒక్కటే
అమ్మ యెవరైతేనేం? చనుబాల తీపంతా ఒక్కటే
బిక్క ముఖాలతో చూస్తారేం?
పిచ్చివాణ్ణిగా కేసు పుటప్ చెయ్యండి
నన్నెకనివ్వండి బోను" అంటూ ధిక్కరించాడు.
సిసలైన న్యాయస్థానం కొరకు అన్వేషించాడు.

ఇక మహాస్వప్న "చరిత్ర నిద్రా సముద్రంమీద తుఫాన్‌లాగా, కాలం వాయులీనం మీద కమానులాగా, విప్పుకుంటున్న మూడో కన్నులాగా, నేను వస్తున్నాను దిగంబర కవిని
స్థంభించిన కవితాస్తంభం బ్రద్ధలై పుట్టుకొస్తున్న ఉగ్రనగ్న నరకేసరిని

నాటేసిన చెట్లను నడిపించేందుకు
పాతేసిన రాళ్ళని పలికించేందుకు
గోరీల్లో శవాలకి పునరుత్థానం కలిగించేందుకు
వికృతాకారపు శిలల్ని మానవులుగా మలిచేందుకు
మరణించిన భగవంతుడికి ప్రాణం పోసేందుకు"
అని దిగంబర కవి రాకడలోని ఉద్దేశాన్ని తెలిపాడు.

సుఖాన్ని, స్వార్థాన్ని రోగంగా గుర్తించిన నగ్నముని తనకు జాతి తప్ప ద్వేషం లేదని స్పష్టంగానే చెప్పాడు.

"నిజాన్ని చెప్పలేక నిర్మలంగా బతకలేక
ముసుగుని ముఖం నిండా కప్పుకున్న
బురదని భాషనిండా పులుముకున్న
నిన్ను చూస్తే నాకెందుకు ద్వేషం
నీ చుట్టూ విషకీటకాలు నిర్జనారణ్యాలు సంచరిస్తున్నా
నీ ఒంటినిండా పలుకుబడి రసికారుతున్నా
నిన్ను ప్రేమిస్తాను
నిన్ను మంచితనంతో భయపెడతాను
నీ బొమికల్ని హడల గొడతాను
నీ కలల్లో కల్లోలం రేపుతాను
ఊఁ ! లే !
ముసుగు తొలగించు
ఈ కంపు కొట్టే బట్టల్ని విప్పి
ఆత్మముందు నిలబడి నిన్ను నువ్వు చూసుకో
మనిషిలా మంచిగా ఆకాశంలా అవనిలా
బతుకు
తెరిచిన కళ్ళు యింక మూయకు
చెప్పడానికి నువ్వెవరని గొంతు నొక్కడానికి ప్రయత్నించకు!" (నగ్నముని – సుఖరోగి)

అని తొలి సంపుటంలోనే ఒక హెచ్చరిక చేశాడు.

ఒక దశాబ్దంపాటు నిర్లిప్తత ఆవరించి పరిస్థితులు, సామాజిక, రాజకీయ స్థితిగతులు నానాటికీ దిగజారిపోతూ పతనావస్థకు చేరుకున్న దశలో దిగంబరులు గొంతు విప్పారు. నిజానికి స్వాతంత్ర్యానంతరం సంభవించిన మార్పుల కారణంగా ప్రజల జీవన విధానంలో, విలువల పట్టింపు, పాటింపుల్లో మార్పులు రాసాగాయి. ఆర్థిక, రాజకీయ వ్యవస్థలు మారాయి. కొత్త సమస్యలు ఉత్పన్నమవుతూ ఉన్నాయి. పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారీ వర్గం బలం పుంజుకొని నిలదొక్కుకుంటోంది. వీరి ప్రభావం రాజకీయరంగంపై పడుతూ ఉన్నది. స్వాతంత్ర్యం, సమానత్వం, స్వేచ్ఛ మొదలైనవి బలహీనవర్గాల దాకా చేరలేదు. సంఘర్షణ ఒకటి నిరంతరం సమాజాన్ని ఆవరించే ఉన్నది. స్వతంత్ర భారతదేశం సాధించేందేమీ లేదన్న అసంతృప్తి కూడా అధికం కాసాగింది. స్వాతంత్ర్యానంతరం భారతదేశాభివృద్ధిని గురించిన భ్రమలు అటు కవులు, మేధావుల్లోనూ తొలగటం మొదలైంది. రాజకీయ స్వేచ్ఛకీ, సామాజికాభివృద్ధికీ ఎటువంటి సంబంధం లేదన్న అంశం బోధపడసాగింది. రాజకీయంగా స్వేచ్ఛని పొందినంత మాత్రాన ఆకలి, అజ్ఞానం, నిరక్షరాస్యత లాంటి సమస్యలు సమసిపోయేవి కావని బోధపడసాగింది.

1947 మొదలుకొని 1955 వరకు జరిగిన రాజకీయ సామాజిక సాహిత్య పరిణామాల ప్రభావం అభ్యుదయ కవిత్వోద్యమంపై ప్రసరించింది. అభ్యుదయ కవిత్వోద్యమం పూర్తిగా నిర్వీర్యం కావటానికి దారితీసినవి ప్రధానంగా ఇవి :

1. **1946 - 51** వరకు సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో కమ్యూనిస్టు పార్టీలో తలెత్తిన సైద్ధాంతిక విభేదాలు.
2. స్వాతంత్ర్యానంతరం మారిన సామాజిక, రాజకీయ పరిస్థితుల దృష్ట్యా కాలావసరాన్ని బట్టి కర్తవ్యాన్ని నిర్వర్తించటంలో వైఫల్యం.
3. రాజకీయ చైతన్యంలో వచ్చిన మార్పులు, కొత్తగా ఏర్పడిన దృక్పథాలు.
4. నెహ్రూ చూపిన ప్రజాస్వామ్యం, సామ్యవాద వ్యవస్థల సమన్వయ మార్గం పట్ల అభ్యుదయ కవులు చూపిన మొగ్గుదల.
5. వర్గ దృక్పథాన్ని విడిచి, శ్రామికవర్గ పక్షపాతాన్ని విస్మరించి వర్గ స్వభావాన్ని కోల్పోవటం.

6. అభ్యుదయ కవుల మధ్యతరగతి మనస్తత్వం.
7. 1955 ఎన్నికల సందర్భంగా చెలరేగిన సాహిత్య కల్లోలం, ఆంధ్రపత్రిక / ఆంధ్రప్రభల వినాశకర పాత్ర, వివాదం.
8. అభ్యుదయ రచయితల సంఘం నిర్దేశించుకున్న లక్ష్యాలకు తగ్గస్థాయిలో పనిచేయకపోగా తద్విరుద్ధంగా పనిచేయడం.

అభ్యుదయ కవిత్వోద్యమం ముందుకు తెచ్చిన సామాజిక ప్రగతి, అభ్యుదయ దృక్పథం, సాహిత్య ప్రయోజనం తదితర విలువలు 1955 కే అప్రధానమై పోయాయి. 1955 నుంచి దిగంబరుల దాకా తెలుగు కవిత్వంలో దృక్పథ అన్వేషణాదశ కొనసాగింది. ముఖ్య అభ్యుదయ కవులంతా సాహిత్య రంగాన్ని వదిలిపెట్టి సినిమా రంగాన్ని ఆశ్రయించారు. 1955 ఎన్నికల ఫలితాలు తారుమారు కావటం వల్ల నిస్పృహలోకి జారిన కమ్యూనిస్టు పార్టీ పట్ల అభ్యుదయ కవుల ఆసక్తి కొనసాగలేకపోయింది. అయితే దాశరథి 'మహాంధ్రోద్యమం' (1955), సి. నారాయణరెడ్డి 'నాగార్జున సాగరం' (1955) కుందుర్తి ఆంజనేయులు 'తెలంగాణా' (1956) విద్వాన్ విశ్వం 'పెన్నేటి పాట' (1956) రెంటాల 'సర్పయాగం' (1956), మాదిరాజు రంగారావు 'కిర్మీరం' (1957) సుప్రసన్న 'తేజశ్చక్రం' (1958), రమణారెడ్డి 'అంగార వల్లరి' (1959) మొదలైనవి వచ్చాయి. ఉద్యమ తీవ్రత తగ్గిన కారణంగా స్వీయానుభూతులకై అన్వేషణ మొదలైంది. ఆలూరి బైరాగి, తిలక్ లాంటి కవులు తమ తమ ధోరణులలో కవిత్వం రాస్తున్నారు. ఈ కాలంలో ఏదో ఒక మేరకు అభ్యుదయ కవితా చైతన్యాన్ని నిలుపుకొని రచనలు చేసిన వారిలో సి.వి. ప్రధానంగా కనిపిస్తారు.

ఇదిలా ఉంటే 1960ల నాటికి వచన కవిత్వం అనే మాట స్థిరపడిపోయింది. కవిత్వ రూపానికి పరిమితమై చర్చలు, వాదాలు సాగుతున్నాయి. ఈ దశలో యువకులకు జరుగుతున్న చర్చలు దృక్పథాన్ని కలిగించటంలో దోహదకారులుగా ఉపయోపడుతున్నట్లు కనిపించలేదు. ఈ దశలోనే కేశవరావ్ 'ఉదయించని ఉదయాలు' ప్రచురితమైంది. దీనికి ఆరుద్ర రాసిన పీఠికలో ఇట్లా అభిప్రాయపడ్డారు "అభ్యుదయ కవుల ధర్మమా అని వర్గ చైతన్యం గురించి పాడితే తప్ప మిగతాది కవిత్వం కాదేమోనన్న అపోహ ఆంధ్రదేశంలో అనవసరంగా ఊపిరి పీలుస్తోంది". తెలుగు కవిత్వంలో రానున్న మార్పును ఆరుద్ర ముందుగానే గుర్తించి అన్నమాట ఇది.

సమాజంలో కులతత్వం, మతప్రాబల్యం అధికమవుతూ అవినీతి, బంధుప్రీతి, మనిషి స్వప్రయోజనం తప్ప సమష్టి ప్రయోజనాలవైపు దృష్టిసారించే చైతన్యం కోల్పోయి ఉన్న దశలో దిగంబరులు ముందుకొచ్చారు. వీటికి తోడుగా యువతరాన్ని ప్రక్కదారులు పట్టించే వ్యాపార సాహిత్యం, మానసికంగా ఎదగనీయని సినిమాలు, పత్రికలు, రాజకీయాలు, సాహిత్య సంస్థలు, విశ్వవిద్యాలయాలు అన్నీ వేటికవే కలుషితమయ్యాయి. మొత్తం సమాజమంతా గమ్యరహితంగా నడవసాగింది. దీని నుండి బయటపడే మార్గం కోసం కవుల వెతుకులాట సాగింది. తత్ఫలితమే దిగంబర కవిత్వం. తమ దిక్‌ల ద్వారా సమాజ, సాహిత్య రంగాలలో చలనాన్ని తెచ్చే ప్రయత్నం చేశారు. సమాజ సాహిత్యాలలో, సంస్కృతి, రాజకీయ రంగాలలో పేరుకుపోయిన నైచ్యాన్ని తొలగించే ప్రయత్నం దిగంబరులది. దీనిని గుర్తించాడు శ్రీశ్రీ. కనుకనే “అభ్యుదయ కవిత్వం ఆంధ్ర దేశంలో తన పాత్ర నిర్వహించి తెరవెనక్కి తప్పుకుంది. ఇప్పుడు కొత్త శక్తులు పెరుగుతున్నాయి. కొత్త మంటలు రగులుతున్నాయి. అభ్యుదయ కవిత్వం ఒక వెస్టెడ్ ఇంటరెస్ట్ కాకూడదు. ఇవాళ రాస్తున్న వాళ్లు దిగంబర కవులు, తిరుగుబాటు కవులు, సంఘర్షణ కవులు, చేతనైతే వాళ్ళకి చేయూతనివ్వండి, లేకపోతే నోరు ముయ్యండి” అని గట్టిగా మందలించి దిగంబర కవిత్వాన్ని సమర్థించాడు. అభ్యుదయ కవిత్వం సంక్షోభంలో పడి ఒక దశాబ్దం గడిచాక జరిగిన, జరుగుతూ ఉన్న సామాజిక మార్పులను, జాతీయంగా, అంతర్జాతీయంగా, స్థానికంగా వస్తున్న పరిణామాలను పట్టించుకోలేక అశక్తమైనప్పుడు విలువలు లుప్తమవుతున్న తరుణంలో దిగంబరుల ఉద్యమం సాగింది.

దిగంబర కవిత్వకలాపమంతా ఎన్నో అంశాలను demystify చేయటం మీద ఆధారపడి సాగింది. కేవలం దీనితో సరిపెట్టుకోకుండా తీవ్రంగా నిలదీసి ప్రశ్నించడంలోనూ, జవాబుదారీలను గుర్తించడంలోనూ దిగంబర కవిత్వశక్తి దాగి ఉంది. అన్ని రకాల సాంస్కృతిక ఆరాధనలను, భక్తి తత్పరులను దిగంబరులు ఆక్షేపించారు. సామాజిక విధి నిషేధాలు, వాటి అమలు, వీటిని నడుపుతూ నియంత్రిస్తున్న మౌలిక విలువలను సందేహించి తమ నిరాకరణనీ ప్రకటించటంలో దిగంబరుల ధాటి ఉంది. సమాజానికి రక్షణ కవచంగా ఉన్న సమాజగతిని, గమనాన్ని నిర్దేశిస్తూ ఉన్న సాంస్కృతిక నియమాలను నిరంతరంగా భంగపరచడంలో, భగ్నం చేయడంలో, వాటిని అతిక్రమించే వ్యూహాలను తమ కవిత్వం ద్వారా రూపొందించి ఇవ్వడంలో దిగంబరుల నైతిక బలం ఉంది.

ఎవరిని తాము సంబోధిస్తున్నారో వారిని తట్టి, తిట్టి లేపడంలో దిగంబరుల సాహసం ఉంది. దీనిని ఒక చికిత్సా విధానంగా భావించారు దిగంబరులు. కాబట్టే షాక్ ట్రీట్‌మెంట్ అని వ్యవహరించారు. ఈ చికిత్సకున్న పరమోద్దేశం, పరమ ప్రయోజనం విముక్తి. దేని నుంచి విముక్తం కావాలంటే – ఆయా వర్గాలు, తరగతులు, వ్యక్తులు, వ్యవస్థలు, తాము ఏ సాంప్రదాయాలకు అనాలోచిత విధేయులై ఉన్నారో, ఆ విధేయతల నుంచి బయటపడాలి. తాము బానిసలై ఉన్న హీన సంస్కృతి నుంచి వైదొలగటం, దాన్నుంచి మేలుకోవటం ఇందుకోసం వాడవలసిన పరుషపదాలను వాడారు. గాయపడాల్సినంత తీవ్రంగానే వ్యవహరించారు. ఇందుకోసం రెచ్చగొట్టారు. విషయాన్ని రట్టు చేశారు.

తొలి సంపుటి 1965 మేలో, రెండవ సంపుటి 1966 డిసెంబర్, మూడవది 1968 జూన్‌లో వెలువరించారు. మొదటి సంపుటి దిగంబరశకం నగ్న నామసంవత్సరం ఆశ ఋతువులో  ఆవిష్కృతమైంది. కాబట్టి సంకల్ప, ఉత్సాహాలే తప్ప దిగంబరుల తత్వంలో నిరాశ, నిస్పృహలు లేవని అర్థం చేసుకోవచ్చు. ఒకవేళ ఉంటే దుస్సహ బాధ ఉంది. అది పెను ఆక్రోశంగా వ్యక్త రూపం పొందుతూ ఉంటుంది. దిగంబర శకం కాలమానం ప్రకారం సంవత్సరాలు, ఋతువులు, వారు ఆరుగా పేర్కొన్నారు. ఆశ, మదిర, విషాద ఋతువులలో మూడు సంపుటాలు ఆవిష్కరణ పొందాయి. ఈ మూడు సంపుటాలకు రాసిన పరిచయ పీఠికల్లో ఎక్కడా నిరాశ, నిస్పృహలు కనిపించవు. మొదటి సంపుటి ప్రాపంచిక ఆచ్ఛాదనల్ని చీల్చుకుని కొత్తరక్తాన్ని ఇంజెక్ట్ చెయ్యడానికొస్తున్న, ధైర్య, స్థయిర్యం కేకలుగా పేర్కొన్నారు. రెండో సంపుటిలో 'ఇంకా భయం, భయంగా బానిసత్వంగ దుర్భరంగా హేయంగా ఛండాలంగా వున్న ఆంధ్ర దేశమనే మురిగ్గుంటలోంచి' పలికిన దిగంబరకవితగా చెప్పారు. మూడవ సంపుటిలో 'ప్రజల అవిద్యని అజ్ఞానాన్ని ఆశక్తతని ఆసరాగా తీసుకుని దేశాన్ని దోచుకుతినడం మరిగిన పాలకులు, సంఘంలోని వివిధ వర్గాల వాళ్లు నేడు ప్రజలపై రుద్దుతున్న 'కుష్టు వ్యవస్థ'ను ఎదుర్కొంటూ దిగంబరకవులు పలికిన దిగ్‌లను' వినిపించటంగా పేర్కొన్నారు.

మొదటి సంపుటిలోనివి దూసుకొచ్చిన కేకలు. వీటికి ఆలంబన ఈ కవుల ధైర్య, స్థైర్యాలు. ఈ కేకలు విన్న తరువాత కూడా భయాన్ని, బానిసత్వాన్ని వదిలిపెట్టని ఆంధ్ర దేశపు మురిగ్గుంటలోకి పలికిన కవితగా మారింది. మూడవ సంపుటం 'ఎదుర్కోవటం'ను ప్రధానంగా ఉద్దేశించింది. ఆయా సంపుటాల లక్ష్య ప్రకటనలో ఎక్కడా కవులు నిరాశ,

నిస్పృహలను గురించి ప్రస్తావించలేదు. దిగంబర కవిత్వం గురించి సాధికారికంగా విశ్లేషించి, వ్యాఖ్యానించే కొన్ని ప్రతిపాదనలు చేసిన వెల్చేరు నారాయణరావుకి, నగ్నమునిలో నిహిలిస్టు ధోరణి వెర్రితలలు వేసినట్లుగా ఎందుకు కనిపించిందో అర్థంకాదు. వెల్చేరు సమర్ధన 'లైంగీక ప్రతీకలు', 'అశ్లీల పద ప్రయోగం' మీద దృష్టి నిలిపిసాగింది. నిజానికి దిగంబరులలో ధర్మాగ్రహమో, ధార్మికాగ్రహమో కలగటానికి ముఖ్య కారణం 1955-64 మధ్య కాలంలో తలెత్తిన దృక్పథ రాహిత్యమని చెప్పాలి. "తెలుగు కవిత్వంలో హేయవస్తు కవిత్వం మొదలైంది దిగంబర కవులతో"[2] అన్నారు వేల్చేరు.

హేయ వస్తువు అంటూ కవిత్వంలో ప్రత్యేకంగా ఏమీ లేదని, హేయస్థితిలో సమాజం ఉందనే అంశాన్ని వేల్చేరు నిర్ధారించలేదు. ఆయనే మరొక మాట కూడా చెప్పారు. "రమణీయ వేషం వేసుకొని అకవిత్వం కవిత్వంగా చలామణి అవుతున్నప్పుడు అకవిత్వ వికృతాకృతిలో వచ్చిన కవిత్వం దిగంబర కవిత్వం" అని తేల్చారు. దిగంబర కవిత్వ లక్షణంగా చెప్పటానికిది ఉపకరిస్తుంది. దిగంబర కవిత్వం కవిత్వమేనని చెప్పాల్సినంత బలంగా చెప్పటం లేదు. దిగంబరులకు ముందటి దశాబ్దంలో అభ్యుదయ ఉద్యమ విచ్ఛిత్తి, దృక్పథ రాహిత్యం, వచన కవిత్వం ఒక రూపంగా స్థిరపడటం, కొత్త తరం కవుల రాజకీయ ఆదర్శాల అన్వేషణ తదితరమైనవి కనిపిస్తాయి తప్ప ఏ అకవిత్వమూ రమణీయ వేషం వేసుకొచ్చినట్లు కనిపించదు. ఒకవేళ అటువంటిది ఏదైనా ఉన్నప్పటికీ దానికి ప్రభావశీలత ఏమీ లేదు. ఉండదు కూడా. 'వచన కవిత'గా తమ కవిత్వాన్ని అనదలచుకోకపోవటం, అనని్వకపోవటంలోని దిగంబరుల ఉద్దేశమేమంటే ఈ పదం సమగ్రతను సమకూర్చేది కాకపోవటం. అంతకుమించి ఈ పదం లేదా పదబంధం పట్ల దిగంబరులకు అభ్యంతరం లేదు. వ్యతిరేకత ఉంది. ఉద్వేగం, భావావేశం, సంవేదన, రాజకీయ దృక్పథం, తీవ్రభావ ప్రకటన, సంకోచ బిడియాలు లేని వ్యక్తీకరణ, భావ తీవ్రతను బట్టి పదప్రయోగం, అత్యంత సహజంగా అనగలగటం, రాయగలగటం మొదలైన వాటిల్లో కవులుగా వారికున్న స్వేచ్ఛాకాంక్షను తెలుపుతుంది. అది కవిత్వమా, అకవిత్వమా, రమణీయ వేషమా? వికృతాకృతా అనే వివేచన దిగంబరులది కాదు. వారికా అవసరమూ లేదు.

స్వభావం దృష్ట్యా, లక్షణాలను బట్టి, సాధించదలచిన లక్ష్యాలను బట్టి చూస్తే దిగంబరులది ఉద్యమమే అవుతుంది స్థూలార్థంలో. సామాజిక, రాజకీయ ఉద్యమాలు అండగా లేకపోవటం, ఏదో ఒక సిద్ధాంతం లేదా వాదం భూమిక కాకపోవటం రీత్యా అప్పటి వరకు ఉద్యమాలకు

చెప్పుకున్న నిర్వచనాల ప్రకారం చూసినప్పుడు దిగంబరులది ఉద్యమంగా అనిపించదు. విమర్శకులకు ఇదొట్టి 'అలజడి'గా, 'అల్లరి'గా మాత్రమే కనిపించింది. శ్రీశ్రీలాంటి ఏ కొద్దిమందికోతప్ప దిగంబరుల పట్ల సానుకూల దృష్టి లోపించింది. దిగంబరుల ప్రయత్నం ఆనాటి పరిస్థితుల దృష్ట్యా ఒక సాహిత్య ఉద్యమ అవసరాన్ని బలంగానే గుర్తింపజేసింది. అప్పటిదాకా లేని ఒక కొత్త వ్యక్తిని దిగంబర కవిత్వం ఇచ్చింది.

దిగంబరులు రంగంమీదకు రాకముందు వెలువడిన రాత్రి కవితా సంకలనం యువతరంలో ఉన్న అలజడిని ప్రతిబింబించింది. వ్యక్తిపై కప్పబడిన ముసుగుల్ని తొలగించడం ద్వారా మానవాత్మను ఉద్ధరించవచ్చనే వ్యక్తి వాద ప్రభావ ఛాయలు దిగంబరుల తొలి సంపుటంలో ప్రబలంగానే కనిపిస్తాయి. ఒకరిద్దరు కవులలో తప్ప తొలి రెండు సంపుటాలలో మార్క్సిజం పట్ల సందేహం, సంశయం స్పష్టం. వ్యక్తి నుంచే వ్యవస్థ రూపుదిద్దుకుంటున్నదనేది దిగంబరుల నిష్కర్ష. "ప్రతి మనిషిలోను అతని అసలు స్వరూపం దీపంలా వెలుగుతూ ఉంటుంది. తన స్వరూపాన్ని మరచిపోయి వికృతంగా యీనాడు మనిషి పెరుగుతున్నాడు. కృత్రిమ ఆచ్ఛాదనల క్రింద దొంగలా బతుకుతున్నాడు" అనేది దిగంబరుల నిర్ధారణ. గర్వించదగ్గ గతమూ లేక, చెప్పుకోదగిన వర్తమానమూ కనిపించక, ఆశించదగిన భవిష్యత్తూ కానరాని స్థితిలో 'పిచ్చెత్తి ప్రవచించిన కవిత'గా తమ కవిత్వం గురించి దిగంబరుల అభివర్ణన. ఆశలు అడుగంటిపోయిన మనిషికి కొత్త ఆశ కలిగించే తత్పరత గలవారిగా తమని తాము భావించుకోవటం ఉంది. 'మానసిక దిగంబరత్వం', 'సత్య సచేతన ఆత్మస్ఫూర్తి' ఆశయంగా ప్రకటిస్తూ ఇతర మానవులలో సారూప్యం చెందటం, 'వ్యక్తి అస్తిత్వ పరిరక్షణ' లాంటి మాటలు అస్తిత్వ వాదం పట్ల దిగంబరులకు గల మొగ్గును తెలియజేస్తాయి.

పుస్తకాల్లోంచి మాట్లాడదలచుకోకపోయినా, అనుభవాలలోంచి పలకదలచు కున్నాం అని చెప్పినా, జీన్‌పాల్ సార్త్రే) ప్రస్తావన తొలిసంపుటిలో ఉంది. మనిషి సాధికారిక అస్తిత్వంతో జీవించేందుకు గల అవకాశాలను అస్తిత్వవాదం చర్చిస్తుంది. సాధికారత కోల్పోయిన వ్యక్తులు, వ్యవస్థలు ఏ విధంగా ఉంటాయో ప్రత్యక్షంగా దిగంబరులు అనుభవించారు. కాబట్టే "మంచి కోసం, మనిషిలోని నిప్పులాంటి నిజమైన మనిషి కోసం, కపటంలేని చిరునవ్వులు చిందే సమాజం కోసం, ఆహోరాత్రులు ఆరని అగ్నిలో నడిచిన ఆత్మలోంచి పలుకుతున్న గొంతుకులం" అని కుండబద్ధలు కొట్టినట్లు చెప్పగలిగారు. సాహిత్యం లేదా కవిత్వం నిర్వర్తించాల్సిన కర్తవ్యం ఏమిటో కూడా దిగంబరులు గుర్తించారు. వారు నమ్మిందేమంటే

"Literature should not be a sedative but an irritant, a catalyst provoking men to change the world in which they live and in so doing to change themselves" [David cante - Introduction - What is Lileralure (Sartre) Page : XI] ఉత్ప్రేరకంగా పనిచేయాల్సిన సాహిత్యం నిర్వీర్య స్థితికి చేరినప్పుడు కలిగిన అసహనమే దిగంబర కవిత్వంలో ప్రధానంగా కనిపించేది. సహజత్వం, స్వేచ్ఛ, మానవ అద్వితీయత, కృత్రిమత్వ పరిహరణం లాంటి వాటిపై కవులు ముఖ్యంగా దృష్టిపెట్టారు. జ్వలిస్తున్న అద్దాల్లాగా దిగంబరులు ప్రజ్వరిల్లారు. దానిపై పడ్డ ప్రతిబింబాలన్నిటినీ ఆ అద్దం దగ్ధం చేసినట్లుగా దిగంబర కవిత్వం ఒక జ్వలన క్రమాన్ని తన కవిత్వంతో మొదలుపెట్టింది. ఏది రాయటానికైనా రచయిత లేదా కవికి స్వేచ్ఛ ఉన్నట్లే, దేనినైనా మార్చగల స్వేచ్ఛ, శక్తి ఉన్న ప్రజల కోసం రాయాలన్న సార్త్రే ప్రతిపాదన సారాంశం దిగంబర కవుల తొలి మలి సంపుటాలలో వ్యక్తమైంది. సార్త్రే అర్థంలో దిక్‌లు ప్రతిఫలనాత్మక చైతన్యాన్ని ప్రదర్శిస్తాయి. రచయిత ఎవరికోసం రాస్తాడు అనే విషయంగా సార్త్రే ఇలా అభిప్రాయపడ్డాడు. "As a matter of fact the writer knows that he speaks for freedoms which are swallowed up, masked and unavailable; and his own freedom is not so pure; he has to clean it" (Jeanpaul Sartre - What is Literature : 43) కోల్పోయిన, పరిహరింపబడిన, కాలుష్యానికి గురైన స్వేచ్ఛను తిరిగి పొందటంలో భాగంగా తనని తాను స్వచ్ఛ పరచుకోవటం, స్వస్థత పొందటం అనే భారం దిగంబర కవిత మోయక తప్పలేదు.

ఈ భారాన్ని మోయటమనే విషయంలో దిగంబరులు గుండె దిటవు గొప్పది. ఈ క్రమంలో దిగంబరులు కీర్తిని, అపకీర్తిని సరిసమానంగానే పొందారు. దిగంబరుల మూడవ సంపుటాన్ని 'సంవేదన' (జనవరి 1969)లో సమీక్షిస్తూ సుప్రసిద్ధ మార్క్సిస్టు విమర్శకులు రాచమల్లు రామచంద్రారెడ్డి ఈ విధంగా అడిగారు "సమాజం కుళ్ళిపోయిన మాట నిజమే. సమాజం పతనమైన మాట నిజమే. విప్లవాగ్ని జ్వాలలతో తప్ప సంస్కరించడానికి సాధ్యం కానంతగా పతనమైన మాట నిజమే. కానీ, యెంత పతనమయినా, ఈ దిగంబరుల పైత్యాన్ని కవిత్వమనుకునేటంతగా పతనమయిందా?"

1970ల నాటికి దిగంబరులు విప్లవ కవులుగా పర్యవసించటం, పరివర్థితం కావటం మనకు తెలిసిందే. దిగంబరుల కవిత్వం పైత్యం కాదని, అది విశుద్ధ కవిత్వమేనని గట్టిగా అనలేని, రాయలేని అశక్తత తెలుగు కవిత్వ విమర్శను నాటి నుంచి నేటి దాకా పట్టి పీడిస్తూనే ఉన్నది. ఈ అర్థ శతాబ్ధి కాలంలో దిగంబర కవుల ప్రస్తావన లేకుండా కవిత్వం గురించి చర్చలేదు.

ఏ సామాజిక, సాహిత్య ఉద్యమమైనా ప్రజా బాహుళ్యాన్ని కదిలించటానికి మూడు పనులు తప్పనిసరిగా చేయాల్సి ఉంటుంది. ఒకటి : **భావాలను సరళీకరించటం.** రెండు : **సత్యాన్ని ఆవిష్కరించటం,** మూడవది : **ఈ రెండిటి కలయికతో నిబద్ధతతో కూడిన ఆచరణను ఆశించటం. దిగంబరులు ఆశించింది, ఆకాంక్షించింది ఇదే కదా!**

ప్రపంచ సాహిత్య కళారంగాలలో ప్రవర్తిల్లిన డాడా ఉద్యమాన్ని జర్మన్ బోల్షివిజంగా వ్యవహరించి గౌరవించారు పరిశోధకులు, విమర్శకులు. మరి దిగంబర కవిత్వాన్ని ఏభై ఏళ్ళ తరువాత విజయవాడ సాహితీ మిత్రులు తిరిగి ముద్రిస్తున్నారు. 1971లో మూడు కవితా సంకలనాల ఏకైక సంపుటిగా ఎమెస్కో సంస్థ ప్రచురించింది.

మూడవ సంపుటి చివరలో దిగంబరులు ఈ 'కుష్ఠు వ్యవస్థ'కి క్రూరంగా బలైన 'కంచికచెర్ల కోటేశు స్మృతిలో' అంటూ ఒక కొనసాగింపు సూచించారు. దిగంబర కవిత్వ ప్రాసంగికత ఇన్నేళ్లలో మరింత పెరిగిందే తప్ప రవ్వంత కూడా తరగలేదు. మరికొన్ని సంక్లిష్టతలు వచ్చిచేరాయి. మరింతగా సమాజం ఏమవుతూ ఉన్నదో అందరూ ఎరిగినదే. ఇప్పుడున్న పరిస్థితులలో మరో దిగంబర ఉద్యమ కవిత ఉద్భవిస్తుందన్న ఆశలేదు... ఆస్కారమూ లేదు.

---

1. శ్రీశ్రీ : అధ్యక్షోపన్యాసం శ్రీశ్రీ సాహిత్యం (వచన విభాగం) పుట : 217

*2. వెల్చేరు నారాయణరావు – తెలుగులో కవితా విప్లవాలు, పుట: 159*

సాహితీమిత్రులు (Regd. No. 48/2012/IV విజయవాడ) పక్షాన **– సీతారాం**

13.8.2016

# దిక్ సూచి

**దిగంబర శకంలోకి....**


1. ఆత్మయోని - నిఖిలేశ్వర్ 25
2. సూర్యస్నానం - జ్వాలాముఖి 26
3. దిగంబరి - భైరవయ్య 31
4. నన్నెక్కనివ్వండి బోను- చెరబండరాజు 35
5. గ్లానిర్భవతి భారత - మహాస్వప్న 39
6. సుఖరోగి - నగ్నముని 42
7. ఎప్పుడూ ఏడ్వలేదనీ - నిఖిలేశ్వర్ 44
8. అవలోకన - జ్వాలాముఖి 46
9. అగ్ని ప్రవేశం - భైరవయ్య 50
10. చితి పేర్చుకుందాం - చెరబండరాజు 53
11. హఠాత్తుగా పట్టపగలు బట్టలన్ని విప్పేసి - మహాస్వప్న 55
12. దిగంబర నృత్యం - నగ్నముని 58
13. నీరవ నిఖిలేశ్వం - నిఖిలేశ్వర్ 60
14. హురే - హురే - భైరవయ్య 63
15. చూడలేను - చెరబండరాజు 67
16. నటసామ్రాట్ - మహాస్వప్న 70
17. దాహం - నగ్నముని 72
18. నీవు చెప్పింది అబద్ధం కాదు - నిఖిలేశ్వర్ 73
19. ఎముకల కేకలు - భైరవయ్య 75
20. ఇంకా నువ్వింకా బానిసవే - చెరబండ రాజు 79
21. జైల్లో సముద్రం - నగ్నముని 82

దిగంబర శకం - కాలమానం 88

## దిక్‌లు 30, సంపుటి 2


సమకాలీన జీవితంపై

దిగంబర కవుల దృక్పథం 90

22. కాస్మిక్ జాతికోసం - నగ్నముని 95

23. నా దేశంలో నేను ఏకాకిని- నిఖిలేశ్వర్ 96

24. ఆకాశం వెక్కి వెక్కి ఏడుస్తోంది - చెరబండరాజు 98

25. చెరచబడ్డ గీతాన్ని - భైరవయ్య 100

26. కిలికించితం - జ్వాలాముఖి 101

27. ఈ మరుభూములపై నిలుచున్న సాయంత్రాల చెట్లు - నిఖిలేశ్వర్ 108

28. దెయ్యం దీవించాలి - నగ్నముని 110

29. ఊబి - చెరబండ రాజు 111

30. మేం మనుషులం కాదు ఇంకేదో పేరుంది మాకు- మహాస్వప్న 113

31. హృదిక్ - నగ్నముని 114

32. వేదాలు వల్లించే సైతాను ముఖంలో - నిఖిలేశ్వర్ 115

33. కో - చెరబండ రాజు 117

34. మొహమ్మీద చంద్రుడు - నగ్నముని 119

35. సమాధుల చుట్టు మంటలు- నిఖిలేశ్వర్121

36. పునర్‌యోనీ ప్రదేశం - జ్వాలాముఖి 124

37. వికాసం - నగ్నముని 133

38. బర్బరులు - నిఖిలేశ్వర్ 135

39. నా మనుష్య ప్రపంచంలోకి - చెరబండరాజు 137

40. షష్టిపూర్తి - భైరవయ్య 139

41. బాధ్యత - నగ్నముని 143

42. విలపిస్తున్న దీనత్వం - నిఖిలేశ్వర్ 144

43. పో - చెరబండరాజు 147

44. నా వారసులు - నిఖిలేశ్వర్ 148

45. కరువు బిచ్చం - భైరవయ్య 150

46. అన్నీ మరణాలే - చెరబండరాజు 152

47. అణుయజ్ఞం - భైరవయ్య 153

48. మా - నగ్నముని 156

49. పిచ్చాసుపత్రి అంతా ఖాళీ - నిఖిలేశ్వర్ 157

50. దిక్ ఇరవై తొమ్మిది - చెరబండరాజు 159

51. ఇక సెలవు - నిఖిలేశ్వర్ 161

మళ్ళీ మళ్ళీ మళ్ళీ చెబుతున్నాం .. 164
52. వందేమాతరం - చెరబండరాజు 168
53. ఆహ్వానిస్తున్నాను - నిఖిలేశ్వర్ 169
54. కొజ్జాల కామకేళి చూస్తున్నాను - నగ్నముని 171
55. శవభోగులు - నిఖిలేశ్వర్ 177
56. కుక్కల మేళం - చెరబండరాజు 178
57. యాభైకోట్ల మంటలు - చెరబండరాజు 179
58. ఈ మట్టిలోంచి - నిఖిలేశ్వర్ 180
59. మాచకమ్మ ప్రతాపం - నగ్నముని 182
60. నేనే మీ ఊపిరి - చెరబండరాజు 183
61. యాచకీయాలు - నిఖిలేశ్వర్ 186
62. తొడవిరిగిన తరం - నగ్నముని 188
63. మంటలెప్పుడో గాని పాకవు - చెరబండరాజు 192
64. శవాలు - నల్లులు - నిఖిలేశ్వర్ 194
65. అణుదిక్ - నగ్నముని 195
66. రక్తఘోష - చెరబండరాజు 199
67. హింస - నిఖిలేశ్వర్ 202
68. బ్రహ్మపదార్థం - నగ్నముని 204
69. చిలుం - చెరబండరాజు 207
70. ఉచ్చలో దిక్కులేని శవం - నిఖిలేశ్వర్ 210
71. బుద్ధక్షమ - నగ్నముని 212
72. నరమాంసం రుచి మరిగి - భైరవయ్య 214
73. వుర్రేయ్ వెధవయ్యా - భైరవయ్య 216
74. కనుదిక్ - నగ్నముని 220
75. పల్లెటి దిక్కులు - నగ్నముని 225
76. డాలర్ వెన్నెల - నగ్నముని 227
77. మనిషి మాంసం - నిఖిలేశ్వర్ 229
78. మరిజువానా పొగ - నిఖిలేశ్వర్ 230
79. విధ్వంసరాగం - నిఖిలేశ్వర్ 232
80. జిఘాంస - నిఖిలేశ్వర్ 234
81. కన్నీళ్ళేనా - చెరబండరాజు 236
82. ఆపండి ఆర్కెస్ట్రాని ఆర్పండి కాగడాల్ని - మహాస్వప్న 237
83. మురిగిన సూర్యుణ్ణి నంజుకుంటూ మృత్యువుని కాస్త కాస్తగా కొరుక్కుతిన్నాను - మహాస్వప్న 239
84. నీతి రచయితల బూతు గ్రంథం - నగ్నముని 241
85. కుష్టురోగి - నగ్నముని 244
86. దిగంబరం కావాలి - నగ్నముని 249
87. నగ్న శిశువు - నగ్నముని 252
88. ఓటమి తిరుగుబాటు - జ్వాలాముఖి 256
89. జగద్గురువు లొస్తున్నారు జాగ్రత్త - చెరబండరాజు 269
90. శస్త్ర చికిత్స - జ్వాలాముఖి 271
91. నేను దేవుణ్ణి నమ్ముతున్నాను - భైరవయ్య 278
92. దద్దోజనం - భైరవయ్య 281
93. కుష్టు దేవుళ్ళు - నగ్నముని 284

# ఇతిశాసనమ్

**ది**గంబరశకం నగ్ననామ సంవత్సరం ఆశ ఋతువు (సరిగ్గా క్రీ.శ. 1965 మే) న ఆంధ్రప్రదేశ్ రాజధానీ నగరం హైదరాబాద్‌న ప్రప్రథమంగా తాము దిగంబర కవులమని ప్రకటిస్తూ ఈ ప్రాపంచిక ఆచ్ఛాదనల్ని చీల్చుకుని కొత్తరక్తాన్ని ఇంజెక్ట్ చెయ్యడానికొస్తున్న నగ్నముని నిఖిలేశ్వర్ జ్వాలాముఖి చెరబండరాజు భైరవయ్య మహాస్వప్నల గుండెల్లోంచి ధైర్యంగా స్థయిర్యంగా దూసుకొచ్చిన కేకల్ని ఈ పేజీల్లో పట్టుకోవడానికి ప్రయత్నించిన దిగంబర కవితా ప్రచురణ సమర్పణ.

నగ్నముని
నిఖిలేశ్వర్
జ్వాలాముఖి
చెరబండరాజు
భైరవయ్య
మహాస్వప్న | నిర్మిస్తున్న
★

# దిగంబర శకంలోకి

**ఇది సెక్స్ గ్రంథం కాదు.**

రాజకీయ నినాదాలకోసం ఉద్దేశించినది అంతకంటే కాదు.

ఈ దేశంలో, యీ గోళంలో ఊపిరిపీల్చే ప్రతి మనిషి ఉనికికోసం తపనపడి, అతడి భావిని చూసి వెక్కి వెక్కి ఏడ్చి, పిచ్చెక్కి ప్రవచించిన కవిత.

***2***

ఈ గ్రంథాన్ని చూసీ చూడగానే హేళనచేసే వాళ్ళకోసం, కాస్సేపయినా ఆగి – ఏమిటి, ఎందుకు అనైనా ప్రశ్నించుకోలేని వెన్నెముకలేని వాళ్ళకోసం, ఏహ్యంగా ముఖంపెట్టే వారికోసం, శార్దూల మత్తేభాల మధ్య తమ కోపారుణ వీక్షణాల్ని పదునుపెట్టే వాళ్ళకోసం, యింకా యింకా, ఇంకా కవిత్వం ప్రబంధయుగాల కావలనే యింకిపోయిందని కవిమేళాల్లో, శాసనాలు మాత్రమే అచ్చేసే పత్రికల్లోను, బాకాలూదే వాళ్లకోసం, అసహ్యం, అసహనం, అరిగి, పుచ్చి కుళ్లి దుర్గంధాన్ని వెదజల్లే మాటల్ని, సమాసాల్ని, భావాల్ని పట్టుకొని వేలాడేవాళ్లకోసం వ్రాయవలసివొచ్చిన అక్షరాలు.

కోపం తెచ్చుకోకండి.

కాలం మారింది. జీవిత విధానం మారింది. అనుభవాల ఆకారం మారింది. మీరు ఊపిరి పీలుస్తున్న ప్రపంచంలో మీరు లేరు. మీరెప్పుడోచచ్చి, రోడ్లపక్కన బురద గుంటల్లో దొర్లుతున్నారు.

కూతుళ్ళ, కొడుకుల పెళ్లిళ్ళ బాజాల్లో, – సిమెంటు కంట్రాక్టుల కాగితాల్లో, మనిషి అంటే డబ్బు, డబ్బు, డబ్బు ; ఆడది అంటే రాత్రి తనకింద పడుకునే డన్‌లప్పిల్లో అనుకునే మీరు ఏనాడో చచ్చారు. దానిక్కారణం మీ ముఖాలమీద వేళ్లాడే – ముసుగులే తార్కాణం. మీరు మనసారా నవ్వగలరా? గుండెల విసేట్టు, మీరు చేసిన పాపాల్ని క్షాళితం అయేంత ఏడవగలరా? మిమ్మల్ని మీరు పుట్టగానే మరిచిపోయ్యారు. పుట్టగానే వార్ధక్యంలో పడిపొయ్యారు.

పెళ్లాంకి మొగుడిగా నటన. మొగుడికి పెళ్లాంగా నటన, ఆఫీసుల్లో, ఓట్ల హడావిడిలో కాకారాయుళ్లుగా నటన, మీ బిడ్డలకి గొప్ప తల్లిదండ్రులుగా నటన, పక్కవాడ్ని చూసి ఏడుపు, ప్రమోషన్ లేదని గోల. మీ మనసంతా చీదర, ఎక్కడా వంగి దణ్ణాలే మీ బతుకు. నక్క వినయాలే మీ పెట్టని భుజకీర్తులు.

## *3*

కీర్తి, డబ్బు, యినప బూట్లక్రింద పడి నలిగి కొనవూపిరితో గిలగిలా కొట్టుకుంటున్న మీ అసలు స్వరూపాన్ని ఎన్నడైనా, ఒక్కనాడైనా చూసుకున్నారా?

మీరు జీవిస్తున్నది మీ జీవితం కాదు. మీ ముసుగు – నటన జీవితం. అధికారం – జీవితం. డబ్బు జీవితం. గౌరవ జీవితం. వాటికోసం పడిచచ్చి. వాటికోసం ఏదయినాసరే, చివరికి మిమ్మల్ని సైతం చంపుకునే దిక్కు మాలిన జీవితం.

ఏం, ఈ ముసుగు లేకపోతేనేం? స్వేచ్ఛగా అసలు స్వరూపంతో బతకడానికి యత్నిస్తేనేం?

నువ్వు లేవు. నీ అధికారం లేదు. నీ హోదాలేదు. నీ పంచజరీ అంచులేదు. నువ్వు 24 గంటలూ పదిలంగా మేకప్ చేసుకుంటున్న నీ ముసుగు లేదు. నీ పెళ్లాం, బిడ్డలు, నీ చుట్టూ గుమిగూడినవాళ్లు. నీ చివరి, ఒంటరి బిక్కు బిక్కుమనే క్షణాల్లో నిన్ను Fool చేస్తారు.

దేన్నీ నమ్మకు. నీ లోపల, యీ ముసుగులోపల, యీ వంచన అంచుల కిందవున్న నీ అసలు స్వరూపాల్ని, నీ 'తనాన్ని' నమ్ముకో. ఈ నాలుగు నిమిషాలూ హాయిగా బతుకు. అది తెలుసుకున్నప్పుడు ఇంతకాలం యీ ముసుగు నిన్ను ఎంత వ్యర్థుడిగా చేసిందో తెలుస్తుంది.

ఒక్కటి గుర్తుంచుకో, ఇందరి మధ్య, యిన్ని ప్రపంచ – ప్రకృతి కార్యకలాపాల మధ్య, నిన్ను నువ్వు చీల్చుకున్న ఇన్ని వేల ముసుగు ముఖాల మధ్య ఊపిరి సలపనీని బతుకు పోరాటం మధ్య నువ్వెప్పుడూ ఏకాకివి. జనన మరణ యాతనల మధ్య పోరుసల్పే సైనికుడివి.

ఏం భయం లేదు. ఆ ఒంటరితనమే నీకు కవచం కానివ్వు. ఈ ఆడంబరాల వెనక వున్న నిన్ను ఒక్కసారి దిగంబరంగా చూసుకో. నీ ఎముకలు, నీ భయాలు, నీ కన్నీళ్లు, నీ ఆందోళనలు, నీ సుఖం ఇవన్నీ నిజం. వీటన్నింటికీ అందనంత దూరంలో స్వచ్ఛమైన, సహజమైన, అజేయమైన నీ అసలు స్వరూపం వుంది. ప్రతి మనిషిలోను అతని అసలు స్వరూపం దీపంలా వెలుగుతూ వుంటుంది. తన స్వరూపాన్ని మరచిపోయి వికృతంగా ఈనాడు మనిషి పెరుగుతున్నాడు. కృత్రిమ ఆచ్ఛాదనల క్రింద దొంగలా బతుకుతున్నాడు.

ఈ దొంగనాటకానికి ఇంక తెరవేసేయ్. నీ అసలు రూపానికి అడ్డంగా దించిన ముసుగుని చించేయ్. లే. నీ నిజస్వరూపంతో యీ ప్రపంచాన్ని పరిపాలించుకో.

## *4*

మేం ఆరుగురం. మాలోని నిజరూపాల్ని దర్శిస్తూ మా చుట్టూ వున్న మనుషులందర్నీ ప్రేమిస్తూ వాళ్ళని కూడా ఆ ప్రయత్నం చెయ్యమంటున్నాం.

అందుకే మేం 'దిగంబర కవులం'. మంచికోసం, మనిషిలోని నిప్పులాంటి నిజమైన మనిషి కోసం, కపటం లేని చిరునవ్వులు చిందే సమాజం కోసం, అహోరాత్రులు ఆరని అగ్నిలో నడిచిన ఆత్మలలోంచి పలుకుతున్న గొంతుకలం.

మేం పుస్తకాల్లోంచి మాట్లాడదలచుకోలేదు. అనుభవాల్లోంచి పలకదలచుకున్నాం. అందుకే "శంకరాచార్యులు ఇలా అన్నాడు. ఝీన్ పాల్ సార్త్రే అలా అన్నాడు" అనదలచుకోలేదు. మేం మేంగా మాట్లాడదలచుకున్నాం. మా దిగంబర గొంతుకతో చెప్పదలచుకున్నాం.

## *5*

ఇంక ఈ గ్రంథంలోని కవిత. ఈ గ్రంథావిష్కరణతో దిగంబరశకం ఆరంభమవుతున్నది. మహామాయల, మంత్ర తంత్రాల రక్తపు కూడు తిని బలుస్తున్న మనిషిని రక్షించే ప్రయత్నంలో ఈ శకం ప్రారంభమవుతున్నది. దిగంబర శకం యొక్క వివరాలు ఈ సంపుటిలోనే వేరొకచోట ప్రకటిస్తున్నాం.

## *6*

ఇటీవలి కవితా ప్రక్రియ గూర్చి, వర్స్ లిబర్, బ్లాంక్‌వర్స్, ప్రోజ్‌పొయిట్రీ, ఫ్రీవెర్స్ అన్నారు ఆంగ్ల సాహిత్యంలో. ఆ పేర్లకు, వాటికివారు ఇచ్చిన నిర్వచనాలకు దగ్గరగా వున్నా, దూరంగా వున్నా ముక్తచ్ఛందం అనీ, స్వేచ్ఛా కవిత అనీ, అనిబద్ధ కవిత అనీ, వచనగేయం అనీ, ఇంకా, ఇంకా ఎవరి కిష్టమైనట్లు వాళ్లు పిలుచుకుంటున్నారు. తెలుగులో ఇప్పుడు ఎక్కువ చలామణిలోవున్న పేరు 'వచన కవిత' స్వరూపాన్ని బట్టి, స్వభావాన్ని బట్టి మేం వ్రాస్తున్న దానిని 'వచన కవిత' అని మేం అనదలచుకోలేదు. అననివ్వదలచుకోలేదు. వచన కవిత అనే పదం మాకు నచ్చదు. ఇంతకంటే సమగ్రమైన పిలుపు కోసం వేచిచూశాం కొంతకాలం. కానీ 'వచన – కవిత' అనే యింకా చలామణీ అవుతున్నది.

ఇది దిగంబర శకం.

మేం దిగంబర కవులం.

మాది దిగంబర కవిత.

ఇది సాహిత్యంలో 'దిగంబర కవితోద్యమం'

ఇటువంటి సంపుటాలు వరుసగా దిగంబర కాలమానంలోని ఋతువులవారీ వెలువడుతాయి. చేతన సాహితీ సీమలోని వివిధ ప్రక్రియలు యీ సంపుటాల్లో ప్రత్యక్ష్యమవుతాయ్

ఆహ్వానించండి.

**– దిగంబర కవులు**

# నిఖిలేశ్వర్

## ఆత్మయోని

నన్నయ్యను నరేంద్రుడి బొందలోనే
నిద్రపోనియ్యి
లేపకు
పీకనులిమి గోతిలోకి లాగుతాడు.
ప్రబంధాంగనల తొడలు తాడి మొద్దులు
తాకితే కాళ్ళు విరగ్గొట్టు
కుచములు ఎవరూ ఎక్కని పర్వతాగ్రములు
తలను ఢీకొని బ్రద్దలుకొట్టు
పండిత వర్యా ! రికార్డులా నోరు త్రిప్పకు
నవసృష్టిని కాలదన్నకు
భావకవుల నపుంసక హావభావాలకు సవాలు!
అభ్యుదయ కవీ నల్లమందుతిని నిద్రపోయావ్
నయాగారా జలపాతంలో
దూకలేక పోయిన అన్నయ్యా!
గుడ్ బై! మీకందరికి సలామ్‌వాలేకమ్
వచనం లేదు!
కవిత్వం అంతకంటే లేదు
చప్పబడిన చపాతీబ్రతుకు
ఫైళ్ళమధ్య నలిగిన కాగితపుభూతం
నీవు అధిరోహించావ్ 'బిగ్‌బెన్' అగ్ని పర్వతాన్ని
ఇక కక్కనీ !
సమస్తం కాలనీ!
.... .... .... .... చావు !
దిగంబర కవితలో మరొకడు – మరొకడు
నిండుగా నిజంగా ఊపిరి పీల్చేవాడు
ఆత్మయోని నుండి పుట్టుకొస్తున్నాడు. ●

## సూర్యస్నానం

జై దిగంబర
జైజై దిగంబర
నేనే పైగంబర
పొంగారిన అంగసౌష్టవాలనుండి
అంగారపు హొయల వెలుగుపై నుండి,
దుశ్శాసనుణ్ణై పై వలువను, ఐరాస
నిండుకొలువులో వొలువానుంది
పొంగుల మూలల్లో
కృంగిన అందాల్ని
హొయల లోయల్లో
శిథిలమైన మానవతని,
నాగరికత నిగనిగల కౌగిలిలో,
మైమరచి మైకం కమ్మిన, నేటి వ్యామోహపు
పతిత జాతికి చరచి చూపాలనుంది ;
జాగృతి కై ధ్వంసరచన చేయాలనుంది
చచ్చిన రాజుల పుచ్చిన గాథల,
మెచ్చే చచ్చు చరిత్రకారులను
ముక్కుచెవులుకోసి అడగాలనుంది ;
మానవపరిణామ శాస్త్రం నేర్పిందేమని?
పదార్థ శాస్త్రాభ్యుదయంలో
పండిన ప్రచండ వైజ్ఞానానికుల్ని
బత్తలబజార్ల కీడ్చి చూపాలనుంది
మనిషి – మనిషి మధ్యనున్న చీకటి అఖాతాన్ని

అణ్వహంకారంలో కావరమెక్కిన
అగ్రరాజ్య శ్యేనాలకు, రెక్కలు నరికి
ఈకలు పెరికి, చూపాలనుంది ;
వాళ్ళ పొడుపులకు, కుళ్ళి పురుగులుపడ్డ
ఈ శతాబ్దపు కాంగోదారుణ వ్రణాన్ని
ఎన్నటికీ ఎచ్చని ఆఫ్రికాఖండాన్ని
కల్లోలపు కడలి అలల తాకుళ్ళమధ్య
ఊపిరి సలపని చీకటి సుళ్ళమధ్య
యుద్ధ తిమింగలాల రంపపు పళ్ళమధ్య
త్రోయబడ్డ “శాంతిమూకబాల,” చరమఘోషను,
కనురెప్పలు ఊడబెరికి చూపాలనుంది;
కండ కావరమున పండిన ప్రపంచ పండితులకు
సమస్యలకు లోతులు తీసి
సామాన్యుల గోతుల్లో తోసి
కాలాన్ని గాలంగా వాడుకుంటూ
నిర్లిప్తతలోనే నిప్పును రాజేస్తూ
అనంత అమాయిక మానవ జాతిని
అనాదిగా అధ్వాన్నముగా పరిపాలించే
పిడికిడు మేధావులకు
పిరమిడ్లు కట్టాలనుంది
రాచరికం సుకుమారితో
రాక్షస రతి సలిపే
వినాయక విటులకు,
ఓట్లనాడు పట్టపగలే చేయించాలనుంది ;
నగ్న విరాట్స్వరూప సౌందర్య సందర్శనాన్ని

మత మీమాంసలో కోరలు పెంచిన
మతావిష్టుల్ని చెవిపట్టి చెంపకొట్టి
భూగోళం నడిబొడ్డున, చూపాలనుంది;
ముక్కలక్రింద క్రూరంగా నరకబడ్డ
మానవజాతి మహా కల్పవృక్షాన్ని
దేవుడు దేవుడంటూ
నేలవిడిచి సాముచేయు
తత్వ దిమ్మరులకు,
ఆధ్యాత్మిక సోమరులకు,
కళ్ళుపీకి చూపాలనుంది;
పృథ్వీమాత గర్భంలో
నెలలు నిండక
బ్రతుకు పండక
వికృతంగా మరణించిన
జీవుని శైశవ కళేబరాన్ని
కనుపించని ప్రేయసి వక్షోజాల వాపులపై
తాదాత్మ్యం పొందిన కవి కాముకులను,
లాగి తన్ని, ఒక్కసారి చూపాలనుంది
హీనంగా చెరబడ్డ కవితా కన్యను
నంగనాచి నాగరికతను నగ్నంచేసి
నవమధువున "సూర్యస్నానం" చేయించి
న్యూయార్కు నగర వేదికన నీగ్రో వీరునితో,
"నూడ్‌ట్విస్టు - తాండవం" చేయించాలనుంది
అవయవాల పొంగుల కుదింపుల్లో,
నరనరాల కవాతుల మేళవింపుల్లో,

కీళ్ళు – కీళ్ళు, సళ్ళి సళ్ళి, బొమికలు త్రెళ్ళి,
రక్త మాంసాలు మరిగి మరిగి, కరిగి కరిగి ;
ఆవిరై శూన్యాకాశంలో
మేఘంలా తేలిపోతూంటే
ఆ దృశ్యం అందరికీ,
హాలీడే ఇచ్చి చూపాలనుంది;
క్రింద బడ్డ నగ్న కళేబరాన్ని
ఐరాసకు ఎంబ్లమ్ చేయాలనుంది
ఒకనాటి సూర్యోదయాన ఈ లోకం
ఒక పెద్ద "న్యూడిష్టకాలనీ" ఐందని,
రంగురూపులపై మమకారాల్ని
జాతి మత దురహంకారాల్ని
ఆ రాత్రి "కామదహనం" చేశారని.
జట్లు జట్లుగా – పక్షులు బారులుగా
నగర విసర్జనంచేసి కదలివెళ్ళారని
గంగాసింధూనదుల సుందరతీరాల్లో
వోల్గా నైలునదుల సమీపాల్లో,
మానవులంతా కొత్త కుటుంబాలుగా ఏర్పడ్డారని
తిరుగుబాటు నాయకుడు "దిగంబర దేవుడు"
అర్ధరాత్రి "నూత్న దిగంబర యాగాన్ని" ఆరంభించాడని,
ఐరాసనుండి, ఆకాశవాణిలో, 'శాంతిబాల' ప్రేమభాషలో
వార్తలు వేదంలా చదువుతూంటే చెవికోసుక వినాలనుంది
లోకమే ఒక మహా దిగంబరియై
లోకోత్తరంగా కనిపిస్తూవుంటే
పాతరోతతో మొహం మొత్తిన

దేవతలు భూలోకం సరిహద్దులుదాటి
దొంగచాటుగ వలస వస్తున్నారని
"దిగంబర దేవుని" ప్రపంచ ప్రభుతకు
ఇదొక గడ్డుసమస్యగా ఘనీభవించిందని,
అయినా సానుభూతితో శరణార్థులకు
న్యూయార్కు - మాస్కో, పెకింగ్, బాంబే, ప్యారిస్, లండన్ వగైరా
నిర్జనారణ్యాల్లో వసతి సౌకర్యాలు చేయిస్తున్నారని
ప్రభుత్వ ప్రతినిధి అధికార ప్రకటన వెల్లడైంది
అణు శక్తితో
అన్ని గ్రహాలకు
ఆకాశ వీధులు ;
దేవతల దరఖాస్తువై
అందుక్కూడా "నగ్నవాడల"
నిర్మాణానికి ప్రణాళిక
అమలుకు సిద్ధంగా ఉందని
స్వర్గంలో దేవతలు చేసిన
సన్మాన సభలో దిగంబర దేవుని
బహిరంగోపన్యాసంలోని సారాంశం.........
మరణ జననాలు లేకుండా
వ్యాధీ వార్ధక్యాలు రాకుండా
అణ్వమృత కాసారంలో
మానవులంతా ఒక్కసారిగ
"సూర్య - స్నానం" చేశారని
యమలోకంలో దిగంబర దేవుని ఉవాచ
నరకం రద్దుకు ఆర్డినెన్సు జారీ ●

# భైరవయ్య

దిగంబరి

ఫెళ్ళున

ఎక్కడో ఒక ఎండుపుల్ల విరిగింది
ఒక పాచినోట్లో వెర్రినవ్వు దూకింది
ఏ గుండెల్లోనో కార్చిచ్చు మొలిచింది
భళ్ళున
ఏ పెదవులపైనో చిర్నగవు విరిసింది
ఏ కన్నుల్లోనో కాంతిరేఖ మెరిసింది
ఎక్కడో కొత్తపువ్వు పూసింది
ఆయ్
ఎక్కడిదా వెకిలినవ్వు
ఎవ్వడిదా పిచ్చిగొంతు
కాదు కాదు కాదు కాదు కాదు !!!!!
దిగంబరి
ప్రబంధ సుందరి కాదు
పారిస్ లో నగ్నరూప విన్యాసంచూపే కామాక్షి కాదు
కాదు బెల్లీడాన్సర్
అమెరికా నైట్ క్లబ్బు స్ట్రిప్పర్
దిగంబరత్వం
బట్టవిప్పి బారచాచి
నడిరోడ్లో గంతులేయడంకాదు
పదాలతో వలువల్ని ఒలిచేయడం
అంతకన్నా కాదు
ఏమిటి ఏమిటి ఏమిటి ఏమిటి చెయ్యడం ????

మనిషిలో అట్టడుగున బురదగుంట్లో
పడివున్న మనీషిని లేవదియ్యడం
ఎముకల లోతుల్లో ధ్వనించే
స్వచ్ఛమైన గీతాల్ని ప్రతిధ్వనించడం
కళ్ళవెనుక దాగివున్న
సిసలైన కన్నీళ్ళని ప్రసరించడం
గుండెలతీరాన్ని కొట్టుకునే
సహజమైన భావాల్ని ఒడుపుగా పట్టడం
పెదాల కొసల్లో
చిక్కటి చిరునవ్వుల్ని మొలిపించడం
నిజాన్ని నిజంగా నగ్నంగా చెప్పడం
ఇందులో
మానినీ వక్షోజాలు
నగల్లాంటి నగాలు ప్రస్ఫుటించవు
ముద్దులు ప్రవహించవు
మీ పాశవిక ప్రవత్తులకి ఫలహారం పెట్టవు
పళ్ళూడిన ముదుసళ్ళ నోట్లో
లాలాజలం ఊరించవు
మీలో విలాసాలు – విభ్రమాలు – విహృతాలు
పుట్టించవు
దిగంబర కవిత్వంలో అక్షరాలు
కామంతో పుచ్చిపోయిన
లతాంగి పయోధరాలపై
నూతన నఖక్షతాలు కావు
ఆకాశంలో నక్షత్రాలూ కావు – తోకచుక్కలూ కావు
సాహితికి – సరస్వతికి
కొత్తబంగారపు తొడుగులంతకన్నా కావు

పచ్చల హారాలు – ముత్యాల సరులు – నవరత్నాలు
అసలు కానేకావు
ఇవి నిజాలు
నిత్యం మండే యదార్థాలు
ఆడదాని ప్రసూతి వేదనలా
జీన్ వాల్జీన్ ఆకలి మంటలా
ఎదిగి చేతికందిన కొడుకు
యముడి పరమైతే
తల్లడిల్లే విధవతల్లి గర్భశోకంలా
సూటిగా నగ్నంగా చెప్పబడే సత్యాలు
ఇవి అర్థం కావు
అహంకారులకి – అహంభావితులకి –
పదాల గారడీలో
పరమార్థం చూసే పక్షులకి –
ప్రబంధాల – పురాణాల
అసలు తత్వం విడిచిపెట్టి
చూర్లుపట్టుకు వేళ్ళాడే చుంచులకి –
తమలో – ప్రపంచంలో
కొత్తదనం – చైతన్యం
కోరని – హర్షించని – సహించని కొజ్జాలకి
తామే యుగకర్తలమని
తమదే సాహిత్యమని
తప్పెట్లు కొట్టుకునే భ్రాష్టులకి
ఇవి అర్థం కావాలంటే
ఈ సాహితీనగ్న విరాట్స్వ రూపానికి తట్టుకోవాలంటే
మీ గుండెలు కుతకుత ఉడుకెత్తాలి
ఉడుకెత్తిన గుండెల్లో కొత్త రక్తం పుట్టాలి

పుట్టిన రక్తం మీ నరాల కాలువల్లో
సుళ్ళు తిరిగి నాట్యం చేయాలి
మీ మస్తిష్కంలో నిర్మించుకున్న
అడ్డుగోడలు పగులు గొట్టాలి
అంటువ్యాధిలాంటి
అజగరం లాంటి
గొంగళి పురుగు భావాలు భస్మం చేయాలి
నిర్మలమైన భావవీచికల్ని
హాయిగా ప్రసరింపజెయ్యాలి
మీరు
మోహమాటంతో కట్టుకున్న బట్టలిప్పి
ఒంటరిగానైనా నగ్నంగా నిలబడి
మీలోకి చూసుకోవాలి
ఎరువు తెచ్చుకున్న మెదడుతో మటుకు చూడకండి
చూడకండి కుళ్ళిపోయిన కళ్ళతో –
అయిందా
ఏం చెయ్యాలో అర్థమైందా ! ?
అయితే చూడండి
కణకణలాడుతున్న నిప్పుల్ని
మీ అబద్ధాన్ని
మీదనుకున్న దాన్ని
నక్కలాంటి – కుక్కలాంటి – పందికొక్కులాంటి బ్రతుకుని
సూర్యుని నిజకిరణాలు తట్టుకోలేని గుడ్ల గూబల్ని
పొంచున్న మానుపిల్లుల్ని
దొంగచాటుగా మీదపడే తోడేళ్ళని
మీ జీవితంలా పగిలిపోయిన చిళ్ళపెంకుల్ని
మీ చుట్టూ విశ్వరూపం దాల్చిన సత్యాన్ని. ●

# చెరబండరాజు

## నన్నెక్కనివ్వండి బోను

నల్లకోట్లు నీలిరంగునోట్లతో
ఒక దేశం ఒక కోర్టులో
ఫైసలా అయ్యే కేసు కాదు నాది
నన్నెక్కనివ్వండి బోను

నలుగురి నమ్మకంతో 'అమ్మా' అని పిలవటంతప్ప
నవమాసాలు మోసిందెవరో
ఎవరికైనా ఏమి తెలుసంటున్నాను
సృష్టికర్తనే వెక్కిరిస్తోన్న పాపిష్టిని
మీలో మిమ్మల్ని ప్రశ్నించుకొమ్మంటున్నాను
అంటున్నాను అంటాను
అనుకుంటూనే వస్తున్నాను

మనిషిమీద నమ్మకం పోగొడుతున్న మీరు
దేవుడిమీద ప్రమాణం చేయమంటారెందుకు?
దోషికి నిర్దోషికి ఒకటే సూత్రం
వల్లించిందే వల్లించి వాదిస్తారు
ఫీజు కుడితి కుండలో
న్యాయాన్ని ఎలుకలా ముంచేస్తారు
మీ ఉద్యోగాలకు ప్రమాణాలేమిటి?
ఎక్కనివ్వండి నన్ను బోను

కలాలు కాగితాలు సర్దుకోండి
లా బుక్కుల్లో నా సందేహాలు వ్రాసుకోండి

న్యాయానికి దేశాలేమిటి ? యెల్లలేమిటి ?
మనిషి, రక్తం, ప్రాణం ముఖ్యం
లింగ భేదాలు వాదాలు తప్పితే
మందిర్, మజ్జిద్, చర్చి,
మతాధికారులు మతాలు యెందుకు ?
ఆకలి, కామం, కలలూ, కన్నీళ్ళు,
మనిషిలోని మర్మజ్ఞానమంతా ఒక్కటే
దేశమేదైతేనేం? మట్టంతా ఒక్కటే
అమ్మ యెవరైతేనేం? చనుబాలతీపంతా ఒక్కటే
బిక్క ముఖాలతో చూస్తారేం ?
పిచ్చివాణ్ణిగా కేసు పుటప్ చెయ్యండి
నన్నెక్కనివ్వండి బోను

తిన్న యింటి మర్యాదెంచని నాకు
బుద్ధుల్లో పెద్దల సహజాతాలేమైయుంటావ్ ?
మంచి మనసు పరిమళాలు
విశ్వ వ్యాప్తి కాకపోవు
భావితరం గుర్తించకపోదు
జగత్ప్రళయ కావ్యంలో
తపనాగ్ని జ్వాల నిలుస్తోంది
అణువణువున అగ్నికణం
చల్లారక రగులుతోంది
నన్నెక్క నివ్వండి బోను
తీర్పు మీది జైలు మీది

భయపడతారెందుకు

మీ మనోసౌధాలనిండా
తరగని తరతరాల బూజు
అనుక్షణం చచ్చే ప్రియత్వం
కాపురాల గోపురాలలో తిరిగే పావురాళ్ళారా!
నరుక్కో రెందుకు తలలు?
గది నాల్గు గోడలు కూల్చివేసి
దిశలు నాల్గుగా మార్చుకోండి
ప్రపంచ పౌరులు కారెందుకు అప్పుడు?
నాకు తెలుసు

మీ రాత్రి చొక్కాలు పగళ్లు నిలవవు
పగటి చొక్కాలు రాత్రి వుండవు
మీ పెళ్ళాలు పిచ్చివాళ్ళు
పాతిక చీరతో స్వర్గాన్ని కప్పుకొని
వంట గదిలో ఆలోచనలకు
ఎసర్లు పెడుతున్న వాళ్లు
మీ వాగ్దానాలు పుచ్చు గింజలు
మీ బిడ్డలు కృత్రిమ నాగరికత షోలో
మోడల్‌గా పనికొస్తున్న వాళ్ళు
ఛీ, ఛీ యెవరు మీరు?
నవ్వుతారెందుకు?
నీవు నేను కలిసి యెదుటవాని పిలుపుకు
'మీరు' గాక ఏమౌతాం?
నీ గుండెలు నా గుండెలు
మూతబడిన కొండగుహలు

ఎక్కనివ్వండి నన్ను బోను

ఈ సువిశాల ప్రపంచ జీవశాలలో
సిసలైన న్యాయస్థానం యెక్కడైనా వుంటే
నన్నెక్కనివ్వండి బోను
నా గుండెలు పిండుకునే
కొండల్లాంటి సందేహాలు.......
విశ్వశాంతి మన ధ్యేయం
యుద్ధాలకు పరిమితమా ?
అబద్ధమా యీ వేదన ?
మాంసం ముద్దలుగా మనుషులు
శిశువులుగా జన్మించుట ఏ దేశంలో లేదు
ఏ దేశంలో నైతేనేమి?
అర్ధరాత్రి పడగ్గదుల
అంతరార్థమొకటేగద !
ప్రపంచ మొక నగ్నశిలా
ఫలకము వలె కనిపిస్తున్నది
భగవంతుడి అసలు పేరు నగ్న ప్రియుడంటాను
అంటాను అంటున్నాను
అనుకుంటూనే వస్తున్నాను
అందుకే
నన్నెక్క నివ్వండి బోను. ●

## గ్లానిర్భవతి భారత

యదా యదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత
అభ్యుత్థాన మధర్మస్య తదా−−త్మానమ్ సృజామ్యహమ్.
– గీత

కలియుగం రేడియోగ్రామ్‌లో
గిరగిర తిరుగుతున్న క్రీ. శ. ఇరవయ్యో శతాబ్దం రికార్డుమీద పిన్నునై
మానవత రెండుకళ్ళూ మూసుక పోయినప్పుడు
విప్పుకుంటున్న మూడో కన్నునై
కాలం వాయులీనం మీద కమానునై
చరిత్ర నిద్రా సముద్రం మీద తుపానునై
నేను వస్తున్నాను దిగంబరకవిని
రాత్రి ఉదయిస్తున్న రవిని

రంగులు పేలిపోయి
డైలాగులు జారిపోయి
దిక్కులు మార్మోగేట్లు గొల్లుమంటున్న స్వగతాల్లో
తెరపై టెక్నీషియన్ల అస్థిపంజరాల నటనల్లో
జగన్నాటకపు మట్టిపాత్రలు బీటలెత్తినప్పుడు
డైరక్టర్ అంతర్ధానమైనప్పుడు
మానిషాద శోకంలోంచి వేదనా వల్మీకంలోంచి
నేను వస్తున్నాను దిగంబరకవిని
రాత్రి ఉదయిస్తున్న రవిని

డాఫర్ మచ్చను మేకప్ చేసుకుని

వెన్నెల నేపథ్యగానంతో విలాసంగా చంద్రుడు ఆకాశాన్ని పాలిస్తున్నప్పుడు
క్షణక్షణానికి పోజులు మారుస్తున్న మబ్బులతో
ప్రదర్శన శాలల్ని అలంకరించేందుకు
చీకటికోసం తహతహ లాడుతున్న తారలతో
నగరాన్ని చుంబిస్తున్న గగనంలోంచి
వస్తూన్నాన్నేను దిగంబరకవిని
ఆరని దాహపు నాల్కల్లో
భూకంపాల ఆకలి ఆవులింతల్లో
కామాగ్ని పర్వతాలు పగిలి ఎగజిమ్ముతున్న లావాల్లో
పోటెత్తిన సముద్రాల తరంగాలు ఉవ్వెత్తునరేగి
చెలియలికట్టల్ని తెగద్రెంచుకుంటున్నప్పుడు
అసంపూర్ణ జ్ఞానుల అహంభావ సిద్ధాంతాల అజ్ఞాన ప్రవాహాల్లో
ప్రమాదాల జలావర్తాల్లో
జనత ఊపిరాడక ఉక్కిరి బిక్కిరై పోతున్నప్పుడు
కీర్తి కాముకుల, నియంతల, అహంతల దౌర్జన్య బాహువుల దురాక్రమణలో
దేశదేశాల సుఖవ్యాధి పుండ్లతో
చీడపురుగులు నిండిన మేడి పండ్లతో
భూమి వెలయాలై , పతితయై , భ్రష్టయై పుచ్చి గబ్బు కొడుతున్నప్పుడు
నేను పుడుతున్నాను దిగంబరకవిని

విజ్ఞానం విరజిమ్ముతున్న విష పవనాల్లో
వేదికలు వెదజల్లుతున్న చీకటి పొగల్లో
పుస్తకాల పుటల బంజరు బీళ్ళలో
నాగరికత మత్తు ఇంజెక్షన్‌లో సమాజం జీవచ్ఛవమైనప్పుడు
దీపాలు కొడిగట్టి

రక్తధునులు గడ్డకట్టి
జీవనదులింకి
మానవత మసిపాతలా మారిపోయినప్పుడు
మాసిపోయినప్పుడు
నేను వస్తున్నాను దిగంబరకవిని
స్తంభించిన కవితా స్తంభం బ్రద్ధలై పుట్టుకొస్తున్న ఉగ్రనగ్న నరకేసరిని
నాటేసిన చెట్లని నడిపించేందుకు
పాతేసిన రాళ్ళని పలికించేందుకు
గోరీల్లో శవాలకి పునరుత్థానం కలిగించేందుకు
వికృతాకారపు శిలల్ని మానవులుగా మలిచేందుకు
మరణించిన భగవంతుడికి ప్రాణం పోసేందుకు
నేను వస్తున్నాను దిగంబరకవిని – వాచవిని
రాత్రి ఉదయిస్తున్న ప్రతిభా రవిని

కలియుగం రేడియో గ్రామ్‌లో
గిరగిర తిరుగుతున్న క్రీ.శ. ఇరవయ్యో శతాబ్దం రికార్డుమీద పిన్నునై
మానవత రెండుకళ్ళూ మూసుకుపోయినప్పుడు
విప్పుకుంటున్న మూడోకన్నునై
కాలం వాయులీనంమీద కమానునై
చరిత్ర నిద్రా సముద్రంమీద తుపానునై ●

# నగ్నముని

## సుఖరోగి

**డి**యర్ స్కౌండ్రల్ !

నాలుగు గోడల మధ్య మంచితనం పాతేసి
కన్నీళ్ళు గులాబీరేకులకి ఎరుపుగా వాడి
పచ్చని పసితనం వెచ్చని యవ్వనం
ప్రమాదాల్లో పారేసుకుని
విషాదాంత నాయకుడిలా
ఎత్తని తెరవెనక వెక్కి వెక్కి నవ్వుతున్న
నిన్ను చూస్తే నాకు జాలి
పెద్దమనిషిగా చారల పైజామా కోర్కెలకింద
నిన్ను నువ్వు 24 గంటలూ దాచుకుంటూ
అవమానాల్ని పూలహారాలుగా ధరిస్తూ
వెధవా అని ప్రపంచమంటే వెకిలిగా పళ్ళికిలిస్తూ
నీలో పొంచున్న అవకాశం బెబ్బులికి కొత్తరంగు వేసుకుంటూ
కప్పలా బెక బెక మంటున్న
మేకలా మే మే అంటున్న
నీ అసహాయపు కీచురాయి గొంతువింటే
నువ్వెవరో నీకే తెలీని యీ సంతలో నువ్వంటే
నాకు జాలి

అయినా ఎందుకు ద్వేషం
నిజాన్ని చెప్పలేక నిర్మలంగా బతకలేక
ముసుగుని ముఖం నిండా కప్పుకున్న

బురదని భాషనిండా పులుముకున్న
నిన్ను చూస్తే నాకెందుకు ద్వేషం
నీ చుట్టూ విషకీటకాలు నిర్జనారణ్యాలు సంచరిస్తున్నా
నీ ఒంటినిండా పలుకుబడి రసి కారుతున్నా
నిన్ను ప్రేమిస్తాను
నిన్ను మంచితనంతో భయపెడతాను
నీ బొమికల్ని హడల గొడతాను
నీ కలల్లో కల్లోలం రేపుతాను
ఊఁ లే!
ముసుగు తొలగించు
ఈ కంపుకొట్టే బట్టల్ని విప్పి
ఆత్మముందు నిలబడి నిన్ను నువ్వు చూసుకో
మనిషిలా మంచిగా ఆకాశంలా అవనిలా
బతుకు
తెరిచిన కళ్ళు యింక మూయకు
చెప్పడానికి నువ్వెవరని గొంతు నొక్కడానికి ప్రయత్నించకు

మనిద్దరి మధ్య బలమైన బంధం
ముందు మనం మనుషులం

ఇంక శాసించు మనమధ్య స్నేహం సూర్యుణ్ణి ●

# నిఖిలేశ్వర్

## ఎప్పుడు ఏడ్వలేదనీ ?

నీవు ఎప్పుడు ఏడ్వలేదనీ ?
అస్తమానం నీ ముఖంపై
పొగ వ్యాపించి
బొగ్గుగనులు గుర్తుకొస్తాయి.

ఎప్పుడో ఒకడు తంతాడనీ
ప్యాకెట్టు కొట్టేస్తాడనీ
పరీక్ష పోతుందనీ
వ్యాపారం నల్లసముద్రం పాలవుతుందనీ
నీ భార్యను ఎవడో లేవదీసుకెళతాడనీ
ఏడుస్తూనే వుంటావ్
మరి ఎప్పుడు ఏడ్వందీ ?

ఏడుపు మరుద్దామని
వొళ్ళు మరిచేలా త్రాగినా
ఏడుస్తూనే ప్రేలుతావ్
జేబులు నిండుకొన్నాక
మళ్ళీ ఏడుస్తావు!

నీవు చేసిన వెధవ పనికి
చేస్తున్న ముదనష్టపు చేష్టలకి
రేపు పత్రికల్లో పతాక శీర్షికల్లో
డొక్కచించి డోలు కడ్తారని
ఒకటే ఏడుపు !

మరి ఎందుకలా నిన్ను నరుక్కొన్నావ్ ?
జానెడు పొట్టకు కూడు దొరకలేదనా
నగ్నత్వాన్ని కప్పివేయడానికి
మూరెడు బట్టలేదా ?
ఏడ్చినా కన్నీళ్ళల్లో కడగలేని
పాడెపై మాసిపోని
దౌర్భాగ్యపు వేషాలు.
ఇంకా ఏడుపే !
చచ్చినా ఏడుపే !

అధికారాన్ని ఔపోసన పట్టినవాడా
ఎన్నడైనా
గుడిసె గడపముందు ప్రశాంతంగా
నిద్రించిన శవాన్ని చూశావా?
మనస్సు మమతల రాగాలలో
ఒయాసిస్సు కన్నీళ్ళతో నిండిందని తెలిసిందా ? ●

## అవలోకన

ఆనాడు
నిశిని రేరాజు
నగ్నం చేశాడు.
బహుధాన్య చైత్రపూర్ణిమ
నాడు భాగ్యనగరంలో పుట్టాడు.
ధాన్యం కొరతలో బ్రతుకుతున్నాడు.
మతంపేర కుళ్ళునీ మనుషుల్లో ముళ్ళనీ
చిన్ననాడే చూసీ 'మనిషీ', అని అరచాడు. ఆ అరుపుతో
కవి ఐనాడు. అలా అరుస్తానే కాలాన్ని కరుస్తానే
ఛస్తానంటాడు. మనిషిని నాశనంచేసిన మతాన్ని నాశనం
చేయాలంటాడు. మానవ కల్యాణానికి అదొక్కటే మార్గమంటాడు. అందుకు
రచయితలే సాహసించి యుద్ధం ప్రకటించాలంటాడు. నమ్మకంలేదు
ఏ అతీత శక్తిలోను. ఉందల్లా ఒకే ఒక్క మానవ అంతఃశక్తిలోన,
దాన్ని పెంచడానికే కవి అంకితమవ్వా లంటాడు.
బ్రేకులు లేని భావుకుడు, సరిహద్దులు దాటిన
సహృదయుడు. ప్రపంచంలో ఐదేళ్ళ పైబడ్డ
వారంతా హఠాత్తుగా చస్తే శాంతి
పూస్తుందనే ఆశ. ఇష్టం
మనిషి, అసహ్యం
మనిషి.

మానవతను ధ్వంసంచేసీ
మనిషిని "మాంసం"లా కోసీ
వేడి వేడి నిట్టూర్పులపై
మడికట్టుక ఉడుకపెట్టి
అశ్రురసంలో "షోర్బా" కాచుక
ఆరగిస్తున్నాం మనమంతా
ధర్మదేవత
చర్మంవొలిచీ
"కర్మ" కడాయిలో
మర్మంగా గోలించిన
కర కర వడియాలను
చర చర నమిలేస్తున్నాం
చాదస్తపు దౌడల వాడలతో
చాక చక్యపు పన్నుల సూదులతో .
రాచరికం గులాబీల
రక్తం నులిమీ నులిమీ
ఖద్దరుకంపుల దేహాలకు,
పులిమీ పులిమీ,
గద్దెలపైని ప్రసంగాలలో
గద్దల్లాంటి గుణాలను
లోలోన కప్పేస్తున్నాం
లోకానికి గంతలు కట్టేస్తున్నాం.

భారత భాగవత రామాయణ
పారాయణాల అండదండల్లో
ప్రాచీనత్వానికి
పతాక నెత్తుతూ
నిత్యజీవితంలో నైతిక పతనం
నిత్య సత్యముగ జరిపిస్తున్నాం.
“మనమంతా జగన్నాటక సూత్రధారులం
మనమంతా బృహన్నాటక పాత్రధారులం
మనమంతా గత పురాణేతిహాస కాలాలకు చిహ్నాలం
మనమంతా జగత్కల్యాణ భావాలకు ప్రాణాలం,”
కాని ప్రస్తుతం మాత్సర్యం
మోసాలకు పెన్నిధులం
మానవతనే విస్మరించిన
అవయవాల యంత్రాలం.
అవయవాల యంత్రాలే
అరిషడ్వర్గాలకు ఆలవాలం
అందుకే మనమేనాటికి
అభ్యుదయానికి పోజాలం.
మారణ హోమపుకాంక్షల జ్వాలలలో
దారుణరూపం దాల్చిన దానవతా చర్యలలో
మరణించిన “మానవత”ను మళ్ళీ తేజాలం
మనమింకా సజీవ మానవులం కాజాలం.
పడిపోయిన గుడి గోడలు
విడిచి ముందుకు రాజాలం
మురికి పట్టిన మతం మడుగులే

మోక్షమార్గపు వేదాంతమంటూ
యశ: కాంతతో జీవిత వాంఛను తీర్చుకుంటూ
ఆత్మారాముని దుర్భరఘోషను కనజాలం, వినజాలం.
స్వార్థపరత్వపు వేశ్యారతిలో
ఆనంద పరబ్రహ్మ స్వరూపాన్ని చూస్తూ
అసలు కర్తవ్యాన్ని వదిలేస్తున్నాం
అజ్ఞానపు తిమిరం నమిలేస్తున్నాం.
సంకుచితత్వాన్ని మనమంతా
సాంప్రదాయబద్ధం చేసేసుకున్నాం
కాబట్టే మనకింకా అర్థంకానిది
"సర్వమానవ కల్యాణం" ●

## అగ్నిప్రవేశం

నిలుచున్నాను
అబద్ధాల కత్తి అంచులమీద నిజంలా
మిన్నంటుతున్న జ్వాలల కొసలపై పొగలా
చూస్తున్నాను
రుద్రఫాలం మీది నేత్రంలా
చిక్కటి ఇరుల ఉడుపుల వెనుక దాగిన
తొగరు అందాల తేజంలా
ఎదురుగా
నా తలపులో మండిన ఆవేశం అగ్ని రేకులో
కాయం నిండా నిండిన ఉద్రేకం గాయంలో
మానసం మత్తెక్కిన ఊహల సురా పానంలో
తన్వులో పర్వెత్తే ఉత్సాహం సైంధవాల రావాల్లో
కనిపించింది
కాల భైరవుని సన్నిధిలో కంకాళనృత్యం !
మరుభూమిలో కాలిపోతున్న సగటు మనిషి జీవితం !
పుష్పకాల పయనించే పూబోడుల కుసుమ పరాగం !
తమతో కలవమనే ముందుతరాల ఆహ్వానం !
తనకెదురీదమనే  కాలవాహిని సవాలు !

ఉద్విగ్నుణ్ణయ్యాను
ఉత్తేజాన్ని ఊపుచేసుకుని,
నిబ్బరాన్ని గుండెలో పోసుకుని,

కలం మీద కాలాన్ని దూసుకుంటూ,
కవనాల్తో కవిత్వంలోకి చొచ్చుకుంటూ
చుట్టూ భయంకర దృశ్యాలు సృష్టిస్తూ,
కన్ చెదురుగా – దిల్ బెదురుగా
వచ్చాను

నిప్పులా నగ్నంగా వికసిస్తూ వచ్చాను
గుండెలో మండిన ఆశలా వచ్చాను
కడలిలో పెల్లుబికిన బడబానలంలా వచ్చాను
నింగిలో ఎగసిన వేగుచుక్కలా వచ్చాను
నిశీధి మంటల్లో
మిన్నంటుతున్న భావాల జ్వాలల్లో
మస్తిష్కం విహరిస్తుండగా వచ్చాను
విశ్వంభరం వాకిట్లో చల్లిన చీకటి కళ్ళాపి మీద
యామిని అందంగా దిద్దిన నక్షత్రాల ముగ్గుల మీద
నా నేత్రాలు ఘూర్ణిల్లగా వచ్చాను
అక్షరాలతో

అహంకారంలా – ఆశలా
పెరుగుతూ వచ్చాను
నిశ్శబ్దంలో ఆది మానవుడు విన్న
ఆది శబ్దంలా వచ్చాను
మాతృ గర్భంలో మాటలు నేర్చుకున్న శిశువు
పెట్టిన తొలి పొలికేకలా వచ్చాను
ఆకొన్న హరీంద్ర గర్జనలా
మేఘాల వికటాట్ట హాసాలు చీల్చుకుని
ముందు కురికిన మెరుపులా

జడివానలా

పెనుగాలిలా

సంధ్యరేపిన నెత్తుటి మంటలా

మధ్యాహ్నం మింటనిండిన మార్తాండునిలా

కన్ చెదురుగా – 'దిల్' బెదురుగా

కవి లేఖినిలో కదం త్రొక్కుతూ వచ్చాను

కవిత్వంలోకి చొచ్చుకుంటూ వచ్చాను. ●

# చెరబండరాజు

## చితిపేర్చుకుందాం

ఏయ్ ! సూఫీ ! !
నిన్నే ముసుగులు తన్నేయ్

వెయ్యేండ్ల కలల తత్వంతో
వేసారిపోతున్న నీకు
క్షణం గ్యారంటీలేని
జీవితం మిగిల్చేదేమిటి?

నిన్నేనోయ్ ఎదగని మనిషీ !
రేబవళ్ళ తిరుగలి మధ్య
నామరూప రహితుడవై
ఎప్పుడో గప్పున గాలిలో కలిసేముందు
ఒక్కసారి వెనక్కి మళ్ళీ చూసుకోవూ ?
వెన్నెల నీ కన్నుల్లో ఇంకి
చుక్కలు నీ చూపుల్లో చిక్కి
కన్నీటిని దూరం చేస్తాయా ?

అందమైన ఆడదాన్ని వెతికి తెచ్చి
ఊపిరాడని గదిలో బంధించి
వొయ్యారపు ఊహల పల్లకీలో ఊరేగించి
పాదాలు పట్టుక వ్రేలాడే కవీ !
కోలుకుంటా వెప్పుడు నీ తరతరాల వ్యాధి?
జాతిని జాగృతం చేసే
చైతన్య పుంస్కోకిలల కంఠాలమధురం

జావలా జారి జారి
ముసలి దాని ముద్దులోని తీపిలాగుందని
మహాశయా పాఠకుడా
మనస్సెప్పుడేని మళ్ళించావూ ?

నీవూ నేనూ ఓటుతో పోటీపడి
నిర్మించుకున్న గూడు
అదే చూడు
పుల్ల మీద పుల్ల
పైనించి చూస్తే కనిపిస్తుంది నేల
సిగ్గెందుకు లేదోయ్ రాజకీయవాదీ?

ఈ మహా పాపంలో
మనమంతా భాగస్థులం
రాగల యుగాల కొఱకు
అణువణువును చిదిమి చిదిమి
చైతన్యాగ్ని జ్వాలాముఖులమై
చితి పేర్చుకుందాం రండి. ●

# మహాస్వప్న

హఠాత్తుగా పట్టపగలు బట్టలన్ని విప్పేసి

నగరం నడి రోడ్డుమీద
నాగరికత బొడ్డుమీద నగ్నంగా నిలబడ్డా
మనిషీ......మనిషీ.....మనిషీ....
ఎలుగెత్తి పిలుస్తున్నా –

వెర్రికేకలేస్తున్నా
పెడబొబ్బలు పెడుతున్నా

దిక్కులదిరిపోతున్నయ్
నా కేకలు శూన్యంలో సుళ్ళు తిరిగిపోతున్నయ్
నగరానికి కళ్ళు తిరిగిపోతున్నయ్

నన్ను చూచి నాగరికత గజ గజమని వణికింది
నన్ను చూచి నాగరికత బెదిరింది
నన్ను చూచి నాగరికత స్తంభించింది.

వెడుతున్నా వెడుతున్నా
గిర గిర గిర గింగిరాలు కొడుతున్నా
పడుతున్నా
లేస్తున్నా
నగరం నడి రోడ్ల మీద నగ్నంగా వెడుతున్నా
గుంపులు చెల్లా చెదరై భయాలు పరుగెడుతున్నయ్
సిగ్గులన్ని పరదాల్లో దాక్కున్నయ్

సభ్యతలూ, సంస్కారాలూ డోక్కున్నయ్
పగలూ ద్వేషాలన్నీ పుట్టల్లో దాక్కున్నయ్
కపటాలూ, వంచనలూ కళ్ళజోళ్ళలోంచి చూచి
అదే పరుగు అదే పరుగు

వెడుతున్నా వెడుతున్నా
పిల్లి మొగ్గలేస్తున్నా కుప్పిగంతులేస్తున్నా
చౌరస్తా కాళీయుని
శిరం మీద కథక్కళీ చేస్తున్నా
కోట్లు సూట్లు బుష్ షర్టూ

చొక్కాలు లాల్చీలూ నేలకొరిగి పోతున్నయ్
టోపీలూ, పాగాలూ గాలికెగిరి పోతున్నయ్
గర్జిస్తూ వెళుతున్నా
గాండ్రిస్తూ వెళుతున్నా
నగరం నడి బజార్లలో నగ్నంగా వెళుతున్నా

తలుపులు బంద్ కిటికీల్ బంద్
ఆఫీసులు దుకాణాలు అన్నీ బంద్
ట్రాఫిక్ బంద్
సందులు గొందులకి జ్వరాలు
బజార్లు బజార్లకే మూర్ఛలు
అంతా నిశ్శబ్దం
నా దగ్గిరకొకడైనా రాడు
నేనంటే నగరానికి మహాభయం

నాకు తెలుసు మీరు నన్ను చూళ్ళేరని
నాకు తెలుసు మీరు నన్ను వినలేరని

నాకు తెలుసు అసలిక్కడ మనుషులు లేనేలేరని
నాకు తెలుసు మీరంతా మనుషులు కానే కారని
మీరంతా చీకట్లో తిరుగుతున్న గజ దొంగలు
మీరంతా ముసుగుల్లో నటిస్తున్న వంచకులు
మీరంతా మీరంతా
నల్లులురా నల్లులు ! బల్లులురా ! బల్లులు ! !
రక్తం పీల్చే జలగలు ! పిశాచాలు ! నిశాచరులు ! !

మిమ్మల్ని కాపాడుతున్న
ఈ చీకటి రాత్రి కోట బద్దలు కొడతాను నేను
ఈ నాగరికతకు మానభంగం చేస్తాను నేను
ప్రతి పుట్టను పగలగొట్టి
విష భుజంగాల్ని పట్టి కోరలు తీస్తాను నేను
ఈ ఘోరారణ్యంలో కారు చిచ్చు రగిలిస్తా
ఈ నాగరికత రావణ లంకా దహనం చేస్తా

పుడుతున్నా పుడుతున్నా
కడుపు రగిలి పుడమి పగిలి పుడుతున్నా
నవ ప్రపంచ వీధుల్లో నగ్నంగా వెడుతున్నా ●

# నగ్నముని

## దిగంబరనృత్యం

**దొ**ర్లి దొర్లి
ఊరువుల కొండ చరియల్లోకి దొర్లి
నా నీగ్రో చెలి
ఇనప కౌగిలిలో సొమ్మసిల్లి
ఆనందం పట్టలేక నా బొమికల కలల్లో
ఫక్కుమని నవ్విన సమయం
తగలబడింది బురదగుంట జీవితం
అప్పుడు ఆకాశం కురిసిన నక్షత్రపు చినుకులు
మోహం ఆల్చిప్పల్లో పట్టి
నా చొక్కా గుండీలుగా పెట్టి
గదిలో బట్టలు విప్పి కాస్సేపు గతం గొంతునొక్కి
దిగంబర నృత్యంలో దిక్కుల్ని తాకి
తెలుసుకున్న సత్యం

ఇంతకాలం నాగరికత డ్రెయినేజిలో పాదాలు
బూట్లలో దండకారణ్యాలు
కనురెప్పలకింద నక్కిన సర్పకార్పణ్యాలు
అబద్ధం
జీవితం
అబద్ధం
ఈ ప్రపంచ నాటకం అబద్ధం
నే చొక్కా చెడ్డీ విప్పేస్తే

సిగ్గూ శరం సంధిస్తే
అమ్మా
నీ రొమ్ముల్లో నే తాగిన పాలు అబద్ధం
నేనీలోకంలో తాగి వమనం చేసిన భాషలోని అర్థాలు
అబద్ధం

ఒక్కటి నిజం
ఒక్క క్షణం నిజం
నా సంఘం బట్టల మురికి వెనుక
సిగ్గుతో కుమిలి కుమిలి యేడ్చే నేను నిజం
ఆ రాత్రి నా నీగ్రో చెలి కౌగిలిలో
ఊరువుల కొండ చరియల్లో చంద్రోదయం
నిజం
నా నరాల బాధ నిజం
నా నిలకడ నిజం నా విశ్వాసం నిజం
నేను నిజం
ఇన్ని నిజాల వెనక నా ఊపిరి గట్టుపై నిలబడి
పగలబడి నవ్వుతున్నది

ఆకలి నా నీగ్రోచెలి. ●

# నిఖిలేశ్వర్

## నీరవ నిఖిలేశ్వర

**పు**ట్టగానే
గంటసేపు అసలు
ఏడ్వలేదు. చావు –
బ్రతుకుల మధ్య వూగిన
లాడుతున్న వాణ్ణి కోమటికామందు
అప్పుడే తిని ఎంగిలిచేసిన విస్తరాకుపై
పడుకోబెట్టి పెంట కుప్పపై పారవేయబడ్డాడు.
నల్లగొండలోని వీరపల్లిలో పొలాలనడుమ గాలిపీల్చిన
వాడు. జన్మించిన తేది ఇంతవరకు తెలీదు. ఊరి వీధి బడిలో ఆ
తర్వాత హైదరాబాద్ నగరపు రోడ్లపై చదువు. రవిశంకర్ సితార్
పరమ ఇష్టం. దేశమంతా తిరగాలనీ, ఎన్నో పుస్తకాలు చదవాలనీ, వ్యక్తులను
కలుసుకోవాలని ......కోరికలు చాలా వున్నాయి. ఆకారం దాల్చేవరకు
చెప్పదలుచుకోలేదు, ఈ ప్రపంచంలో ఆది – అంతంలేని విషాదం
కూరుక పోయింది. పాపాలు – పుణ్యాలు ఎప్పుడూ వున్నాయి.
లయ కల్పాల క్రమం తప్పదంటాడు. సంప్రదాయ
విరుద్ధంగా జీవిత రచన. జీవితాన్ని ప్రయోగ
శాలగా భావిస్తాడు. ఈ తరానికి నూతన
సమాజ వ్యవస్థ కోసం వ్యక్తిగత
త్యాగం అవసరమని
నమ్ము తాడు.

ఇక్కడ
ఎవడూ హీరోకాదు – విలన్‌కాదు
మంచాడుకాదు – పిచ్చాడుకాదు
నిస్సారతను పిండేస్తున్న
ఖాళీ టిన్ను మానవులు
మరి
రేపు తాజ్‌మహల్ కూలిపోయిందంటే
నీ సోమరితనం ముక్కలై పోతుందా ?

నీ మౌనం
ఓడరేవు సాయంత్రి చావుముఖం
సరకులు నిండిన పెద్దఓడ
అది కదలదు తన క్రింది
అలల కౌగిలింతలకు
మరి నీవు అంత డల్‌గా వున్నా వేమిటి ?

కాలికి బలపం కట్టుకుని
రోజూ నీతోడి వాళ్ళ ముఖాలపై గీతలుగీస్తూ
ఈ ఉపఖండంలో నీకు నీవే మిగలకుండా
రాకెట్టులాగా దూసుక పోకుండా
నిలుచున్న నీరవ నిఖిలేశ్వర !

నగరం నలువైపుల వేలాడుతున్న
కాలిన గుడ్డ పీలికలు
నీ ముఖంపై జీరాడుతున్న సన్నని కాలిబాటలు
అక్కడ సంచరిస్తున్నాయి
కమురువాసన గొట్టే కంచరిగాడిదలు

నీవు దిగంబరుడివి కావా ?
డల్‌గా తలదించుకుని నడుస్తున్న విశ్వంబర
చూడు ! కళ్లుచీల్చి చూడు !

ఆదిమ వాసుల్లా
ఎవరి గోడలపంచనో
ఈ అరణ్యాల్లో పొగరాజగొడుతూ
దుమ్ముకు దాసులై
పాటలు పాడుతూ
రోట్లో జీవితపు కారం దంచుతున్న
లంబాడి సుందరీ మణుల మధ్య
వజ్రాలగనిలో పాతుకపోయినవాడ!
అంత డల్‌గా వున్నావేమిటి ?
విప్పేయ్ నీ మర్యాద దుస్తులు! ●

# భైరవయ్య

హురే – హురే

ధినక ధినక తద్ధినక ధినక
ధినక ధినక తద్ధినక ధినక
అశ్శరభ శరభ అశ్శరభ శ్శరభ

ఓరి నాయన
ఓరోరి నాయన
జాతర – అమ్మోరి జాతర
పెద్దమ్మోరి జాతర
ఊరవతల వల్లకాడు మోతర
ఊళ్ళో అస్థిపంజరాల గోలర

పరుగెత్తు – లగెత్తు
వెర్రెత్తి – వేప మండలు మొలకు చుట్టి
నిమ్మ పళ్ళు చేత బట్టి
కల్లు ముంత ఎత్తి బట్టి
గట గటా గుటక లేసి
గణాచారి వీరబాబు
పరుగెత్తు – లగెత్తు
ఊరవతల జువ్వి చెట్టు
భల్లూకాలకి – పెను భూతాలకి ఆటపట్టు
మద మెక్కిన భటాచోర్లకి
కుళ్ళిపోయిన కామాక్షికి
ఊరిపెద్ద చిట్టి బాబు

భటాచోరు బడాబాబు
పుండాకోర్లకి
బరి తెగించిన రండాలకి
కులదైవం పెద్దబాబు
నిర్మించిన వాడకట్టు

ఆడకట్టు
నిజం చెప్పినోడి రక్తం పోసేసి
నిజ మన్నోడి శవం పాతేసి
అమ్మోరికి గుడి కట్టు.

అయ్య బాబోయ్
అమ్మోరు వెలిసింది !
వయసొచ్చిన మగోళ్ళని
పురుగుల్లా మింగేసిన ఎల్లమ్మ
ఒంటిని జిగి వొగ్గేసాక
వైరాగ్యం పుచ్చుకున్న
నాపసాని ఎల్లమ్మ
దేవతై వెలిసింది*

ఊరి పెద్ద చిట్టి బాబు
భటాచోరు బడా బాబు
కల్లో కనిపించింది
కల్లు తాగి తందనా లాడింది
కామంతో నోరు తెరిచి
కనిపించినోడినల్లా కరిచింది

* దెయ్యానికి ప్రకృతి దేవత

ఊరి పెద్ద గుండెల్లో గూడు కప్పింది
అమ్మోరు వెలిసింది
మహమ్మారిలా వ్యాపించింది.
అరేయ్ బాబు
గణాచారి వీరబాబు
భయపడకు
ఊరి పెద్ద చిట్టి బాబు
భటాచోరు బడా బాబు
బాడుఖావు బుచ్చిబాబు
నీ వెన్నుపూస నిండాడు.
బలేసి ఏటపోతు
సగమాడిది - సగం నీది
ఒక్కర్తే మొక్కొచ్చిన
కన్నెపిల్ల మానంలో
సగమాడిది - సగం నీది

అంతెందుకు
నీ దేవత నిర్మించిన వాడకట్లో
ఊరిపెద్ద పాలించే వాడకట్లో
మానం తెలియని నిత్య కన్నెలు
నీ పడగ్గదికి వన్నె చిన్నెలు
ఆలసించకు - ఆలోచించకు
పరుగెత్తు - లగెత్తు

నుదుటి మధ్య బొట్టు పెట్టు
గణం పట్టి ఊరిని హడల గొట్టు

శివం పూని
బతికున్న శవాలకి కూడు పెట్టు
నిజాయితీకి నిలుచున్నోడి
కూట్లో మట్టి కొట్టు
దేవతెలిసింది
పచ్చి బోగంది
పతివ్రతై మొలిచింది !
హురే ! హురే ! ●

# చెరబండరాజు

## చూడలేను

హైదరాబాదుకు
తూర్పున, అంకుశా
పురంలో పదిహేను రోజుల
ప్రసవ వేదనలో అమ్మ చచ్చిపోతుం
దనగా నేలమీదికి కసిగా విసిరివేయ బడ్డాడు
ఎప్పుడో తేదీ లేదు. బంగార మొడ్డించే పల్లెవాసుల
చల్లని చూపుల్లో, పైరు పచ్చని పొలాల గట్లమీద కాలిబాటల
చీలికల్లో పెరిగాడు. ఎదురైన ప్రతి హృదయానికీ
అంకితమవుతాడు. సాగర తీరాల ఇసుక తిన్నెలమీద
ఒంటరిగా కూర్చోవడం వానలో నానడం
ఏకాకిగా ఉండడం విషాదం ఇష్టం.
మనిషి కోసం పడిచస్తానంటాడు.
ఒక్క భగవంతుని మీదే
కసి, పగ.

ఛందోబద్ధ సాహితీ వృక్షంలో
చీడపురుగు గీ పెడుతున్నది
కాపలాకాసే బిరుదురాయుళ్ళ కళ్ళకు
కాల దోషం పట్టుకుంది
ఇక ఈ మ్రాను విస్తరించదు
మళ్ళీ వసంతాన్ని చూడదు
వచ్చే గ్రీష్మానికి పుచ్చె రాలిపోతుంది

నా యింటి ముంగిటి గడ్డిపరక సైతం
నిట్టూర్చి గుండె లదుము కుంటున్న వేళ
ఎవరా కళ్ళారా నిద్రిస్తున్నది?
నా వెన్నెముకై నిలిచిన
నా కన్నుల వలె తోచిన
రాజకీయ వాదులు రాబందులు
“చౌకగా దొరికేది వీరు”
అంటున్నారే గోముఖ వ్యాఘ్రాలు వారు!
ఈ కక్కుర్తి ముఖస్తుతి నక్కలనించి
విషాన్నం గుర్తుచేసే
నిషాకన్నుల నవ్వుల ప్రేయసి నుంచి
ప్రణయ కావ్యాల భర్తల
అర్థ నిమీలిత నేత్రాల నించి
సన్మానపత్ర సంకీర్తన
సంబోధనాల నించి
నిరంతరం ఆశతో మండే
ఇల్లాలి అస్థి పంజరం నించి
ప్రతి మనిషీ వేరు పడాలని
మళ్ళీ బాల్యంలోకి వెళ్ళిపోవాలని
‘అమ్మా’ అని అరిచి అరిచి
విశ్వాంతర సీమల పట్టాభిషిక్తులై పోతున్నారు

ఎండు టాకుల గుండెలు
భయం భయంతో తిరిగే మనుషులు
మింటి యింటి రంధ్రాలవోలె
మిణుగురు పువ్వుల ఆశలవోలె

భూమ్యాకాశాల మధ్య
గానుగెద్దుల్లా పీనుగుల్లా
రెపరెప కొట్టుకలాడి మట్టిలో రాలి
పట్టపగలే ఊపిర్లు విడిచేస్తున్నారు

ఏ దేశంలో ఉంది శాంతి?
ఎటు జూచినా భయకంపిత
వడగాల్పుల సుడిగాలుల సందడులే
శాంతి లేదు వెలుగు లేదు
కారు మొయిలు చీకటులే
కంట కంట కనిపించును

చూపులలో చురకత్తుల కసరత్తులు
మాటలలో పడగెత్తని
నాగుబాము వొయారాలు

చూడలేను చూడలేను
చూడలేను చూడలేను ●

# మహాస్వప్న

## నటసామ్రాట్

పాతికేళ్ళ నాడు ఈ
కల కళ్ళు తెరిచింది నెల్లూరు
జిల్లా లింగసముద్రంలో. కావలి,
హైదరాబాద్‌లోని ఆకాశాన్ని భూమినీ
చదువుకున్నాడు. దౌర్భాగ్యనగరం గుండెలమీద
బూట్లతో గీతాల్ని రాసే ఇతన్ని చూసి సడెన్ బ్రేకు
లేసుకుంటాయి కార్లు. భళ్ళున తెరుచుకుంటాయి
బార్లు. బ్రేకుల్లేని పుకార్లలో ఇతడి షికార్లు.
ఈ ప్రపంచం వేసుకున్న
ముసుగుని చీల్చడానికే
పుట్టానంటాడు.

**నో**రు మూసుకో
గుండు చేసుకో
వీలైతే నాలిక తెగ్గోసుకో
ఒక్కసారి అద్దంలో నిన్ను నువ్వు చూసుకో
ఇంక వివిధ పాత్రాభినయం వద్దు
ఇంక చిలుక పలుకులు వద్దు
తొడుక్కున్న బట్టలన్ని విప్పేస్కో
నువు చేసిన అప్పులన్నీ చెప్పేస్కో

నట సామ్రాట్
నువ్వెవరో నాకు తెలుసు
నీ జాతకం నాకు తెలుసు
నీ వొంట్లో నీ ఇంట్లో
సిర లెన్నో
అర లెన్నో
మరలెన్నో నాకు తెలుసు
వగలూ వొయ్యారాల్నీ
పరుపూ మర్యాదల్నీ సైడు కాల్వల్లోకి పంపు
మాసిపోయిన సిగ్గు చీర కొడుతుంది కంపు
మహాశయా

తెల్లగా తెల్లవారింది
నాటకానికి తెర జారింది
ప్రపంచంలా పరుచుకున్న జీవితం మీద
నగ్న సూర్యోదయమైంది

నీ పాత్ర చిలుం పట్టింది – తోముకో
నిజం లాగ

ధ్వజం లాగ నిటారుగా – లే!
భయం వీడి
నగ్నంగా బజార్లోకి – రా! ●

## దాహం

నడుస్తున్న చెట్లమీద గుసగుసలాడే ఆకులు
జడుస్తూ తూలుతూ కునుకుతున్న ప్రణాలపై వాలే కాకులు
ఆకారంలాగే వికారంగా వాంతి చేసుకునే వీధులు
నగరం మూపుమీద వాపుమీద పెద్దల విగ్రహాలు

కందువాకింద
కండకావరంకింద
పిట్ట
రెట్ట
ఆ విగ్రహం బ్రతికున్నప్పుడు చుట్టూ ఎన్ని గ్రహాలు
కోడిపుంజు కొట్లాటలు సిమెంటు కాంట్రాక్టులు
ప్లేట్లలో ఫోర్కుల కింద అలగాజనాలు
జైళ్లలో బండరాళ్లు కప్పుకుని అమాయకులు
నీచం జారత్వం పశుత్వం ప్రవహిస్తాయి సైడు కాలువలు
అవి చివరికి ఆక్రమిస్తాయి విగ్రహాలు కాబోయే రక్తనాళాలు
ఇంతెందుకు నడుస్తున్న చెట్లనడుగు
గుసగుసలాడే ఆకుల్నడుగు
పెద్ద పెద్ద హోటళ్లలో గోడల్నడుగు
క్యూలో ప్రాణం వొదిలిన ఆకల్నడుగు
చెరచబడ్డ వీధుల్నడుగు
ఏం చేశావు బ్రతికుండగా?
ఏం కూశావ్ బహిరంగ సభల్లో?
ఇంత జరిగి ఎట్లా నిద్ర పోగలుగుతున్నావ్ నిర్మల నక్షత్రం కింద
నగరం మూపుమీద వాపు మీద
అసహ్యంగా నిలబడ్డ ఆ విగ్రహాన్నడుగు ●

# నిఖిలేశ్వర్

## నీవు చెప్పింది అబద్ధం కాదు

**అ**వును సత్యం
నీవు చెప్పింది అబద్ధం కాదు
"ఈ దేశంలోని ప్రతి నగరం
నవ నవలాడే మహాగాయం
దూరం నుండి అది ఎర్ర గులాబి
దగ్గరికి వెడితే రక్తస్రావపు వ్రణం"

రోడ్డు మధ్య జారిన రక్తపు చారికల్లో
కాలు విరిగిన వాడి జీవితం
తల పగలినవాడి ముఖం
'అది నేనే అవుతే' అని ఆత్మ వొణికిన క్షణం!
ప్రక్కనే ప్రాణం లేని నేరస్థుడిగా నిలుచుని వుంది లారీ
స్టీరింగ్ ముందు వేగానికి బానిస అయిన
డ్రైవర్ పాపం ! పోలీసు స్టేషన్‌లో లాకప్పులో

ప్రతిరోజు – చూస్తూనే వున్నాను
ఇది అబద్ధం అసలు కాదు
ఇది మామూలుగా జరిగే నిజం అంటాను
హృదయం రోడ్డులా గట్టి పడిందంటాను
లేకపోతే నీవే చెప్పు :
రోజూ హోటల్లో ఏమో తిని
బయట అడుగుపెట్టగానే
6–8 చేతులు ఎదురుగా చాచుకొంటాయి

ముఖంలో ముఖం దైన్యంగా ప్రతిఫలిస్తుంది
నేను మాత్రం నేరస్థుడిలా
మొగం వేలాడేసుకొని వెళ్ళిపోతుంటాను
దీనికేమంటావు సత్యం?

మన పవిత్ర విశాల దేవాలయ ప్రాకారాల నడుమ
పొడుగాటి గోపురాల నీడలలో
భగవంతుణ్ణి బంధించి వ్యాపారం చేసే స్థానంలో
ఆవు రావు రంటూ ప్రతి మనిషిని
సారీ ! ప్రతి భక్తుణ్ణి "స్వామీ" అంటూ
నోరు తెరచి అర్థిస్తున్న బిచ్చగాళ్ళ సంగతి

'రాత్రి గోళ్లు తీస్తే' దరిద్రం చుట్టుకొంటుంది
అనే ధనస్వాముల దేశం సంగతి!
నీకు నీవు రోజూ ఉద్యోగాన్ని అన్వేషిస్తూ
నాకు నేను రోజూ అడవిలో ప్రాణాలు నిలుపుకొంటూ
ఎవరికి వారు డబ్బుకి దాస్యం చేస్తున్నప్పుడు
బిచ్చగాళ్ళు – బీదవాళ్ళు – బిక్క చచ్చిన వాళ్ళు
ఈ అడవిలో తోడేళ్ళకు మిగిలిపోయినపుడు
చెప్పు సత్యం మరోసారి చెప్పు!

దేవుళ్ళ కోసం – రాజుల సమాధుల కోసం
బంగారు ఇటుకలతో గోడలు లేపే ఈ దేశంలో
మట్టిగోడల గోడు వినే వాడెవ్వడు? ●

# భైరవయ్య

## ఎముకల కేకలు

8 - 1 2 - 1 9 4 2.
అర్ధరాత్రి ఆకాశం కళ్ళనిండా
కాటుక పూసుకుంది. పిడుగులు
పడ్డాయి. నక్షత్రాలు ఏడ్చాయి. గోదావరి
సుళ్ళు తిరిగిన దేశంలో, నరసాపురం వీధుల్లో
మురుగ్గుంటలకు మూలస్థానమైన బెజవాడలో హైదరాబాదు
రాజవీధిలో చదువుకున్నాడు. ప్రపంచంలో ప్రస్థానం గుండెలో
అగ్నిపర్వతాలు బద్ధలైనా నవ్వడం ఇష్టం. శ్మశానంలో కూడా
చెంగల్వలు పుట్టించడం కోర్కె. ఈ ప్రపంచం
అయోమయంలో లయమవుతోంది
అంటాడు. జీవితం ఒక పెద్ద
మిష్టరీ అని గంభీరంగా
నవ్వుతాడు.

**మ**నిషీ
మానవతా నిగమాగమ ఋషీ!
మేలుకో
ఆకాశంలో నక్షత్రాలు నెత్తురు కక్కకముందే
అవనిలో అబద్ధం
విశృంఖల విశ్వరూపం చూపించక ముందే
విషనాల్కలు చాచకముందే
తొలగించుకో

హిరోషిమాకి వల్లెవాటు వేసిన అణురజంలా
నీ మనసుని కప్పేసిన కృత్రిమత్వపు ముసుగుల్ని
నీవు తొడుక్కున్న ఎరువు చొక్కాని
మొహమాటపు చాకలాడి దగ్గర తెచ్చినదాన్ని
ఛేదించుకో
సముద్రపు నురుగులా
నిన్ను చుట్టుముట్టిన సందేహాల శాక్తేయుల్ని
పేడ పురుగుల్లా
నిన్ను తొలుస్తున్న అనుమానాల హంతకుల్ని
అప్పుడు చూడు
నీ కనురెప్పలలో మొలిచిన
(నటనకి అసలు పేరు మోసం)
కొయ్యకండల్ని కోసేసుకుని చూడు
ఈ విరాణ్మాయామయ ప్రపంచంలో
ఆదిన నువ్వు పొలికేక పెట్టిననాడు
నువ్వు ధరించిన అసలు దుస్తుల్ని తొడుక్కుని చూడు
అప్పుడు వినిపిస్తుంది! కనిపిస్తుంది!
మనిషీ
మానసిక శిఖరాగ్రాలపై
మానవత్వాన్ని ప్రతిష్టించే మహర్షీ!
డిప్లొమసీ మసిలో ఉక్కిరి బిక్కిరై
గుండెల్లో మండే నిజాన్ని వెళ్ళగ్రక్క లేక
అణువుల్లో ప్రతిధ్వనించే
యదార్థాల పల్లవికి తాళం వేయలేక
నరనరాల్లో సాగే సత్యాన్వేషణకి రాగం తీయలేక

నీ ఎముకల
పొలికేకలు – పెనుకేకలు
చావు బాకాలు
ఆచారాల మౌఢ్యపు సెంటువాసనలు తట్టుకోలేక
భటాచోరు సంఘంలో
బడాబాబులా నిన్ను మోయలేక
ఘూకాల బాకాలు
నీ ఎముకల ప్రళయ గర్జనలు
సహజత్వానికి సజీవ సమాధికట్టి
నిజాన్ని నిట్రాతిమీద శిలువవేసి
వికటంగా లాస్యం చేస్తూ
వికృతంగా గాంధర్వాన్ని చిత్రవధ చేస్తూ
నీ చుట్టూ మూర్తీభవించిన కృత్రిమత్వాన్ని
గర్హిస్తూ
నీ ఎముకల హాహాకారాలు
మొహమాటాన్ని నీ చుట్టూ ఉచ్చుపన్ని
బాధ్యతారహితత్వాన్ని జాంపండు ముక్కలా ఎరవేసి
నీ నిండా భయాన్ని వొంపేసిన
నీ చవటతనానికి – సనవతనానికి
ఖేదిస్తూ
నీ ఎముకల వికృత – ప్రస్ఫుటరోదన ధ్వనులు
ఇంకా ఆలస్యం దేనికి మనిషీ !
నవ్యర్షీ !
వినిపించటం లేదా
ఓ మనీషీ – మహర్షీ !!

నీలో పడగవిప్పని నిజాల బుస !
సహజ సైంధవాల హేష !
ఆలోచించు
అత్తవారెట్టిన మర్యాద పంచెల్ని కట్టుకోకు
నీ ఎముకల్లో జీర్ణించుకున్న నిజాన్ని బురదలో కప్పెయ్యకు
పొద్దు తిరుగుడు పువ్వులా
లోకం చుట్టూ పరిగెత్తకు
మనీషివై
కాకుంటే కనీసం మనిషివై
ఎఱ్ఱగులాబిలా – నిప్పులా
యౌవ్వనంలా – మందహాసంలా
నిజంలా – నింగిమధ్య మార్తాండునిలా
అరక్షణం బ్రతుకు
ఆ అరక్షణం
'సీ' హోరులా హోరెత్తు
నీ ఎముకల ప్రళయార్ణవాన్ని ఎలుగెత్తు ●

# చెరబండరాజు

## ఇంకా నువ్వింకా బానిసవే

ముక్కలుగా ముక్కలుగా నరికి నరికి
గొడ్డలి దెబ్బల గాయాలు చేసి
గాలి విసురుకు తూర్పారబట్టినా
పరిమళించే మంచి గంధపు చెక్కలుగా
నీ హృదయం ముక్కలైన
నీ నవ్వులు చీల్చబడిన
నీ చూపులు చీకటైన
జాలిలేని సమాజాన
మనిషీ ! నువు
నిలద్రొక్కుకు నిలవనపుడు
చీకటికీ, నైరాశ్య ఊపిరికీ
ఇంకా ఇంకా నువ్వింకా బానిసవే
కన్నీటికి కట్టుబడీ
ఎదుటి వాని యెద కుంపటి దించాలని
జీవంతో హృదయంతో
రొమ్మిరుచుక తిరిగే మనుషుల
లో మనీషిని పీల్చుక తినే
క్షణం క్షణం చేతులు మారే
వేశ్యాంశ ధన పిశాచికి
ఇంకా ఇంకా నువ్వింకా బానిసవే
చమురింకిన దీపానివి

శిథిలాలయ అందం చిదుగువి
కాడూడిన పుష్పానివి

హృదయ మున్న మంచి వాడు
ప్రతి ఒక్కడూ పిచ్చివాడు
దగాకోరు లోకం కంట్లో
కనిపించే దింకేమిటి?

ఇల్లూ పెళ్ళాం పిల్లల గొడవలు
అరసెంటీ మీటరు భూమికి
అంతర్జాతీయ తగాదాల జాబితాలు
ఇవి తప్పిన నీ బ్రతుకేమిటి?
ఇవి తప్పని నీ బ్రతుకున
ఇంకా ఇంకా నువ్వింకా బానిసవే

రెప్పపాటు చీకటినే భరించ లేక
అనుక్షణం అర్థరాత్రిగా యెంచుక
ఆవేశంతో కుస్తీ పట్టి
తల నేలకు బ్రద్దలు కొట్టి
నీ నెత్తుటి ఒక్కొక్క జీవకణంలో
ఒక్కొక్క దేశపు మనిషిని ఊహించుకొని
ఆద్యంతం అంతా నీవేనని
రక్తంలో నగ్నంగా
ప్రతిరూపం చూసుకొనీ
ఇకనైనా మనిషిగా నిలవాలని
వెర్రిగా వెకిలిగా కుర్రవాని కేకలా
ప్రపంచపు మనిషి నిమిత్తం

పడియేడ్చిన క్షణాలు యెన్ని ?
హృదయ మున్న మంచివాడు
ప్రతి ఒకడూ పిచ్చివాడు
కడుపులోని స్వప్నానికి
నీ తాతల తండ్రుల నీ వంశపు తరతరాల
రూపురేఖ విలాసాల దేవులాటలో
ఇంకా ఇంకా నువ్వింకా బానిసవే

కళ్ళు తెరిచి నేలా నింగిని
కన్నదాన్ని చూడలేని
కసి గందుకు మతాలు యెల్లలు
సంకుచిత స్వభావాల కొలబద్దలు
ఎందుకు? ఎందుకు ? యెందుకు ?

కామానికి కసికీ కట్టుబడ్డ నీ ప్రేమకు
జాలిపడీ కరుణించీ తోటమాలి విసిరేసిన
జీవమొక్క – ఎటు పెరిగిన – పెరుగనీని
పిచ్చి పిచ్చి ఊహలు పుచ్చిన తలపులలో

ఇంకా ఇంకా ఓ మనిషీ !
నువ్వింకా బానిసవే ●

# నగ్నముని

## జైల్లో సముద్రం

1940 లో
తెనాలి కౌగిలిలోని
అస్థిపంజరం లాంటి ఓ
పల్లెటూళ్లో కళ్ళుతెరచి అరిచాడు.
బందరు హైదరాబాదు దుమ్ములో పెరుగుతూ
బురదని, బురఖాల్ని చదువుకున్నాడు. పెసరట్లు,
కిటికీలోంచి కిందనడిచే మనుషులు, సైగల్ గొంతులో
విషాదఘోష, రాత్రేళ 12 గంటల గడియారం ముళ్ళ
ఉపగూహన యిష్టం. ఈ భూగోళమ్మీద యీ సమస్యల
చింకిపాతల్లో ఊపిరి పీల్చడమే ఒక
అనుభవం అంటాడు. ఒక కంద
చీమని పెంచుతున్నాడు.
పేరు జీనా.

**సూ**ర్యుని కడ్డంగా నుంచున్న
ఆ మబ్బు తునక పేరేమిటి?

అర్థంకాని అనంతశూన్యం అంచుమీదకి
ఆకారంలేని కుర్చీనొకటి లాక్కుని
అర్థవంతమైన బ్రతుకువెన్నెల చుక్కల్ని కప్పులో వొంపి
ఒక్కొక్క క్షణం పెదవుల కానించి
విషాదాన్ని ఆరాధిస్తూ వుంటానా!
హొయలు హొయలుగా పొగలు పొగలుగా

కెరటకెరట కెరటాలుగా కాలం
నా కాళ్ళని ముంచెత్తుతూ వుంటుందా!

ఎందుకో ఒక్కసారి ఏకాంతంలోకి
నిర్జనారణ్యాలు నడిచివస్తాయి
నిబిడాంధకార గహ్వరాలు తెరుచుకుంటాయి
నా వేళ్ళ చివర
అస్తమయంలా వెలిగే గులాబీలా
భయ విహ్వలతలా అదుముకున్న
సిగరెట్టు చివర

ఏరి స్నేహితులు పార్టీలు పందిళ్లు
పరివార సమేతాలు మందిరాంతర్భాగాల
కవితా గానాలాపాలు చిరుగజ్జెలు శారద రాత్రులు
మల్లెల మందయామినులు
ఫ్లాస్కుల్లో విరబూసిన కాఫీ పరిమళాలు
గ్లాసులచుట్టూ వొత్తైన వేళ్ళ వొత్తిళ్ళు
చిరునవ్వులద్దుకున్న కాశ్మీర్ పూదోటలు
అధరాలు ఆక్రమించుకున్న సూర్యోదయాలు
మెడలపై వక్షోజాల ఉన్నతుల తటిల్లతల
రహస్య లోయల కాందిశీక ప్రయాణాల
చేతివేళ్ళ సరిగమలు సఖులు ప్రియబాంధవులు
పరవశత్వపు పలుకుల ఖర్జూరాలు
ఏవి?
సూర్యుని కడ్డంగా నుంచున్న
ఆ మబ్బుతునక పేరేమిటి?

జ్ఞాపకాల వాలు కుర్చీలో
కుక్కనోటిలో బొమిక ముక్కలాగు
చలిగాలి రాత్రిపళ్ళలో యిరుక్కుంటాను

గోడమీద నిక్కి నిక్కి చూస్తూ టిక్కు టిక్కు మనే
ఈ పాతకాలం గడియారం నా పాపాల్ని క్షమించబోదు
ఎదురుగా నన్ననవతరం వీక్షించే పరీక్షించే యీ అద్దం
నా ముఖంపై మొలిచే ముడతల్ని నాకేచూపి
భయపెట్టడానికే కాబోలు వేచి వుంది
నా తలలో మొహెంజొదారో శిథిలాల్ని త్రవ్వి
బ్రహ్మజెముడులా తెల్ల వెంట్రుకల్ని చూపడానికి
నిరీక్షిస్తున్నది
వికటాట్టహాసం చేస్తూ నన్ను నహుషుణ్ణి చేయడానికి
పొంచున్నది
రూపాయి నోట్లో తలదూర్చి తన్నుకుంటున్న లోకంలా
సీసాలో బంధించుకుంటున్న ఆధునిక మానవుడి రూపంలా
ఎప్పటికీ నా కర్థం కానిది యీ అద్దం
తానెవరో అర్థమై
ఊపిరి ఉనికి తెలిసినచోట
ఈ అద్దాన్ని అమర్చడానికి ప్రయత్నిస్తూ వుంటానా
కాలమృగం కోరలకందకుండా తిరుగుతూ వుంటానా
మేఘాల్లోనూ కన్నీళ్ళని లెక్క బెడుతూ వుంటానా
గోడకి కఠినంగా కొట్టబడిన మేకులు
భళ్ళునరాలి నవ్వుతాయి
జీసస్ చేతుల్లో మొలిచిన మానవాత్మల మందారాలు

తళుక్కున మెరుస్తాయి
మెదడు ఆసుపత్రి క్రింద మారుతుంది.

మూలుగులు తప్ప మరేమీ ప్రవహించని పర్వతాగ్రాన
అద్దం కోసం స్థలాన్ని వెతుకుతూ వుంటానా
మనసు మసీదులో అదృశ్య హస్తాలు మొలుస్తాయి
కేక పెగలనిచోట కోరిక లాంటి శిశువు జన్మించి
రక్తమాంసాల నదిలో ఊయలలూగుతుంది.
మహిషం వేదం వల్లె వేస్తూ శతాబ్ధాల్ని నెమరేస్తుంది
విహ్వాలుడనై ఊహల బండలమీద కూర్చుంటానా
మహాబోధిని కూల్చే భూకంపాల్లో
నీరో రగుల్కొల్పిన గీతాల నాలుకల్లో
సాగిన నరాలు ఎముకల గూళ్ళు
తుప్పుపట్టిన పళ్ళు నక్షత్రాల రాళ్ళు కూలిన గోడల కింద కుళ్ళు
గుడిశెలు పందికొక్కులు పరాన్న భుక్కుల పంచన
ఆకాశం పరచుకున్న వంచన గొంగళీ కింద
వెలగని దీపాల తాపాలు
రొమ్ముల్లో శాపాలు

నగరం అస్థిపంజరంలో
ఆకలి ఉరగం కదలిక
నిద్రపోని రోడ్ల మీద జనం
జైల్లో బంధించబడిన సముద్రం
స్ట్రయిక్స్, స్ట్రయిక్స్, స్ట్రయిక్స్
నాయకుల ఉప (వి) న్యాసాల కేక్స్
వాగ్దానాల ఉచ్చుల్లో వార్తా పత్రికలు

యుద్ధాలు ఆక్రమణలు అగాథాలు
కూలుతున్న పిరమిడ్లు
సముద్రాల్ని బంధించానని సాహసంగా నవ్వుతున్న కొన్ని
చేతివేళ్ళు

అంచెలమీద రోదసీ ప్రయాణాలు
ఎక్కడో ఏ యంత్రమో చెడింది
స్థంభించాయి రేడియో కిరణాలు
ఇరవై శతాబ్ధాలు
దిక్కులేని దిక్కులు
ఊహల బండరాళ్ళు ముక్కలై నయ్
కాలమృగం ఢీకొన్నది ఆకొన్నది
రక్తమాంసాల నదిలో కోరికలాంటి శిశు గర్భంలో
అణుకోర దిగింది

చర్చి గంటలు
మసీదులో మంటలు
గర్భగుడిలో చెరచబడ్డ విగ్రహాలు
గ్రామఫోను రికార్డులో తన్నుకుంటున్నాడు గాయకుడు
వాల్‌పోస్టర్లో మానాన్ని దాచుకుంటున్నది అభినేత్రి
గళ్ళలుంగీ రోడ్డుమీద రాజకీయాల కారాకిళ్ళీ ఉమ్ములు
సెకెండ్ షో వొదిలారు
నా వయసు ఎన్ని అంధకాంతి సంవత్సరాలు
ఏది అర్థం
ఏది అద్దం పరమార్థం
మానవత అసలు రూపు మాసిపోకుండా చూపే

భవితవ్యం
మనిషిని మనిషిగా
ఈ కృత్రిమ దుస్తుల్ని విప్పేసి
నగ్నంగా నిశ్చలంగా సజీవంగా సాక్షాత్తూ మానవుడిగా
మట్టిలో పుట్టి మట్టిలో ఎదిగి
కాలరాక్షసి కరాలకందని ఎత్తుకు ఎదిగే
మానవతా నక్షత్రం
నీకూ నాకూ నడుమ
నాకూ యీ నటనకీ నడుమ
ప్రపంచ దేశాల ప్రళయపరాచికాల నడుమ
సత్యానికీ సత్వానికీ నడుమ నిలుచున్న
ఆ మబ్బుతునక పేరేమిటి ●

# దిగంబర శకం

## కాలమానం

**సంవత్సరాలు**

**ఆరు**

నగ్ననామ సంవత్సరం
నిఖిలేశ్వరనామ సంవత్సరం
జ్వాలాముఖినామ సంవత్సరం
చెరబండనామ సంవత్సరం
భైరవనామ సంవత్సరం
మహాస్వప్ననామ సంవత్సరం

**ఋతువులు**

**ఆరు**

ఆశ ఋతువు
తపన ఋతువు
అశ్రు ఋతువు
మదిర ఋతువు
విరహ ఋతువు
విషాద ఋతువు

**వారాలు**

**ఆరు**

స్నేహ వారం
విశృంఖల వారం
క్రాంతి వారం
సృజన వారం
వికాస వారం
అనంత వారం

# దిక్‌లు 30

# దిగంబర కవులు

## సంపుటి 2

★★★

## దిగంబర శకం

నిఖిలేశ్వర నామ సంవత్సరం మదిరరుతువు (సరిగ్గా క్రీ.శ. 1966 డిసెంబర్)లో ఇంకా భయం భయంగా బానిసత్వంగా దుర్భరంగా హేయంగా ఛండాలంగా వున్న ఆంధ్రదేశమనే మురిగ్గుంట లోంచి నగ్నముని నిఖిలేశ్వర్ జ్వాలాముఖి చెరబండరాజు భైరవయ్య మహాస్వప్నలు పలికిన కవిత దిగంబర కవితా ప్రచురణ సమర్పిస్తున్నది.

నగ్నముని
నిఖిలేశ్వర్
జ్వాలాముఖి
చెరబండరాజు
భైరవయ్య
మహాస్వప్న | నిర్మిస్తున్న

# దిగంబరశకంలోంచి

## సమకాలీన జీవితంపై దిగంబర కవుల దృక్పథం

### మేం ఏం కోరుతున్నాం?

ఎందరి శవాలపైననో నిలబడ్డ కీర్తికాముకుల, అవకాశవాదుల,
గుంటనక్కల మధ్య, చాచుకున్న శూన్యహస్తాల ఈనాటితరం
తలల మధ్య మేం ఏం కోరుతున్నాం?

కుళ్లి గబ్బుకొడుతున్న గడిచిన రోజుల చరిత్ర శవాన్ని మోస్తూ, అభినవ క్రీస్తులుగా తలపోస్తూ ప్రస్తుతం తమ ఆస్తిత్వం కోసం 'మార్జువానా' మత్తులో తటపటాయింపుల నగర సంగీత గంద్రగోళంలో ఎటూ పాలుపోకుండా నిలుచున్న బీట్ సోదరులు అక్కడ తన బొజ్జ నునుపు కోసం పక్కవాడి పీక అతి చులాగ్గా, హేలగా, లీలగా నులిమేసే రాజకీయవేత్తలు పళ్లికిలిస్తూ గొంతుల నదుముతున్న చేతివేళ్ల క్రీనీడలలో నిరంతరం గుర్తు తెలీని ముఖాలు వేగంగా ప్రవహించే కలకత్తా రోడ్లపైన బంగాళీతనం కోసం మనిషిని మరచిన భారతీయాత్మ కోసం విలపించే ఆకలితరం యువకులు

ఇక్కడ కోపంతో, ఉద్రేకంతో తిరగబడి మత, రక్తబాంధవ్యాల ముళ్లపొదలపై, శిధిలవ్యవస్థపై, జడత్వంపై సంచలనాన్ని లేవదీసి, మరో మహత్తర వ్యవస్థ కోసం తపనపడుతున్న కోపోద్రిక్త యువకుల నడుమ సంప్రదాయాల సంకెళ్లకీ, చరిత్రలో చిరిగిపోయిన పేజీలకి తమని అమ్మేసుకున్న గొర్రెలు, స్వార్థంతో, కృత్రిమత్వంతో తమ ముఖాలను తామే రంగు కాయితాల్తో అతికేసుకున్న గాడిదలు, డబ్బుకోసం, భవనాలకోసం, పదవులసోపానాలకోసం, విగ్రహాలకోసం, ప్రజల నాలికలు కుట్టేసి కాలాన్ని వెనక్కి యింకా వెనక్కి గుంజాలనే ప్రయత్నం ముమ్మరంగా సాగుతున్నచోట, భయంకరంగా యీ తరానికి కాస్త కాస్త విషం ఎక్కిస్తున్నచోట మీముందు దిగంబర కవులు.

పలాయనవాదపు పందికొక్కుల్ని తరిమేసి, జీవితంలోంచి సాహిత్యంలోకి వొస్తున్న వాళ్ళు, సాహిత్యంలోంచి జీవితాన్ని దర్శిస్తున్న వాళ్ళు. నేటి చెత్త వ్యవస్థని సమూలంగా తొలగించి నిత్యనూతన, మహోత్తర వ్యవస్థకోసం తపనపడుతున్న దిగంబర కవులుగా మేం ఏం కోరుతున్నాం?

## సాహిత్యంలో

ఆదినుండి అనువాదానికీ, అనుకరణకీ అలవాటుపడి నేడు పాశ్చాత్యస్వరాలకి ప్రతిధ్వనిగా మారిన తెలుగు సాహిత్యానికి మౌలికమైన ధ్వనిని కోరుతున్నాం.

ప్రస్తుతం అప్రస్తుతంగా టన్నుల కొద్దీ ఉత్పత్తి అవుతున్న పోపు సాహిత్యాన్ని, దానికి జెండా ఎత్తుతున్న పత్రికలను తగలబెట్టే రచనలను కోరుతున్నాం. సాంప్రదాయకమైన కావ్యరచనలలోనున్న ఆడంబరాలను, దంభాలను, మిథ్యా భ్రమలను త్యజించడం అవసరం. నేటి కావ్య రచనలో జీవితంలోని నిజాయితీని, సరళత్వాన్ని, యుగ సందేశాన్ని, అనుభూతుల అభివ్యక్తిని ఊపిరిగా పీల్చగల ఆధునిక మానవుని అస్తిత్వం ఆవిష్కరింపబడడం అవసరం.

## ఈనాటి జీవితంలో

ఈ జీవితంలో జంతువుల్లా బ్రతికే అధికారం ఎవరికీలేదు. పనిచేస్తూ, తింటూ, పిల్లల్ని కంటూ వున్నంతమాత్రాన అస్తిత్వాన్ని నిలబెట్టుకున్నట్టుకాదు. అది అవసరమైనా, పశువుకంటే హీనంగా జీవించడం మాత్రమే అవుతుంది. నిజమైన అస్తిత్వం భౌతిక ఆనందంతోబాటు మనస్సుని సర్వదా సచేతనంగా వుంచి అందరిలోనూ నిలబడి తనలో తాను జీవించడం.

ఈ జీవితం తాటస్థ్యాన్ని వరించకూడదు. మనిషి జీవితం ద్వీపంలాగా కాకుండా తోటివారి ప్రేరణాస్రోతస్సుగా వుండడం కావాలి.

సమకాలీన శాస్త్రీయ యుగంలో వ్యక్తి తనతోనే తాను పోరుసల్పుతున్నాడు. ధనం వెనుక పిచ్చివాడై, సుఖం, లాలస వెనక కుక్కలా తిరుగుతున్నాడు. తన నీడని చూచి భయవిహ్వాలుడై మిగిలిపోయాడు. సుఖాన్ని యిచ్చే సాధనాలు చివరికి ఆత్మను బంధించే సంకెళ్ళు గా ఎదుట నిలుచున్నాయి.

అణ్వభ్యున్నతిలో మానవుడు యీ ధరాతలంలో తప్పిపోయాడు. తప్పిపోయిన ఆత్మను పట్టియిచ్చి మనిషిని మనిషిగా చూడాలని మా కోరిక.

కుళ్ళి గబ్బుగొడుతున్న కుల, మత, వర్ణ వర్గపు బురదగుంటల్లో పడి పురుగుల్లా రాజకీయ వేత్తలు ఈదుతున్నారు.

ఇరవయ్యో శతాబ్దంలో మనిషి యంత్రపు విడిభాగంగా తయారై అస్తిత్వ రహితుడు కానక్కరలేదు. శక్తితో కలిసి యంత్రాన్ని నడిపించాలిగాని, పక్కవాడి గొంతు నొక్కడానికి దానిని ఉపయోగించకూడదు. ఇప్పుడు జరుగుతున్నది అదేనని ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు.

## రాజకీయ వ్యవస్థ

మానవజాతి చరిత్ర మొదలైనప్పటినుండి ఎన్నో మతాలు, సిద్ధాంతాలు ఉద్భవిల్లాయి. ఆయా దేశ కాల పరిస్థితుల కనుగుణంగా నిర్వచింపబడిన వాటికన్నింటికీ పరిణామదశలో ఏదో స్థానం, తత్కాలానుగుణమైన విశిష్టత ఉన్నాయి. అయితే మానవ సంక్షేమంకోసం, వ్యక్తిని మరింత ఉన్నతునిగా మలచడంకోసం పుట్టిన యీ మతాలూ, సిద్ధాంతాలూ, కాలం మారుతున్నకొద్ది, చరిత్ర పురోగమిస్తున్నకొద్ది వాటి స్వరూప స్వభావాలుకూడ పూర్తిగా మారిపోయి కేవలం భేషజంగానో, లేక ఏ కొద్దిమంది వ్యక్తుల స్వార్థపరుల అధికారదాహానికి ఆలంబనంగానో మిగిలిపోవడం జరుగుతోంది.

ఇదే ఆనాటి గ్రీకు ప్రజా రాజ్యాలనుండి నేటి పశ్చిమదేశాల్లో ప్రజాస్వామ్యం పేరుతో చలామణీ అవుతున్న పదార్థాలలోనూ, మార్క్సిస్టు మతావలంబకులమని చెప్పుకుంటున్న కమ్యూనిష్టు దేశాల్లోనూ కూడా మిగిలింది. ఈ వైవిధ్యపు అంతర్జాతీయ రాజకీయ సుడిగుండంలో పడి యీనాడు మనిషి నలిగి పోతున్నాడు.

అందుకనే దిగంబర కవులు యీ మతాలతోను, ఇజాలతోను తమకు నిమిత్తం లేదంటున్నారు. అంతర్జాతీయ రాజకీయ రంగంలో మనిషిని పణంగా పెట్టి, ఇజాల పాచికలతో మాయజూదం ఆడరాదంటున్నారు. చిత్తశుద్ధి, నిజాయితీలపై ఆధారపడిన సంఘవ్యవస్థ, రాజకీయ దృక్పథం రూపొందించాలి.

ఈ భూగోళంపై దారిద్ర్యం, ఆకలి అలుముకుని వున్నంతవరకూ మార్క్సిస్టు దృక్పథాన్ని సవాల్ చేసే అధికారం ఎవరికీ లేదు, అయితే వ్యక్తి స్వేచ్ఛ జనబాహుళ్యానికి అడ్డుకారాదు. కాని నియమాల నిరంకుశత్వంలో సిద్ధాంతాల వక్రభాష్యంతో మనిషిని కీలుబొమ్మగా, యంత్రపు విడిభాగంగా తయారు చేసే నియంతృత్వానికి అది మార్గం కారాదు.

ఈనాటి రాజకీయాలకు ప్రత్యామ్నాయ మార్గాన్ని అన్వేషించే ప్రయత్నం జరగాలి. రాజకీయవేత్తల గుడ్డివేటు పోటి ముగిసి వ్యక్తి మంచికోసం పాటుపడే వ్యవస్థ నిర్మించాలి. ఒక్కమాటలో చెప్పాలంటే వ్యక్తిని శాసిస్తున్న రాజకీయాల మంత్రదండం విరిగిపోయి అసలు విలువలకోసం నిలిచే, బ్రతికే జీవితంకోసం సంఘర్షణ జరగాలి.

విశ్వశాంతి కావాలని ఉపన్యాసాల చిలుకపలుకులు చెప్పి, అణ్వస్త్ర పరీక్షలపేర ప్రపంచ వాతావరణాన్నే విషయుక్తం చేస్తున్న అగ్రరాజ్యాల నాయకులు గొప్ప నటచక్రవర్తులు. వాళ్ళపైన గొర్రె చర్మం కప్పుకున్నారు. వీళ్లు ఏ ఇజంకింద, ఏ వ్యవస్థకింద వున్నా వీళ్లని, వీళ్ల అమానుష చర్యలను దిగంబర కవులు అసహ్యించుకుంటున్నారు.

## జడత్వాన్ని వరించిన ఆంధ్రదేశం

ఈ భూగోళంపై ఇంత సంచలనం, ఇంత సంఘర్షణ జరుగుతున్నా ఆంధ్రదేశం మాత్రం తనకి ఏమీ పట్టనట్టు నిద్రపోవటం చూస్తే అన్ని వింతలలోకి వింతగా కనబడుతున్నది మాకు. పాలేరు మనస్తత్వంగల పాలకులు, వెన్నెముక లేని యువకులు, నవ్యసాహిత్యాన్ని ఇంకా మట్టి సుద్దలతో తూచే మహా మహానుభావులు, మైధున కవిత్వంలో ఆధునికులమనుకునే క్షుద్రశవభోగులు, సినిమాలే ప్రమోషన్‌లుగా మారిన గుమాస్తా మనస్తత్వంగల కళాకారులు, ఈ అకాడమీలు, ఈ సంస్థలు, ఈ పత్రికలు, వీళ్లందర్నీ బట్ట లొలిచి దిగంబరకవిత్వపు కొరడాకొసల్ని రుచి చూపించాలి. వీళ్ల జబ్బు భావితరాలకు అంటకుండా శస్త్ర చికిత్స జరగాలి. ఈ సిఫిలిస్‌గాళ్లని రోగం నయమయ్యేంతవరకూ దూరంగా వుంచాలి.

ఇంక యీ ప్రదేశంలో మరోరకమైన మదపిచ్చిగా తయారైంది సినిమా. దేశాన్ని కుష్ఠులాగ పట్టుకుంటున్న ఈ వెర్రి ప్రభావం తగ్గి, ఆరోగ్యకరమైన విజ్ఞాన, వినోద సాధనంగా, కళాకారుడి నిజమైన స్వప్నావిష్కరణగా సినిమా తయారు కావాలి.

## మా తాత్విక దృక్కోణం

మనిషి భౌతికవాంఛ నిజం. ఈ వాంఛతోబాటు అచేతనంగా వున్న మూడో ప్రపంచం కూడా నిజం. అలాగే మానసికమైన ఏకాకితనం కూడా వాస్తవమే. కాని, ఈ ఏకాకితనం మాత్రమే అస్తిత్వం కాదు. పరిసరాలు, మానవ బాంధవ్యాలు వొదిలి క్షణం పై క్షణం బరువుగాపడి యీడుస్తూ పోవడం గాకుండా చైతన్యవంతమైన ఆత్మ సంతృప్తితో సాగే జీవితం నిజమైన అస్తిత్వం.

మానవుడి కష్టదశయే అతని మానవత్వానికి అగ్ని పరీక్ష. ఈ దశలో కత్తి అంచుపై కూడా మానవత్వాన్ని మరచిపోనివాడు, అంతర్గత సంగీతాన్ని వింటూ వుండేవాడు యదార్థ మానవుడు.

'జీవితానికి అర్థం లేద'ని నిరర్థక జీవన విధానంతో మనిషి జీవించలేడు. శూన్యంలో ఎక్కడో ఒక మూల లేశమైనాగానీ, ఆశాకిరణం దాగివుంది. శూన్యంలోని ఆశాభావానికి అర్థంలేదనే పిడివాదం గాళ్ళకి నిజంగానే అర్థంలేదు.

ఈ జీవితంలో ప్రతి వస్తువుకు, సంఘటనకు సార్థకత–నిరర్థకత రెండూ ఉన్నాయి. అది తెలీక గుడ్డిగా దేనినోనమ్మి, కర్మ సిద్ధాంతభయంతో రాళ్ళకు మొక్కేవాడు నిజమైన నాస్తికుడు!

ఏ ఆచ్ఛాదనకీ తలవొగ్గని, ఏ భయాలకీ లొంగని నిరంతర సజీవ మానవుడి కోసం ఎలుగెత్తి పిలుస్తున్నాం.

**దిగంబర కవులు**

## దిక్‌లు

దిగంబరకవులు తమ మొదటి సంపుటిలో ఒక విషయాన్ని స్పష్టం చేశారు. తమ కవితా ప్రక్రియను వచనకవిత్వం అనమని, అనవివ్వమనీ అన్నారు. ఇకనుండి దిగంబర కవులు తమ కవితా ఖండికను దిక్ అనీ, ఖండికలను దిక్కులనీ వ్యవహరిస్తారు. జబ్బు పొరల్ని చీల్చి కాస్మిక్ మార్గాన్ని నిర్దేశించేవి యీ దిక్‌లు. మానవత్వపు విలువలు వీటి హద్దులు.

# నగ్నముని

## కాస్మిక్ జాతికోసం

**కో**డిపందాలకీ గొర్రెపందాలకీ
కుత్తుకలు తెగ్గోసుకునే
ఓ ఆంధ్రదేశమా

నీ రోడ్లనీ గొడ్లనీ లారీల్నీ మైకా గనుల్నీ
టెండర్లనీ కంట్రాక్టర్లనీ
మాదాకవళం మేధావుల్నీ లంగామార్కు సినిమాలనీ
ఎండల్నీ కల్లుకుండల్నీ
పొగాకుపైకాన్నీ వంటింటి పత్రికల్నీ
ఇళ్ళు తగలబెట్టుకునే సహజీవనాన్నీ
బొర్రపెంచుకుతిరిగే సెంటిమెంట్ల అంట్లవెధవల్నీ
వెలుగుముఖం చూడని వర్తకుల్నీ

ఓహోహో అఖిలాంధ్రదేశమా!
అజ్ఞానంధ సౌభాగ్యసీమా!
లుకలుకలాడే నీ నాలుగుకోట్ల జనాన్నీ
ప్రణాళికల వ్రణాలపై మూగే ఈగల రాజకీయాల్నీ
అహామాత్యుల్నీ వాళ్ళని సృష్టించిన ఆడంగిరేకులవాణ్ణీ

కవిపందుల్నీ
అగాధమీలనే అనాథశరణాలయాల్నీ
బెజవాడ ఏలూరు కాల్వలో వికసించే ఉదయాల్నీ
బార్‌లలో హైదరాబాధనీ
నీ వేల సంవత్సరాల గొడ్రాలి సంస్కృతినీ
ఏ దేశమేగినా ఎందుకాలిడినా
కారంలో పొర్లించిన రోకళ్ళతో
పట్టపగలు
విషయించాలనుంది ● *(దిక్ - 1)*

# నిఖిలేశ్వర్

## నా దేశంలో నేను ఏకాకిని

**నా** దేశంలో నేను ఏకాకిని
ఎప్పటికప్పుడు ఎదురు నిల్చి
కత్తిదూసి ప్రశ్నిస్తున్నాడు హేమ్లెట్

నా దేశం నాకు మిగిల్చిన
మహాసమస్యలు ఉరితాడు
నిత్యం తలపై పురి తిరుగుతూ
గట్టిపడుతున్న ఆకలి – నిరుద్యోగపు ముళ్లు
ఆ ముళ్ళల్లో
అందమైన ముఖాల పువ్వులు
విచ్చుకొన్నవాటి రెక్కల మధ్య
రెక్కలు విరచబడిన
అసహాయ స్థితిలోని విషాదం
విషాదం వైర్ల మధ్య
సూర్యముఖి పువ్వులా వేలాడుతున్న
చంద్రుడు ఒక తెల్లని గబ్బిలం
నా సంస్కృతి నన్ను కాలదన్నేసినప్పుడు
వేల వత్సరాల ఔన్నత్యం నాకళ్ళముందు
నా ఆలోచనల దాడికి శిథిలమై
చరిత్రలో ఎక్కడా చోటు మిగలక
సముద్రతీరమంతా సరుగుడు చెట్లమయమై
నక్షత్రాలు అల్యూమినియమ్ నాణాల్లా మెరుస్తున్నప్పుడు

నా ఇంటి కిటికీలోంచి మరో సముద్రపు గాలి
ఉధృతంగా వీచి విశ్వాసాలను కూల్చినపుడు
ఒక్కొక్క పుట తిరగవేస్తే
కోడి పందాలు
కోళ్ళలా తన్నుకున్న వీరులు
వీళ్ళల్లో ఒకడి తల ఒకడు నరుక్కున్న
బొబ్బిలి శూరులు

దీపాల గాలికి ఆరిపోయిన వొత్తులు
మిగిలిన అయోమయపు చీకట్లో
వరుసగా నిలుచున్న కరెంటు దీపాల్లో
నేను నా దేశానికి పరాయివాడిని
జ్వలిస్తున్న ఏకాకిని
స్నేహం ఇవ్వని దేశంలో
స్నేహంలేని ప్రతివాడూ ఒక్కొక్క ద్వీపం ●

*(దిక్ - 2)*

## ఆకాశం వెక్కి వెక్కి ఏడుస్తోంది

**పు**డమితల్లి చల్లని గుండెను
పాయలు పాయలుగా చీల్చుకొని
కాల్వలై ఎవరిదో
ఏతరం కన్నీరో
గలగలా సుళ్లు తిరిగి
మెల్లమెల్లగా పారుతూంది
దూరంగా ఊరి చివరి మైదానం
శిరసెత్తిన సరస్సై
నింగివేపు పొంగుతూంది
తడుస్తోన్న జీవితం గోనెతట్టును పిండలేక
పరుగెత్తబోయి తట్టుతాకి జారిపడిన
పసుల కాపరి కళ్ళల్లో
కన్నీళ్లు సెలయేళ్ళు
అంబా అరపులతో తిరుగాడే గోదలు
ఏడ్పించి ఎందుకో నవ్విస్తున్నాయి
ఎక్కడో పిడుగు పడింది
అపుడే పుట్టిన ఆవుదూడ
లోతైన గోతిలో దిగబడింది
ఎక్కడో కత్తిమెరుపు
ఊరి ఎగువన తటాకం
గుండెతెగి ప్రవహిస్తున్నట్టుంది
ఒంటరి పాలేరు గుండె పూరింటిలో
దూలం విరిగి గోడకూలి
బంధానుబంధాల తాటాకులు

గాలిలో ఎగురుతున్నాయ్
ఆ కాపరి విశ్వాసం కంచుగొడుగు కింద
ప్రసవించిన నేత్రం
కళ్ళులేని ఆత్మ
అతనికోసం ఆత్రంతో
పక్కింటి చూరుకింద
దైవాలను కొలుస్తున్నాయ్
ఆకులపై రాలే చినుకుల అలికిడి
పసిపాపల కేరింతల్లా విని
కాపరి హృదయంలో ఏదో
కన్నీటి ఊయల కదలాడింది
కాలం వానజల్లు తెరలమధ్య సుడిగాలుల సాలెగూడులో
కనిపించని పశువుల కలవరింతల్లో
వరదలో కాల్జారిన కాపరి
మరో సుడిగుండమై తిరుగుతున్నాడు
నాటు సారాయి మత్తులో
ఒళ్ళు మరిచాడు భూస్వామి
ఆలుబిడ్డలేమైనారని
అనలేక అనుకోలేక
ఆకాశం చూడలేక
ఏ గట్టూ కానలేక

సజీవ తరంగాలను సృష్టిస్తూ
నీరవ తరంగమై నెమ్మదిగా
కదిలిపోతున్నాడు కాపరి

ఆకాశం వెక్కి వెక్కి ఏడుస్తోంది. ●

*(దిక్ – 3)*

## చెరచబడ్డ గీతాన్ని

నేను చెరచబడ్డ గీతాన్ని
నగ్నంగా నడివీధిలో కాటేసిన భూతాన్ని
స్వార్థపు కాంక్రీటు తొడలమధ్య
నలిపివేయబడ్డ రాగాన్ని
కీర్తిరతి తీరని బాబాకారుల
భయంకర
నఖక్షతాలకి దంతక్షతాలకి
పుళ్ళుపడి కుళ్ళిపోయిన వక్షాన్ని
నేను గీతాన్ని
కేరింతలు కొట్టి
పరులకైత తమదని భేరీ మ్రోగించి
చలామణీ చేయించే
చాపల్యాల చవకబారు కామోద్రేకానికి
చచ్చి పుచ్చిపోయిన పిండాన్ని
ముద్రాక్షతలతో తమ రాక్షసత్వాన్ని
లిఖించుకోవాలని
తాపత్రయపడే తుచ్ఛులు
స్వైర విహారం చేసిన శరీరాన్ని
రసాన్ని వదిలి
రాక్షసత్వాన్ని ప్రతిబింబించిన రూపాన్ని
నేను గీతాన్ని
అసహ్యంగా అసభ్యంగా
బహిరంగంగా బాహాటంగా
సిగ్గులేక – చాకచక్యంలేక – చాతకాక
నీచంగా – ఛండాలంగా
చెరచబడ్డ గీతాన్ని
చిత్రించబడ్డ భూతాన్ని ● *(దిక్ – 4)*

## కిలికించితం

పగులుతూన్న జాతిదర్పణంలో
మహాత్ముల త్యాగఫలం
నిష్ఫలమై స్రవిస్తూంది
వైపరీత్యం కొలకుల్లో
మొలిచిన పరితాప కుసుమాలు
ఆరాటం ఆల్చిప్పల్లోకి
జాలిగానవ్వి జారిపోతున్నాయి

పెళ్ళలు రాలుతూన్న స్వరాజ్యం గోడలపై
చరిత్ర కాలజ్ఞాని నిక్కి నిక్కి కూస్తూన్నది
ఉదయాన్ని పెనునిద్దుర తింటూందని ధ్వనిస్తూన్నది

'నేడు'
నిన్నటి బీడులోలేచి
రేపటి మేఘంలో నీటివాసననైనా కానక
ఒరుగుతూంది నిరాశాక్షామంవైపు
లోకాలోకనం చేస్తూన్న అతృప్తాత్మ
గూడుజారిన పులుగుకూనలా
నేటి నిజం చుట్టూ కొట్టుకుంటూంది

స్వాతంత్ర్యం తన్నులలో
పగిలి తొనలూడిన త్యాగఫలాన్ని
చూడలేని ధర్మ చక్షువులకు
వేడివేడి వర్షాకాలం
అవినీతి పంకిలం

అందరికీ శ్రీచందనమైనందుకు
ఆదర్శం అర్భకుని చరమశ్వాస

స్వాతంత్ర్యం పూదోటలో
అదుపుతప్పి ఎగబడ్డ
రాజకీయాల గొడ్లని
తన్ని తరిమివేయలేక రోషం

'కల' నిజమైన తరంలోనే
'నిజంనిసుగు' ఇజాల గాజుకూజాలో
ఊపిరి పీలుస్తున్నందుకు
'సిగ్గు – అభిమానం' పాలిండ్లు
గడ్డకట్టి పగిలిపోతున్నాయి

వంధ్య సాకలేని తల్లి ఐందనే వ్యాఖ్య
దేశం ఉనికిని ఉచ్చై బిగుస్తూంది
దాయాలు కుడుపుతూన్న
దాక్షిణ్య స్తన్యాలు
బాలారిష్టాలై బాధిస్తున్నాయి
పట్టనితనం గట్టుపై
సినిమా గిలిగింతల్లో
ఆటల నాటకాల ఇకిలింతల్లో
అమ్మాయిల ఎంగిలింతల్లో
కట్నాల కౌగిలింతల్లో
యువతరం తిలాంబరాలు
అజ్ఞానపు అంగుష్ఠపానంలోనే
అనంతబాల్యరసాస్వాదన
బార్ ల వేదాంతశాలలో
అనంతమైన ఆత్మరతిలో మేథావులు

మైకంలో సిద్ధాంతాల శునక మైథునాలు
వారికి జీవితాలు పేకముక్కలు
వారికి సమస్యలు తురుపు ముక్కలు
కవులు
ఊహాలోకాలలో
భావనాకల్పిత
ప్రేయసీ వక్షోజాల రసశిఖరాలకు
వ్రేలాడుతూన్న గండు గబ్బిలాలు
రసాల సాలెగూళ్ళని చీల్చలేక
అలంకారాల అంధకార మార్గాల్ని భేదించలేక
సమకాలీన వెలుగు వారధిని గాంచలేక
చీకటి బానిసలు
గుడ్లగూబలు
చక్షు గవాక్షాల్ని బిగిస్తున్నారు
అక్షర భిక్షల్ని ఆశిస్తున్నారు
సినిమావ్రణాల యక్షిణులపై
ముఠా రాజకీయాల మురుగు నురుగులపై
కిరాయి వాదాల కిరాణా కోణాలపై
ముసిరిన పత్రికామక్షికాలు
అజ్ఞానపు కలరాని వ్యాపిస్తున్నాయి
ప్రజాస్వామ్యం పేరిట ప్రజల్తో
పరాచికాలాడుతున్నాయి
మతాలు
వ్యాపార మందిరాల్ని
అహంకారాల మసీదుల్ని
ఆడంబరాల చర్చీల్ని

అందంగా తెరచి
సామాన్యులను లేవకుండా చరిచి
మౌఢ్యాల సమాశ్రయణాలు వేసి
సాంప్రదాయాల బంజర్లలోకి సాగనంపుతున్నాయి
సమాజం కొలనులో అశుద్ధాన్ని
శాశ్వతంగా కలుపుతున్నాయి

పరిపాలన పరాచికాల పెనం పైన
పేదల ఆకలిచిందుల్ని
సాంప్రదాయనాట్యంగా సమాజం తిలకిస్తున్నది
సభల్లో
శాసనాల సంధ్యావందనాల్లో
ఉపన్యాసాల ఊకదంపుళ్ళలో
హక్కుల రుక్కుల చిక్కుల్లో
తీర్మానాల తీయందనాలలో
ప్రణాళికావసంతాల పందిళ్ళలో
బిక్కుబిక్కుమంటూన్న
దిక్కులేని "బీదసత్యాలమానభంగం"
సాంప్రదాయ సిద్ధంగా జరుగుతూంది
అందుకే మహాత్ముని మూడు నీతికోతులు
రానున్న ఘోరదృశ్యాల్ని చూడలేక
మొదలే జాగ్రత్తపడి మూసుకున్నాయి
అవిగో
స్వతంత్రభారత అనూహదృశ్యాలు
నినాద ప్రభంజనాలు
ప్రజాస్వామ్య ప్రవచనాలు
సామ్యవాదపు స్వర్గసోపానాలు

కీర్తికండూతి మండూకరావాలు
పదవీవ్యామోహపు సేవాపారాయణాలు
రాజకీయ వ్యభిచార మందిరాంతర్గత రహస్యాలు
మఠాతత్వపు మఠాధిపతుల గుడుగుడుగుంచాలు
సూక్తుల శుక్తిమతీతీరాలు
ఎన్నికల పన్నగాల గుడారాలు
వాగ్దానాల ప్రహసనాలు
స్వోత్కర్షల స్వకుచమర్దనాలు
సన్మానాల పరస్పరకుచమర్దనాలు
సాహితీ వందిమాగధుల స్తోత్రపాఠాలు
పతాకశీర్షికల ప్రయోజనాల తమాషావేషాలు
రకరకాల సంఘాల రంకుల రంగులాటలు
ఉపవాసాల ఊర్ధ్వపుండ్రాలు
ఉద్యమాల పరాచికాలు
భాషా ప్రాంతీయ వాదాల కవాతులు
దౌర్జన్యదారుణాల తాండవాలు
కంట్రాక్టర్ల దయాదాక్షిణ్యాలపై వదిలేసిన ప్రాజెక్టులు
బేహారుల విహారాలుగా మారిన మార్కెట్టులు
వరదల్లో తేలాడే గ్రామాలు
వీళ్ళల్లో తిరుగాడే అస్థిపంజరాలు
రైళ్ళకౌగిలింతల్లో రాలిన ప్రాణాలు
దహనక్రియావేడుకల్లో ఊపిరాడని వాడలు
హత్యలు ఆత్మహత్యలు సమాజం దినచర్యలు
రేట్లబూట్లక్రింద కొనుగోలు చీమలు
కల్తీతామరలో ఎడారిఓడలు
సమ్మెల్లో దుమ్ముల్లో సొమ్మసిల్లిన మానవతాకిరణాలు
నలుపుసాని నగ్న నయగారాల వేలంపాటలు

స్వరాజ్య యజ్ఞంలో 'స్వాహాకారా'ల ప్రతిధ్వనులు
నేడుమేడిపండులో లుకలుకలాడే కీటకారణ్యాలు
నాతరం జ్ఞానబధిరతావ్యాధి కారణాలు
మానాల్ని వదిలిన నాణాల లావణ్యాలు
ఏమీ తెలియని అలగాజనాలు

అన్నీ ,
అవినీతి మయసభలో అగుపించే దృశ్యాలు
నవ్వాలో ఏడ్వాలో తెలియని విషాదాలు
నేటి భారతంలో వికసించిన విషాదాలు
దేశం నిండా శాపగ్రస్తులు
వానల్లో స్నానమాడి వడగాల్పుల్లో ఆరి
ఆకల్ని ఆరగించి కన్నీళ్ళను సేవించి
చలిని కప్పుకొని
ఆశలఆకులు రాలిన చెట్లక్రింద
ఎక్కిళ్ళ జోలపాటలో
కలతల కనుకుల చేతితలగడపై
అలలుఅలలుగా కలలు గంటున్నారు
సామ్యవాదపు ఇంద్రప్రస్థాన్ని
నిరాశల సెగల పొగలలో
ఆకలి చరుపులకు సొమ్మసిల్లిన గోదల్ని
అవసరాల ములుగర్రలతో
ఆశయాల ముకుత్రాళ్ళతో
ప్రతియుగం పరాచికాలాడుతూంది
శుష్కప్రియాలు వారి కార్తీకస్నానాలు
శూన్యహస్తాలు వారి మురిపాల సోపానాలు
వారు పావుకాయలు

చీల్చబడ్డ నదీపాయలు
వారిని ఉద్యమాలు దారిలో మరిచాయి
విప్లవాలు ఊబిలో విడిచాయి
స్వాతంత్ర్యపోరాటంలో వారు క్షతగాత్రులు
స్వరాజ్యం అనుభవంలో మిగిలిన భిక్షాపాత్రలు
వారు జాతినేతల స్వప్నకళాఖండాల కళేబరాలు
శ్రేయోరాజ్యం త్రిశంకుస్వర్గంలో వేలాడుతూన్న కంకాళాలు
స్వరాజ్యంచిన్నది
ప్రణాళికల వసంతాల్ని దాటి
అవయవాల్లో వికాసం వెన్నెలని పండించి
'శ్రేయోరాజ్యం' సూర్యోదయాన
సంక్షేమద్వారాలు తెరచి
"సుభిక్షం జగన్నాథు"ని చేరి
గోకులాన్ని రక్షించాలని జాతినేతల కల
కల నిజానికి కదులుతూంటే
కాముకులు "ధర్మకర్తలు"
ఎగబడి హీనంగా చెరిచారు
తమ సృష్టిని పశుకామానికి బలిచేశారు
ఇంకా చిన్నది ఐనా పతిత
భ్రష్ట హీన దీన
ఛీ !
క్రోధం శోకం సిగ్గు భయం హర్షం
ఇది వైక్లబ్యం
పౌరఫల్గుణుని విషాదయోగం
కాలకాంత కిలికించితానుభావం. ●

*(దిక్ - 5)*

# నిఖిలేశ్వర్

## ఈ మరుభూముల పై నిలుచున్న సాయంత్రాలచెట్లు

**ఆ**కలి - దాహంతో నకనకలాడుతున్న
ఈ సాయంత్రాల వేడి ముఖాలు
పాదాలకు మొలుచుకొచ్చిన
పచ్చని చెట్లవేళ్ళు
ఇరుక్కొన్న
జన్మరహస్యపు జడత్వంలో
నిమ్మళంగా కదలని చెట్లలో
ప్రతిరాత్రీ నరాలు పిండుతో
రహస్యాంగాలలో గాలించే ఆనందంతో
వోడిపోయిన సోదరులమధ్య
ముఖంనిండా మొలిచిన కోర్కెల కొమ్మల్లో
ఈ సాయంత్రం ఇంత మొద్దుబారి
నీరసించి అనాసక్తి ముసుగు కప్పుకొన్న
సన్యాసి గడ్డంలో
వేలాడుతున్న రోడ్లపై పౌరులు కౌపీనాలు
కాలుతున్న యవ్వనం
చిగురించిన ఎర్రతురాయి పూవులో
శరీరం పాదరసంలా కదిలే చీరలో
యాంత్రిక సంపర్కంలో క్షణికాన్ని అనుభవించి
ఆనంద ద్రావకంలోంచి
మునకలెత్తి - మునకలెత్తి

నెర్రెలు చాచిన భూమికన్య పెదాల మధ్య
ప్రాణం నిలబెట్టే నీరుకూడా కరువై
ఒకచోట మనిషి దీనానాథుడి
దారిద్ర్యానికి కొలతబద్దగా బతికి
అస్థికలు కూడా మిగల్చని ధనికజ్వాలల్లో చిక్కి
అంతులేని ఆరాటంలో
మాడి – మాడి అస్తిత్వం మిగలకుండా.........
కత్తి అంచులాంటి క్షణాల్లో
పశువుకి మనిషికి నడుమనున్న
అగాధాలని పూడ్చిన వాంఛాశక్తి
రంగుల్లో నటనల్లో గీతాల్లో
దిగంబర కోరికను
దిగంతాలకు వ్యాపింప చేసింది
'ఈ సమాధుల్ని కూల్చివేయండి'
అని విరుద్ధాభాసంతో కేకలేస్తున్న
మనస్సులోని అసలుపొరలు
పశుకోరల్ని అధిగమించని మనుషులు
రోజూ ఈ సాయంత్రాల మరుభూములపై
పెరిగి కూలే అందమైన చెట్లు ●

*(దిక్ – 6)*

## దెయ్యం దీవించాలి

సిగరెట్లతో గులాబీలు తగలబెట్టేవాళ్లకళ్లు కుళ్లుకాల్వలుగా ప్రవహిస్తున్న
లోకంలో అడుగుపెట్టడం పాపం అదే పాపం లావాలో కూరుకుపోయిన
క్యూలో కూలిబియ్యం కొనుక్కునే బండలైన బతుకులశాపం
ఎండలా మండుతున్న రోడ్లమీద అడుగు పెట్టడం మహాపరాధం ఉన్నవాళ్ళ చీమూ
నెత్తుర్లో కారణంలాంటి కరుణ జీవనదివంటి జాలికి బదులు బ్రహ్మజెముడు
పొదలు బలిష్ఠంగా ఎదిగిన ప్రదేశాల పరుగెత్తడం పాతకం
మంచితనానికి ముళ్ళు గుచ్చి శాంతినోట్లో గుడ్డలు కుక్కి చీకట్లో తప్ప
వ్యాపారం చెయ్యని మహారుషుల్నీ నిమిషానికో గొయ్యితీసి నవ్వు
కూడ నవ్వలేనంత నవ్వుతో జీవితాలు పూడ్చేసే రాజకీయాంబరధారుల్నీ
యుద్ధంలేనిదే అన్నం సయించని అభ్యుదయకాముకుల్నీ సమస్త జంతు
జాలాన్నీ జనంపై వొదిలి
ఆకలి అరాచకం కళ్ళు రాలిపోయి చేతులు తెగిపోయి పసిపాపల అసహాయలు
ఏ జన్మల లోంచో వెన్నుపూసల్లో వొదిగిన భయంకర రోగాలకు వారసులు
సగంకాలిన ఇళ్ళు జైళ్లు రక్తం కన్నీరూ ఏకమై వింతకాంతితో వెలిగిపోతున్న
ఈ లోకాన్ని వొదిలి
ఆ దేవుడుగాడు చచ్చాడు
ఇంక దెయ్యమే కనికరించాలి
ఆక్రందనలతో నిండిన ఆకాశంనుండి దీవించాలి. ●

*(దిక్ – 7)*

# చెరబండరాజు

## ఊబి

తెల్లగా చీలిన పాపిట పాయలో
చీము చిమ్ముతున్న
ఊట
వెన్నెల
జడలుకట్టిన శిరోజాల కొసలు
పట్టుకు వేళ్లాడుతున్న
పేలు
నాయకులు
నొసట తిట్టుతిలకం
చట్టం
బొగ్గుముక్కల పెదాలతో
నవ్వుతూ నామీద దొర్లుతున్న
కాలం
వేశ్య
పయ్యెద సామ్రాజ్యం మీద
పగిలినకోట
పైట
నాగరికత
కడుపు మడతల కింద
చితికిన గజ్జిపుండు
బొడ్డు

ఆకలి
మహారణ్యం బురదగుంటలో
కాళ్లు విరిగిపడ్డ
ఈగ
మనిషి
తప్పిపోయిన చొప్పకట్టలు
ఊరువులు
కట్లు తొలగిస్తే చదలు
కోరికలు

అయినా యోధానయోధులు మేధావులు యోగులు
పై చూపులలో మహామనీషులు మందిరాలు దేవుళ్లు
కవులూ కవిత్వం కౌలుదార్లు నటులూ నాయకులు

ఒక్కసారి
ఒకేసారి

కాలం వెలయాలులో రమిస్తున్నారు
తాముచచ్చి ప్రపంచాన్ని చంపి
స్పర్థాలోకపు అట్టడుగున
స్వార్థం పశువులై
పడిపోయిన గోడలై
సిద్ధాంతాల ఊబిలో కూరుకుపోయి
ప్రవక్తలమని నమ్మమంటున్నారు. ●

*(దిక్ - 8)*

# మహాస్వప్న

## మేం మనుషులం కాదు ఇంకేదో పేరుంది మాకు

నీ అభయహస్తం లాంటి ఆకాశంలో ఇంకిన కన్నీటిచుక్కలు
చావుబ్రతుకులమధ్య నెత్తుట్లో తడిసిన సరిహద్దు రేఖలా మానవత
బావురుమంటున్నాయి కూలిన దిగ్భిత్తికా శిథిలాలు
నవ్వుకుంటున్నాయి పాతాళంలోంచి మేరు శిఖరాలు
ప్రసవ వేదన పడుతున్న ధరణీగర్భంలో
అడ్డంతిరిగిన మృతశిశువు శాంతి
దు:ఖిస్తున్న కీకారణ్యపు చీకటి కులాయంలో
ఎక్కడో
చలికి గజగజవణకుతున్న రెక్కలు తెగిన దిక్కులేని పావురాయి
చరిత్ర అంధకారంలో
నిశ్శబ్దంగా ప్రేలిన అబద్దాలు అణుబాంబులు
దగాలు వంచనలు కుహనాసత్యాలు
జరా రుజా దురాక్రమణలో నిజ స్వరూపాల్ని కోల్పోయిన మానవజాతి
వినిపించే నాగరికతా సిఫిలిస్సంగీతం
ఎంత భ్రమపడ్డావ్ మా దుస్తుల్ని చూసి
ఎంత శ్రమపడ్డావ్ మమ్మల్ని నమ్మి
మేం మనుషులంకాదు ఇంకేదో పేరుంది మాకు
ఇన్ని కోట్ల గోడ్సేల ఘాతుక హస్తాల నడుమ
నలువైపుల హోరుమని విరుచుకపడుతున్న చీకటి సముద్రాలనడుమ
నిశ్చలంగా వెలిగే నీ చిరునవ్వు...
బాపూ, మోసపోలేదుకదా నువ్వు ●

*(దిక్ – 9)*

# నగ్నముని

## హృదిక్

ఆకాశం అరుణిమ పైనే
సూర్యచంద్రులనే నక్షత్రాలనే
భూగోళంపై కేకలనే మానవులనే
పంచభూతాలనే
కవితల్ని రచించింది నేనే

నా రక్తనిండా విశ్వరహస్యముద్రాల జంత్రవాద్యాలు
నా వీర్యంనిండా రేడియో ధార్మిక కిరణాలు
కాలకాంత సరసన
ఇరవయ్యోశతాబ్దం సౌరశయ్యన
సంక్లిష్ట సమస్యల పరిమళాల్ని ఆఘ్రాణిస్తూ
క్షణక్షణ సంఘర్షణతో రమిస్తూ
శుక్రేతర సర్వగ్రహాల సంకేతాల్ని వినిపిస్తాను
ప్రళయాల పొరలకింద నిశ్శబ్దాన్ని తెనిగిస్తాను
న
జ. ●

*(దిక్ – 10)*

# నిఖిలేశ్వర్

## వేదాలు వల్లించే సైతాను ముఖంలో

**రెం**డు ముళ్ళ కౌగిలిలో కాలంతెర
శూన్యమైన కళ్లల్లో ఎర్రజీర
రక్తం మడుగులో సైతానుస్నానం
ఇంకా వేదాలు వల్లించేవాడి ముఖంలో
ఈ అర్ధరాత్రి
కాలం తెర మరోసారి ఆగి
చర్చిశిఖరంపై
గర్భాలయంలో
ఒకే ఊపుతో ఊగే గంటలు
ఈ శూన్యపు కాల విభజనలో
సైతాను వల్లించే వేదాలు
రంగులు పూస్తున్న పీఠాధిపతులు
జరీచీరలను రాసుకొంటూ
కార్ల మెరుపులలో ప్రవచనాలు
ఇంట్లో గోడకు వేలాడేసిన పులినోట్లో
ఎదురుగా కళ్ళు తేలేసిన జింక
నల్లహంస ఎర్రమూతితో
నల్లకలువను ముద్దించుకొని
పాలను నీటిని ఏకం చేస్తున్నప్పుడు
కొండచిలువను చుట్టుకొని
చంద్రుడిలో వేడిసెగలు కప్పుకొని
సైతానుచేతిలో ఖాళీడైరీ
టోపితీసిన పెన్ను నాలుక
ఈరోజుపై కక్కలేదు
నల్లని మంటలను ఇంకా

చలిలో మగాడి పక్కపై
శూన్యం పరచుకొంది
చలిచంకలో పిల్లలు ఏడుస్తున్నారు
గదిలో ఒంటరి సైతానుముందు
కాలుతున్న వార్తలను
గుక్క తిప్పుకోకుండా నింపాదిగా
నిలువునా పోయిన వాళ్లపై
నిర్లిప్తంగా చదువుతున్న రేడియో
విసంగతమై వికటించిన బ్రతుకును
సైతాను ఉటంకించి ఊరడిల్లి
ఊసరవెల్లియై
'ఆనందోబ్రహ్మ' అంటూ
విడివడిన రెండు ముళ్ళనుండి
వెలువరించిన జీవితగ్రంథం
పుటలమధ్య ఫుల్‌స్టాఫ్‌లు
"నిన్ను నీవు మోసం చేసుకో
భూమిపై నీ అస్థిత్వాన్ని మాడ్చుకో"
అంతరంగంలో పాదరసం గడ్డకట్టదు
సంగీతంలో ప్రతినిమిషం
బాదుకొనే గుండెతీగలు
ధ్వనులలో తప్పిపోయి
చైతన్య సుషుప్తావస్థలో
సైతాను ప్రక్క నిద్రించి
రోజూ అక్కడక్కడ
జాగృతిలో దయ అంచులపై నడిచి
సైతాను నరాల్లో మేల్కొని
మనిషిలోని మట్టిని
నలుమూలలా విసిరేస్తూ నిద్రిస్తుంది. ●

*(దిక్ - 11)*

# చెరబండరాజు

కో

నమ్మకం మడతలకింద నల్లిలా
వెన్నెముకలేని గుడ్డులా
రద్దీ కాగితంలో పలచబడిన సిరాలా
జీవిస్తోన్న జీవితంతో పొత్తుకుదరక
బ్రతికిన నీ బ్రతుక్కి ఇక సమాధికట్టుకో

నిద్రా వేదికలమీద
ఛాందస మేళాల్లో లాభాల్లో
ఆడదాని అందాన్ని స్వీయకవిత వ్యాపారాల్లో
వేలంపెట్టి డబ్బాకొట్టిన
ప్రబుద్ధుల ఆటకట్టిందిప్పుడు
మునుపెప్పుడో పెరికేసిన ముళ్లకు
చెల్లించిన కృతజ్ఞత నిలుపుకో
ఆ గద్దెను మాంసకండరంలా ఊహించుకు
గద్దలా గంతులు వేయకు
అది నీ సొంతం గాదు
వంటింట్లో కబుర్లుచెప్పుక కాలంగడుపుకో
కనీసం పెళ్లాం ప్రేమకైనా నోచుకో

అడుగడులకు మడుగులొత్తి
అవకాశాల ఆసాముల పంచన
లేపిన మేడ పునాదులు కదలకముందు
చెరసాలకు కాదు కాదునిన్ను

కసాయిశాలకు పంపాలనుంది
అనుభవం మగ్గంమీద నేసుకున్న
ఆనవాలు పట్టే పంచుంటే చుట్టుకో
చావునాడైనా ఘనంగా
స్మశానం చేరేవిధంగా
ఇప్పటినుండైనా మసులుకో

సిగ్గుంది నీకు
ఈ దిక్ చదువుకో ●

*(దిక్ - 12)*

# నగ్నముని

## మొహమ్మీద చంద్రుడు

ఇనపబూట్లతో కర్కశకంఠాలతో

పొట్టమీద ఒక నల్లసొట్టి పొట్టమీద కాలు తొక్కిపట్టి నీటిమట్టం తెలుసుకునే యంత్రం కనిపెట్టి కొద్దికొద్దిగా కక్కిస్తే అమ్మోయ్‌లో బాబోయ్‌లో రక్షించండ్రోయ్‌లో ఎంత డబ్బు పీనాసిపీకలోతుకింద ఎంతడబ్బు

ఒక ఫస్టుతారీఖు పిల్లలు పెట్టిన జేబులో కలవరంగా గాజుల అలారంలా చక్రవడ్డీల బాహువుల్లో నెమ్మదినెరగని నాలుగు పగిలిన సీసాబుడ్లు బొడ్లో రెండు మల్లెపూ రెక్కల లాంతరు పంచన అవమానంలాంటి వొంచిన తలకింద

మెడకింద సెక్సప్పీల్ సీనరీలు

టి. బి. లో తయారుగావున్న ఎండసాయంత్రం కోరల్లాంటి వేడివేడి ఆమ్లెట్ల పూర్వ జీవితంలోని పొట్టలో గుచ్చుకున్న స్టెన్‌గన్ చూపుకి ఆకారం రాకముందు అరుస్తున్న కళ్ళు కరుస్తున్న జీవితాలు కుళ్ళిపోతున్న దేశం తలగడగా గడగడా రెండంటే రెండు ఎలక్షన్ పెగ్గులు పుచ్చుకుని అరాచకం చంకనబెట్టుకుని పొట్టచుట్టూ బెల్టుకిబదులు ఉపన్యాసాల పావురాల రెక్కల్ని అదిమిపట్టి ఎగరలేని ఎగరవేయలేని ఆరని ఆరవేయలేని బండబూతుల్లాంటి స్వప్నాలూ కబంధహస్తాలూడి ఎలూ అరుపులూ నగరం తలమీద బూటుకాళ్ళ కింద గదిలో ఫ్లాష్ బాక్‌లో వినిపించే నిశ్శబ్దం నీరవం కళ్ళల్లో నింపుకుని అనాది ఆచారాలని ఆగ్రహాచారాలని యీ రాత్రికి భోంచేసి చెయ్యి కడుక్కోబోతే తాంబూలంగా కనబడ్డ

శనివారం సాయంత్రం

మురిగ్గుంటలో ముగ్గుబుట్టలో పలాయనవాద్యంలో పక్షుల నిష్క్రమణసంకేతాల్లో అల్లిబిల్లిగా ఆడుకుంటున్న భవిష్యత్తు శవాలు

కలిసి కాంభోజరాగంలో తానంలో పల్లవిలో తొడమీద మద్దెలదరువు చిటపట చినుకులు యీ రాత్రి ఫస్టుతారీఖు పెట్టిన గుడ్లమీద నృత్యంచేస్తూ సుబ్బలక్ష్మీ సిగ్గు గగనానికీ నా పాంటుగుండీలకీ నడుమ పొద్దు పొడవదు

పొద్దున్నగానీ అప్పులన్నీ విరబూయవు

అప్పుడు శత్రువు మిత్రుడికి ఒక టెర్లిన్ జేబు కుట్టిస్తాడు అసావేరిలో యిద్దరూ కలిసి అభ్యంగనస్నానం చేస్తారు. ఈ రాత్రి సినిమాలో శుభం పారిపోయాక రిక్షాలో మేనుమీద చెంబులింగం సంగీత ప్రపంచంలో హుషారుగా షారానిషానిస్తూ నాలుగు దోమలు నా స్నేహితులు తొండముదరడం వుందో లేదో ఊసరవెల్లిలా ముళ్ళకంపలా సూర్యుడు రాత్రి తలకి చుట్టుకున్న రోకలిబండ వినిపించిన కథలు ఏ పత్రికలో సీరియల్‌గా ప్రకటించాలో నీడ చుట్టూనింగి ఏరు విప్పిన బుష్‌షర్టు

భూగోళం మరణం విని రోదసిలో తలవొంచిన పతాకంలో నా శవాన్ని దహనం చేస్తాను అందాకా నే రాసిన గీతాల్ని నేనే భక్షిస్తాను. ●

*(దిక్ - 13)*

# నిఖిలేశ్వర్

## సమాధులచుట్టూ మంటలు

**ఈ** గ్రహాల విగ్రహాల మధ్య
గోడలమీది కేలండర్లపై
అజంతాలో ధ్యానముద్రలో బుద్ధుడు
నీకోసం వెక్కివెక్కి ఏడుస్తున్నాడు
ఏథెన్సులో సోక్రటీసు
లోకుల అజ్ఞానానికి లోబడి
నీ జ్ఞానవృద్ధికి విషంత్రాగి చచ్చాడు
నీటి తొట్టిలో ఆర్కిమెడిస్
అంకెల అంతరాత్మలో ప్రాణంపోసి
ద్రవ్యసాంద్రతావిష్కరణలో
నీలో నగ్నంగా అరుస్తున్నాడు
హిప్పోక్రెటస్ భిషగర్వుడు ఫ్రాయిడ్
నీ మనోవ్యాధికి తల్లడిల్లే శరీరానికి
నొప్పిని మరిపించే బ్యాండేజులు కడుతున్నారు
.........ఇవన్నీ కేలండర్లు
శూన్యంలో వొలకబోసిన నీటిబొట్టు
దారిలేక గమ్యంలేక
కొట్టుమిట్టాడుతున్న నీవూ నేను
ఈ దేశం కేలండర్లపై తారీఖులం
నిరాధారంగా తహితీ ద్వీపాలులేక
నిలుచున్న ఏకాకులం

గొలుసులాంటి అభివృద్ధిలో
సాధించిన ప్రతి భౌతిక విజయం
ఎక్కడికక్కడే తెగిపోతూవుంది
సగం కట్టిన అభ్యుదయ భవనంలో
కాలం ఇచ్చిన అధికారం మత్తు
లౌక్యం ముసుగుతో
ఉన్న విలువల్ని నేల రాసేసిన వాళ్ళు
మహా తాచుపాములు
రేచులు కాకులు బల్లులు
తలలు లెక్కించే ప్రజాస్వామ్యంలో
ఈ మనుష్యుల కాళ్ళ అడవిలోంచి
సర్వత్రా వ్యాపిస్తున్న
అయోమయపు దుమ్ములో
ముసలినక్కలు లాభాలు పంచుకునే ఈ శ్రేయోరాజ్యంలో
నీ బాధ తప్పదు
నీవు అనుభవించే ఈ కొంచెం సంతోషం
తమకే ధారపోయమంటారు వీళ్లు
అలవాట్లకు బానిసలైపోయి ఎప్పుడూ మనసు క్రింది పొరల్లో
మసిపూసుకు తిరిగే వీళ్ళు తీరని పశువాంఛలలో
పెద్దపెద్ద యంత్రాగారాలు, కవిత్వాక్షర రసపిపాస
ఎంతకీ అర్థంకాని జబ్బువెధవలు, బొద్దింకలు కొరుకుతున్న
వీళ్ల చరిత్ర పుటల్లో కనపడవు యువతలోని సంఘర్షించే ఆత్మలు
ఈ ఘోషించే ప్రేతాలపక్క కొండలతో కదులుతున్న
ఎతైన ఆడాళ్లు
ఇంట్లో స్ఫటిక విగ్రహాలముందు

నమ్ముకొన్న సాలగ్రామాలముందు
భయపడుతున్న సాష్టాంగ గ్రహాలు
తనవి 'ఏవీ' 'ఎవరూ' ఎత్తుకెళ్లోద్దని లెంపలు వేసుకోడాలు
యువ మేధా సంపత్తిని కొల్లగొట్టి
ఈ తరాన్ని తరాజులో తూచేస్తున్న
వీళ్ల రక్షణకు నిర్మించుకొన్న మేడలు సమాధులు
సమాధులచుట్టూ మంటలు మంటలుచుట్టూ
తుపానుగా విసురుతున్న రక్తమాంసాల కేలండర్లు. ●

*(దిక్ – 14)*

# పునర్ యోనీప్రవేశం

శతాబ్దాల పరిణామం ప్రగతిపై
అనాదిగా పెరుగుతూన్న అనంతమానవుణ్ణి నేను
పురోగమనం అద్భుతాల వ్యామోహంలో
విజ్ఞానం విజయాల దాహం పరిధిలో
తిరుగుతూన్న ఇంగితాన్ని నేను
సృష్టి యోని నుండి జారిపడ్డ విచిత్ర వికార రూపాన్ని నేను
ఇంకా ఎదగని మానవుణ్ణి నేను

పంచభూతాల పాలిండ్లను పిండిపిండి
పంచప్రాణాల్ని పెంచి పోషించాను
గోళాల గందరగోళంలో అనాథనై దిక్కుల్ని తడిమాను
పురుగుపురుషుని రూపందాల్చి ప్రకృతి వెదురును తొల్చి
బ్రతుకును చల్లని పిల్లంగోవి చేశాను
నాదబ్రహ్మంలో బ్రహ్మాండాన్ని ఊయలచేసి ఊగాను
ఆర్ద్రలోకాల అంచుల్ని తాకాను
సంతృప్తి హరివిల్లులో అనుభూతుల తంత్రుల్ని మీటాను
ఆనందానికి ఆకారాన్ని కల్పించి వెలిగించాను

నాడు
మానవతాఝురులు పారాయి
మంచితనం తీరాలు వెలిశాయి
పాపపుణ్యాతీతలోకం శాంతివెన్నెలను సాకింది
వర్గాలులేని మానవ స్వర్గాలు

నదుల నాగరికతల్లో తీర్థాలుగా వెలిశాయి.
నడచినది పరిణామం
చెడినది మానవారామం
ఈప్సితారణ్యాలలో వాంఛలనాగజెముళ్ళు లేచి
శివమెత్తి నర్తించాయి
మానవతాకమలాలు 'మనిషికొలను'లో వాడాయి

విజ్ఞాన లోకాలలో వేలాది ప్రేలుళ్లు
చిత్రవిచిత్ర రంగాలలో విస్తృతాద్భుతాల నాట్యాలు
ప్రపంచ ప్రయోగశాలలో విజ్ఞానం విస్ఫోటన

తలలో విశ్వామిత్రసృష్టి
నాకు నా తలకు దారిచెడింది
హృదయానికీ మేధస్సుకీ మధ్య తడితీగె తెగింది
నీటినుండి పరిణామం నింగి దాకా సాగింది

జగతి నా అరచేతిలో ఆశ ఐ ఆడింది
ఆకారంలేని అంధకారణ్యాల ఆవరణ
నురుగులు గ్రక్కే రక్తజని ఆమ్లాల జలపాతాలు
మరుగుతూన్న జాతుల మిశ్రమాల కమురువాసనలు
అహమంధతాసముద్రంలో ఈర్ష్యా ద్వేషాల క్రకచాలు

నాగరికతాజిజీవిషవర్ష ప్రహారాల్లో
మతజిఘాంస ప్రచండ పదఘట్టనలో
విజ్ఞానేరమ్మదం వికటాట్టహాసంలో
ఆశ్రయానికి పరుగులుతీసే
మానవతాశిశు అరణ్యరోదన
విషయవలయాలు ఊష్ణవర్షాల వాయుమండలాలు

రుధిర ఝరీతీరాలు హింసారిరంసాకంటక వృక్షపరిష్వంగాలు
మానవతాశాద్వలాల దహన క్రియాదారుణాలు
తప్పించుక ఎగిరి ఎగిరి
నా గూటికోసం చీకటి దిక్కుల్ని తడిమితడిమి
అలసిన రెక్కలతో వేసారిన దృక్కులతో
వగర్చాన్న వ్యథిత శాంతిపక్షిని నేను
పరిణామం పెట్టిన ఆశాశాపం భిక్షం నేను
నాగరికతా అవహేళనలో
కన్నీళ్ళను అడుక్కుంటూన్న యుగభిక్షువును నేను
విజ్ఞానం విసరిన విషకిరణానికి చెడిపోయిన చక్షువును నేను
వ్యధాశోకాల పీడితలోకాలలో
విరిసిన కారుణ్యం మహాబోధి వెలుగులో
మెరసిన 'తథాగతుణ్ణి' నేను
అహంకారం సిలువపైన నవ్విన నెత్తురు గులాబీని నేను
తృష్ణ తొండంలా సాగింది
తృప్తివనం తునకలై పోయింది
విజ్ఞానం ఏపుగా పెరిగి ఆశా ద్రావకంలో మరిగి
అహంకారం ప్రేలి అరిషడ్వర్గాల లావా చిమ్మింది
రక్తమాంసాల ద్వీపాలుపగిలి చీముసొనల ఏర్లు పారి
సరిక్రొత్త వ్రణతీరాలు పూచాయి
నాగరికతా మక్షికాలు ఎగబడి ముసిరాయి
ప్రపంచం నాకు తెలియని మహానగరంలా మారింది
కనుపించే సౌందర్యం నన్ను గుర్తించకుండా నవ్వింది
కాలం ఊసరవెల్లి తమాషారంగు దాల్చింది
ఒంటరితనం దినదినం పాపంలా పేరింది

పరుగెడుతూన్న జాతులలో ఎగసి పడుతూన్న నాగరికతలు
అహమంధతారణ్యంలో అస్తిత్వాల పోరాటం
ముక్కలక్రింద ప్రపంచం పిచ్చిదై నవ్వింది
వెక్కివెక్కి కురిసిన నవ్వులలో పరిమాణం మెరసి మాసింది
సృక్కిన మానవతారామం ఆవురుమంది
విలాపాలు వినక కాలం నిర్లిప్తంగా సాగింది
అహంత ఆశాబాణానికి మృదుని ఫాలం పగిలింది
అణునేత్రం ఒక్కసారిగా రగిలింది
బడబానలం దావానలం
వెంటవెంట రెండు రణాగ్ని వర్షాలు
మానవతా గర్భస్రావాలు
విరిగిన జాతుల విసిగిన జీవితాలు
దాహం! దాహం! దాహం!
శాంతి కొలనుకు వెతుకులాట
ఆత్మల ఒయాసిస్సు వెలుగుల్ని ఆశించి
క్రమ్మిన చీకటి వేడి ఎడారుల్ని గాలించి
అనంతంగా శాంతి దాహానికి తపించి
వెతికి వేసారి కనిపించక దారి
నమ్ముకున్న 'సాథీ ఒంటె'ను
నిర్దాక్షిణ్యంగా నరికి
నీటితిత్తిని బైటికి పెరికి
చీకటి దాహం తీర్చుకున్నాను
అవసరానికి క్రూరంగా
లోమానవుణ్ణి పూడ్చుకున్నాను
ఘాతుకానికి రంజాన్ చంద్రుడు నల్లనై రాలాడు

దారుణానికి చుక్కల గుండెలు ముక్కలై పేలాయి
పాతకానికి ప్రపంచం ఒక్కసారి గజగజా వణికింది
కూలుతూన్న విశ్వాసాల మందిరాల్లో
భిన్నించిన ఘంటారావాల అపశృతులు
మథన అంతర్మథన ప్రకృతి మథన వికృతి మథన
మనసు మసీదులో నమాజు నిలిచిన చప్పుడు
కారుణ్యం కడుపులో దేవిన త్రిప్పుడు
స్నేహ ప్రవాహంలో పుట్టిన స్వార్థం సుడిలో
పడిమడిసిన సాథీ తిరుగుడు
త్రిప్పుడు తిరుగుడు తిరుగుడు త్రిప్పుడు
ఇమడని విశ్వాస ఘాతుకం ఆగక లోలో తిరుగుడు
త్రిప్పుడు తిరుగుడు తిరుగుడు త్రిప్పుడు
వమనం! వమనం! వమనం!
ఆయాసం తొలగింది
జాలినేల ఎదపై నిలిచిన నెత్తురులో
సాథీస్వరూపం చూడలేక
పాపానికి కారణాన్ని కలుపలేక
గతానికి ప్రస్తుతాన్ని చేర్చలేక
పరితాపానికి ప్రాయశ్చితాన్ని కానలేక
హోరెత్తిన అశాంతి సముద్ర ప్రతాడనల్లో
పిచ్చెత్తిన ఆవేదన విలయం ఢమరుకలో
మత్తెక్కిన పాపం ప్రతిధ్వనుల దుందుభిలో
శరణ్యం శూన్యంలోకి
నిష్కృతి చేతులుసాచి
బిగ్గరగా ఏడ్చాను

అనాథనై రోదించాను
ఆక్రందననై ఆవరించాను
దిక్కుల్లో పిక్కటిల్లింది
స్వయంకృతాపరాధ సుశ్లోకం
రాలాయి కన్నీటి ఖర్జూరాలు
కూలాయి కూరిమి గుడారాలు
లేచాయి నిర్వేదం సహారాలు
వీచాయి విషాదం గిటారాలు
ప్రవహించాయి పరితాపం రుబాయీలు
ఒలికాయి సాఖీ స్నేహపానీయాలు
కదిలాయి బెదరిన బ్రతుకుల ఖాఫిలాలు
కేక
కెవ్వన కేక
భయంలో లయిస్తూన్న కేక
అపజయంలో ధ్వనిస్తూన్న కేక
అహంకారం ఆధారం పగిలి పరితాపం గుండె రగిలి
స్వార్థం కుబుసం తొలగి తృష్ణలో బడబానలం తగిలి
అంధకారం లోయలోకి జారి చేరకుండా పడిపోతూన్న
వికల విషాదాంత మానవుడి కేక
భాషలేక బావురుమంటూన్న కేక
ఆక్రందిత ఆత్మకు ఆకృతినిస్తూన్న కేక
ఘూర్ణిల్లు ప్రతిధ్వనులు
పెకిలివచ్చెడు రక్తాశ్రు వమనాలు
భయవిహ్వాలితకాయంపై అరిషడ్వర్గ కీలా ప్రహారాలు
విరుచుకపడుతూన్న విషోరగపరీరంభాలు

అరుస్తున్నాను అందని దిక్కులకై
పయనిస్తున్నాను అనుభవం అంచులపై
ప్రవచిస్తున్నాను సృష్ట్యాది సూత్రాల్ని
జారిపోతున్నాను చేరని చరమ స్థలానికి
వినిపిస్తున్నాయి లోలోయలో స్వాగత గీతాలు
చిత్తగిస్తున్నాయి విగత ఆశాపిశాచాలు
ఆత్మలో ప్రేలుళ్ళు లోలోన కాలుళ్ళు
చీకటి ద్రావకంలో ఏదో ముదిరిన వస్తువు కరిగిన సవ్వడి
అహం క్రొవ్వు కరుగుతూన్న కమురువాసన
శరీరం పేల్చుకున్నాను పంచభూతాల్ని వదుల్చుకున్నాను
ఆత్మదివ్వె ఆరిన వాసన
యుగయుగాల దీర్ఘకాయం కుంచించుకపోతూంది.
నాలో నేను గుండ్రంగా తిరుగుడు నాలో నేను వేగంగా కరుగుడు
రక్తధమనుల రసాయనిక క్రియల్లో అస్థికలు ఇంధనాలు
మాంసం ఇంకని ఇగురని ద్రావకం
అవయవాల అహంకారం కరుగుతూంది
తరతరాల విజ్ఞానం ఎసట్లో మెదడు కళపెళా ఉడుకుతూంది
సరికొత్త రూపానికి కాయం కాగుతూంది
త్రిగుణాత్మక త్రిదశల్ని దాటి అస్తిత్వం ఆవిరౌతూంది
మాయ మాయ మాయ
ధూళి ధూసరితంలా క్రమ్ముతున్న మాయావరణ
చుట్టూ మాంసపు పొరల అల్లిక
మెత్తని కశ్మలాల కటకటాలు
మళ్ళీ లోలో ప్రేలుడు
చల్లగ లోలో కాలుడు

కనిపించని ఆకారం
సృష్టి రహస్య గహ్వరాంతరాల్లోకి
స్వస్థానం కోసం మహాభినిష్క్రమణ
త్రోసుక వస్తున్న పరిణామ ఝంఝ శంఖారావాలు
ప్రకృతిభేరీపై విలయతాండవ నాట్యభంగిమలు
ఉదయం వాయులీనంపై మలయానిలాల మందహాసాలు
విచిత్ర పరిణామం
తిరుగు ప్రయాణం
మెత్తని మాంసపు తెరలు
జిలుగు వెలుగుల జిగురు పొరలు
కశ్మలాల గర్భకవాటాలు
మసృణ మాంసలయజ్ఞోపవీతాలు
చర్మ సింహద్వారాలు
మర్మకర్మాంగణ మంగళ వాద్యాలు
మాయాలోక మహారణ్యాలు
లోలోయల విచిత్ర వీధుల ఆనందాలంకరణలు
దాటి
ఆవల
ఆవల
కోవెల
కొత్త కోవెల
లోలోయలో కోవెల
వెలుగుల్తో వికసించిన కోవెల
పరిమళాకాశం గర్భగుడి చేరాను
మంగళం మండపంలో గంటలు
గంటలు గంటలు గంటలు

చల్లని మెల్లని గంటలు హారతి మంటలు
మంటలు మంటలు
అనంత దిగంతాల వెలుగు
సాగక చల్లగ తిరుగుతూన్న వెలుగు
మెత్తని వెలుగు మొహం మొత్తని వెలుగు
ఎడతెగని చీకటికి పడిన కలుగు
వెన్నెల కొలనులో పడిపోయాను
నిరాకారకమలాన్నై తేలి వెలిగాను
పరంజ్యోతినై పరిణామం ప్రమిదలో ఆగి ఊగాను
యుగయుగాల చీకటి చరిత్రా సముద్రాల ఉపరితలంపై
పురోగతి అలసటని పునఃసృష్టి కోవెలలో తీర్చుకుంటున్నాను
బడలిక తీర్చుకుంటున్నాను
సృష్టి గర్భాంతర్గత నిరాకారవాసంలో
నిశ్చల సమాధిని కూర్చుకుంటున్నాను
సత్య సౌందర్యావరణలో శివమై తాదాత్మ్యం చెందాను
ముక్తి ముక్తి
ఆశానురక్తి నుండి
విషయవాంఛాసక్తి నుండి
దేహం నుండి
అహం నుండి
విముక్తి
విముక్తి విముక్తి విముక్తి
యుగయుగాల చీకటి నుండి
తరతరాల దాహం నుండి
విముక్తి విముక్తి విముక్తి
విముక్తి ●

*(దిక్ – 15)*

# నగ్నముని

## వికాసం

**నా**కింకా బలే గమ్మత్తుగా గుర్తుంది
ఒంటినిండా చిన్న చిన్న ఏనుగులు కుట్టినట్లు బొద్దింకలు మన మీసాల్ని
సరిహద్దులుగా వాడుకున్నట్లు తొండలూ బల్లులూ మన ఒంటిమీద
కాక్‌టెయిల్ సేవిస్తున్నట్టు
నాకింకా తమాషాగా గుర్తుంది
ఖడ్గమృగాలూ కండచీమలూ భల్లూకాలూ భరనభభరవలూ పంటికింద పడుకున్నట్టు

నా ఒంట్లో ఇంకా జగుప్స ప్రవహిస్తూనే వుంది
అప్పుడు మనం తెలుగు సినిమాల్లో చేరడానికి
హాస్టల్నిండా డైలాగులు తకడం గోడల్నిండా అభ్యంతరం లేకుండా బలిసిన
అభినేత్రుల మొత్తల్ని తగిలించి అభిమానించడం
పాంటుల్లోనే పూజాద్రవ్యాల్ని ఒలకబోసుకోవడం
ఏవేవో మంచి పనులు చేసెయ్యాలని
ప్రజలకి జరుగుతున్న ప్రగతినంతా చెప్పెయ్యాలని
గ్రాంధికటోపీ ఛాఛాఛీఛీ గులాబీలు పోటీగా తగిలించి
గడగడవడగళ్లుగా చెట్లకీ పుట్లకీ సుబ్బయ్య హోటల్లో పకోడిలకీ ఉపన్యాసాలివ్వడం
అకాడమీలని అలరిద్దామనీ అలంకరిద్దామనీ
సానిత్యసేవ చేసేద్దామనీ ఆధిక్యోత్పత్తిలో అవార్డులపంపకంలో
లిస్టులో మనపేరే ఫస్టునుంటుందనీ
చచ్చిన ప్రతి పురుగ్గాడిదమీద దేశమాతమీద వెల్లుల్లిమీద
తులపిష్ఠంమీద పద్యాలల్లడం
ఉగాదికి సరిహద్దు తగాదాకీ ఒకే ప్రాసలో బరానీల్ని

ఒలవడం
ఇప్పుడు గుర్తొచ్చి
అప్పుడు మన్నిపాలించిన స్వప్నాల్లో ధీరోలైన
గంగిరెద్దుగాళ్ళనీ గంగానమ్మల్నీ జెండాగాళ్ళనీ వందన సమర్పణప్పళ్ళాల్నీ
రాద్ధాంతం సిద్ధాంతం రాస్కెలుల్నీ
మురిగిపోయిన శాంతినికేతన్ ఊరగాయజాడీల్నీ
నవ్వొచ్చి-
కొంపదీసి ఈ సింహాసనాల మెత్తలకూనిరాగాల్లో
ఎక్కడో కూరుకుపోలేదుగదా నువ్వు ●

*(దిక్ - 16)*

# నిఖిలేశ్వర్

## బర్బరులు

**ఈ** అక్షరాల నిస్సహాయత
బుద్ధుని మౌనంలో అణగిన శోకం
పగోడాల ప్రశాంతత
అనుయాయుల ముఖాలలో స్తంభించి
టాంకులముందు బోధిసత్త్వుని ఆకారం
మంటల్లో హననం

20 శతాబ్దాలు రేడియో ధార్మికకిరణాల్లా
మనిషి తియ్యని నిద్రతొలిచి వేస్తూ
నా హృదయంలో పృధ్వీరోదన
సతతం రయ్యిమనే గాలిలా
గాలిలో మెషిన్‌గన్‌ల కాల్పులమధ్య
అల్లల్లాడుతున్న ఆకులు
వీట్నాం పౌరుల జీవితాలు
బురదలో కూరుకుపోయిన మనిషివాంఛ
వాంఛల్లో రేగి క్షణాలకు బలి అవుతున్న
వీట్నాం స్త్రీల మాంసకండరాలు
ఈ కండరాలపై దయలేదు
దేవుడులేదు దెయ్యంలేదు
రెండు సిద్ధాంతాల మానవభక్షకుల నోళ్ళల్లో
తల్లడిల్లుతున్న శాంతి
పశువు వారసుడిగా ప్రపంచపౌరుని అధోగతి

ఎంతమంది ప్రవక్తులు
ఎంతమంది భోక్తలు

రూపం మాసిన లెక్కలేని భక్తులమధ్య
యుద్ధరంగంలో భయం ద్వేషం కళ్లకు
గంతలుకట్టి అధిష్ఠించిన నాయకులు
ముద్రలు వేసుకున్న వీళ్లంతా నా శత్రువులు
నా వారసులని మట్టిగరిపిస్తున్న బర్బరులు
పగోడాలో ప్రశాంతతకు గోరికట్టి
తుపాకులు పేరుస్తున్న శిఖరాగ్రసిద్ధాంతకర్తలు
బుద్ధుడు అనాథుడు
నా వారసులు నిస్సహాయులు. ●

*(దిక్ – 17)*

# చెరబండరాజు

## నా మనుష్య ప్రపంచంలోకి

నడక నేర్చిన నా కవితలు
నగరాలచుట్టూ సున్నాలు చుట్టి
శూన్యంలో తలదూర్చి ఏడ్చి
ఎదిగిన ప్రపంచపౌరుల
అపుడే పుట్టిన పురిటింటికేకల
అరని మంటల కథలు
కన్నీటి గంటల రొాదలు
వినిపిస్తున్నాయ్

మంచి చచ్చి పుచ్చిన మానవతలో
శవాలుగా మిగిలిన మనుషుల
ఆశల చరమశ్వాసల చూసి జాలిపడి
వారి వెన్నుపూసలుగా మారి
వారిని నిలబెడుతున్నాయ్
నా మనుష్యప్రపంచంలోకి నడిపిస్తున్నాయ్

విశ్వస్మశాన వీధుల్లో చావని గాథల్లో
పసిబిడ్డల భావిశాంతి స్వప్నాలలో
మనిషికోసం వెక్కివెక్కి
తరతరాలుగా విలపిస్తున్నాయ్
సైనికులు మనుషులని
ప్రేమానురాగాల బందీలనీ మరచి

నిర్దయగా చీమలుగా ఎల్లలచుట్టూ నిలిపి
నలిపేసిన అధినేతల్ని కాలదన్ని
కలకాలం జగత్తునేలే ఆత్మలు
కాలానికి ప్రతిబింబాలు
కవులనీ కవితాగతులనీ
వినిపిస్తున్నాయ్

వెన్నెల ఉమ్ములో పూపంకిలాల మురుగులో
పురుగులుగా తిరిగే కళాప్రియుల్ని
వెన్నంటికరిచి మెడలువిరిచి
ముసుగులేని నిజంవైపు అసలు బ్రతుకు ఆశవేపు
పరుగెత్తిస్తున్నాయ్

వంచనల సంకుచిత సహజీవనాల్లో
కుంచించుకుపోయి జాతిమతాలు నెమరేసే
యుగాల రోగపీడితుల్ని
పండితుల్ని పశువుల్ని నపుంసక భావుకుల్ని
నా కవితలు
నా మనుష్య ప్రపంచంలోకి నడిపిస్తున్నాయ్ ●

*(దిక్ – 18)*

# భైరవయ్య

## షష్టిపూర్తి

దేశంలో క్షామంలో
బడాబడా నాయకుడికి
బహుత్‌బడా ఆసామికి
షష్టిపూర్తి
ఒక్కసారి
దిక్కులన్ని ఒక్కసారి
నగరంలో
నాల్గువైపు పల్లెల్లో
రోడ్లన్నీ ఒక్కసారి
ఫెడేల్‌ఫెడేల్ బ్రద్దలైతే
ఫెళఫెళమని పందిళ్లు ఎదిగిపోతే

అచ్చట్లు ముచ్చట్లు
ఆ పైన
చప్పట్లు తప్పెట్లు తందనాలు
నడిరోడ్లో సంబరాలు
ఒక్కుమ్మడి మూకుమ్మడి
ముమ్మరంగా వచ్చిపడితే

చావుబాజ పెళ్ళి బాజ
అమ్మోరికి ఏటపోతునేసేందుకు
తీసికెళ్ళేప్పుడేయు బాజ
మిఠాయించి ధనాయించి

ధనధనమని దగుల్బాజిమాటల్లా
వాయిస్తే వేయిస్తే
కోయడాన్సు కొంగడాన్సు
కొరివిదెయ్యం దొంగడాన్సు
కొరివిపట్టి దుమ్మురేపి
కఱ్ఱసాము కత్తిసాము
మాటల్తో మనిషిసాము
అరే అరే, షష్టిపూర్తి
అరవదేళ్లు నిండినట్టి
అపరసంఘ సంస్కర్తకి
షష్టిపూర్తి
నాలుగేళ్ళు సానబట్టి
నిట్టనిలువు తవ్వించిన
నీరుకోని మోటబావి
(అక్కడుండే యీరిగాడి పూరిగుడిసె
నేలమట్టమయిదంటే వేరేసంగతి)

ఊరవతల పడమటేపు
ప్రజానీక పారిశుద్ధ్యానికి
కట్టించిన బహిర్భుమి
(పిచ్చిపంతులు పైరుపొలం మొత్తుకున్న
దిక్కులేదంటే వేరేసంగతి)
మూడోవార్డు రోడ్లన్ని
ఇరుగ్గున్న సందుల్ని
వెడల్పుచేసి వెల్లడించిన ప్రతాపం
(ఎగస్పార్టీ కోటిచ్చిన కోటయ్యలాంటోళ్ళ

నోట్లో మట్టికొట్టిందంటే వేరేసంగతి)
సానివాడ చెదలపుట్ట
కందిరీగ తేనెతుట్ట
చెదరగొట్టి
గడపగడప చెదలుబట్టి
కందిరీగ కొంపలన్ని కొల్లగొట్టి

వాడవాడ సానులొచ్చి
ఊరువాడ ఏకమైతె
చెలామణీ చక్కిలింత
అపరసంఘ సంస్కర్తకి
షష్టిపూర్తి

కవితలన్నీ కాపీకొట్టి
పరులపద్దెం పదునుబెట్టి
పరకాయప్రవేశం చేసినట్టి
కైంకర్యపు కవిపుంగవునికి
షష్టిపూర్తి
మతంలోన మతులుదప్పి
సోమపానం ధూమపానం
షోడాబుడ్డీ సారాబుడ్డీ
షోడశోపచారాలకి
సెంట్లు పూలవాసనల్తో
ముదితల మర్మాంగాల
వేదాంతపు వేదికెక్కి
ఉపన్యాసం హసన్యాసం

ఏకబిగిని దంచినట్టి
అపరసన్నాసికి
షష్టిపూర్తి
కళామతల్లి కారుణ్యాల కల్పవల్లి
కవోష్ణాలని వడ్డీకిచ్చి
బహువిధ అగాధమీల పీటలెక్కి
కళాసేవ బురదజల్లి కంపుగొట్టు
కళ+అకారుడికి
షష్టిపూర్తి
ఇలా ఇలా
ఎందరికో
మహానుభావు లెందరికో
షష్టిపూర్తి
మా ఊళ్లో
వెకిలినవ్వు వెకిలిచేష్ట
అంతా వెకిలివెకిలి
వెదురుగొట్టం వెంగళప్ప వాజమ్మకికూడా
షష్టిపూర్తి
దానికి మా ఊళ్ళోవున్న పందులు కుక్కలు
ఆఖరికి గాడిదలుకూడా మేళతాళాలతో
పూలహారాలతో హాజరు ! ! ! ●

*(దిక్ – 19)*

# నగ్నముని

## బాధ్యత

ఎగరగొట్టి
పగులగొట్టి
ఈ అటవికమూకల కొవ్వుపట్టి ఉబ్బిన టోపీలు
నల్లబజార్లో వెలుగుతున్న సూర్యులు చంద్రులు
బహిరంగసభల్లో యిచ్చిన హామీలు కడుపుకిపుట్టిన సిఫిలిస్ శిశువుగా
18 సంఘర్షరాలలో పశువుగా మారిన
కాలం
కాదు కాదు అపరాధం కాదు పుట్టడం
గౌద్రాలైన యీ సంఘవ్యవస్థ చన్నుకుడవడం
నేరం
సుఖవ్యాధులు గుహల్లో
తపస్సు చేసే చర్మవ్యాపారి
రంగుల్లో హంగుల్తో తీసిన సినిమా
ఈ ఇరవయ్యో శతాబ్దం
జీవితం

తెరమీదే తగలబెట్టు
జట్టుపట్టి యీడ్చుకొచ్చి
చెట్టుకట్టి నాగరికత ఒళ్ళంతా చిట్లగొట్టు
మానవత్వం మందుపట్టు ●

*(దిక్ – 20)*

# నిఖిలేశ్వర్

## విలపిస్తున్న దీనత్వం

1

ఈతరం కాళ్ళకింద మొనదేలిన కంకరరాళ్లు
చుట్టుదారి పైగా ఆత్మలపై నుండి కార్లు
మైదానం వెంబడి దోపిడిదొంగలు
నిజాయితీ గొంతుపై నిస్సహాయతకొండలు
చీకట్లో మెట్లనడుమ ఆగిపోయినకాలు
కాలి ముద్రల కంటే ముందే కదులుతున్న నీడలు
జడత్వం చెరచిన అందమైన దుస్తులు
చైతన్యం రాగాలపై గాడిదల నడక
లోపలిగొంతు అరుస్తూనేవుంది
"మనం ఎప్పుడో చచ్చాం"

2

ఆకుల నీడలు  నీరసంగా
గర్భిణీ స్త్రీ ఆయాసంలా
లోపల కదులుతున్న పిండంలా
అమ్మో ! నొప్పి ! బాధ !
ప్రపంచం పరుచుకొన్న నీడలు
సృష్టికి ముందే సంశయాల సంకెళ్లు
పసిఫిక్ గర్భంలో హైడ్రోజన్‌బాంబు

3

దక్షిణ వీట్నాంలో నల్లని చావురూపంలో
ప్లేగ్ ప్లేగ్ ప్లేగ్
చరిత్రగతినే ముప్పతిప్పలు పెట్టిన ప్లేగ్
అక్కడలేదు ఈ తరానికి మరోప్లేగ్
వాల్‌స్ట్రీట్‌లో గంటకొక ఆత్మహత్య
ప్రపంచ రంగస్థలంపై నిమిషానికో మానభంగం
చర్మపులోతుల్లో బ్రహ్మానందం దాచిననేరం
ఆదినుండి నల్లుల్లా చుట్టూనేరాలు
నలిపేయ్ నలిపేయ్ నలిపేయ్
మళ్ళీ మనస్సు కింది పొరల్లో
పుట్టుకొస్తున్న నల్లులు
'ధ్వంసరచన'కు ధ్వజమెత్తిన వీరులు
ఒక్కొక్కరే నీడల్లో నిలుచున్నారు

4

ఈతరం తరగతి గోడల్లో గొణుగుతోంది
గోడలపై దిసమొలల్తో ఎగాదిగా చూస్తోంది
దిక్కులేదు మొక్కులేదు
నీకు– నాకు, నీవు – నేను మినహా
ఆ ఆశకూడా వల్ల
కాట్లో నిలుచుంది
'నీకు నీవే సానుభూతి'
అని రాంబందుల వికటాట్టహాసం
ఇది ఎవడో చూపుతున్న

ఏకాకితనం కాదు
ధనం గుప్పిట్లో పొట్టనిండిన జలగలు
బాంబుల గొడుగుకింద విశ్వాంతరాళం
అవసరాల ద్వీపంపై వ్యక్తి
చుట్టూ డబ్బుసముద్రం
నలువైపులా సముద్రపు దొంగలు
మోకాళ్ళమధ్య తలదూర్చిన మనిషి
ధైర్యంచెప్పే మనిషి తండ్రి బూడిదలో
వానకూడా పడలేదు
కవి సర్కస్ ఫీట్లల్లో 'ఆమని కలలు'
ఈ కవిగాళ్ళు 'నీరో' మునిమనుమలమనుమలు

5

ఇక దిక్కెవ్వరు ఈ మంటలమధ్య
నీచత్వం పారుతున్న ఈ నరాలమధ్య
బదులు చెప్పేందుకు
అక్కడ ఎదురుగా
తెరపై ఆడుతున్న బొమ్మలగతంలో
విలపిస్తున్న దీనత్వం.......! ●

*(దిక్ - 21)*

# చెరబండరాజు

## ఫో

అడుగు అడుగులో సహారా ఎడారి
ప్రపంచంలో ప్రతి ఒక్కడి శిరస్సుమీద
ఒక్కొక్క హిమాలయం

ఊపిరి సలపనీని యుద్ధభయంజలపాతపుసుళ్ళు
భూగోళంఒంటినిండా రాచపుళ్ళు
పిచ్చెత్తిన పక్షిలా ఎగిరిపోయి
ఉపన్యాసాల పుచ్చుగింజలు ఏరకు
హృదయాన్ని శిథిలం చేయకు
ఎవడికీ వేదిక నిర్మించకు
స్వకుచమర్దన సన్మానపత్రాలు సమర్పించకు
శ్రోతలశాపాల్నుంచి తప్పించుకోలేవు
పదవీక్షయ పీడితనియంతృత్వ రాజకీయ రాబందులు
చంపితేగాని చావరు
అది మాత్రం మరచిపోకు
ఆకాశం బీదది
అవకాశమున్నంతవరకే వెలుగుతుంది
భయం బానిసత్వం బ్రతుకుకాదు
సరిహద్దుల్లో పారేనెత్తుటేర్లని
నిర్లిప్తంగా చూస్తూ నిలుచున్న మేధావుల్ని మన్నించకు
ఎవర్నీ నమ్మకు
నీ ఆశయం సూర్యుణ్ణి మాత్రం
పిడికిట్లోంచి జారవిడువకు
ప్రాణాన్ని పణంపెట్టయినా
ఈ జగతికి మానవతా భిక్షపెట్టు
ఫో ●      *(దిక్ - 22)*

# నిఖిలేశ్వర్

## నా వారసులు

**ఈ** చేతుల్లోకి రాత్రి
వచ్చి చేరకముందే
ఈ అస్తిత్వం ప్రవహిస్తున్న
తీగెలనుండి వేలాడిన
రోడ్డుపక్క దీపం
వెలుగు పరిధిలో

నేను ప్రసవించిన ఆకారాల
శరీరాలపై వ్యాపించిన
ధూళిలేపనంతో గాలికి ఎదిగిన అస్థిపంజరాలలో
భారతీయ రుషులు
ఈ రుషులు స్నాయువుల్లో
చీకటై ప్రవహిస్తున్న చిక్కటి నెత్తురు
పక్కనేపారే నుదుటి చెమటకాల్వ
కాల్వ నిలిచిపోతుంది
ఒక్కసారి కార్లను ముంచెత్తుతుంది
రోడ్డుమీది నీడలపై నుండి పారుతుంది
వెలుగు పరిధి మాత్రం మునగదు

ఆ పరిధి చుట్టూ
చీకటి చుంబించకుండా
శ్మశానం నృత్యం చేస్తుంది

నా వారసులు
ఆధ్యాత్మికదేశ ప్రతినిధులు
చలితో ఆడుతారు
దుమ్మును ప్రేమిస్తారు
దుమ్ములో ఘనీభవించిన
ఈ రాతి మేడల చుట్టూ
కుక్కల్లా పహరా కాస్తారు. ●

*(దిక్ - 23)*

# భైరవయ్య

## కరువు బిచ్చం

అన్నా భయపడకు
కరువుభత్యం పెరుగుతుంది
కొండచిలువ నోట్లోకి ఈగపిల్ల దూకుతుంది

నీ జీవితంలా చిరిగిపోయిన చొక్కాకి కొత్తమాసికేసుకోవచ్చు
అర్ధాంగి కళ్లలో అరక్షణం కాంతులు నింపొచ్చు
అప్పులవాడిని ఆమడదూరంనుంచి
ధైర్యంగా చూడొచ్చు
షావుకారనే నల్ల దేముడికి ముడుపుకట్టొచ్చు
ఆఫీసరు చిన్నకొడుక్కి బిస్కట్లు పట్టుకెళ్లొచ్చు
లోకం తెలియక ఆకలన్న ఆఖరివాణ్ణి
సూటిగా కసరొచ్చు
డాక్టరు నీళ్ళలో కొత్తరంగు చూడొచ్చు
కొంతసేపు గుండెమీద చెయ్యేసుకుని
నేనే అనొచ్చు
రోడ్డుమీద జెర్రిపోతులా జారుతున్న
ప్లిమత్‌కారుని సరదాగా పరిశీలించొచ్చు
'షోకేసు' లో వస్తువుల్ని ఆత్రంగా అధికారయుతంగా పరీక్షించొచ్చు
(ఫుట్‌పాత్ మీంచి)

అన్నన్నా ఇంకా భయం దేనికి
ఈ ఊపులోనిండిన కొత్తనెత్తురుతో గానుగెద్దుని పునరుద్ధరించొచ్చు

అల వాళ్ళబ్బాయి కొత్తసైకిలు చూపించి బాబిగాణ్ణి మభ్య పెట్టొచ్చు
అంగట్లోంచి జారిపడిన పూలరేకులు
పదిలంగా ఏరుకుని ఇల్లాలి కురులు నింపొచ్చు
ఒక్కసారి ప్రస్తుతాన్ని వదిలి భావికేసి ఆకాశంలో నక్షత్రాలకేసి
ఆశకేసి
ఆశగా చూడొచ్చు
రానున్న గ్రీష్మాన్ని విడిచిపెట్టి
ముందున్న చలికాలం మరచిపోయి లోకంకేసి
పావుక్షణం కాలరెత్తుకు చూడొచ్చు

ఏమైతేనేం
లోకం ఎల్లా వుంటేనేం
పెద్దన్నా
నీ కరువుభత్యం తప్పక పెరుగుతుంది
ధరల వేగం హెచ్చుతుంది
కొండచిలువ మరోసారి ఆవులిస్తుంది. ●

*(దిక్ - 24)*

# చెరబండరాజు

## అన్నీ మరణాలే

వడ్డీలా పెరుగుతున్న ఆకలి
ఆకాశం విస్తట్లో అన్నపుముద్ద
ఆనవాలు పట్టరాని అందుబాట్లో లేని
సానుభూతి కరువైన సంతకాలు సాక్ష్యాలు స్నేహాలు
రోగగ్రస్తయైన దేశంలో
రుణాల పేరిట వ్రణాలు
చేతులు దాచుకుంటున్న దాతలు
రోడ్డుపక్క రేగుతున్న దుమ్ములో
దుమ్మై పోతున్న మూగజీవాల మూల్గులు
కిరణం దూసుకురాని చెరసాలలో
వాయిదాలు పెడుతున్న మరణం
అమ్ముడుపోతున్న అముద్రిత అధరాలు
ప్రణాళికాంతలో శంకుస్థాపనలు
చస్తే దేశంకోసం
వారసత్వపులంచాలమంచితనంలో
నాయకాధముల కలల విమానాల్లోంచి
గర్వింపబడుతున్న దేశం
నా దేశం. ●

*(దిక్ – 25)*

# భైరవయ్య

## అణుయజ్ఞం

కొడిగట్టిన చుట్ట నుసిలా
ముసుగేసుకున్న విధవలా
అలుముకుంది వెన్నెల
భేతాళుడిలా చంద్రుడు నవ్వుతున్నాడు వికృతంగా
హాహాకారాలు చేస్తున్నాయి నక్షత్రాలు మారీగణాల్లా
రాజుకుంటున్న నిప్పులా
నిలబడింది రాత్రి అర్ధరాత్రి
పీర్లసాయిబులా నడుస్తున్నాన్నేను
నిప్పుకణాలమీద సమిధల్లా మండుతున్న క్షణాలమీద
అగ్నికీలలా వ్యాపిస్తోంది నాపెదాల మీద చిరునవ్వు
పిడుగుల్లా వేస్తున్నాను అడుగులు
కంకాళాలు కైవారాలు పలుకుతున్నాయి
ఆకాశంలో గ్రహాలను దిగ్గొట్టి
నక్షత్రాలను వేళ్ళాడదీస్తున్నాను
పాతాళానికి గోతులుత్రవ్వి పాతిపెట్టి శబ్దాల్ని
అర్థాలని అణగద్రొక్కి పూడుస్తున్నా తాత్పర్యాల్ని
సౌందర్యాన్ని మంటబెట్టి
ఆనందాన్ని ఆహుతిచేసి
విషాదాన్ని సృష్టిస్తున్నాను
శూన్యానికి ఆకృతినిచ్చి
ప్రణవంలో ప్రళయాన్ని పలికిస్తున్నాను

లలాటంతెరిచి
పాశుపతాలు సంధిస్తున్నాను
అర్థంలేని
సహితత్వ రహిత్వాలతో
పనిలేని భావాలమీద
ఆకాశం మంటపంక్రింద
ఒంటికాలి నృత్యంచేస్తున్న
అణ్వస్త్రాల ఆధునికుణ్ణి
నేను
మారణాయుధాల మానవుణ్ణి
నేను యజ్ఞం తలపెట్టాను
ప్రపంచంమీద నిర్మించిన హోమగుండంలో
చరాచరాలు హవిర్భాగాలు
భేతాళుని రుత్విజు తత్వంలో
ఘృతంగా మారిన కాలాన్ని
ఆస్వాదించిన యాగపురుషుడు స్మశానం
భైరవుని పర్యవేక్షణతో
వేదపండితులు భూతాలు
పిశాచాలు మ్రోగించాయి మంగళతూర్యాలు
నలుదిక్కులు రుధిరం క్రక్కుకున్నాయి
గగనఫాలంమీద కనురెప్పలు విచ్చుకున్నాయి
ధాత్రీదేహంలో అగ్నిపుటలు బద్దలయ్యాయి
జలతరంగాలు వికృతంగా చిచ్చుపెట్టాయి
వాయుదేవుడు విషాస్వాదనతో
మత్తెక్కి తూలుతున్నాడు

హోమజ్వాలలు తాండవం చేస్తున్నాయి
రుధిరసోమాన్ని సేవించిన రుత్విక్కులు
రౌద్రంతో స్వాహా మంత్రాలు ఉచ్చాటన చేస్తున్నారు
యాగాశ్వంలా నిలిచిన స్రష్ట
హేషా (ఆర్తా) రావాలు చేస్తోంది
ఒక్కసారిగా అణుగుండంలో
యాగపురుషుని ప్రత్యక్షంతో
సర్వస్తంభన జరిగింది
నాదోసిట యాగఫలం
పిడికెడు భస్మం నిలిచింది. ●

*(దిక్ – 26)*

# నగ్నముని

## మా

**వ**ద్దువద్దు
రావద్దు
విరగబూచిన జీవితంలోంచి సరేసరి
వక్రించిన విధిని తిట్టుకుంటూ
నా హృదయంలో ఇటువైపుమాత్రం
ఏ క్రూర శాపవశాన్నయినా సరే అడుగుపెట్టొద్దు
అన్నల్లారా తమ్ముల్లారా తల్లుల్లారా అక్క చెల్లెళ్లారా
ప్రియబాంధవులారా గర్భలోకాలభవిష్యత్ కనుపాపల్లారా
నా ప్రశ్నలకి తలవంచుకు వెనక్కిమళ్ళే
సముద్రకెరటాల్లారా
మాట్లాడని మౌనుల్లారా పక్షుల్లారా
ఇటుమాత్రం ఎవరూ రావద్దు
మానవుడి మూర్ఖత్వాన్ని రాక్షసత్వాన్ని అజ్ఞానాన్ని ఆక్రందనల్ని
రెండుప్రపంచ మహాసంగ్రామాల బూడిదని
కళ్లులేని కామాన్ని
కోర్కెల కుష్టురోగాల్ని అసూయల్ని ఆగ్రహాల్ని
నగరాల దుర్గంధాన్ని యింకా ఎన్నో మరెన్నో
పేరుతెలీని ప్రవృత్తుల్ని
20 శతాబ్దాల దారుణ మానభంగాల్ని
భ్రూణహత్యల్ని అంతులేని అంధకారాన్ని
ఇక్కడ దాచాను ఇక్కడ పూడ్చాను
వద్దువద్దు
ఇక్కడికెవ్వరూ రావద్దు
ఈ తలుపుల్ని తెరవొద్దు
నా హృదయంలో యిటువైపు ఎవరూ అడుగుపెట్టొద్దు ● *(దిక్ - 27)*

# నిఖిలేశ్వర్

## పిచ్చాసుపత్రి అంతా ఖాళీ

**కొం**దరు కోటీశ్వరుల సారాగ్లాసుల్లో
కోటికోట్ల సగటుపౌరులు మంచుగడ్డలు
బల్బులేని దీపస్తంభంకింద నీడల ఆరాటం
ఆరాటాల్ని కాలుస్తున్న ఖరీదైన చుట్టసెగలు
నల్లనిదొర బొజ్జంతా కొవ్వునిండి
గడియారాల ముళ్లను శాసించే వేళ్లఘోర్కుల మధ్య
గిజగిజలాడే జనం
'ఖర్మమంత్రం' చొంగ కారుస్తున్నప్పుడు
ఈ ఖర్మగాళ్లందర్ని మొసళ్ళకు వదిలేసి
వాద్య సంగీతం ముందు ఉన్ని కోట్ల గంతులు
ఎన్ని ఏళ్ళ కన్నీళ్ల రక్తంబొట్లు కూడి
ఈ నాగరికమైన వీధుల షోకేసుల్లో
బలే షోగ్గా మనీపర్సుల్లో బంధించబడి
భూమికి జానెడు ఎత్తుపై నడిచే
అదృష్టవంతుల నడుమ
నీవు–నేను నాలుకలు వేలాడేసుకున్న పిచ్చికుక్కలం
నిజాం నవాబులాంటి ఫకీర్ జీవితంలో
నిజంగా మనమంతా పరిహాసితులం
నవాబు అనుభవిస్తున్న ఐశ్వర్యానికి
నిజంగా మనమంతా వారసులం
చలిచెరబట్టిన రాత్రిలో
గుండె చీల్చుకొని ఏడుస్తున్న కుక్కపిల్ల
నిజంగా మనమంతా కుక్కపిల్లలం

తోక ముడుచుకొని
రోడ్లపై మిఠాయి అంగడికెదురుగా
తన్నులుతిన్నా మళ్ళీవచ్చి నాలుకలు చాచేవాళ్ళం
మనకు ముక్తి ఎప్పుడు
అసలు మనుష్యుల మమకారం
మనకు పంచిపెట్టేదెప్పుడు
దేశంలో ఈ 18ఏళ్లు కరిగి
బంగారపు కడ్డీలుగా మారి
మహామహా ఘనత వహించిన వాళ్ల సొరుగుల్లో దూరి
స్వార్థం నల్లగడ్డకట్టిన ధనంగా
కోటికోట్లను దురదృష్టవంతులుగా
చేసిన ఈ రోజు
రోడ్డుపై రాజ్యాంగానికి రాజైన
సగటుపౌరుడు ఉన్మాదస్థితిలో
కొట్టు ఆసామి ఎదుట
"అరే అది నీవు చెప్పేదానిలో సగం ధరనే కదా"
అంటూ విశాలమైన పిచ్చాసుపత్రిలో
ఇప్పుడు ఇక మానసిక వైద్యులుకాదు
పిచ్చిగుత్తేదార్ల అగాధమి సరసులుకాదు
విదూషకులై కామగీతాలు పాడే కవులుకాదు
డబ్బుకోసం శరీరాన్ని వేలంవేసుకొన్న సినీనటికాదు
ప్రజల పావులతో జూదమాడే రాజకీయవాది కాదు
ఎవరూకాదు ఇంకెవరూకాదు
ప్రగతిమెట్లపై నడిచే
పిడికిలి నిండిన మహామహులు
మెట్లుగా తలవంచక తప్పదు ●

*(దిక్ - 28)*

# చెరబండరాజు

## దిక్ ఇరవై తొమ్మిది

**ఆ**పకండి
వెనక్కి పిలవకండి
మీ మానసిక ఏకాకితనం శిఖరాల మీద
కాంతిపాదాలతో కదంతొక్కుతూ
నడుస్తున్న వాణ్ణి
మీ కళ్లలో పెరిగిన చీకటి అరణ్యాల్ని
తగలబెట్టేవాణ్ణి
మీ గుండెల్లో చోటుచేసుకున్న
శూన్యపు ఆకాశాల్ని వెలిగించే వాణ్ణి
పాలిపోయిన నరనరాన్ని పితికి
జీవనదికి ఊటలు సృష్టించేవాణ్ణి
మీ అస్తిత్వాన్ని ఆశయాల్ని కాలదన్ని
మీ కలల్ని పావులుగా చదరంగం ఆడేవాళ్ల
ఆటకట్టించేవాణ్ణి
బీటలెత్తిన మీ కడుపుబీళ్లలో
ఎరువులువేసి పొలాలుదున్ని
కన్నీళ్లతో పైరులు పెంచి
మీ బిడ్డల భావికి ఆకలి శోకం మాట
లేకుండా చేసేవాణ్ణి
కాకులు గద్దలు వదిలేసిన ఎముకల్లాంటి
పదవుల్ని పట్టుకు

మిమ్మల్ని శాసించే వె(ర్రికుక్కల్ని
తరిమికొట్టేవాణ్ణి
మీ తలలమీది చం(ద్రుణ్ని ముక్కలుచేసి
చీకటి అఖాతాల్ని మిగిల్చి
ఎందుకు ఏమిటి అని
ఎదిరించే హక్కులేదని వాదించే గాడిదల
నాలికలు పీకేసేవాణ్ణి
మీ ధైర్యాన్ని కొల్లగొట్టి
బానిసలుగా వాడుకుంటూ
మోయలేనిచట్టాల గులకరాళ్ళతట్టలు మోయించేవాళ్లని
వాళ్ల డబ్బాల్ని వాయించే అపరశిఖండుల్ని
పట్టపగలు బట్టబయలు చేసేవాణ్ణి
ఆపకండి
ఆపకండి
వెనక్కి పిలవకండి ●

*(దిక్ – 29)*

# నిఖిలేశ్వర్

## ఇక సెలవు

నేను పొడుగాటి వాణ్ణి
నా వెనుక అంతకంటే పొడుగునీడ
నీడలో ప్రతిఫలించిన
వెలుగు ప్రవాహంలో
మూడు నీడలు

1. చరిత్ర మిగిల్చిన భారం
2. క్షణికానందంలోని ఆవేశం
3. విలువల వెలుగులోని విషాదం

చేతులు ఊపి–ఊపి
నిలకడకోసం నింగిదాకా చేతులు
అల్పాక్షరాలలో అనంతార్థమ్ము కాదు
అత్యల్పచిత్రాలలో చిరంతనానందం
జీవితపు మోకాళ్ళల్లో నిగూఢరహస్యం
ప్రతిమాట వెనుక మండే జీవితవాంఛ
వాంఛలోదాగిన జీవనజ్వాల
జ్వాలలో నా యువ ఆకాశంకింద
కొల్లగొట్టేవాడు లేడు
సాంవత్సరికాలు పెట్టే విమర్శక గార్దభమణీ
ఎందుకు ఇంకా నీ వీపుపై అన్ని మైలబట్టలు
ఆకాశంకింద ఎగుడు దిగుడుగా పెరిగిన
కుహనామేధావీ
ప్రగతికి గుదిబండలా
నీకు నీవే శిలాఫలకమై
ఇంకా ఎందుకు మా ముందు
ఇక సెలవు ! ● *(దిక్ – 30)*

**దిగంబరశకం కాలమానం సంవత్సరాలు ఆరు;** నగ్ననామ సంవత్సరం, నిఖిలేశ్వర నామసంవత్సరం, జ్వాలనామ సంవత్సరం, చెరబండ నామసంవత్సరం, భైరవనామ సంవత్సరం, మహాస్వప్న నామసంవత్సరం; **రుతువులు ఆరు** ఆశ రుతువు, తపన రుతువు, అశ్రురుతువు, మదిరరుతువు, విరహరుతువు, విషాదరుతువు; **వారాలు ఆరు** స్నేహవారం, విశృంఖలవారం, క్రాంతి వారం, సృజనవారం, వికాశవారం, అనంతవారం.

# నేటి
# 'కుష్ఠువ్యవస్థ'
# పై
# దిగంబర కవులు
## సంపుటి 3

ప్రజల
అవిద్యని అజ్ఞానాన్ని అశక్తతని ఆసరాగా తీసుకుని దేశాన్ని దోచుకు తినడం మరిగిన పరిపాలకులు, సంఘంలోని వివిధ వర్గాలవాళ్లు నేడు ప్రజల పై రుద్దుతున్న 'కుష్ఠువ్యవస్థ'ని ఎదుర్కొంటూ దిగంబర కవులు పలికిన దిగ్‌లను జ్వాలానామ సంవత్సర విషాద రుతువు (సరిగ్గా క్రీ.శ 1968 జూన్) లో దిగంబర కవితా ప్రచురణ వినిపిస్తున్నది

నగ్నముని
నిఖిలేశ్వర్
జ్వాలాముఖి
చెరబండరాజు
భైరవయ్య
మహాస్వప్న | నిర్మిస్తున్న
★

# దిగంబరశకంలోంచి

## మళ్ళీ మళ్ళీ మళ్ళీ చెబుతున్నాం

**చెవులుంటే విను**
**కళ్ళుంటే చూడు**
**మెదడుంటే ఆలోచించు**

పసవుంటే, అంటే చీమూ నెత్తురూవంటి నీతీ నిజాయితీ వుంటే దేశమంతటా రాజకీయనాయకులు, పెద్ద పెద్ద బొజ్జల, గొప్పగొప్ప ప్రజారక్త వ్యాపారులు, పదవికోసం, డబ్బుకోసం దేనికైనా తెగించే మహాత్ములు జాతి రక్తనాళాల నిండా, మహమ్మారిలా వ్యాపింపజేస్తున్న ఒక 'కుష్ఠువ్యవస్థ'ని నాశనం చెయ్యడానికి బయటికిరా.

# సిగ్గులేని తెలుగువాడు

ప్రపంచ పౌరుడిగా తన బాధ్యత లేమిటో ఆలోచించవలసిన, పట్టించుకోవలసిన అవసరం అటుండనిచ్చి, దేశం ఒక లేవెత్రిగా తయారై కంపుకొడుతుంటే, దానికి కారణాలేమిటో ఏ మాత్రం చూడకుండా పేడపురుగుకన్నా హీనంగా బతికేస్తున్న ఆంధ్రుడు యిప్పటికైనా తన ముండమోపి బతుకునిగురించి తెలుసుకోవడం అవసరం.

# ఆంధ్రుడు రోజురోజుకీ మరింతగా నపుంసకుడు అయిపోవడానికి ముఖ్య కారకులు :

1. రాష్ట్ర ప్రజల అవసరాలు ఏమాత్రం పట్టించుకోని రాజకీయాశుద్ధంలో పొర్లుతున్న గ్రూపు పురుగులు, ఉపన్యాసాల నంగివెధవలు, మెదడులేని అడ్డగాడిదలు.
2. స్వర్గానికి షార్టుకట్ చూపిస్తామని ప్రజల్ని బ్లాక్‌మెయిల్ చేస్తున్న సన్నాసులు, మతం యినప గోళ్ళతో మనుషుల్ని మరింత అజ్ఞానంలోకి తోసి నంచుకుతింటున్న పీఠాధిపతులు, గోసాయీలు, కోడెవిధవల్ని మరిగిన బాబాలు
3. ప్రజల చెమటసొమ్ముతో కళ పేరుతో తోలు వ్యాపారం సాగిస్తూ ప్రజాసామ్యయుగంలో నటసామ్రాట్టులని, నటచక్రవర్తులమని బిరుదుల జాకెట్లు తగిలించుకు తిరుగుతూ సిగ్గులేకుండా మహానటులుగా పైటలు సరిజేసుకుంటున్న వయసుజారిన సినీహీరోలనే మడతకొజ్జాలు
4. సినీ మడతకొజ్జాల ముఖాల్ని తగిలించుకుని ప్రతివారం యింత చెత్త దేశంమీద పోస్తున్న వారపత్రికలు, రాజకీయ పురుగులకి, సినీ మడత కొజ్జాలకి ఆంధ్రదేశాన్ని తారుస్తున్న యీ పత్రికాధిపతులు, సంపాదకులు
5. రాజకీయ నంగివెధవలకీ, సినీ మడతకొజ్జాల కన్నుగీట్లకీ, సాహిత్య అనాథమీ బహుమతులకీ చొంగ కార్చుకుంటూ వారపత్రికల్లో వాంతులు చేసుకుంటున్న రచయిత పందులు (ఇందులో మళ్ళీ రెండు – ఆడపందీ, మగపందీ – ఇదిగాక, జిల్లా) వీళ్ళంతా 'ప్రజలకోసమనే' పేరుతో ప్రజలపై ఒక 'కుష్ఠువ్యవస్థ'ని దుర్గంధ సంస్కృతి'ని రుద్దుతున్నారు.
6. ఈ 'కుష్ఠువ్యవస్థ'ని 'దుర్గంధ సంస్కృతి'ని తరతరాలకీ అంటించి వొదులుతున్నాయి మన విశ్వవిద్యాలయాలు.

ఇది ఒక్క ఆంధ్రదేశమే కాదు, భారతదేశమంతటా విస్తరిస్తున్న 'కుష్టువ్యవస్థ'. ఈ వ్యవస్థలో కుంటీ గుడ్డీ మూగా చెవిటీగా జాతినంతా బతుకును యీడవడానికి విశ్వవిద్యాలయాలు, రాజకీయ నాయకులు, పెద్దపెద్ద హోదాలవాళ్ళు, బయటవుండి ప్రభుత్వాల్ని తమ గుప్పిట్లో పెట్టుకున్నవాళ్లు, స్వార్థం ఒళ్ళంతా తినేసినవాళ్ళంతా రక్షిస్తున్నారు.

ఈ 'కుష్ఠువ్యవస్థ'ని పోషిస్తున్నవాళ్ళనీ, యీ వ్యవస్థనీ సర్వనాశనం చెయ్యడానికి దిగంబర కవులు పూనుకున్నారు.

## ప్రత్యేకంగా యువతరంతో దిగంబర కవులు

రాజకీయ నాయకుల్ని ప్రజల అవసరాలేమిటో ఎప్పటికప్పుడు పట్టించుకునేట్లు వాళ్ళని అదుపాజ్ఞలలో పెట్టడానికి యువతరం సంసిద్ధం కావాలి. వారు సంఘాన్ని దోచుకుతింటున్న చీడపురుగులన్నిటికీ ఏవిధంగా తమ స్వార్థంకోసం ఉపయోగపడుతున్నారో బహిరంగంగా తెలిపే చర్యలు యువతరం తీసుకోవాలి.

ప్రజల అజ్ఞానాన్ని, మూఢనమ్మకాల్ని ఆసరాగా తీసుకొని ప్రజల డబ్బుపై భోగాలు అనుభవిస్తూ దేశానికి పనికొచ్చే పని ఒక్కటీ చెయ్యని యీ పీఠాధిపతుల్ని, బాబాల్ని, సన్నాసుల్ని బట్టలొలిచి, గాడిదలమీద ఊరేగించి తరిమితరిమి తన్నాలి. వీళ్ళవలన ఎంత మతమౌఢ్యం పెరుగుతున్నదో, వీళ్ళు ప్రజల డబ్బుని ఎలా దోచుకుతింటున్నారో, దేవుడిపేర వ్యాపారం యిక్కడ ఎంత పెద్ద స్థాయిలో జరుగుతున్నదో ప్రజలకు తెలిపేందుకు యువతరం ఈ దేశద్రోహుల, సోమరిపోతుల బట్టలొలిచి బహిరంగంగా తన్నుతూ గాడిదలపై వూరేగించడానికి, తరిమితరిమి తన్నడానికి ముందుకురావాలి.

మనిషిలోని చీకటికోణాల్ని కాల్చేస్తూ వెలుగువైపు తిప్పడానికి, సంఘంలో పేరుకునే మూఢనమ్మకాల్ని పారదోలి, మానసికంగా, ఆర్థికంగా యితరత్రా అన్నివిధాలా వెనుకబడిన అమాయకమైన ప్రజల్ని బలమైన జాతిగా తయారు చెయ్యడానికి మన సినీ పరిశ్రమ ప్రయత్నించకపోవడమేగాక, ప్రజలలోని అవిద్యని. ఆజ్ఞానాన్ని ఆధారంచేసుకుని కళ పేరుతో ప్రజల్ని మరింతగా అవినీతివైపు ప్రోత్సహిస్తున్న మన సినీ కళాకారుల్ని బహిరంగంగా అవమానపరచాలి. వాళ్లు యింతకాలమూ డబ్బుకోసం, తెరమీద దశాబ్దాల తరబడి ఎంత ఛండాలంగానైనాసరే కనబడడంకోసం, పేపర్లలో ఫోటోలకోసం అవార్డులకోసం, పత్రికల్ని, పదవుల్లో వున్న పెద్దవాళ్ళని వుపయోగించుకోవడం ఎంత అవినీతిని తిని బతుకుతున్నారో, ఎంతగా అవినీతిని ప్రోత్సహిస్తున్నారో

వాళ్ళని ఆదర్శంగా పెట్టుకుని పూజిస్తున్న వాళ్ళకి తెలిసేట్టు బహిరంగంగా వాళ్ళ నిజ జీవితాల్ని వీధిలోకి లాక్కురావడానికి యువతరం ముందుకు రావాలి.

పదవిలో వున్నవాళ్ళ, సినిమావాళ్ళ గొప్పతనాన్ని పొగుడుతూ డబ్బున్న ప్రతివెధవ కాళ్ళూ, పలుకుబడి వున్న ప్రతి గాడిదకాళ్ళు పట్టుకుంటూ వంకాయ కూరలో వందలకొలది ప్రయోగాలే పరమావధి అయిన మన వంటింటి పత్రికల్ని, నిజం చెప్పడానికి భయపడే యీ పిరికి పత్రికాధిపతుల బాధ్యతావిస్మరణని గూర్చి బహిరంగంగా విచారణ జరపడానికి యువతరం పూనుకోవాలి.

ఈ సినీ రాజకీయ అనాథమీ మార్కు రచయితలు యీ 'కుష్ఠువ్యవస్థ'కి ఏ విధంగా పతాకం ఎత్తుకున్నారో ప్రజలకి తెలిసేట్లు చెయ్యడానికి యువతరం ముందుకురావాలి. పనికొచ్చే చదువులు చెప్పేవిధంగా విశ్వవిద్యాలయాల్ని బలవంతంగా మార్చటానికి యువతరం పూనుకోవాలి.

నిజాలు చెప్పనివ్వకుండా గొంతులు నొక్కేసే పరిస్థితుల్ని ప్రోత్సహించే, విషవలయాన్ని సృష్టిస్తున్న వీళ్ళందర్నీ, వీళ్ళు పెంచి పోషిస్తున్న యీ 'కుష్ఠువ్యవస్థ' నీ 'దుర్గంధ సంస్కృతి' నీ నాశనం చెయడానికి నిజమైన మనుషులు కావాలి.

దిగంబర కవులు యువరక్తాన్ని ఇప్పటికైనా మేల్కొనవలసిందిగా కోరుతున్నారు. దిగంబర శకంలోకి ఆహ్వానిస్తున్నారు.

**దిగంబర కవులు**

# చెరబండరాజు

## వందేమాతరం

ఓ నా ప్రియమైన మాతృదేశమా!
తల్లివి తండ్రివి దైవానివి నీవేనమ్మా
దుండగులతో పక్కమీద కులుకుతున్న శీలం నీది
అంతర్జాతీయ విపణిలో అంగాంగం తాకట్టు పెట్టిన అందం నీది
సంపన్నుల చేతుల్లో మైమరచి నిద్రిస్తున్న యవ్వనం నీది
ఊసినా దుమ్మెత్తిపోసినా చలనంలేని మైకంనీది
కోతకొచ్చిన చేనులో కలుగులు తవ్వుతున్న
ఎలకల్నీ పందికొక్కుల్నీ భరిస్తూ నుంచున్న 'భారతి'వమ్మా!
నోటి కందని సస్యశ్యామల సీమవమ్మా
వందేమాతరం! వందేమాతరం!
ఒంటిమీది గుడ్డలతో జండాలు కుట్టించి
వివస్త్రవై ఊరేగుతున్న ధైర్యం నీది
అప్పుతెచ్చి లేపిన మిద్దెల్లో
కాలుగాలిన పిల్లిలా తిరుగుతున్న దీనత్వం నీది
ఎండిన స్తనాలమీదికి ఎగబడ్డ బిడ్డల్ని
ఓదార్చలేని శోకం నీది
ఆకలికి ఎండి మాడి ఎరువు సొమ్ములతో వీధినబడ్డ సింగారం నీది
అమ్మా భారతీ! నీ గమ్యం ఏమిటి తల్లీ?
వందేమాతరం!
వందేమాతరం! ●

# నిఖిలేశ్వర్

## ఆహ్వానిస్తున్నాను

దున్నపోతు కొవ్వునిండిన ఈ గుండెలను
నీ ఉక్కుచేతులతో కరిగించమని
ఆహ్వానిస్తున్నాను
కుక్కల మొరుగుడని విర్రవీగే
కామందుల కళ్ళు పీకమని
ఆహ్వానిస్తున్నాను
లారీనిండా పుస్తకాలు రాసి
లారీలా అరిచే
కుల మత తత్వ 'సామ్రాట్టుల'
తర్కాన్ని నుసి చేయమని
ఆహానిస్తున్నాను
మధ్య తరగతి బూజును
వెన్నెముక వంగిన నంగనాచి యువతను
కళ పేరుతో పలాయనం గీచే నానమ్మలను
సుకుమారులైన అవకాశ వాదులను
యువకరక్తం ఉరకలు వేసేలా ఉడికించమని
ఆహ్వానిస్తున్నాను
ఐదేళ్ళలో ఒక్కసారి ఒక్క క్షణం మాత్రమే
నీ కాగితం వోటు హక్కుతో
ఐదేళ్ళు సొంతం బానిసగా
రాజకీయాల రంకుకు బలికాకుండా

ప్రజాస్వామ్యం - స్వేచ్ఛ
కొందరి ఖద్దరు గావంచాల వెనుక
నల్లని నిషా నాగుల కారుల కింది
కొన ప్రాణాన్ని
ఒక్కసారి రక్తార్చనతో ఆదుకొమ్మని
ఆహ్వానిస్తున్నాను

ఈ దారుణ దారిద్ర్య భీకర విషఖండంలో
ఈ గొంతులు కోసే వ్యవస్థలో
ఈ సారి నీ ఇంటి దోపిడీగాళ్ళతోనే
సమూలంగా సుందర సమతా వ్యవస్థకై
బలాలను తేల్చుకోమని
ఆహ్వానిస్తున్నాను. ●

# నగ్నముని

## కొజ్జాల కామకేళి చూస్తున్నాను

"అశ్లీలం పలుకుతోంది దిగంబరాక్షరం"
అంటున్నావు సిగ్గులేకుండా

నీ మెదడు పురుగు తినేసింది
నీ చర్మం కుళ్ళిపోయింది
నీ అవయవం పుచ్చిపోయింది
నీ కళ్ళకి కన్నం పడింది
నీ మనసు కక్కూసుగా మారింది

ఇంక నీకు ప్రతిదానిలోనూ
అశ్లీలం గాక మరేమి కనబడుతుంది

బాహాటంగా పట్టపగలు జరుగుతున్న
అన్యాయాలూ అక్రమాలూ అమానుషాలూ
ఉన్నదున్నట్లు చెబితే నీకు అశ్లీలంగానే కనబడుతుంది

నల్లబజారు పగటి బజార్లకంటే
రొమ్ములవిరుచుక రోడ్లపై నడుస్తున్నాయంటే
నీకు అశ్లీలంగానే వినబడుతుంది

తోలు వ్యాపారస్తులు
నీతి బోధలు చేస్తున్నారురా అంటే
నీకు అశ్లీలంగానే వినబడుతుంది

రాజకీయరంకు భక్తులూ

ఇసక నైవేద్యపు కాంట్రాక్టర్లూ
ఉడతాభక్తి వాటాదార్లూ
మనుషుల్ని కొనేసే వ్యాపారంచేస్తున్న యూనిఫారం లమ్డీకొడుకులూ
ఆ దేశం వాళ్ళకీ
ఈ దేశం వాళ్ళకీ
బిస్కత్తులు చూపించే అడ్డమైన వాళ్ళకీ
కుక్కల్లా అమ్ముడుపోయినవాళ్ళూ

డబ్బు కోసం
పదవి కోసం
ముఖాలకి పెంట రాసుకోమన్నా
ఫేస్‌పౌడర్లా పూసుకునే వాళ్ళూ
బద్మాష్ ముండా కొడుకులూ
వాళ్ళ తమ్ముళ్ళూ బామ్మర్దులూ
ముండలూ వాళ్ళ ముండల కొడుకులూ
పంటపొలం నిండా కలుపుమొక్కల్లా
ధాన్యాగారం నిండా పందికొక్కుల్లా
బలిసిపోయినారంటే
నీకు అశ్లీలంగానే వినబడుతుంది

వాడు
ఆ రాస్కెల్
ఆ బొజ్జలంజా కొడుకు
మన అభ్యుదయాన్ని గూర్చి మైకు బద్దలుకొడుతున్నవాడు
క్షణంలో లక్షాధికారి ఎట్లా ఐనాడని అడిగితే
అది నీకు అశ్లీలంగానే వినబడుతుంది

“ఇప్పటికంటే
దొరలరోజులే మారాజుగా వున్నాయి బాబూ”
అని నాగరికత నేర్పని
చదువులు సోకని పల్లెలు అఘోరిస్తున్నాయిరా అంటే
అది నీకు అశ్లీలంగానే వినబడుతుంది

ఈ కులాలూ
ఈ కలహాలూ ఎందుకురా అని ప్రశ్నిస్తే
అది నీకు అశ్లీలంగానే వినబడుతుంది
ఈ మతాలూ
ఈ మౌఢ్యాలూ ఎక్కిడికిరా అని ప్రశ్నిస్తే
అది నీకు అశ్లీలంగానే వినబడుతుంది
ఈ జరీకండువా సన్మానాలూ
ఈ ఊరపందుల గురగుర కావ్యాలూ
వాళ్ళ అజ్ఞానంతో నిండిన అనాథమీ సత్రాలూ
ఇంతకంటే ఎదగవా అని బాధపడితే
అది నీకు అశ్లీలంగానే వినబడుతుంది

ఈ గతుకుల జీవితపు రోడ్లూ
ఈ కుమ్ములాటలూ
ఈ ఓట్ల కోసం చంపుకోవడాలూ పొడుచుకోవడాలూ
ఈ తాగుడు పొయ్యడాలూ
ఈ తార్చడాలూ
ఇంక ప్రజలే ఎదురుతిరిగి
పరిపాలన మార్చలేరా అని కుమిలిపోతే
అది నీకు అశ్లీలంగానే వినబడుతుంది
పైసకి కొరగాని యీ చదువులు

రక్తంపీలుస్తూ పొట్టలుబ్బిన ధరల జలగలు
లంగాలు యింకా యింకా పైకెత్తడంలో
పోటీపడుతున్న సినిమాలూ
సుఖవ్యాధుల్తో కుళ్ళిపోతున్న పార్టీలూ
యువతరం యికనైనా కళ్ళు తెరవదా అని
వెక్కిళ్ళ రాత్రుల బాధతో మెలికలు తిరిగి కుమిలిపోతే
అది నీకు అశ్లీలంగానే కనబడుతుంది
అయినా
సముద్రాలు నా మీద పొర్లు కొచ్చినా
అగ్ని పర్వతాలు నాకింద పేలినా
నిద్ర నటిస్తున్న వాళ్ళ కళ్ళరెప్పల్ని పీకెయ్యడం మాత్రం మానను
నా ముందు జరుగుతున్న కిరాతకం ఆపందే వెనక్కు తిరగను

విను
కళ్ళతో విను
బలమైన ఆయుధాల చేతుల కండరాలతో విను

ఇదివరకు
సంవత్సరాని కొకసారి
జట్లు జట్లుగా కొంతమంది కొజ్జాలు
లజ్జ నభినయిస్తూ
మద్దెళ్ళూ తాళాలూ మ్రోయిస్తూ
వెన్నెలపై తమలపాకం ఊస్తూ
పదాలూ పాదాలూ చిందిస్తూ
ఆదిమరాత్రుల భయ మిశ్రమ సంభ్రమ సంతతిగా
ప్రతి ఇంటి ముందూ ఆడి ఆడి పాడి పాడి

కొసరి కొసరి పైసలు దండుకు పోయేవారు
సంవత్సరానికొకసారి అదేమి పండగో
ప్రకృతి కెందుకు వాళ్ళపై అంత చిన్నచూపో
ఏ సామ్రాజ్య కంతాల కాపలా కర్కశత్వానికి బలైనారో

ఇప్పుడు కొత్తరకం కొజ్జాలు దిగారు
లజ్జలేని బొజ్జలున్న కొజ్జాలు దిగారు
యూనిఫారం సరిజేసుకుంటూ
అయిదేళ్ళ కొకసారి ప్రేమనొలకబోస్తూ
బాకాలతో భజంత్రీలతో మందీ మార్బలంతో వొస్తున్నారు
చెయ్యనివన్నీ వివరంగా చేస్తామని చెబుతున్నారు
డబ్బు చల్లి డబ్బు పండించే వ్యాపారంలోకి దిగుతున్నారు

ప్రజలపై డబ్బు కాట్లు వేస్తున్నారు
ముఖం నిండా అభిమానం పులుముకున్నారు
చేతులు జోడించి ప్రజలకీ ఏడుకొండలకీ మొక్కుతున్నారు
అయిదేళ్ళ పండగ అయిపోగానే మరి అయిపులేరు
డబ్బు వెనక పదవి వెనుక పరుగుకి అలుపు లేదు

అక్కడితో ఆగలేదు యీ కొజ్జాల పరాక్రమం
రెండు చేతుల్తో యవ్వనం మొత్తం పట్టేద్దామని ప్రయత్నం
దేశాన్ని జుట్టుపట్టి యీడ్చుకొచ్చారు రోడ్డుమీదకి
బరాబరా లాక్కొచ్చారు కంకరరోడ్డు మీదకి
నలుగురూ చూస్తారనే లజ్జయినా లేదు యీ కొజ్జాలకి
పదవీ పరాక్రమంతో ఏమైనా చెయ్యొచ్చనే ధైర్యం కొజ్జాలకి

ఆర్తనాదం రవికె గుంజేశారు
అభిమానం వోణీ చించేశారు
తొడలు కొడుతూ లేని మీసం మెలేశారు

ఆకాశాన్ని చించి ఏడ్చింది దేశం
నేలని పగిలి పగిలి పొర్లింది దేశం
అక్కడితో ఆగలేదు కొజ్జాల పరాక్రమం
కుళ్ళిపోయిన పుచ్చిపోయిన
తమ పయోరియా పళ్ళతో పెదవులు కొరికి కొరికి
రక్తం చిందించి నవ్వారు
వాళ్ళ కుష్ఠ చేతుల్తో రొమ్ములు పిసికి పిసికి గెంతారు
తొడలు నలిపి నలిపి
అవయవంలో గర్భగుడిలో వేళ్లు దోపి దోపి
ఒళ్ళంతా కసిగా తొక్కి తొక్కి
వాళ్ళ జబ్బు రసినంతా ఒంటిమీద కార్చి కార్చి తుళ్లారు

నగ్నంగా
మెరుపుల పేగులుగా
రక్తం మరకల పీలికగా
పెంటపోగున కుక్కల పందుల కాళ్ళ కింద విస్తరిలా
రోడ్డు మధ్య
మానవత్వం మడుగులో
దేశం కొనవూపిరి శవం

కెమేరాల దేశాలవాళ్ళు ఫొటోలు తీస్తున్నారు
కొందరు కొజ్జాల్ని అభినందించడంలో నిమగ్నులైనారు
మరికొందరు ఇదే అదేనుగా
అవయవాల్ని కళ్ళతో నలిపి సానుభూతి కార్చుకుంటున్నారు

ఒరే పీనుగా
ఇది కూడా నీకు అశ్లీలంగానే కనబడుతున్నదా. ●

# నిఖిలేశ్వర్

## శవభోగులు

**శ**వాలకు చుట్టిన బట్టల్ని
విప్పుతున్న నాయకులు
ఆర్ష ధర్మమని కుల ధర్మాన్ని బోధిస్తూ
అరణ్య తత్వాన్ని పెంచుతున్న ఆచార్యులు
మెదడు కసరత్తుతో
కశ్మలం చుట్టూ వాలుతూ
వెన్నెముక విరిగిన బుద్ధిజీవులు
అపారమైన అమృత జనసాగరంలో
రాలుతున్న విషబిందువులు
సీమలులేని మానవాత్మలో
గడ్డకట్టిన సౌందర్యంతో
రమిస్తున్న శవభోగులు. ●

# చెరబండరాజు

## కుక్కల మేళం

రక్త మాంసాలు లేని రూపాయి బొమికె కోసం
మనిషీ దేశం ప్రపంచ గమనం పట్టని కొందరు
పిచ్చికుక్కల్లా కాట్లాడుకుంటున్నారు

ఉపన్యాసాల్లో
సానుభూతి కరుణలు
మానవత్వపు విలువలు
చొల్లు కింద కారుస్తున్నారు
ఒకడి దొకడు అందినంతవరకు
నాలుకను సాచి నాక్కుంటున్నారు

అబద్ధాలాడక పూట గడవదు
ఆత్మీయుల్ని లాభనష్టాల త్రాసులో
తూచందే నిద్రపోరు

నిర్లజ్జగా లంజ టెక్కులతో
రాజకీయ బజారు పందుల వెంట
రాత్రింబవళ్లు పరుగెత్తుతున్నారు

పలుకుబడి పీతికుప్పలో
పురుగుల్లా పెరుగుతున్నారు
వీళ్ళ నరాల్లో ప్రవహించేది రక్తం గాదు
నవ్వుతారు ఉమ్మినట్టు
చూస్తారు నాకుతున్నట్టు
కనిపిస్తారు మనుషుల్లా. ●

# చెరబండరాజు

## యాభైకోట్ల మంటలు

**యా**భై కోట్ల కంఠాలు
తిరుగుబాటు మంటలుగా మారాలి

వాస్తవ జీవితాన్ని వేల మైళ్ళ దూరంలో విసిరేసిన
విద్యాలయాలు వదిలి
జట్లు జట్లుగా మెట్లు మెట్లుగా
యువకులు నడిరోడ్డుకు పరుగెత్తుకురావాలి

మూఢనమ్మకాల ఉక్కు కౌగిళ్ళలో
నంగనాచి నాయకుల దొంగ వేషాల్లో
నలిగే అలగా జనం కళ్ళగంతలు చించుకొని బయటికి రావాలి
మహా వ్యవస్థ రూపొందించని నాయకులు
జనాన్ని జేజమ్మలుగా వాజమ్మలుగా
పురుగులుగా వెధవలుగా
ఎట్లా దిగజార్చారో
ఒక్కసారి వెన్నుతట్టి కళ్ళారా చూపించాలి

యాభై కోట్ల కంఠాలు తిరుగుబాటు మంటలుగా మారాలి. ●

# నిఖిలేశ్వర్

## ఈ మట్టిలోంచి

**క**ళ్ళ ఆవరణలో ఆడుతోంది పేదవాడి చూపు
చూపులపై రాజకీయాలు విసరుతున్నాయి కత్తులు
ఎండమావులు కల్పిస్తున్న ఉపన్యాసాల ధ్వనులు
ఇసుక సమాధులు పేరుస్తూ వెంటాడే నీడలు

కత్తిమొనపై హఠాత్తుగా మెత్తగా తెగిన వేలులా
మృత్యువు మోసుకెడుతోంది భౌతిక సత్యాన్ని
అప్పుడు చీలిన ఆకుల సందు నుండి
జన్మాంధుడు చంద్రుడు నవ్వుతాడు
ఇప్పుడు మిగిలిన అనంతమైన
ఆరని నగ్నసత్యం చేతులు విరిగి
నాలుక చాచి దిక్కులు సారిస్తున్నది

అనుభవాలను పట్టి ఇచ్చే ధనం చేతుల్లో
అనుభవహీనమై నీరసించి
ఎక్కడికక్కడే తెగి
విలవిలలాడుతున్న ప్రాణమై
నిద్రలో దూరిన చెవిలోని చీమకు
దారితప్పుతున్న గుండెపోటుకు తల్లడిల్లి
చావుకు ఎరగా మారిన
ఈ వానపాముల మనుష్యుల మధ్య

రగులుతున్న విప్లవంలో

మనిషి తీరని దాహమై
సజీవమైన అసంఖ్యాక ఆత్మల బలంతో
ఈ మట్టిలోంచి
నీటిలో గాలిలో తిరిగే
నీవు – నేను ముందుకు నడవాలి
కదిలే నీళ్ళతోనే కదుల్తాయి రూపాలు. ●

# నగ్నముని

## మాచకమ్మ ప్రతాపం

నిజాయితీ కొండల్ని తినడం మరిగి
వంకరదార్లు నేర్చి ఎడారి దొంగలతో లాలూచీ పడి
సుభిక్షాన్ని వెన్నుపోటు పొడుస్తున్న నదుల్ని
జుట్టుపట్టి వొళ్లు వొంచి మానవత్వం మళ్ళలోకి
ఇరవయ్యేళ్ళుగా వొట్టిపోయిన మెదళ్ళలోకి

చనుధారల తుపానులు ప్రవహింపజెయ్యడానికి
అవినీతి తారు మింగుతున్న రక్తాన్ని
అణు విద్యుత్ వరదలుగా మార్చడానికి

గౌద్రాలైన యీ భూమి భూమినంతా
జనవిప్లవ మంటల కెరటాలు ఉవ్వెత్తున లేపి
నపుంసకాకాశాల్ని కాల్చడానికి

కలకత్తా కాళికలూ మళయాళ మరాళాలూ
నేలనేలనా వీర మాతృశ్రీలు శిశువులుగా
అగ్ని పర్వతాలు ప్రసవిస్తుంటే

అయిదేళ్ళ పెంటపోగులో దొరికిన అద్దం పెంకులో
ఎంతకీ పగలని తన అవయవాన్ని చూసుకుంటూ
గర్వంగా మురిసిపోతున్నది
ఆంధ్రమాత. ●

*మాచకమ్మ : ఎప్పటికీ పెద్దమనిషి కాని ఆడది*

# చెరబండరాజు

## నేనే మీ ఊపిరి

ఆంబోతుల తోకల కుచ్చుల్లో
అంటుడు కాయల్లా చిక్కుకున్నవారు

శతాబ్దాల వెనక్కి నెట్టి
మతోద్ధరణ మైకంలో పడద్రోసే
పిచ్చి పిచ్చి టెంకాయలు
కాళ్లు చాపి వాలు కుర్చీలో కూర్చొని
భూస్వాముల భజన చేయు
పచ్చి రొచ్చు బూర్జువాల
ప్రాంతీయ సేనలతో
ప్రత్యేక నాడులతో
పాతరాతి పైత్యాలను
జనంపైన పులుమువారు

కారు కారు వీళ్ళెవరూ
ఈ దేశాన్ని రక్షించేవారు కారని
ఇరవై ఏళ్ళ చరిత్ర
నా మొహం గుద్ది చెబుతోంది

అంతర్ముఖుణ్ణయి గుండెలోతుల్లో
కలల అలల్ని కెలుకుతూ
భావాల గాలాల్ని విడుస్తూ ఏడుస్తూ
ఏమీ పట్టనట్టుగా

నేనెవరికీ ఏమీ కానట్టుగా
గుట్టుగా కూర్చోలేను
యాభై కోట్ల జనాన్ని
స్వార్థ సంఘ క్రిమి కీటకాదులు
తినేస్తుంటే పీనుగులా బతకలేను
మజిలి మజిలికీ వేశ్య
కొత్త చీర మార్చుకున్నట్టు
నపుంసకుడు పురీషాన్ని
ప్రతి నిమిషం నలిపినట్టు
పార్టీలు మారే ఈ పగటి వేషగాళ్ళని
పదవీ భ్రష్టుల్ని చేసే
బహిరంగ సభల్లో నిర్దయగా కాల్చేసే
తిరుగుబాటు యువతరాన్ని సమర్థించి తీరుతాను
ముందునడిచి నడిపిస్తాను

సామాన్యుడి తలపాగను చించి
రోజుకో జండాని ఎగరేసే గూండాల
చెవులుపట్టి వెనక్కి తిప్పి
ప్రగతి పేర దేశానికి తెచ్చిన దుర్గతిని
ప్రణాళిక పేర రేపిన వ్రణాల్ని
మూత్రశాలలుగా చాకిరేవులుగా మారిన
శంకుస్థాపన స్థావరాల్ని
కళ్ళ పొరలు పెరికి చూపిస్తాను

పిల్లి గుండెల ఢిల్లీ నగరానికి
అక్కడ చేరిన నక్కలకి విశ్వాసంలేని కుక్కలకి

ప్రజల పస ఏమిటో చూపిస్తాను

ఇంటింటా ఆరని కుంపటిలా జ్వలిస్తూన్న
యువతరం నీరు కారనక్కర్లేదు

తండ్రయినా, తల్లయినా, తమ్ముళ్ళన్న లెవరయినా
ఈ పెంట వ్యవస్థకు కారకులయినప్పుడు
ప్రభుత్వాలు శాశ్వతం అసలే కానప్పుడు
దేన్నయినా ఎవర్నయినా ఎందుకు మనం క్షమించాలి. ●

## యాచకీయాలు

పాత జిడ్డు అలవాట్లనే సాంప్రదాయం చేసుకున్న దేశంలో
విరిగిన గోడల మొండితనం
సామూహిక భజనలో కళ్ళుమూసి తేలేసి
మతంతో తాదాత్మ్యాన్ని నటించి
కూనిరాగాల జోలపాటలో భుజాలు ఊపుతున్న
వందిమాగధుల నపుంసక సాహిత్యం
తలలూపి తలలపై చేయి పెడుతున్న గాంధోళీగాళ్లు

ఒక వర్గ విశేషాన్ని ఆకాశానికి ఎత్తి
జేబులు నింపుకున్న సాహితీ యాచకులు
సుసంస్కృతులని సంస్కృతమనే సొమ్ములు వేసి
అనాగరికులని నీచంగా కొందరిని సొమ్మసిల్ల చేసి
స్వోత్కర్షతో సాగిన తత్వం
గుండె బలాన్ని ఇవ్వదు
బిచ్చమెత్తుకునే చొరవ తప్ప

సొంత చేతులతో పాలించుకునే హక్కు
ఏనాటినుండో కొందరి హస్తగతమయి
అందరి చేతులను కట్టివేసిన వ్యవస్థ
అలంకార ప్రాయంగా
వాక్ స్వాతంత్ర్యమని మెరుస్తున్న
మిథ్యా గ్రంథంలోని పుటలు

ఏ ఒక్కరికో గోచి ఆదర్శప్రాయమైనా
అందంగా ఆనందంగా ధర్మకర్తృత్వాన్ని

పంచిపెట్టమనే ఉదార ఉద్ఘోషలో
మిగిలినవి అనంతకోటి పరాన్న జీవులు
గోచి పాతరాయుళ్ళు తవ్విన గోతులు

ప్రజా సేవకుల సేవా రాజకీయాల మాటున
శరీర ధర్మాన్ని విస్మరించని
విస్తృతమైన విశృంఖల దోపిడీ
అరచేతుల్లో ఆకాశాన్ని నింపుకొన్న పాత్రలు
ఎముకలు ఉబికిన సరిహద్దుల రక్షణకు
చేతులు చాస్తున్న రక్షణ వ్యవస్థ
బోలుగా కృతకంగా కృంగిపోయిన
మెదడులోని స్నాయువులు
పి. యల్. 480కి దాసోహం

స్వేచ్ఛా పాలనా–పాలితులకు
మిగిల్చిన సశేషమైన అనంత యాచన
యాచకీయాల వారసత్వాన్ని మోస్తున్న
వెన్నెముక వంగిన నూతన తరాల –
నరాలకు– ఆలోచనలకు తీరిక ఇవ్వని
సెక్సు సాహిత్యం – లంగా మార్కు సినీమాలు

స్త్రీగా జన్మించడమే పిల్లల్ని కనేందుకు యోగ్యత
గాలికి జీవించడమే యాచకుల ఉద్యమం
స్వతంత్ర భారత పౌరుడనే విచిత్ర జీవి
యాచకీయాల వంచనలో
స్వస్వరూపాన్ని ఏనాడో కోల్పోయి
సంప్రదాయ శిథిలాల మధ్య
యాచక వికృత విరాట్ రూపాన్ని దర్శిస్తున్నాడు. ●

# నగ్నముని

## తొడ విరిగిన తరం

**న**వ్వేవాడివి అడివి పువ్వులు
కంఠమెత్తి పాడేవాడివి మంటలు జీవిత సత్యాలు

వేణూ!
ఎక్కడున్నా విప్పుడు నువ్వు
ఏ మతాల కనుగుణంగా ఊపిరి పీలుస్తున్నావు
ఏ దైవాల ఆరాధనలో సిగరెట్లు వెలిగిస్తున్నావు
ఎక్కడున్నా మైత్రీబంధం సుఖంగా వుండు నువ్వు

గోమాతలా గోధుమ భూములూ
నునుసిగ్గుపై రెప్పలు వొంచిన వరిచేలూ
నీ భోజనంలోకి పుష్టిగా పాలు పోసుకుని
రత్నాలూ, వజ్రాలూ రాల్చాలి
రాజకీయాల రోగాలు తగలని కోళ్ళు
నీ ఆమ్లెట్లలోకి ఆరోగ్యవంతమైన గుడ్లు
ఆనందంగా పెట్టాలి

గుర్తుందా
ఆ తర్వాత నువ్వు మరి కనపళ్ళే

ఆ ఆఫీసొదిలిన సాయంత్రం
గడియారాల ఆశీస్సుల కింద
ట్రాఫిక్ తప్పతాగిన ఎర్ర లారీ కళ్ళతో
ఒంటరితనం పీలుస్తూ నడుస్తున్న
నా భుజాల బురుజులపై నీ చేతులు
రోడ్డుకడ్డంగా

అన్ని పిరికి పీనుగుల ముందూ

కాఫీ ఒయాసిస్ ముందు
పరుచుకున్నాం మనం దొర్లిన రోజులు
ఎంత మారిపోయినావు
లావుగా పొట్టతో కళ్ళద్దాలతో
మాంసం పొంగిన బుగ్గల్తో
కోటులో కొనుక్కున్న సుఖంతో
డబ్బున్న వాడి సహజమైన కులాసాతో
వేటాడే కళ్ళతో
ఆత్మల్ని అమాంతం కొనేసే వుంగరాల వేళ్ళతో
నీ చేతుల్లో కాంట్రాక్టుల కాగితాల్తో

నువ్వు పువ్వుల్ని నవ్వినప్పుడు
నిజాయితీ మంటలు తింటూ బతికినప్పుడు
నీ ఉద్యోగం ఊడిపోయింది
నీ పరువు చొక్కా చిరిగిపోయింది
ఇప్పుడు పువ్వుల్నీ మంటల్నీ ఎలా ఆరాధించను

ఇక్కడ రోడ్ల పక్క నాటిన మొక్కలు
నాగరికత పీల్చుకుంటూ పెరిగిన చెట్లు
అన్యాయాలకి తలలాడిస్తూ వుంటాయి
పాము పడగలూ, కోరలూ
మేక చర్మాల కోటులో పెద్దపులులూ
మనుషులుగా, మనీషులుగా చెల్లుతూ
టాపు లేని కారుల్లో దండల ఊరేగింపుల్లో
వెలిగిపోతూ ముకుళిత హస్తాల్లోని ముళ్ళు చల్లుతూ వెడుతున్నప్పుడు
కొమ్మల్ని వంచి వాళ్ళనీ, వాళ్ళ వెంట మందనీ చావబాదకుండా
పరమ శాంతమూర్తుల రుషుల పోజులో

ఇక్కడి చెట్లు నాగరికతని ఎల్లవేళలా పాటిస్తూ వుంటాయి

అవమానాల ఆకాశం కింద చిరుగుల చొక్కాలో నీ చిరునవ్వులూ
కుటుంబ బరువు బాధ్యతల మోసళ్ళూ
నీ జ్ఞాపకం నా గొంతుని పూడ్చేస్తుంది

నువ్వు నీ ఉద్యోగం నిమ్మకాయ కోసి
గోదాలోకి దూకి ఎదురు తిరిగితే
ప్రజల్ని పలుకుతాను జాగ్రత్త అని దురంతాల్ని ప్రశ్నిస్తే

పిచ్చికుక్కలా తరిమి కర్రల్తో సంసారం వలలో గిలా గిలా పట్టి
మూతి కట్టి
సుఖం కారులో మోసుకెళ్ళిపోయారు

సీసాల్లో స్నానమాడించి
సిల్కు చీరల లంగాల్లో నిన్ను పాతేశారు
వేణూ!
నిన్ను వాళ్ళు నిలువునా కొనేశారు

ఆ తర్వాత ఎంత పెద్దవాడివైనావు నువ్వు
ఆ తర్వాతే పూలకి చెదలు పట్టాయి
ఆ తర్వాతే మంటలు కన్నీళ్ళు కక్కుకున్నాయి
డబ్బు పగలబడి నీ చుట్టూ నవ్వింది
అవసరాలకి చందనగంధం పూసింది

ఇవాళ నీ పేరు తలవకుండా
నీ ముఖం వివిధ కోణాల్లో ప్రదర్శించకుండా
బయటికి రావడానికే బిడియపడుతుంది వార్తాపత్రిక
మనం సాధిస్తున్న ప్రగతి గూర్చి
నీ వాణి నలుదిక్కులా మ్రోయడానికే నిలుచున్నది ఠీవిగా వేదికపై మైకు

నీ స్పర్శకై ఎదురుచూస్తున్నాయి శిలలు

శంకుస్థాపనలు
నన్ను క్షమించు
నీ పొట్టపై పద్యాలల్ల లేను
పై మెట్లనీ పదవుల్నీ ఆశించి నిన్ను దండల్తో ఉరితియ్యలేను
నిన్ను సభల్లో పొగడ్తలమధ్య కలిసి
మన మైత్రీబంధం మైలపరచలేను

పగళ్ళూ రాత్రుళ్ళూ
నాలో అజ్ఞానంలా మర్రివూడలా తన్నుకుంటుంది ఆశ్చర్యం
నిన్ను నువ్వెందుకు హత్యచేశావు
నిన్ను నువ్వెట్లా పొడుచుకోగలిగావు
తల్లివంటి విప్లవ భావాల్ని ఎదురీతని ఎట్లా చంపగలిగావు
వేణూ!
నువ్వు తిరిగి
పోరాటం ఊపిరితో
ధైర్యం కవచంతో
ప్రపంచం నిండా పాకిపోతున్న
ఈ కొజ్జా పరిపాలకుల్ని ఊచకోతగా కొయ్యడానికి
ఈ మానవత్వం రక్తాన్ని పీలుస్తున్న తోడేళ్ళని పాతెయ్యడానికి
చెట్టు పేరుతో కాయలమ్ముతున్న గజదొంగల్ని చెట్లకే కట్టెయ్యడానికి
వాళ్ళ డబ్బు పొట్టల్లో గునపాలు దింపడానికి
వేణూ!
పోరాటం ఫెళఫెళలతో
ధైర్యం అగ్నిపర్వతంతో
నాలోకి
ప్రజల్లోకి
తిరిగి నువ్వు బ్రతుకలేవా? ●

## మంటలెప్పుడోగాని పాకవు

చిల్లులుపడి చీకి ముక్కిపోయి
గబ్బులేచిన పాత చాప
ఈ వ్యవస్థ

ఏమీ పట్టించుకోని
ఎందుకూ పనికిరాని ఏనుగు ఆకారం
దుమ్ములా వచ్చి
నీడలా ఒళ్లు వాల్చి
హఠాత్తుగా పరధ్యానంగా ఎక్కడికో
పరుగెత్తి పోతాడు
యజమాని

అబల ముద్ర చెరిపేసుకుంటే
ఆత్మవంచన అనుకుంటుందేమొ
అక్కడే పడి పొర్లుతూంది
కనటానికే అలవాటుపడిన
గృహిణి

తాతల ముత్తాతల
దేవుళ్ళకు దేవుళ్ళయిన బొమ్మల
ప్రతిబింబాల క్రీనీడలు
అక్కడి వెలుగులు
గాలి విసురులా గదిలోకి జొరబడి
నల్లుల రక్తపు చారల చాపమీద

బండ బూజు పురిటి కంపు
అన్నంలో నంజుకొని
యంత్రాల్లా తిరిగిపోతారు
ఎందుకూ పనికిరాని
వెన్నెముక లేని యువతీ యువకులు

ఆప్తమిత్రులకూ అతిథులకూ
ఆ గుంటలోనే విందులు

తరం మారినా కంపుకొట్టినా
ఆ చాప మీద అసహ్యం వేయకపోవడం ఆశ్చర్యం

ఇంటితోబాటు చాప నాశనం గావడానికి
వరద లెన్నడోగాని రావు
మంటలెప్పుడో గాని పాకవు

కార్జ్యం లేని యజమాని
గుండెలేని గృహిణి
చెత్తకుండీ విస్తరి యువకులతో
ఈ చాప వ్యవస్థ మారే దెప్పుడు ●

# నిఖిలేశ్వర్

## శవాలు - నల్లులు

ప్రతి రాత్రీ జరిగే పోరాటంలో
రక్తం మరకల మధ్య చావని నల్లులు
నయాగరా జలపాతంలా ఒక్కక్షణం
నిలుచున్న కత్తిలా కర్మ రహస్యాన్ని తెలుసుకునే
అవయవాల విడి విడి సత్యాల మహానందం
వెలిగే బల్బు కింద కాలే వేళ్ళ మధ్య
కొన్ని క్షణాలు బతికే కవి అనుభూతులు
నిద్రలో - వానలో - నడకలో
నిరంతరం చలించే నిత్య సత్యాలు
వాన ఎందుకు కురుస్తుందో అర్థంకాదు
కౌగిలింతల్లో పిల్లలు ఎందుకు పుడతారనే ప్రసక్తి లేదు
టేబులు ముందు ఫైళ్ళలోన మర మనుష్యులు
రోజూ ఎందుకు ఊపిరి పీలుస్తారో అడగనవసరం లేదు

మంచు తుపానులో శరీరం కరిగి
విరిగిన వేళ్ళు ఎందుకు మిగులుతాయో?
కవిత్వం ముందు కరగని కవి కలంలో
ఇంకా ఎందుకు మిగులుతుందో సిరా?
ఈ ప్రశ్నలకు సమాధానం వెదుక్కుంటూ
అర్థరాత్రి కూసే సైరన్ మోతలో
అంతర్థాన మవుతాయి నక్షత్రాలు
నీరసమైన ఇచ్చి పుచ్చుకునే పద్దుల మధ్య
శ్వాస పీలుస్తూ రేపటికి జీవిస్తారు మనుష్యులు. ●

# నగ్నముని

## అణుదిక్

దశ దిశ దేశ దేశాలా
మహామ్మారి మత్సరాల కలరా ప్లేగు పురుగులు చల్లుతున్న
రాజకీయవేత్తలారా
మలినంపై వాలివచ్చిన ఈగల్లారా
మత్తగజాల మనుకుంటున్న ఊరపందుల్లారా
ఒక్కసారి మీ తలల్ని ఉపన్యాసాల సందేశాల శాంతిబాకాల
ఇసకలో నుండి పై కెత్తి వినండి
పదవి బురదలో నుండి రెప్పల్ని పైకెత్తి వినండి
పందులం దోమలం అనుకుంటున్న
మత్తగజాల్లారా ప్రజల్లారా
ఒక్క క్షణం రాజకీయాల రంకు నుండి
బయటికొచ్చి చూడండి
నేల నవ్వుతోంది
నింగి నవ్వుతోంది
చీమలు నవ్వుతున్నాయి
కాకులు నవ్వుతున్నాయి
దిక్కులు నవ్వుతున్నాయి
అధికారం నవ్వుతోంది
అంధకారం నవ్వుతోంది
నదులు నవ్వుతున్నాయి
కడలి నవ్వుతోంది

బుడగ నవ్వుతోంది
మంట నవ్వుతోంది
రవ్వ నవ్వుతోంది
చెట్టు నవ్వుతోంది
అడవి నవ్వుతోంది

అంగాంగం అణువు నవ్వుతోంది
పెదవులు దాటిన నవ్వు గాలితో ఏమంటోంది
నేల చీలిన నవ్వు ధూళితో ఏమంటోంది
నలుపు పగిలిన నవ్వు చుక్కల్తో ఏమంటోంది
కాకుల కావుకావుల తెలినవ్వులు అన్నం మెతుకుల్తో ఏమంటున్నాయి

నవ్వులు నవ్వులు నవ్వులు నవ్వులు
ప్రశ్నల నవ్వులు సమాధానాల నవ్వులు
నవ్వులు నవ్వులు నవ్వులు నవ్వులు నవ్వులు నవ్వులు
గోలగోలగోలగోలగా నవ్వులు
గలగలగలగలగలగలగలా నవ్వులు
కలకలకలకలకలా నవ్వులు
కల కల కల కల కలకలంగా నవ్వులు
వికవికలుగా నవ్వులు
కకావికలుగా నవ్వులు
పగిలిన నవ్వులు
బద్దలైన నవ్వులు
పొగిలిన నవ్వులు
పొర్లిన నవ్వులు
నవ్వులు నవ్వులు నవ్వులు నవ్వులు నవ్వులు

గడబిడగా నవ్వులు
పొడపొడగా నవ్వులు
ఉంగరాల నవ్వులు
గింగిరాల నవ్వులు
నీళ్ళ నవ్వులు
తరగల నవ్వులు
పొలాల నవ్వులు
గట్లు గట్లుగా నవ్వులు
తెర్లుతెర్లుగా నవ్వులు
తెరలు తెరలుగా నవ్వులు
కెరట కెరట కెరట కెరటాలుగా నవ్వులు
అలగలఅలగలఅలగలల నవ్వులు
పొరలు పొరలు పొరలు కెరలుగా నవ్వులు
గరళగరళగరళ నవ్వులు
కళవళల నవ్వులు
ఫెళ్ ఫెళ్ ఫెళ్ ఫెళ్ ఫెళల నవ్వులు
నేలా నింగీ భళ్ళు భళ్ళున నవ్వులు
ప్రళయంగా నవ్వులు
వరదగా నవ్వులు
ఉప్పెనగా నవ్వులు
ప్రళయ వరద తుఫాను నవ్వులు
ప్రమాదం సూచిస్తూ నవ్వులు
ప్రమాదం కక్కుతూ నవ్వులు

ఒరేరేరేరేరేరేరేరేయ్

ఆటంబాంబులో లేదురా ప్రమాదం
అడవి జంతు మనస్తత్వంలో వుందిరా ప్రమాదం
పదవుల్లో లేదురా ప్రమాదం
రాజకీయనాయకుల మోసాల్ని నమ్మే ప్రజల అజ్ఞానంలో వుందిరా ప్రమాదం
పాము పడగల విషంలో లేదురా ప్రమాదం
పాలు పోసి పెంచుతున్న ప్రజల మూర్ఖత్వంలో వుందిరా ప్రమాదం
మంటలు ప్రవహించే రక్తాన్ని పీనుగ పెంటల కాల్వగా మార్చే
సుఖ వ్యాధుల్లో లేదురా ప్రమాదం
పందుల్లా తోకాడిస్తూ
మనుషులు అశుద్ధాన్ని తినడానికి కూడా తయారవుతున్న
డబ్బులో వుందిరా ప్రమాదం
మూర్ఖత్వంలో వుందిరా ప్రమాదం
అర్భకత్వంలో వుందిరా ప్రమాదం
పిరికితనంలో వుందిరా ప్రమాదం
పారిపోవడంలో వుందిరా ప్రమాదం
సరిపెట్టుకోవడంలో వుందిరా ప్రమాదం
సరి చెయ్యక పోవడంలో వుందిరా ప్రమాదం
పరిస్థితుల్ని గమనించక పోవడంలో వుందిరా ప్రమాదం
పరిస్థితుల్ని మార్చకపోవడంలో వుందిరా ప్రమాదం
ఎవరికివారు ఇంటి దొంగల్నీ స్వజాతి ఘాతకుల్నీ
కనిపెట్టకపోవడంలో వుందిరా ప్రమాదం
నల్లబజార్లని పోషిస్తున్న దౌర్భాగ్యుల్లో వుందిరా ప్రమాదం
బహిరంగంగా చేతికందిన దానితో
తిరగబడడానికి సంసిద్ధం కాని
నపుంసక జాతి జాతి జాతంతా నిండివుందిరా ప్రమాదం. ●

# చెరబండరాజు

## రక్తఘోష

**మ**మ్మల్ని ఉద్ధరిస్తావని
కొక్కాలకు వేలాడే మా కోర్కెలు
నేరుగా అధికారానికి వినిపిస్తావని

మాకిచ్చిన వాగ్దానాలు
నిలువుటద్దంలా ప్రతిబింబిస్తావని

మా అవిసిన ఆశల సేద తీర్చి
మా బతుకుల్లో లేమి మాట మాన్పిస్తావని

నిద్రాహారాలు మాని మాకోసం
అహోరాత్రులు శ్రమిస్తావని

వేషం మార్చుకున్నా ఓర్చిన
మా సహనానికి సార్ధక్యం కలిగిస్తావని

గెలిచిన్నాడు ఊళ్ళో
బంతిపూల మల్లెల మాలలు కురిపించి
హారతి కర్పూరాలు వెలిగించి
సన్నాయి బ్యాండు మేళాలతో
పదహారు జతల ఎడ్ల బండి మీద
దేవుడిలా ఊరేగించిన
మమ్మల్ని మరిచిపోలేవని
నిన్నటివరకూ పెంచుకున్నాం నమ్మకాలు
నీ యింటిముందరి పహరా కుక్కల్ని

గారేజీలో గాండ్రిస్తూ నించున్న కారుని
కాపలాదారుడి కసిరింపుల్ని చూశాక
ప్రజా ప్రతినిధిగా వెళ్ళిన నువ్వు
రాక్షస రాజ్యానికి పునాదులు వేస్తున్నావని
ఇప్పుడు తెలిసింది

నల్లబజారు వ్యాపారిని రక్షిస్తూ
వేదికలెక్కి అధిక ధరల్ని
అరికట్టాలంటున్నావని

లారీల్ని, ద్రాక్ష తోటల్ని
హోటళ్ళ, కార్ఖానాల వాటాల్ని
తాజ్‌మహల్ లాంటి భవనాల్ని
కాపాడుకునేందుకు
పిల్లల్ని నల్లుల్లా కంటూ
కూలినాలి జనానికి
అయిదు పదులు ఆశపెట్టి
కుటుంబనియంత్రణగూర్చి
గొంతు చించుకుంటున్నావని

కైపెక్కిన కళ్ళతో
కనిపించిన స్త్రీనల్లా కరిచి
కారుచీకట్లో కార్లో
నగరం అవతల కన్నెపిల్లలకు
కడుపుల ముడుపులు కడుతున్నావని
అక్షరాలా తెలిసిందిప్పుడు
ఆ నాడు

చంటిపాపల్లా
అయిదారేళ్ళ పిల్ల లాటల్లా
నీ చుట్టూ మూగేవాళ్ళం
తీపి నవ్వుల దుర్గంధంలో దొర్లి
పువ్వులని భ్రమసిపడ్డాం
కళ్ళ కొలనుల బురదలో దూకి
శాంతి కాసారాలని ఎంత మోసపోయాం
ఓనమాలు దిద్దించేటప్పుడు
నిస్వార్థ జీవివని సర్వస్వం అర్పించాం

పలుకుబడి రసి
ఒంట్లోంచి కార్చుకుంటూ
ఆస్తులు పెంచుకుంటోంటే
నీడల్లా నిల్చొని గమనించాం

మాతృదేశం మంచితనం సంగీతం గూర్చి
మాట్లాడే హక్కు నీకు లేదు
రక్తం తాగుతూ అమృతమనుకుంటున్నావ్
నిన్నూ నీ బలగాన్ని గద్దె దింపనిదే నిద్ర లేదు
మా వూళ్ళకేసి చూడకు
మంటలు ఆకాశన్నంటున్నాయ్

నిన్ను పిచ్చికుక్కలా
తరిమి తరిమి కొట్టేతరం
జూలు దులిపి దారికాచి వేచివుంది. ●

# నిఖిలేశ్వర్

## హింస

**నా** ఎదుట శవంలా శూన్యం
చుట్టూ ఆవరించిన నీడల గొడుగులు
సుఖాల గొడుగుల కింద స్కూటర్లు
వెనుక రబ్బరు బంతుల ఆడాళ్ళు
వీపుపై కాస్సేపు రాజ్యం చేసే మల్లెపూలు
చుట్టూ బాధను
బాధలో కుళ్లుతున్న శరీరాలను
మరచి జీవించడం రబ్బరు వాపులకు గుర్తు

అవును సౌఖ్యం భూమినిండా
కొందరి జేబులు నిండా
మరికొందరు కంపుదేహాల వాపుల నిండా
చివరికీ ఎవరికీ దక్కని శూన్యం నిండా

క్షీణించి చాచుకొనే ఒక్క చేతి వెనుక
లెక్కలేనన్ని ఆకలి ముఖాలు
జేబుల్లో దూర్చిన నా చేతులపై
అదృశ్యంగా నొక్కుతున్న లక్షలవేళ్ళు

అర్థరాత్రి ఆర్ద్రంగా కదిలే గాలికి
ప్రాణం లేని గుమ్మం మామిడాకులు దిక్కు
కాని పబ్లిక్ పార్కులో పడుకోలేని
దిక్కులేని పౌరుని దౌర్భాగ్యం చుట్టూ
పహరా కాస్తాయి

అధికారాన్ని కాపాడే పోలీసు దుస్తులు
రోజూ శూన్యం శవంలానే పరచుకొంటుంది
రోజూ చంద్రుడు సైజు మార్చి
చివికి చీముకారే మల్లెపూల మీంచి
నల్లని దైన్యపు మబ్బుల్లో తారు పులుముకొని
గుండెలా కొట్టుకునే సమస్యలపై నవ్వుతాడు
ఎవరిక్కావాలి అర్థంలేని నవ్వు
శూన్యంలో ఖాళీ డబ్బులా ధ్వనించే నవ్వు

నిజమే మంచితనం-అందం-నీతి
అనే విలువలు నీక్కూడా కావాలి
ఎవరికైనా అనుకోవడానికి తప్పకుండా అవసరమే!
మరి మంచితనం తనను నిలుపుకోలేకపోతే?
అందం రబ్బరు బంతుల్లా అమ్ముడుపోతే?
నీతి ఏనాడో నిర్వచనాన్ని కోల్పోతే?
ఏ విలువలు ఎక్కడ వూపిరి పీలుస్తున్నాయో
ఏ మతాలయాలు
ఏ రాజకీయాలు
గిరిగీసి చూపించలేని దారుణ స్థితిలో
కూలుతున్న విలువల్ని ధ్వంసం చేసి
తొక్కుతున్న సుఖాల పరువులపై
శూన్యంలాంటి శవాన్ని కాల్చి
ప్రాణంకోసం
మళ్ళీ పంచిపెట్టు హింసను
హింసలోంచి పుట్టే స్వచ్ఛమైన ప్రేమను. ●

## బ్రహ్మపదార్థం

"ఓయీ దిగంబర కవీ!
నగ్నమునీ!
ఒక్కపరి నీ వ్రాతనుండి తలయెత్తి యిటు జూడుము
నీదు గోరికపైననే గదా యీ భువిపై జన్మించితివి
భూమి నీకు యెట్లున్నది?
ఆవాస యోగ్యముగా భాసించుచున్నదా
సావాస భోగ్యముగా విరాజిల్లుచున్నదా?"

విశ్వవిద్యాలయాల్లా మాట్లాడుతున్నావు
మంత్రిపుంగవుడు వ్రాయించుకొచ్చి చదువుతున్న
వ్యాసంలా వున్నావు
అనాధమీలా
కంపుకొడుతున్నావు
ఎవత్తెవే నువ్వు
స్త్రీవా, భావకవివా, కొజ్జావా?

"ఓరీ నీకు గండకావరము హెచ్చినది
నేను నేనే
నేనే పరబ్రహ్మజ్యోతిని
ఆదిమధ్యాంతరహితని
నేనే ఈ అఖండబ్రహ్మాండమునకు గారణమైనదానిని
నీవు యిచ్చుటనెట్లు జీవించుచున్నావో
జూడవచ్చితిని"

అటులనా

అశరీరవాణీ!

ఆకాశవాణీ!

ఇంతకీ నే నడిగింది తప్ప

మా ముక్కుపొడుం ముండాకొడుకుల్లా

చెత్తనంతా ఎక్కడో బట్టీపట్టి అప్పజెప్పావు

నువ్వు ఆడదానివా, అమలిన శృంగార కవివా, ఆడంగిరేకువా?

భూమి ఎట్లున్నదని అడుగుతున్నవా?

అయిన వినుము

భూమి నారింజపండులా లేదు

భూమి ఫుట్‌బాల్‌లా లేదు

భూమి కుండలా లేదు, బండలా లేదు

అయిన నెట్లున్నదా?

భూమి ముసలి వరిబీజములా వున్నది

భూమి ఆంధ్రుల జీవితములా వున్నది

భూమి కవిసామ్రాట్టు తర్కంలా వున్నది

భూమి వచన కవితోద్యమంలా వున్నది

భూమి తెలుగు సినిమాలా వున్నది

భూమి ఆలిండియా రేడియోలా వున్నది

భూమి ఎద్దు ప్రభుత్వములా వున్నది

భూమి కడగని ఎండిన పీతిముడ్డిలా వున్నది

భూమి అచ్చంగా ఇండియాలా వున్నది

భూమి మధ్య మధ్య ఊగుతున్న వరిబీజములా వున్నది

భూమి ఇండియాని వుంచుకున్న చీకటి వర్తకుల బొజ్జలా వున్నది

భూమి ఇండియాని తారుస్తున్న పెద్ద పెద్ద అడ్డగాడిదల బట్టతలలా వున్నది
భూమి అమెరికా ప్రెసిడెంటు ముఖంలా అమాయికంగా వున్నది
భూమి అమెరికా ప్రెసిడెంటు మెదడులా అమానుషంగా వున్నది
భూమి అల్లకల్లోలాల ముడతలతో అలరారుతున్నది
భూమి శాంతివచనాల వెంట్రుకలతో వెలిగిపోతున్నది
భూమి అణుబాంబుల వీర్యంతో నిండిపోవాలని తపిస్తున్నది
భూమి భగవంతుడి నడుస్తున్న లుంగీలో ఊగుతున్న ముసలి వరిబీజంలా వున్నది
అశరీరవాణీ!
ఆకాశవాణీ!
భూమి ఎట్లున్నదో జూచితివిగదా!
ఇంక నీవు ప్రత్యక్షమై
నీ ముసుగులోని మొగమూ
బొడ్డు కింద బొమ్మా నాకు జూపింపక
వచ్చినత్రోవనే
ఏడుకొండల మీదికి బొమ్మ. ●

# చెరబండరాజు

## చిలుం

చిలుం చిలుం చిలుం చిలుం
వేదనాదాల మంటపాల గంటల
హారతి గీతాల అంతర్మయిధున
ఆధ్యాత్మిక మంతనాల
భారతీయుల బుర్రల్లో
తెప్పలుతెప్పలుగా కుప్పలుకుప్పలుగా
చిలుం

కళాశాల మెట్ల చిలుం
పాఠ్యగ్రంథాల్లో చిలుం
గ్రంథాలయాల్లో చిలుం
అధ్యాపకుల్లో చిలుం
తరగతి గదుల్లో చిలుం
పరీక్ష ఫలితాల చిలుం
నల్లబల్ల చిలుం
పిల్లల్లో చిలుం
తల్లిదండ్రుల్లో చిలుం
చిలుం చిలుం చిలుం చిలుం

పదవుల చిలుం
ప్రేమకథల పత్రికల చిలుం
వారఫలాల చిలుం
లంచాల చిలుం

ఓట్ల చిలుం
పిరికి చిలుం
చిలుం చిలుం చిలుం చిలుం
బంధువుల విందుల్లో చిలుం
పెళ్ళితాంబులాల చిలుం
లగ్నాల కట్నాల చిలుం
దాంపత్య బంధనాల్లో చిలుం
ఎముకల కీళ్ళలో నరాలలో చిలుం
రక్తసంబంధాల్లో చిలుం
చిలుం చిలుం చిలుం చిలుం

ఆచార్యుల పూజ చిలుం
గంగాజల పవిత్రతలో చిలుం
గౌరీశంకర శిఖరంలో చిలుం
షడ్దర్శన పంచకావ్యాల చిలుం
మడిగుడ్డల్లో చిలుం
నామాల చిలుం
ఉత్తరీయాల చిలుం
తత్‌దినాల చిలుం
చిలుం చిలుం చిలుం చిలుం

పీఠాధిపతుల హంగామాల చిలుం
మంత్రుల వాగ్దానాల్లో చిలుం
వార్షికోత్సవాల చిలుం
అయోధ్యలో సయోధ్యలో చిలుం
కాకారాయుళ్ళ కాంట్రాక్టుల్లో చిలుం

తిరుపతి గుండు చిలుం
మొక్కు చిలుం
ఆంధ్రదేశం నిండా చిలుం
ఆస్తి చిలుం
చిలుం చిలుం చిలుం చిలుం
కులహేళన స్వగతంలో చిలుం
భాషా వాదాలు చిలుం
సినిమాల మోజు చిలుం
అప్పు చిలుం
గోసంరక్షణ పిచ్చి చిలుం
నంది చిలుం
చిలుం చిలుం చిలుం చిలుం

యువతీ యువకులార!
మన్నుదిన్న పాముల్లార!
చిలుం నాకి బజ్జోకండి
ఎప్పటికప్పుడు ఎక్కడికక్కడ
కొలింపెట్టి
పగలగొట్టి
చిలుం వదలగొట్టాల్సిందే
తరం మీది
బరువు మీది
బాధ్యత మీది
భావి మీది. ●

# నిఖిలేశ్వర్

## ఉచ్చలో దిక్కులేని శవం

**రా**జీపడి రంగులు మార్చి
గాలి పీలుస్తున్న జడకూటమిలో
జీవితమంతా కులటగా
కులుకు నేర్చుకుంటున్న వ్యవస్థ చుట్టూ
గోడల పక్క
నిర్మించుకొన్న స్వార్థం మూత్రశాలలు
పెరుగుతున్న జనజీవిత యాంత్రికత్వానికి
ఏమాత్రం సరిపోవు!
ఈ నాగరికత గోడల పొడుగునా
ఉర్వరమనే ఈ పవిత్ర భూమిపై
ఏమీ పట్టించుకోని జనుషాంధుల మూత్రం
దిక్కులేక
ప్రజారోగ్యశాఖల పంచన
నోరు తెరచి శూన్యాన్ని నింపుకొన్న శవం
ఎవరిదో
ఎందుకు చచ్చాడో
ఉచ్చలో ఊపిరి పీల్చి
పవిత్ర గంగాజలాన్ని ఎందుకు మింగలేదో ?
బ్రతుకుతున్న ఈ శవాలకు
నడుస్తున్న ఈ జంతువులకు
అంత చైతన్యమే వుంటే

ఎముకల్లో అంత బలమే వుంటే
ఈ కులాలు-మతాలు-రాజకీయాలు
మనుష్యుల్ని ఏనాడూ
స్వార్థపు ఉచ్చుకుండిలో తొక్కుతూ
కులాసాగ చెక్కభజనలు చేసేవికావు. ●

## బుద్ధక్షమ

**క్ష**మ క్షమ క్షమ
గడ్డి తినడానికీ ముడ్డి కడుక్కోడానికీ మాత్రమే
ఉపయోగిస్తున్న చేతులు రెంటినీ క్షమించడం

ఉద్యోగాలు అడుక్కోవడానికీ
అడుక్కున్నది నిలబెట్టుకోవడానికీ
ఇల్లనే గొయ్యి నుండి ఆఫీసనే గోరీలోకి
పర్‌ఫెక్టు శవంగా మోసుకుపోయే
కాళ్ళని రెండూ క్షమించడం

లఫంగ్ లంజాకొడుకులంతా
చిటికెలో లక్షాధికారులూ శాసనాధిపతులూ
నీతులు చెప్పడానికి మాత్రమే పుట్టినవాళ్ళుగా
ఊసరవెల్లులై వేదికలపై నిక్కుతున్నప్పుడు

పాకలోనివాడు ప్లాట్‌ఫారం మీదకి
రిక్షా నుండి టీబీలోకి
టీబీ నుండి కాన్సర్‌లోకి
పంచవర్షప్రణాళికల ప్రగతి ప్రకారం
అభివృద్ధి చెందుతున్నప్పుడు
ఇదంత ప్రకృతి లీలగా హేలగా
ఈ ఘోరకలి కర్మపరిపాకంగా అత్యంత సహజ పరిణామంగా
మనకెందుకులే ఇదంతా పై నొకడున్నాడనే
భారతదేశ సన్నాసి ముండాకొడుకుల
కుళ్ళు వేదాంతాన్ని పరమ పవిత్రంగా ప్రవహింపజేస్తూ
ప్రపంచ క్షణక్షణం కబేళాగా మారిపోతూంటే

నిప్పులు కురవకుండా అర్ధనిమీలితం నటిస్తున్న
ఈ కళ్ళని రెంటినీ క్షమించడం
బుసలుకొడుతూ నలుదిక్కులా నాల్కలతో
శరీరాన్ని తాకినంతనే దహించివేసే మంటలు కక్కే లావాతో
చీకట్లని పెళ్ళగించే అజేయాల్నాజ్ఞాపించే నూత్న తరాల్ని
సృష్టించవలసిన రక్తం
ఎముకల కలుగులో నీరసంగా జబ్బుతో ప్రవహిస్తున్నప్పుడు
దగ్గుతూ కక్కుకుంటున్నప్పుడు
ఎముకల్నీ ఎలకల్నీ ఇసక తినేసిన తొడల్నీ
పుట్టుకతోనే జారిపోయిన యీ జాతి రొమ్ముల్నీ
రంగూ రుచీ లేని పెదాల్నీ చంకల్నీ ఇతర సందుల్నీ క్షమించడం

కనీసం కంటికి కనబడే
అన్యాయాల్ని అక్రమాల్ని సమూలంగా నాశనంచేసే
తుఫానుల్ని భూకంపాల్ని వరదల్ని వడగాడ్పుల్ని
పురిగొల్పని యితర అవయవాల్నిన్నింటినీ క్షమించడం
బుద్ధా, ఇదేకదూ మనిషిని క్షమించడం అంటే
ఇదే క్షమించడం అయితే
రక్తసహజమైన పరవళ్ళని గుంజలకి కట్టేసి
విప్లవాలు కుక్కి మంచాల సంసారాల్లో పాతేసి
నాయకులు ప్రజల ముఖాలపై పోస్తున్న ఉచ్చని
కరుణరసంగా గతుకుతున్న యీ యువతరాన్ని
బీడీముక్కల్లా చెప్పు కింద సిగరెట్టు పీకల్లా
వంటింటి మసి పాతల్లా బతుకుతున్న యీ తరాల్ని
నేను క్షమించలేను
ప్రశ్నించడం చాతకాని అస్థిత్వాన్ని నేను క్షమించలేను

బుద్ధా! నువ్వూ నీ క్షమా నాకక్కర్లేదు
నువ్వొక్కడివే బోధికింద చావు! ●

## నరమాంసం రుచిమరిగి

**ఒ**రేయ్!
మీరంతా ఊరపందుల్లా బతుకుతున్నారు
భవిష్యత్తు గురించి ఆలోచనల్లేవు
వర్తమాన వక్రగతి పట్ల విమర్శలేదు
అంట్ల వెధవల్లా
మొగుడు చచ్చిన ముండల్లా
మొగుడు చాటు పోరంబోకు లంజల్లా
బతికున్న శవాల్లా
చచ్చు పీనుగులు
ఎందుకురా మీరంతా బతికి
ఒరేయ్!
కర్మసిద్ధాంతోపన్యాసుల్లారా!
సన్నాసుల్లారా!
దున్నపోతుల్లారా!
ఎందుకురా మీ బతుకులు?
పౌరుషం చచ్చీ
ఎవడెవడో వచ్చి
నిన్ను లాగి
నీ దేశంమీద
నీ బతుకుమీద
నీ పెళ్ళాం మీద
భయంకర పైశాచిక రతి సలుపుతుంటే

వెధవలాగ నోరెళ్ల బెట్టి నీతి వాక్యాలు బోధించి
పురుషత్వం చచ్చి
కొజ్జాల్లా
ఒరేయ్
మీరంతా డాఫరు మామలు
మీదంటూ మీకు బతుకు లేదు
గతంలో తలలు దూర్చి
వెలిగే సూర్యుణ్ణి చూడ నిరాకరించి
భవిష్యత్తుని శాసింప జూస్తున్న
నిప్పుకోళ్ళు
నిఖార్సైన అప్రాచ్యులు
ఎందుకురా ఈ గానుగెద్దు జీవితాలు ?
మీ జీవితాలు మీరఘోరించడంకూడా చేతకాని వాజమ్మలు
ఎందుకురా మీరు బ్రతికి
అరటిపండు ఒలిచి నమిలిపెట్టినా
అరాయించుకోలేని అగ్ని మాంద్యపు పీనుగులు
మీ కందరికీ మలబద్ధకం
మీ జీవితమే మలబద్ధకం
ఒరేయ్!
పేనుకి పెత్తనమిచ్చిన పెయ్యమ్మలూ!
మీ ఒంటిమీది చర్మంబులు బులాగ్గా ఒలిపించి
కారంపూసి
నిప్పులమీద దొర్లించి
మిమ్మల్ని తింటున్నార్రా! ●

## వుర్రేయ్ వెథవయ్యా!

**గా**ది కింద పందికొక్కు
ఊరికంత పెద్ద దిక్కు
నీనోట్లో- నానోట్లో
అందినోడి అంగుట్లో మట్టికుక్క
తన ఇంట్లో ఇనప్పెట్లో
ఆరి తెచ్చిన కావిడ్పెట్లో

బంగారం కుక్కు
బ్రహ్మంగారి సూత్రాలు
సుమత్యాది శతకాలు
భగవద్గీత శ్లోకాలు
శంకరుని భాష్యాలు
ఏకధాటి వల్లె వేసి
పుక్కిలించి ఉమ్మివేసి
గుడ్లురిమి చూసేసి
చిరునవ్వు బిగించేసి
పెద్ద చేయి పేద్దగా
నెత్తిమీద పెట్టేసి
తిరుగులాడు చిట్టిబాబు
సంఘంలో చెలామణీ
పెద్దమనిషి బడాబాబు
కల్లుతాగిన కోతిర!

తాండవ నృత్యం అన్నాదుర
తాగి తందనాలాడుర
మహాత్ముని సూత్రాలు
నిత్య పారాయణం చేసేసి
వంటింట్లో
నాలుగిళ్ళ చావిట్లో
సారా బట్టీ
సవ్యంగా కట్టేసి
చట్టానికి
నిర్మించిన చట్రానికి
చక్రవ్యూహం చుట్టేసి
నడివీధిలో రొమ్మిరిచిన పెద్దబాబు
అటు చూడర
ఆ పక్కన బద్దలైంది అగ్ని పర్వతం
ధినక ధినక తద్ధినక దినక
తప్పెట్లు తందనాలు
నడిరోడ్లో సంబరాలు
నీ చుట్టూ కంపరాలు
నీ గుండెల్లో గునపాలు
ఓటిచ్చిన బుల్లోడికి
ఒడ్డూ పొడుగూ పెద్దోడికి
ఒక్కసారి మొక్కేసి
మెలితిరిగిన మీసం
ఓర చూపుతో ఒడేసి
చిన్ననవ్వు చిత్రంగా

పంటిసంద్లో బిగించేసి
గెల్చినాక గంతులేసి
ఓటిచ్చినోడి కాళ్ళు పట్టేసీ
కిందగుంజి గొంతునొక్కి
కుక్క నవ్వు నవ్వేసి
నక్క ఏడ్పు ఏడ్చేసి
ఒక్క పెట్టు గోలచేసి
గోలుమాలు పెద్దబాబు
బందెల్‌దొడ్లొ పందికొక్కు
ధినక ధినక
ధిమ్మదిక్క చెమ్మ చెక్క
నాటుసార గొంతుబట్టె
జనం చెయ్యి దురదబెట్టె
వీపు కాస్త పగులగొట్టె
ఈ క్షణం నీకున్నది
మరో క్షణం
బతికుంటే బలుసాకు
పరుగెత్తు
కళ్లు తెరిచి కదం త్రొక్కి
జనమంతా పరుగునొచ్చె
లఘెత్తు
బంగారం దక్కలేదు
భమిడి పళ్లెం పత్తా లేదు
ఉరకలెత్తు
మీ ఇంటి పక్క మురిక్కాలవ

పక్కోడి పొలం నింపేసి
మీ ఆవిడ్ని ఏడు ప్రాకారాల మధ్య కూలేసి
ఏడు గ్రామాల్ని కాపలా ఏసి
పక్కోడి పెళ్ళాన్ని
ఎదురింటోడి పడుచు కూతుర్ని
పక్కలోకి లాగేసి
పరువంలో మింగేసి
ఊరోళ్ళ ఏటపోతులమ్మోరికి బలేసి
ఊరవతలమ్మోరిని నిలేసి
ఊరెక్కి ఊరేగిన పెద్దబాబు
నిజాన్ని ఉరితీసిన చిట్టిబాబు
మీ ఇంట్లో మంతనాలు
మీ పెద్దమ్మాయి జులపాలు
పక్కింటి బుల్లోడి మురిపాలు
నీలో
కుములుతున్న కములుతున్న
నువు సాకిన విషనాగులు విషకీలలు
నీ చుట్టూ మండుతున్న
దుశ్రేష్ఠులు బడబాగ్నులు
నిన్నే ముంచుతున్న
నువ్వే
నిర్మించిన పాలించిన బురదగుంటలు
ధినక ధినక తద్ధినక ధినక
నిజం నిజం
నీ తలకే కొరివిబెట్టె. ●

# నగ్నముని

## కనుదిక్

**చీ**కటి
చుట్టూ కళ్ళని సూదులు పొడుస్తూ చీకటి
ఒంటిని కాన్సర్ తింటూ చీకటి
మెదడ్ని అజ్ఞానంక్షయ చుట్టుకుంటూ చీకటి
నింగి ముంగాళ్ళపై కూచుని ఏడుస్తున్న చీకటి
జట్టు చీకటి – ఏడుపు చీకటి

నేల పొడుగునా తుప్పల చీకటి
రక్తం పీలుస్తూ చీకటి చలి మొసళ్ళ చీకటి
దెయ్యపుచెట్ల చీకటి – పిశాచపు ఊడల చీకటి
మర్రి చీకటి గూబ చీకటి
గుండెదారిలో చావుడప్పుల చీకటి
పాము కడుపులో కప్ప చీకటి
మూలుగు పేగులు తెంపే చీకటి
పడగ చీకటి బుసల చీకటి

కాళ్ళని చుట్టుకుంటూ చీకటి
విదిలించుకుంటూ నడక చీకటి
పాతాళ నూతుల ఆత్మహత్యల భవిష్యత్ చీకటి
తోడేళ్ళ అరుపుల వర్తమాన శ్మశాన చీకటి
మంత్రగప్పల చీకటి
మట్టిదిబ్బల చీకటి
రాకాసి మంటల గెంతుల చీకటి

జీవితాల్ని నూనెలో వేయిస్తున్న చీకటి
ఇనుపకాడలకు గుచ్చి కాలుస్తున్న మనిషి చీకుల కమురు చీకటి
శవాల సెగల ఊర్పుల చీకటి
చీకటిబజార్ల వెలిగే రాచ చీకటి

ఎముకల బొమికల కేకలపై నడుస్తున్న భవంతుల్లో ధనం చీకటి
పుర్రెల రాజ్యం నిండా ఓట్ల చీకటి
రాజధానుల్లో సింహాసనాల రంకు చీకటి
పల్లెల పట్టణాల మొలుస్తున్న జిల్లేళ్ళ చీకటి
తొండల చీకటి బల్లుల చీకటి జలగల చీకటి
నల్లుల చీకటి
రాచకీయ విషకన్య నరనరం చీకటి
పరిపాలన నిండా పగటిని తింటున్న చీకటి

స్కూళ్ళలో చీకటి
గుళ్ళలో చీకటి
మసీదుల్లో చీకటి
చర్చి ప్రార్థనల్లో చీకటి
బ్యాంకుల్లో చీకటి
బార్లలో చీకటి
స్టూడియోల్లో చీకటి
హోటళ్ళలో చీకటి
మేకప్ రూముల్లో చీకటి
బ్రేసరీల్లో చీకటి లంగాల్లో చీకటి
చెట్ల క్రింద ఎక్స్ట్రా చీకటి
వాల్‌పోస్టర్ల నిండా కారుతున్న చీకటి

సినిమా తెరపై కటిక చీకటి
క్యూలో కూరుకుపోయిన చీకటి
రేసుల్లో చీకటి
రేషన్ షాపుల్లో చీకటి
ఫుట్‌పాతుల్లో పారుతున్న చీకటి
రొట్టె కోసం లంగా ఎత్తిన చీకటి
పర్సుతో రొమ్ములు నలిపే చీకటి
పదవితో పర్మిట్లు నమిలే చీకటి
పదవితో పచ్చినెత్తురు తాగే చీకటి
పదవి ఉచ్ఛ గంగాజలంగా చల్లుతూ అచ్చు యంత్రాల చీకటి
పత్రికల్నిండా పెంట పురుగుల చీకటి
లౌడ్‌స్పీకర్ల కంఠంలో యిసక చీకటి
సభల్నిండా చీకటి
వేదికల చీకటి
వాగ్దానాల చీకటి
మాటల్నిండా నవ్వుల్నిండా తడిబట్టల చీకటి
పొగడ్తల చీకటి
పూలదండల చీకటి
ఫొటోల్నిండా చీకటి
వీధుల్లో పారుతున్న చీకటి
ఆఫీసుల్నిండా మురికి చీకటి
ఇళ్ళలో చీకటి
సంసారాల్లో చీకటి
గదుల్లో చీకటి
చీట్లాటలో చీకటి

బుడ్లలో గుడ్లలో చీకటి
పిరికితనం కంటున్న
మగ ఆడ పీనుగుల
చదువుకున్న పరువులపై చీకటి
గుడిశెల్లో చీకటి
రిక్షా లాగొచ్చిన తెగ తాగొచ్చిన చీకటి
కటిక నేలపై చీకటి
చెంపదెబ్బల్లో చీకటి
కొప్పుపట్టి యీడుస్తున్న చీకటి
కుంకం ఏడుస్తున్న చీకటి
నేలకి తలబాదుతూ చీకటి
చిరిగిన బరికిన రెవికలో
లాక్కున్న చిల్లరలో చీకటి
నీ యమ్మా నీయక్కా
బండబూతుల్లో చీకటి

మనుషుల్ని పశువుల మందగా
పీనుగులుగా మార్చిన స్వాతంత్ర్యపు చీకటి
సంక్షేమ రాజ్యపు బావుటా చీకటి
పెద్ద పెద్ద మాటల గ్రంథాల చీకటి
ప్రజల పేరుతో చలామణీ అవుతూ చీకటి
ప్రజల డబ్బుతో పెరుగుతున్న పాపంలా చీకటి
ప్రజల కోసమనే ప్రచారాల చీకటి
ఊళ్ళు పంచుకుతినే దొంగల ముఠాల చీకటి
కులాల పేరుతో హోదాల చీకటి

మతాల పేరుతో పీఠాల చీకటి
నదుల్నీ గర్భిణీ పొలాల్నీ కుళ్ళబెడుతూ చీకటి
మానవ మేధస్సును నంచుకుతింటున్న చీకటి
మనిషిని బతికుండగా పాతిపెడుతున్న
సిద్ధాంత రాద్ధాంతాల చిమ్మ చీకటి
చీకటి చీకటి చీకటి
చుట్టూ మానవత కళ్ళని సూదులు పొడుస్తూ చీకటి
ప్రజల కోటి కోట్ల ఆవేదన గొంతుల చీకటి చీల్చి పుట్టిన
సాయుధ విప్లవజ్వాలా కెరటాల కనుపాపా
నీ రెప్పల్ని కూడా నమ్మకు
చుట్టూ మిత్ర ద్రోహంలా చీకటి
జ్వలిస్తున్న కనుపాపా
ఆకాశాన్నంటే మంటలురాల్చు
స్వాతంత్ర్యం పేర
ప్రజాస్వామ్యం పేర సాగిన
నమ్మక ద్రోహాన్ని
నిలువునా కాల్చు. ●

# నగ్నముని

## పల్లెటిదిక్కులు

ఇక్కడ కప్పుకోడానికి రోడ్లూ లేవు
మునగదీసుకుంటే ఒంటికి చుట్టుకుంటున్నది పామో తాడో దీపాలూ లేవు
చర్మం మాత్రం యీదర గాలికి బిగిసి రంగులేని రక్తం పగులుతూంటుంది
ఉపాన్యాసాల సూదులు విసురిసురుగా కురుస్తూంటుంది అధికారంచలి
నెత్తిమీద వుంటేగింటే ఒక్క తాటాకూ
నెత్తికి చెప్పా పెట్టాకుండా పైన ఏ కన్నో కాస్త తెరుచుకున్నప్పుడు
భగభగా మండిపోతుంది
జుట్టు కసకసా కాలీ
ముక్కూ మొహం కొరకంచుగా మారి బతుకు శ్మశానమై యికిలిస్తుంది

అయినా నీళ్ళులేని గంటల కార్లొచ్చేది అయిదేళ్ళ కొకసారేగదా

తృప్తిగా ఒకళ్ళనొకళ్ళు చంపుకోడానికీ చీల్చుకోడానికీ
పుంతల్లో ముంతల్లో పగలూ కొడవళ్ళ గొడ్డళ్ళ పగలూ తీర్చుకోడానికీ
పొలాల్నిండా గంటల కార్లు చల్లిన గణగణగణాలు
ఓట్ల పంటలు పుష్కలంగా పండిస్తాయిగదా

పత్రికలెంతంత తమ ఒళ్ళు తార్చుకున్నా నాయకుల గొప్పతనానికి
వేదికలెంత పూలదండలు విరగబూసినా
మూకుళ్ళలో చిళ్ళ పెంకుల్లో
తినడానికి పెట్టింది ఆకలీ అజ్ఞానమే గదా

రక్తమూ మాంసమూ
సనసన్నటి నాజూకైన వాగ్దానాల గొట్టాల్తో పీల్చేశాక

తలకాయల్ని రోట్లో తాకట్టు పెట్టేశాక
మనుషులు శవాలుగాక మరేమవుతారు

ఎండల్లో బండల్లో
చర్మం మీద చర్మం ఎండబెట్టుకోవడం గాక

ఇంకేం చాతనవుతుంది ఆడ శవాలకీ మగ శవాలకీ
ఎండిపోయిన జాతి
పీక్కు తినబడిన జాతి
కాలిపోయిన జాతి
కమిలిపోయిన జాతి
కంపుగొడుతున్న జాతి
పిరికితనం గాక మరేమైనా కంటుందా? ●

# నగ్నముని

## డాలర్ వెన్నెల

బతికి వుండడం అంటే
ఉదయాస్తమయ రేకలుగా జీవితం క్షణ క్షణం పుయ్యడం
టీ కాఫీ విస్కీ అనేకానేక చిరు అనందాలు సైతం
ఆప్యాయంగా అంతరంగపు నిప్పు పెదవుల్తో సిప్ చెయ్యడం
ఝుల్లుమనే తరంగాల తరగలుగా
సంగీతపు పరిమళాకారాలుగా శిశువుల్ని చర్మపు సున్నితోద్రేకాలతో పలకడం
శిశువులు నీడనిచ్చే వృక్షాలుగా ప్రజలు కావడం
ఆలోచన అవయవాలు అవసరమైన ఆకాశాల్ని చదువుకోవడం
మనిషి మనిషి మధ్య ఎడారుల్ని దున్ని సిద్ధాంతాల సహనం పండించడం
అనిర్వచనీయ లోచనాలతో విశ్వాంతరాళాల్ని వెలిగించడం
ప్రపంచం ఒకే ప్రశ్నగా
కనిపించని ఆ రహస్య ముఖంగా ఊపిరి పీల్చడం
ఇదే మనిషి బతికి వుండడానికి సంకేతం

మృత్యువుని ప్రత్యక్షంగా చూడడం కోసం
బతికివున్న మనుషుల్ని వీధుల్లో ఇళ్ల లోగిళ్ళలో ఆఫీసుల్లో ఫ్యాక్టరీలలో దుకాణాలలో
చావు విత్తులు చల్లినట్లు గాలినుండి బాంబులు పేల్చి
ఫొటోలు తియ్యడం
అందమైన నునుపైన కాగితాల రంగు రంగు సంపుటాలు
అచ్చువేసుకుని గర్వించడం
కన్ను గీటడం తప్ప కెమేరాలు ప్రేమించలేవని
పేగులు కక్కున్న మనిషిని తిరిగి బతికించలేవని తెలుసుకోలేకపోవడం

మనిషి విసిరిన మారణాయుధం చివర మసిలో
బతికివుండిన మనిషి వున్నాడని గ్రహించకపోవడం

క్షమార్హం కాని యుగక్షణం

బతకడం అనేదానికి అర్థం లేదు
ఈ అజ్ఞాన కీటకం తొలుస్తున్నంతకాలం

దారుణాల్ని ఆపలేని
ఆకాశమంత ఎత్తున కట్టుకున్న చర్చీలు లేవెట్రీలు
అభయ హస్తాలూ అరణ్యాలు

బాంబులు మీటుతున్న గిటార్లనీ
మృత్యువుతో కన్ను కలుపుతున్న కెమేరాలనీ
బద్దలు కొట్టడానికి
డాలర్‌లోని పురుగు ప్రసరిస్తున్న పుర్రెల వెన్నెలతో వెలిగిపోతున్న
శ్మశానంలోకి వెడుతున్నాను

పురుగునుపట్టి నేలరాచేవరకూ మానవత్వం అనే పలుకే
పలకను ●

# నిఖిలేశ్వర్

## మనిషి మాంసం

ఆయుధ వ్యాపారస్తుల గిడ్డంగుల్లో
నల్ల మందు పక్కనే మెషిన్ గన్‌లు
మానవ మాంస విక్రేతల అంగళ్ళల్లో
ఉత్తర – దక్షిణ వీట్నాం ప్రజల మాంసం
పరవళ్ళు తొక్కుతున్న నెత్తురులో
సామ్రాజ్యవాదులు తినేవి
తెగినకాళ్ళూ – చేతులూ
దురహంకారులు నడిచేది
పుట్టగొడుగుల భూమి ●

# నిఖిలేశ్వర్

## మరిజువానా పొగ

చెట్ల క్రింద 'సియస్టా' ముద్రలో దక్షిణవీట్నాం
ఆకుల మాటున పొంచివున్న సైనికుల కాపలా
కాస్సేపట్లో మధ్యాహ్నపు కునుకు ముగుస్తుంది
సైగాన్ వీధుల్లో తృష్ణతో రేగే దుమ్ము
చీకటి శరీరాన్ని అంటుకొని ఆవులిస్తుంది
ఆవులింతల్లో అంగాంగాల అలసత్వంలో
సుళ్ళు సుళ్ళుగా మరిజువానా పొగ
మారణహోమానికి అలవడిన ప్రపంచం
పాశువిక ప్రవృత్తికి పడుతున్న పొగ
జారి జారి జారత్వంలో మైమరచిన జనానికి
కారికారి రక్తపాతాన్ని పులుముకొన్న దేశానికి
మనుష్యుల మమకారాలు విస్మరించే తతంగంలో
పాకుతోంది పరిసరాలపై మత్తుధూమం
తాగుతోంది ద్వేషాన్ని-కోపాన్ని-కుత్సితాన్ని

బైనెట్ బలం కింద ఎరుపెక్కిన కళ్ళు
జాతీయత దమ్ము ముందుకుతోసే వాళ్ళు
మనుష్యులుగా ఎవరైనా
అమెరికన్-వియత్కాంగ్ సైనికుల ఆత్మలు
ముళ్ళుముళ్ళుగా ముడివడిపోయి
కాలుతున్న యుద్ధానికి పావులుగా పనిముట్లుగా
అస్థిత్వాన్ని కోల్పోయిన మరిజువానా మనుష్యులు

హత్యకు-ఆత్మహత్యకు సన్ననిగీతను చెరిపివేసే
సమర మార్గంలో
స్ప్రుహతప్పి తల్లడిల్లే పొగ
ముందుకుతోస్తుంది నర దాహాన్ని
కప్పుతోంది ఉవ్వెత్తున పొరలు కమ్ముకొని

కప్పుకొన్న పొరల్లో అర్థంలేదు
ఆర్తనాదాలకు-అహింసావాదాలకు
విచక్షణలేని మత్తుమందు మండుతోంది
సిద్ధాంతాల తేడా లేకుండా
పొగలు పొగలుగా అలుముకొన్న సమస్యలో
ఎవరూ దక్కరు-ఎవరి ప్రతిష్టా మిగలదు. ●

# నిఖిలేశ్వర్

## విధ్వంస రాగం

అవ్యక్తంగా అచేతనంగా రోజూ
ఈ శరీరంలోని అణువులు
మూలుగుతూ ఆర్తనాదం చేయలేక
భూగోళం మూలల్లో లేస్తున్న
వీట్నాం ఆర్తిని
కళ్ళారా చెవులారా చూచి చూచి
ఘోషించే ఆత్మల అరణ్యంలో
తప్పిపోయిన నేను

నుసిగా మిగిలిన శరీరాలపై
పారుతున్న రక్తం మడుగులోంచి
ఒక తల్లి చంకలో
సిద్ధాంతాల గంట్లుపడని పసిపాప
మంచీచెడూ తెలియని మరో ఇద్దరు పిల్లలు
నడుస్తున్న భయక్రాంత విహ్వాలమైన ముఖాలు
ప్రతిఫలించిన పృథ్వీ నిర్మలత్వపు నిస్సహాయత
తలలపై రాజీపడని రాక్షస విమానాలు
మోగిస్తున్న విధ్వంసరాగాల రంపపుకోత
మరోకోనలో కానలో కంపించింది
పోప్ శాంతిగీతం
మరో మలుపు తిరిగింది
మనుష్యుల దేహాల కాలిన కమురుకంపు

తాము పుట్టని దేశంకోసం
ఎరగని సోదరుల ప్రాణం కోసం
వేనవేలుగా వీట్నాం మట్టిలో కలిసిన
కోపంతో –క్రౌర్యంతో అమెరికన్ సైనికులు
స్వేచ్ఛామృత బిందువులు
స్నాయువుల్లో పారాలని
రక్తం చిందిస్తున్న వియత్కాంగ్‌లు
ఏ దేశం ఏ సహాయం ఎందుకు చేస్తున్నదో
అర్థంకాని
దిక్కులేని దైన్యపు కన్నీళ్ళ వియత్నాం. ●

## జిఘాంస

ఇప్పుడు జిఘాంస ప్రవహిస్తున్నది
నాగరిక దేశాల సిరల్లో

బర్బర జాతులు సిగ్గుపడుతున్నవి
సభ్యదేశాల పాశవిక ప్రవృత్తికి
ఎవరినో ఉద్ధరిస్తాననే నెపంతో
నెత్తురు గోళ్ళు
చించుతున్నాయి భూగోళం గుండెను

అమెరికా నుండి వీట్నాం పొడుగునా
ఆయుధాల శవాలు ఊరేగుతుండగా
శవపూజకు శివమెత్తిన
సామ్రాజ్యకాంక్ష చుట్టూ మంటలు రేగుతున్నాయి
ఏ అమానుష విధానమైనా
అధికారం తలకు చుట్టుకోవాలనే
నాసిరకం రాజకీయవేత్తలే భూమిసొంతం

దేవుడి బిడ్డల్ని ఉద్ధరిస్తామని
మతం కైపుతో
బిడ్డల్ని ఊచకోత కోసిన వాళ్ళు
దేవుడి తాబేదార్లు
కలసిపోయారు శూన్యంలో దేవుడితోపాటే
ఇప్పుడు బట్టలు విప్పి
జంతువు గంతులు వేస్తున్నది

తన వొంపులు చూసుకొని
పిచ్చిగా శ్మశానంలో పరిగెడుతున్నది
సిరల్లో ఇంకిన హత్యా ప్రవృత్తి
ఆయుధాల గుండెల్లో దట్టించి
వియత్నాంపై నెత్తురు పోసినా
మనుషులే ఆయుధాలను లొంగదీసి
జిఘాంస సమాధిపై పేరుస్తారు. ●

# చెరబండరాజు

## కన్నీళ్లేనా?

**క**న్నీళ్లేనా పెట్టుకునేది నీలో నీ తరంలో ఇంకేమీ లేదా?
దారుణాతి దారుణ దారుణంగా దారపు పోగుల్లా
తెగిపడుతున్న పచ్చని చెట్ల ప్రాణాల్ని చూస్తూ
నిర్లిప్తంగా నించోటానికేనా
ఏ సరిహద్దుల శాసన సర్పాలు
నీ పాదాల్ని బంధిస్తున్నాయ్
ఏ శిఖండి ప్రభుత్వాలు
నీ చేతుల్ని వంచిస్తున్నాయ్
ఏ భయసముద్ర తిమింగలాలు
నీ శాంతి నౌకల్ని మింగేస్తున్నాయ్
ధన లోభానికి పురుగులు మేసే
ఏ వార్తా పత్రికలు
నీ రక్తాక్షరాల్ని విరిచేస్తున్నాయ్
కన్నీళ్ళేనా పెట్టుకునేది నీలో నీ తరంలో ఇంకేమీ లేదా. ●

## ఆపండి ఆర్కెస్ట్రాని ఆర్పండి కాగడాల్ని

ఈ చౌరస్తాలోనే యాక్సిడెంట్ జరిగింది
అప్పుడే మతిభ్రమించింది
అక్కణ్ణుంచే కథ మొదలైంది

నా పేరూ వూరు మర్చిపోయి నా ఆకారం మారిపోయి నన్ను నేను కోల్పోయి
ఈ పిచ్చాసుపత్రి కుక్కిమంచం మీద ఒంటరినై కళ్ళువిప్పినరోజు
చీకటి సముద్రం హోరులో ఎక్కడో ఎప్పుడో తప్పిపోయింది ఆత్మ
నేను పుట్టకముందే
మిట్ట మధ్యాహ్నం మండుటెండలో
మార్కెట్లో పెట్టి అమ్మారు శిరాన్ని ఖండించి
యవ్వనంలో పండిన గుండెకాయని
రాళ్ళతో కొట్టి మట్టిలో కలిపారు

బుద్ధిబ్రోతల్ హౌస్‌లో సుఖవ్యాధుల్తో మూలిగి మూలిగి చచ్చింది
నరాల్నీ కండరాన్నీ రక్తాన్నీ యావజ్జీవ కారాగారంలో పెట్టి
నిర్జీవంగా
నిస్సహాయంగా
వొరిగిపోయాను ఈ ఫుట్‌పాత్ మీద
ఆపండి ఆర్కెస్ట్రాని
ఆర్పండి కాగడాల్ని

ఇప్పుడు మీ మొహాల్ని చూశ్ళేను
మండే ఎడార్ల లోంచి ఏడ్చే అరణ్యాల్లోంచి

మాంసపు గుహల్లోంచి
దుర్గంధవీర్యంతో తడిసిన శతాబ్దాల మీంచి
ఇంక మోయలేను ఈ దేవుళ్ళనీ ఉద్గ్రంథాల్నీ
ఇంక మోయలేను ఈ జైళ్ళనీ సంకెళ్ళనీ శాసనాల్నీ
ఇంక మోయలేను ఈ యుద్ధాల్నీ బీటలెత్తిన చరిత్రనీ

ఏమీలేదు ఏమీలేదు

ఆకలి దాహం దుఃఖం దైన్యం దరిద్రం నీచత్వం మృత్యువుతప్ప మరేమీ లేదు

అంధకారం ప్రేతాత్మల హాహాకారం తప్ప మరేమీ లేదు
కాలుతున్న కళేబరాల కమురువాసనతప్ప మరేమీలేదు

చెప్పు
ఇప్పుడన్నా నిజం చెప్పు

పోనీ దయుంచి
ఈ దిక్కుమాలిన శవంమీద ఆకాశాన్ని కప్పు ●

# మహాస్వప్న

మురిగిన సూర్యుణ్ణి నంజుకుంటూ
మృత్యువుని కాస్తకాస్తగా కొరుక్కుతిన్నాను

**రొం**డోసారి పిచ్చెత్తి
అర్ధరాత్రి విజిళ్ళూదాను గొలుసుల్లాగాను ఎర్రజండాలూపాను
పుర్రెనీ రెండెముకల్నీ పట్టుకొని చౌరస్తాలో నిలబడ్డాను
రెండుకోతుల్ని బుజానెక్కించుకొని బజార్లంట తిరిగాను
చిలకజోస్యాలుచెప్పాను రామజోగి మందుల్ని
సుజనులకు పంచాను పేవ్‌మెంట్లమీద గారడీలు చేశాను

నిజమే
రెండోసారి పిచ్చెత్తి
కార్చిచ్చులో పిచ్చికుక్కలా కనిపించిన ప్రతివాణ్ణి కారుకూతలు కూశాను

రోడ్లు రోడ్లన్నీ తిరిగేసి
రోడ్లప్రక్కన నాగరికతరాసిన ఫుట్‌పాత్‌లకి ఫుట్‌నోట్స్ రాశాను
చెత్తకుండీల్లో మురుగ్గుంటల్లో రీసెర్చి చేశాను
దేవళాలమీద డాక్ బంగళాలమీద చర్చీలమీద క్లబ్బులమీద
మసీదులమీద లాడ్జింగులమీద బూతుబొమ్మలు గీశాను
సినిమా చూళ్ళేక థియేటర్లో తెరకడ్డంగా నిలబడ్డాను
పక్షుల జంతువుల మృగాల బొమ్మల్తో నిండిన
ఈ ఒకటోతరగతి వాచకాన్ని చించి గాల్లోకి విసిరేశాను
మల్లెపూలమీద మందహాసాలమీద వాంతిచేసుకున్నాను
రాజకీయాల్లో ధర్మశాస్త్రాల్లో వీర్యస్ఖలనం చేసుకున్నాను

వెన్నెలమీద వుమ్మేసి చంద్రుణ్ని నక్షత్రాల్నీ
గ్రహాల్నీ రాళ్ళతో కొట్టాను

భూగోళాన్ని శిశ్నశిఖరాగ్రంమీద నిలబెట్టాను

చెట్లగుబురుల్లో గూబలా తీతువులా కీచురాయిలా
గీ పెట్టి భయపెట్టింది నేనే
పాతాళవాణిలో భూతాలుపాడిన గీతాల్ని ప్రసారంచేసింది నేనే
భగభగమంటల్తో నగరం తగలబడి పోతున్నట్లు
నిర్వికల్ప సమాధిలో నిదర్శించి నిర్భరానందంలో తాండవం చేసింది నేనే

ఏదో వుందని
ఏమో అవుతుందని
కుళ్లిన శవాలమీద గోరీలమీద దుర్గంధవీధుల్లో నడిచి నడిచి
రాత్రిరాత్రంతా బీటుపోలీసులా కాపలా కాసి కాసి
జాగారం చేసి చేసి అలసిపోయాను
చీలికలు పేలికలై నా మీద వ్రేలాడుతున్న చింపిరి జీవితం మురికిబొంతను
శిలువకు తగిలించి
ఇక్కడే
ఈ చౌరస్తాలో సిగరెట్ల అంపశయ్యపై
ఆకలిని ఆవిష్కరించాను
సారాసముద్రాలు ఇంకిన కళ్ళతో
మురిగిన సూర్యుణ్ణి నంజుకుంటూ
మృత్యువుని కాస్త కాస్త కొరుక్కుతిన్నాను. ●

# నగ్నముని

## నీతిరచయితల బూతుగ్రంథం

**12** గంటల అర్ధరాత్రి రేకలు తోసుకొని మేల్కొన్నది
రోజు రాలి రోజు జన్మిస్తున్నది
నిండైన కెరటం మొలుస్తున్న చోట రాత్రి పేగులు తెగుతున్న చోట
దిగంబర సంతతి రోడ్ల కన్నులపై తిరుగుతున్నది

మెదళ్ళు మేల్కొంటున్నవి
చేతులు మేల్కొంటున్న
కండరాలు మేల్కొంటున్నవి
రక్తంలో మంటలు మేల్కొంటున్నవి
గాలి నాలుకులు ఉవ్వెత్తున మేల్కొంటున్నవి
దిగంబర దిక్కుల కంఠాలు విసిరిన పిలుపులకు ప్రతిజ్వాలలుగా
చిక్కని వీర్యాణువులన్నీ ఒక్కసారి జనపుష్పంలో మేల్కొంటున్నవి

తుఫానుకు ముందు వీస్తున్న శవ ప్రశాంతిలా
నీతి రచయితల బూతు గ్రంథంచుట్టూ
పాత సమాధుల గుండెలు గుబగుబా రెపరెపా కొట్టుకుంటున్నవి

నీతి రచయితలు జీవితాంతం కష్టించి
రాత్రింబవళ్ళ కళ్ళ వత్తులతో ఆలోచనలు దున్ని
రత్నాల రాలుబడికోసమే మేఘాలు కాచారు
ప్రతి అక్షరం నీతివైపు మనిషిని తిప్పుతుందని
నిజాయితీ గీటురాయిగా ప్రకాశిస్తుందని
నీతిరచయితలు గట్టి అట్టలగ్రంథం కుట్టిపెట్టారు
ముళ్ళులేని గడియారాలలో కళ్ళుగుచ్చి
తారాబలం చంద్రబలం జాగ్రత్తగా లెక్కక

శాస్త్ర ప్రకారం కార్యంచేస్తే
పిల్లి పిల్లలూ బల్లి పిల్లలూ పుట్టినట్టు
వీర్యబలంలేని నీతిరచయితల గ్రంథం
సంసారి కావలసింది
సాక్షాత్తూ వ్యభిచారిగా మారిపోయింది
నీతిగ్రంథం చివరికి
బూతుగ్రంథంగా చలామణి అయిపోయింది

ముష్టివాళ్ళకి భూతదయతో కడుపులు చేసే కారులవాళ్ళు
మేడలవాళ్లు పెద్ద పెద్ద వ్యాపారాలవాళ్ళు
నీతి గ్రంథంలోని ప్రతిపదం పారాయణం చేశారు
కంఠతావొచ్చాక
వెనకనుంచి ముందుకు ముందునుంచి పక్కకు
చిక్కగా పదాల్ని మెలిపెట్టడం తెలిశాక
ప్రతి పదానికీ మీసాలు పెట్టి నవ్వుకున్నారు
బొక్కలు పొడిచి పొడిచి చూపుడు వేళ్ళతో పరువుల సుఖంపై బోర్లపడ్డారు

నరాలతీపు హెచ్చినప్పుడు ముష్టి చర్మాలు దొరకనప్పుడు
ఇష్ట మొచ్చిన పేజీతెరిచి అందులో అవయవాన్ని కుక్కారు
కక్కికక్కి పేజీలు చింపి ఖరాబుతో దేశాన్ని లేవెత్రీ చేశారు
క్రమక్రమంగా అడివి జంతువులనుండి మనుషుల్ని రక్షించవలసిన గ్రంథం
భూతదెయ్యాల రంకులకి బొంకులు
సమకూర్చేదిగా మారిపోయింది
కలుగులు కలుగులుగా బొక్కలు బొక్కలుగా తూట్లుపడి
ఇనపగోడనుకున్నది తడిక కంటే హీనంగా మారిపోయింది

పాతరోజు తెంపి 12 గంటల అర్ధరాత్రి మేల్కొన్నది
మెదళ్ళు మేల్కొంటున్నవి
చేతులు మేల్కొంటున్నవి

కండరాలు మేల్కొంటున్నవి

కంఠాలు మేల్కొంటున్నవి
రక్తంలో మంటలు మేల్కొంటున్నవి
తప్పించుక తిరుగుతున్న
సందులు గొందులు దొంగ చూపులు కనిపెడుతూ
దిగంబర సంతతి తిరుగుతున్నది

ఎలకలు జాగ్రత్త పడుతున్నవి
పందికొక్కులు జాగ్రత్తపడుతున్నవి
భూతదెయ్యాలు జాగ్రత్తపడుతున్నవి
అడవి జంతువులు జాగ్రత్తపడుతున్నవి
తోలుబొమ్మలు జాగ్రత్తపడుతున్నవి
తోలుతిత్తులు జాగ్రత్తపడుతున్నవి

కొత్తరోజును పాతరాత్రినుండి చీలుస్తూ
దిగంబర సంతతి ఒకేకన్నుగా తిరుగుతున్నది

చూపులు కూడేచోట
కార్లన్నీ మేడల్ని బొజ్జల్నీ వాటాల్నీ హోదాల్నీ పదవుల్నీ
పంగనామాల్నీ
ఆస్థుల్నీ అభిషేకాల్నీ
సందుల్లో గొందుల్లో తోలుబొక్కల్లోనుండి
తరుముకొచ్చి ఉరుముకొచ్చి
తూట్లుపడేట్లు కాల్చిచంపే సమయం
ఆసన్నమవుతున్నది

ఆకాశమంత ఎత్తున గాలినాలుకల్లో
నీతిగ్రంథం వాడవాడలా తగలబడే క్షణం
సమీపిస్తున్నది. ●

# నగ్నముని

## కుష్ఠురోగి

నీ రోగం మీద నాకు జాలిలేదు
నీ రోగం జాతిజాతంతా అల్లుకుంటున్ననాడు
నిన్ను కాల్చి చంపడానికి వెనుకాడే వాడినికాదు

సూటిగా అడుగుతున్నాను చెప్పు
భయంలేదు నిన్నిక్కడ ఎవరూ ఆనవాలు పట్టలేరు
నీ వ్యాపారాలకి ఇక్కడ ఎవరూ అడ్డంరారు
లోకంలో నువ్వెంత గొప్పవాడిగా చలామణీ అవుతున్నావో
పాపం యిక్కడ ఎవరికీ తెలీదు

నిర్భయంగా చెప్పు
జీవితంలో మొదటిసారి నిజం చెప్పు
మళ్ళీ నేను నీకీ సమయం యిచ్చే అవకాశం రాకపోవచ్చు

ఎక్కడ బతుకుతున్నావు నువ్వు?
ధనం కుష్ఠురసి మీదా హోదాల రాచపుళ్ళ మీదా
పీనుగు పెంటల అలగాజనం రాస్త్రాలమీదా
మధ్య తరగతిని తినేస్తున్న ప్రామిసరీ నోటుమీదా

ఎక్కడ ఎంగిలి గుతుకుతున్నావు నువ్వు?
సంక్షేమ పూజ్యంలోనా సంక్ష్యోభ రాజ్యంలోనా
సన్నాసుల మఠంలోనా ఆడశవాలనమ్మే సంతలోనా

ఎక్కడ మెతుకులేరుకుంటున్నావు?
ఎన్ని ప్రాణాలమీద రోజూ కునుకు తీస్తున్నావు

చదువు సంస్కారాల పేరుతో ఎన్ని రోగాలు తగుల్చుకున్నావు
ముంతదాపుళ్ళు వద్దు
డొంక తిరుగుళ్ళు వద్దు
ఉవాచ వద్దు
ఉపన్యాసం వద్దు
నిలిచి చెప్పు
ఒక్కసారైనా నిజం చెప్పు

నిన్నరాత్రి ఎన్నిగంటలకి తిరిగి
నీ పెళ్ళాన్ని వాడిమేడ నుండి ఇంటికి తీసుకొచ్చావు?
నీ వలలో పడ్డారని ఎంత గర్వంగా బుడ్డిముందు నవ్వుకున్నావు

ఇంకా ఎన్ని పర్మిట్లు సంపాదిస్తావు
ఇంకా ఎన్ని కొత్త కొత్త వ్యాపారాల బోనులు తెరుస్తావు
ఇంకా ఎన్ని బోర్డులు రంగురంగులవి రాయిస్తావు
ఇంకా ఎన్ని వాటాలు కొంటావు
ఇంకా ఎన్ని ద్రాక్షతోటలు వేస్తావు
ఇంకా నీ పేర నీకు పుట్టబోయేవారిపేర
ఎన్ని మేడలూ గోడలూ కడతావు?
ఇంకా ఎన్ని కార్లనీ అల్లుళ్లనీ కంపెనీల్నీ కొంటావు
ఇంకా ఎన్ని ఫారిన్‌సీసాల్నీ
విప్పెయ్యడానికి కట్టుకున్న కోకల్ని స్టాకు చేస్తావు?
ఇంకా ఎన్నిరకాలైన వినయవిధేయతల్నీ పార్టీల్నీ
మర్యాదల్నీ మన్ననల్నీ ఆశ్రయింపుల్నీ అలవర్చుకుంటావు
ఇంకా ఎన్నిసార్లు మనిషిమాంసం బిరియానీతో నీ బొజ్జ నిమురుతావు
ఇంకా ఎన్నిసార్లు పెద్దమనుషుల ఆకలి నీ పెళ్ళాంతో తీరుస్తావు

నిన్నరాత్రి ఎన్నిగంటలకి తిరిగి నీ పెళ్ళాన్ని
వాడిమేడనుండి ఇంటికి తీసుకొచ్చావు
గడియారాలకి ముళ్ళుతప్ప కళ్ళులేకపోవచ్చు
కార్లకి పరుగుతప్ప అలుపులేకపోవచ్చు
రోడ్లకి మజిలీలుతప్ప గమ్యం లేకపోవచ్చు
మేడలుపైకి చూడడంతప్ప కిందికి చూడలేకపోవచ్చు

సృష్టిరహస్యం 'వున్న నాలుగు క్షణాలు సుఖమయం చేసుకోవడం'
అని నీ చదువు సంస్కారాలకి నువ్వు యిచ్చుకునే అర్థాలు
నీకు కాసేపు

ఆ చుక్క నాలికమీదవున్న కాసేపూ సంతృప్తి కలిగించవచ్చు
పదవీమదం కారుతున్న కాసేపూ వుండవచ్చు

సూటిగా కళ్ళలోకి చూసి చెప్పు
నిజం చెప్పు
నువ్వు హాయిగా నిద్రపోయి ఎంతకాలమైంది
నువ్వు నీ నీడకి భయపడని క్షణాలు ఎన్నివున్నాయి
పదిమందిలో గొప్పవాడివిగా
ఒంటరిగా దౌర్భాగ్యుడిలా పందిలా
ముక్కుతూ రొప్పుతూ
నీ బురదగుంట గదిలో తిరిగిన సమయాలెన్ని వున్నాయి

నిర్భయంగా చెప్పు
ఒక్కసారైనా నిజంచెప్పు
నీలోవున్న వాడుకూడా గిలగిలా తన్నుకు చచ్చాడా
వాడిని చంపే యీ వ్యాపారంలోకి దిగావా

నిజంచెప్పు

పెద్దపెద్దబంగళాల బాంక్ బాలెన్స్ అల్లుళ్ళ వేటలో
ఫలానాఫలానావారి తాలూకా ఫలానా వారికోసం
సరదాలుమప్పి ఒంటరిసమయాలు స్వయంగా యిచ్చి
ఎన్నిసార్లు నీకూతురికి కడుపు దింపించావు
ఇంకా ఎంతడబ్బున్న వాడు రావాలని ప్రయత్నించావు
ఈ వ్యాపారంలో ఏ వాటా ఎంతకావాలని ఎదురు చూస్తున్నావు
ఇంకా ఎంతపెద్ద గేదెలా
నీ ఫోటో పేపర్ల పడాలని ప్రయత్నిస్తున్నావు
ఇంకా ఎంతమందిని కూడగట్టుకుందామని కులం పేరు చెబుతున్నావు
ఇంకా ఎంతమందిని నలపాలని నలిపించుకోవాలని లిస్టు వేసుకున్నావు
ఎన్నిసార్లు నీ నౌకర్లని తన్ని నీ విధవ చెల్లెలికి కడుపు దింపించావు
ఎన్నిసార్లు నీ హోదాతో భయపెట్టి కొడుకులికి మార్కులేయించావు
ఎన్నిసార్లు వాళ్ళని పైకి తొయ్యడానికి పడరానిపాట్లు పడ్డావు
ఎన్నిసార్లు నీ వెధవ పనులకి నీ బామ్మరుదుల పనులకీ
ప్రజల డబ్బుతో టెలిఫోన్లూ టెలిగ్రామ్లూ వాడుకున్నావు

ఎన్నిసార్లు పని అవుతుందని తెలియగానే
అవతలివాడితో ఆ కులమత పెద్ద కొజ్జాతో
టాక్సీలో వెళ్ళి నువ్వే వాడికింద పడుకున్నావు
నిన్ను వాడు భౌతికంగా విషయిస్తుంటే
నీ రొమ్ములు పిసుకుతుంటే
నీ సహకారానికి
నా లంజా! అని నిన్ను ముద్దాడుతుంటే
సిగ్గునభినయించావు

వేదికలపై నీతిబోధలుచేస్తూ వల్లించి వల్లించి మంత్రాలు
ఎన్నిసార్లు నీ సొంతపనులకు నువ్వేవాటిని కత్తులతో పొడిచావు

నిర్భయంగా చెప్పు
ఒక్కసారి నిజం చెప్పు
నీ బాబు ఎందుకోసం ఎవరికోసం జైలు కెళ్ళాడు
నీ బాబు ఎందుకోసం ఎవరికోసం పదవి విసర్జించాడు
నీ బాబు ఎందుకోసం ఎవరికోసం ఆస్తులమ్మాడు
నీ బాబు ఎందుకోసం ఎవరికోసం లాఠీలకు వీపునిచ్చాడు
నీ బాబు ఎందుకోసం ఎవరికోసం విదేశీ వస్త్రాలు కాల్చాడు
నీ బాబు  ఎందుకోసం ఎవరికోసం నీ పెదవులు పలుకలేని త్యాగాలు చేశాడు
నీ బాబు  ఎందుకోసం తూటాలకి గుండెలిచ్చాడు
నిజం చెప్పు
ఎక్కడ బతుకుతున్నావు నువ్వు
ప్రజాస్వామ్యం పేర సాగే వ్యభిచారగృహంలోనా
స్వరాజ్యంపేర సాధించుకున్న సుఖవ్యాధుల తోలుబొక్కలోనా
ఎంతమంది గొంతులు చిరునవ్వుల్తో నమిలి
యీ మేడల్లో ఊపిరి పీలుస్తున్నావు
ఎంతమంది త్యాగమూర్తుల
ఇంకా ఆరని చితులకి అర్థంలేదని నిరూపిస్తున్నావు
నిజం చెప్పు
నిన్ను రోడ్డుమీదకి
పిచ్చికుక్కలా తరుముకొచ్చి
ప్రజలు కాల్చకముందే
కర్రలతో బరిసెలతో పొడవకముందే
నిజం చెప్పు
మళ్ళీ నీకీ అవకాశం రాదు
నిజం కక్కు ●

# నగ్నముని

## దిగంబరం కావాలి

దిగంబరం కావాలి
దిగంబరం దిగంబరం కావాలి
దిగంబర దిగంబరం దిగంబరం కావాలి
గర్వంగా మొలిచిన ప్రతి శిరస్సుమీదా
నిక్కబొడిచిన ప్రతి వెంట్రుకా దిగంబరం కావాలి
శవాలు తేలే కుళ్ళు బావులు కళ్ళు దిగంబరం కావాలి
చెమట్లుపండే చేనునుదురు దిగంబరం కావాలి
పువ్వులూ కాయలూ కాయని పూయని పొదలు కనుబొమలు
దిగంబరం కావాలి
అసత్యాలకు వ్రేలాడే గబ్బిలాలు చెవులు దిగంబరం కావాలి
లోపల జిల్లేళ్ళు వెంట్రుక మొలకలు దిగంబరం కావాలి
వంకరదార్లు చూపడం మరిగిన ముక్కు దిగంబరం కావాలి
ముక్కుగుహల్లో డబ్బు పెంటకుప్పల పడిశం ముద్దలు దిగంబరం కావాలి
సందులు మూతులు దిగంబరం కావాలి
బోదురు కప్పలు పెదవులు దిగంబరం కావాలి
అశుద్ధంలో దిగబడే పళ్ళు దిగంబరం కావాలి
రెండుగా పన్నెండుగా చీలే నాలుకలు దిగంబరం కావాలి
మొలిచిన మొలవనిగడ్డ గడ్డం దిగంబరం కావాలి
పదివేళ్ళూ నాటిన చెంపలు దిగంబరం కావాలి
సీనా రేకుల తడికల మైకుల కంఠం దిగంబరం కావాలి
ఫైళ్ళనీ పిరికితనాన్నీ తరతరాలుగా మోసే బుజాలు దిగంబరం కావాలి

అవతలివాడి అవయవం నలిపే చేతులు రెండూ దిగంబరం కావాలి
ఉంగరాల వేళ్ళు దిగంబరం కావాలి
బురదగడ్డలు సెగ్గెడ్డలు వక్షాలు దిగంబరం కావాలి
పాలులేని
పాలిపోయిన రొమ్ములు దిగంబరం కావాలి
వేళ్ళు పిలిచినా పలకని రొమ్మొనలు దిగంబరం కావాలి
లోకం పెంటనంతా పడేసుకున్న
పెద్ద పెంటకుప్పబొజ్జ దిగంబరం కావాలి
సుఖం బిరడా బొడ్డు దిగంబరం కావాలి
బొడ్డుకింద గడ్డివాములు దిగంబరం కావాలి
నిలవ నీటికంపు ఊట బిలం దిగంబరం కావాలి
తుప్పుపట్టిన గునపం దిగంబరం కావాలి
చవిటి పర్రలు తొడలూ పిర్రలూ దిగంబరం కావాలి
తిరుపతి కొండలెక్కే మోకాళ్ళు దిగంబరం కావాలి
పిరికిపందల్నీ జబ్బు వెధవల్నీ మోసే పాదాలు దిగంబరం కావాలి
ఇనప్పెట్టల్నీ పదవుల ముట్టుబట్టల్నీ మోసే కాళ్ళు దిగంబరం కావాలి

చర్మం దిగంబరం కావాలి
సిరలు దిగంబరం కావాలి
ధమనులు దిగంబరం కావాలి
చీమూనెత్తురూ దిగంబరం కావాలి
సిగ్గూ శరమూ దిగంబరం కావాలి
నేల దిగంబరం కావాలి
నింగి దిగంబరం కావాలి
ఆడదయితే దిగంబరం కావాలి

మొగాడయితే దిగంబరం కావాలి
ప్రజలు దిగంబరం కావాలి
దేశాలు దిగంబరం కావాలి
మతాలూ ఇజాలూ దిగంబరం కావాలి
యంత్రాలనట్లూ నాగరికతల పటకార్లూ దిగంబరం కావాలి
భజంత్రీలూ బాంబులూ దిగంబరం కావాలి
పెళ్ళిళ్ళూ చావులూ రోగాలూ రొంపలూ దిగంబరం కావాలి
పరిసరాలన్నీ దిగంబరం కావాలి
ప్రపంచం దిగంబరం కావాలి
విశ్వం దిగంబరం కావాలి
ఒరే పశువా!
మొట్టమొదట
చిట్టచివరి కొమ్మన
మనసు దిగంబరం కావాలి ●

## నగ్నశిశువు

ఎవరికీ అక్కర్లేని ఆత్మల్ని
శిశువులు శిశువులుగా విసిరేస్తున్నా రెవరో యీ లోకంలోకి
నల్లటి సొరంగాల్లోంచి రహస్యాల్లోంచి పొగలోంచి పొరల్లోంచి
కార్చిచ్చులోంచి లావా సెగల్లోంచి కొట్టుకొచ్చాం మనందరం

ఎవరికి మాత్రం తెలుసు
మన తల్లెవరో తండ్రెవరో కోరికెవరో కారణమెవరో
నీటికి మాత్రం నిప్పుకి మాత్రం ఏం తెలుసు
అందుకే దిక్కులేని మొక్కులేని అనాథల నాదులుగా
ఆక్రందిస్తూ బుగులు బొగులుగా పెరుగుతున్నాం ప్రపంచం
తెలుసుకోడాని కేవేవో చేస్తున్నాం పరంపర ప్రయత్నాలు
తెలుసుకోవడం తెలుసుకోవడ మెందుకో
పలుకుతున్నా మేమేమో ప్రగల్భాలు

కాళ్లులేని స్కూళ్లు
కడుపు కతకని కాలేజీలు
జ్ఞానగర్భ స్రావాలు విశ్వవిద్యాలయాలు
చదువులు చదువులు చదువులు

కళ్ళని పొడిచి బలవంతంగా
గుడ్డివాణ్ణి అవిటివాణ్ణి చేసే చదువులు
మెయిన్ రోడ్డు కాకుండా జీవితం
సందుల్లో గొందుల్లో
అణిగిపోయి మణిగిపోయి
భయస్థుడిగా నేరస్థుడిగా

వొంగి తిరగడం గాక చదువులు నేర్పిందేమిటి
అయినా ఎవరు మాత్రం ఏం చెయ్యగలరు
తెచ్చుకున్నదిగాక ఎవరు మాత్రం ఏం నేర్పగలరు
వెదురుబొంగుల్లో తలదూర్చి ఏడ్వడం తప్ప గాలి మాత్రం ఏం చెయ్యగలదు
పదవులూ ఉద్యోగాలూ పరిపాలనలూ మాత్రం ఏం నేర్పగలవు
ఎవరికీ ఎందుకూ పనికిరాని తలమునకల వ్యవహారాలు
చేతులూ కాళ్ళూ టపటపలాడిస్తూ చేసిందే రాసిందే చేసిందే చెప్పిందే
రాత్రింబవళ్ళు అలుపులతో చెయ్యడం చెప్పడం రాయడం
రెక్కలూ ఊహలూ రాళ్ళకేసి బాదడం
కలలూ కోర్కెలూ నేలకేసి ఊదవడం
వెళ్ళిపోయేప్పుడు మాత్రం ఎవడి నీడని చూసి వాడే గతుక్కుమనడం
పరువు ప్రతిష్టల ఉమ్మల మూకుళ్ళో ప్రతిపూటా కాస్త కాస్త గడ్డి తినడం
ధనం పెంటకుప్పల మీద పొర్లుతూ నిద్రపోవడం
భయం తాడుపై తోడుగా పెళ్ళాం పిల్లలు సంసారం
జలుబు దగ్గు తలనొప్పి అని ఏడవడం
ఎవరు మాత్రం పట్టగలుగుతున్నారు పిరికితనాన్ని గాలంతో
ఎవరుమాత్రం తరమ గలుగుతున్నారు భయాన్ని బాకులతో
పృథ్విపైకి లంఘించి మానవ కళేబరాన్ని చీల్చుకుతింటున్న ఆకలి జంతువుని చూసి
ఒంటిపై గాలి చల్లుకుని బట్టలకు మంటల నంటించుకోవడం తప్ప అడవులు మాత్రం ఏం చేస్తున్నాయి
ఎవరు మాత్రం అసలు విషయం తెలుసుకోవాలనుకుంటున్నారు
ఎవరు మాత్రం కాలం కుటిలత్వాన్ని గమనిస్తున్నారు
ఎవరుమాత్రం కంటిపాప పారాడని ప్రాంతాలు చూడాలనుకుంటున్నారు
పెళ్ళి ద్వారా ఆడదాని అందాన్ని అసహ్యించుకోవడం ద్వేషించడం నేర్చుకుంటున్నాం
పిల్లల్ని కని పువ్వుల్నీ పుణ్యాల్నీ
కలల్నీ కాంతుల్నీ అద్భుతాల్నీ అన్వేషణల్నీ
మురికిచెయ్యడం అలవర్చుకుంటున్నాం

ఎవరి అనుభవం ఎవరికీ అందకుండా మాటల కత్తులతో కాపలా కాయడం తప్ప
ప్రపంచంలో యిన్ని వున్నా భాషలు మాత్రం ఏం చేస్తున్నాయి
క్రూరమైన రాత్రి బాధల్ని తెలుపుతూ
అస్తమయంలో రేగిన ప్రణాలుగా మారడం తప్ప కొండలు మాత్రం ఏం చేస్తున్నాయి.
ఎవరు మాత్రం అమృతాన్నీ ఆరోగ్యాన్నీ పట్టించుకుంటున్నారు
తాగవలసినదితప్ప తక్కిన బురదనంతా తాగి తాగి
తినవలసినది తప్ప తక్కిన చెత్తనంతా జీవితాంతం మెక్కి
జబ్బుతో మంచమెక్కి
వైద్యపు అపహాస్యంలో విలవిలా కసాయి కత్తి కింద తన్నుకుంటున్నారు
భయం గుప్పిట్లో గాక ఎవరు మాత్రం ఎక్కడ బతుకు నీడుస్తూ పాకుతున్నారు
మూలుగులు గాక ఎలుగులు గాక ఎవరికి మాత్రం ఏం వినబడుతున్నారు
సెగలుసోకి పెదవులు చలించడం తప్ప ఎవరు మాత్రం ఏమిటంటున్నారు
అయినా ఎవరికివారు ప్రతిక్షణం ఆరోగ్య పత్రం చూసుకుంటున్నారు
మనం చేసుకున్న వాంతులు గాక మరేమిటి పత్రికలు
అవయవాల పట్లు తప్పి కార్చుకున్న విరేచనాలు గాక మరేమిటి రాజకీయాలు
అవును పత్రికలు కలరా వాంతులు
రాజకీయాలు కీళ్ళుసళ్ళిన విరేచనాలు
అప్పుడప్పుడూ త్రవ్వకంలో ఎముకల్లా బయటపడడం తప్ప
శిథిల నాగరికతలు మాత్రం ఏం రహస్యాలు విప్పగలవు తెలివివైపు తిప్పగలవు
అవయవాలు పట్లు తప్పిపోవడమే గాదు
ఎముకలు బయటపడడమే గాదు
ఎవరి ముఖమెవరిదో ఎప్పటికి యీ దారిలో ఆనవాలు పట్టలేరు
కావాలని తప్పించుకు తిరుగుతున్నప్పుడు ఎవరికి వారు
చీటీలూ బోర్డులూ కట్టుకు తిరుగుతున్న ముఖాలు
ఏ అరుపుల కొమ్మలు విరుస్తారు
చప్పట్లు మెరుస్తారు

నిద్రలోనే కాదు తప్పించుకోవడం తప్పిపోవడం
నిద్రలోనే కాదు సూర్యుణ్ణి చూడలేకపోవడం
పగలు మాత్రం ఎవరు కన్ను తెరుస్తున్నారు
ఆత్మల అంతరంగాల అఖాతాల్ని పూడ్చలేక
చూపుల తలలు ఆకాశంలో గుచ్చుకోవడం కాదా హిమాలయాలు
తలలు కడుపులోనే మరచి ఆత్రంగా అర్థాంతరంగా
మొండాలుగా పుట్టినవాళ్లు అధికారంలోకి రావడం చూస్తున్నాను
శిరస్సులతో జన్మించినవాళ్ళ కాళ్ళనీ చేతుల్నీ మేకులు కొట్టెయ్యడం
చూస్తున్నాను
గాయాలు తెలిసిచేసినా తెలియక చేసినా
మళ్ళీ మళ్ళీ మళ్ళీ కడుపుతో వుంటున్న కడుపుల్ని గమనిస్తున్నాను
చర్మంతో తప్ప కృతజ్ఞత తెలుపుకోలేకపోవడం గమనిస్తున్నాను
ఇజాల కాన్సర్ తినేసిన దేశాల్నీ మతోన్మాద వికటాట్ట
హాసాల్నీ పొగగొట్టంలో దట్టించి
ఆవేదన పీలుస్తున్నాను
లోలోపల కన్నీళ్ళ వ్రణాలు సలుపుతున్నాను
రక్తం గడ్డ కడుతున్న సమస్యల చలిలో దీవెనలా చలిస్తున్నాను
కులం లేని మతం లేని జడం కాని భాషల బంధనాల్లేని శిశువుకి
ఆనవాలుపట్టే ముఖాలు గల ఇక్కడి తల్లికీ ఇక్కడ తండ్రికి పుట్టబోయే
అంతర్ జాతీయ కాదు అంతర్ ప్రపంచాల శిశువుకి
గతం తలచి మనల్ని తలచి దారుణాల్ని తలచి గుక్కపట్టిన శిశువుకి
నగ్నశిశువుకి
ఒక్కణ్ణీ
జోలెనూపుతూ
మరణంపై మంటచిమ్ముతూ
లాలిపాడుతున్నాను. ●

## ఓటమి తిరుగుబాటు

**ఒ**కడు
కాదు
వాడు
ఎవడు
వాడంటేవాడు
ఆశయాలతో వేగివేగి
ఆశల నిరంతర నిరీక్షణలో అలసి అలసి
అనుభూతులు స్పర్శానందానికి తపించి తపించి
బతుకుతీపికై పడిగాపులు కాచి కాచి
అనుభవం యెడారిలో ఆదర్శంగా కాలి కాలి
ఓటమి వాతలోపడి బతుకు చెడినవాడు
వాడు
పరాజితుడు
పరిచ్యుతుడు
పీడితుడు
తాడితుడు
దరిద్రుడు
తరమబడ్డవాడు

బోధివృక్షం పిడికెడు నీడనీయలేదు
గాంధీపథం గరిటెడు గంజిపోయలేదు
ధర్మశాస్త్రాలు తలదాచుకోనీయలేదు
కర్మసిద్ధాంతం బానిసనుచేసి వదిలింది

వాడు

మతాల వడగాడ్పులకు సొమ్మసిల్లి పడ్డాడు
పుణ్యక్షేత్రాల మెట్లమీద అసహ్యంగా ఉమియబడ్డాడు

స్వాతంత్ర్యం రోడ్డుమీద తమాషా జంతువై తరమబడ్డాడు
ప్రజాస్వామ్యం దొంగల పార్కులో దుర్భరంగా కసరబడ్డాడు
పార్లమెంటు చర్చల్లో హక్కుల విచిత్ర పదార్థంగా ప్రదర్శింప బడ్డాడు
ఖరీదైన కోర్టుభాషలో చెల్లని నాణెమై విసరబడ్డాడు
ఎన్నికల తిరునాళ్ళలో
ఎంగిలి విస్తరాకులకై
బలవంతాన తోయబడ్డాడు
కుక్కల కూటమితో రాజీచేయబడ్డాడు
దేశభక్తి దివిటీ మంటల సందర్భాల్లో
ఆదర్శావేశంతో శలభంలా రెక్కల్ని కాల్చుకున్నాడు
త్యాగం తక్కెట్లో అంగాంగాల్ని నరికి నిజాయితీ తూచాడు
నలుగురి నవ్వుల మంటలలో బొబ్బల గోడుగా మిగిలాడు

వాడు సమాజం కుష్ఠుకు బలైన వ్రణంవికారి
కుష్ఠువ్యవస్థ పీల్చి విసిరిన వికారి వాడు
దేశందోపిడీ ఊడ్చి పారవేసిన బికారివాడు
దారిద్ర్యం చాచే చేతులకు చెదళ్ళు
దైన్యం మొహానికంతా పుళ్ళు
దయసైతం కళ్ళు మూసుకుంటుంది
చావుకూడా జాలిపడడానికి అసహ్యపడుతుంది

దిక్కులేని కుష్ఠు
న్యాయం దిక్కుల్ని తడిమి తిడిమి గాయపడ్డాడు
రోగిని వదలి రోగాన్ని ప్రదర్శించి
పథకాలు వేసిన ఉదారులంతా
ఊళ్ళు పంచుకొని

గుళ్ళు కట్టుకొని
ఛోటాబడా దేవుళ్ళయ్యారు
ఊళ్ళకూళ్ళే వాళ్ళ నిత్య నైవేద్యాలు
కైంకర్యం కాలక్షేపం వాళ్ళ పహరాదార్లు

ఊళ్ళో రాజకీయాల రంకులరద్దీ
జానెడు స్థలంకూడా మిగల్చలేదు
ఊరిబయట
అందమైన దోపిడీగాళ్ళ తీయని ద్రాక్షతోటలు
అక్కడ
శంకరాచార్యుల వేదాంతపు విడిదిమేలాలు
మధురభక్తిమైకంలో సచ్చిదానంద స్వరూపాలు
అద్వైతానందం సేవిస్తున్న నేరస్థులంతా
వాణ్ణిచూచి హడలుపడి "మాయ"–పొమ్మని కసిరారు
నగరాల్లో
రకరకాల అందమైన దొంగల శిబిరాల్లో
దూసుకుపోయే రంకుబాబాలు
వాడి సత్యం కళ్ళల్లో
అవినీతికార్లు దుమ్ముకొట్టి నీ ఖర్మమన్నారు
భుక్తాయాసంగాళ్ళు

భూమికి జానెడెత్తులేచి పరుగెత్తేవాళ్ళు
బజారు కసాయి కాపలాదార్లు
బస్తీ అందాల వ్యామోహం వాపులు
శాసనాల పంగనామాల నంగనాచులు
అందరూవాణ్ణి గేలిచేసి కసిరారు
తిట్లు చివాట్లు
విసుర్లు కసుర్లు
కొట్టడాలు కూలదోయడాలు

వాడికి నిత్యనీరాజనాలు

వాడు
చుట్టుముట్టిన అవినీతితో విసిగి
పైబడుతున్న దుర్భర దుర్మార్గంతో వేసారి
ఆవేదనతో ఆక్రోశంతో
ఏమోచెప్పాలని ఏదోచేయాలని
ఛలో ఢిల్లీయని
పరిపాలన కూడలిని చేరాడు
వ్యవస్థ కుష్ఠుపారుతున్న యమునలో పాతిత్యం కంపు
బతుకు ఝుగ్గీలు కూలుతున్న తమ్ముల తడినెత్తురు
ఆవు పేడ పులుముకున్న శాక్తేయుల నరబలి కేకలు
పదవుల పెదవులపై భయంకర రక్తస్రావాలు
దిగమింగిన బంగళాల కర్కశమౌనం విడిచే ఇనుప ఆవిరి
లోకసహా మర్యాదల ఆస్తినాస్తి చర్చా గందరగోళాలు
ప్రజాస్వామ్యం పరాచికాల రక్త విరేచనాలు
సామాన్యుడు మెట్లవరకు కూడా చేరలేని
సుందర హర్మ్యాంతర్గత
సుప్రీం ధర్మదేవత
ధర్మ దర్శన శూన్యాలు
ఖరీదైన కటాక్ష వీక్షణాల క్యూ కసరత్తులు
అన్నీ వాడి గుండెను చెరువు చేశాయి
ఆశకు గండిపడి పదిలపర్చిన భావి జలమయమైంది
వాడు హతాశుడై రాజ్‌ఘాట్ చేరుకొని
మిగిలిన కన్నీళ్ళను ఒలకబోసుకున్నాడు
వెతనంతా సమాధిరాళ్ళకు పులిమి
తనివి తీరా ఏడ్చి బతుకు భారం తీర్చుకున్నాడు

"అందమైన రూపాల్ని చంపిన దేశస్థులు

ఈతరం దీపాల్ని మలిపిన క్రూరులు
ఈ కూరుపిని బతుకనీయరు
ఇక్కడే
ఈ సమాధి పాదాల వద్ద
ఈ వికారానికి స్వరూపం యిస్తారు
కూడుకున్న కురూపానికి
ఆత్మహత్య ఆటవిడుపు
ఈ సమాధిరాళ్ళు నా మృత్యు విహారాలు"

ఇంతలో
ఎక్కడిదో గజ్జికుక్క
రాళ్ళతో పిచ్చిదైన గజ్జికుక్క
క్రూరంగా తరమబడ్డ గజ్జికుక్క
దీనంగా హీనంగా
అసహ్యంగా దయనీయంగా
వాడికి ప్రతిబింబంగా
వచ్చిన పిచ్చికుక్క
దెబ్బలతో దాడులతో
పగిలిన పుళ్ళ నెత్తురులో
తడితడియై తడబడుతూ ఎర్రకుక్క
ఊడుతున్న జూలు జులపాలతో
కన్నీళ్ళకన్నా దీనమైన చొల్లుతో
తెలియని పగల సెగల నుండి దూరివచ్చిన పిచ్చికుక్క
రాజ్‌ఘాట్ మూలలో రక్షణను వెతుక్కుంది
తగిలిన గాయాల కూనలపై
బతుకు దైన్యాన్ని కార్చుతూ
జాలినాలుక తడితో నాకుతూ
తనివి తీరా తీర్చి దిద్దుతూంది

దుర్భర శీతాకాల నిశీధి
దట్టమైన తన కసినంతా
రాజధాని సాని పీడిత వ్రణాంగాలపై
క్రూరంగా కురుస్తూ చరిస్తూంది
వెతుకుతూన్న జనం కాలుదువ్వుతూ వచ్చి పడింది
భయంతో బద్దలౌతున్న జనం పిచ్చిబతుకు వెంటపడింది
బొజ్జలున్న దోపిడీగాళ్ళు
బుడ్డలున్న మగసిరిగాళ్ళు
నామాలతో ఊరేగే నాంచార్లు
పిలకలున్న పొలిటిక్సు నక్కలు
గడ్డాలతో పెరిగిన పెద్ద మనిషి పందికొక్కులు
మీసాలున్న ఆడవాళ్ళు
మీసాలు లేని మడతకొజ్జాలు
నాజూకులు నయగారాలు
గాజులున్న వాళ్లు గామాపహిల్వాన్లు
చళ్ళెగరేసుక తిరిగే ప్రక్షిప్త కామాగ్నులు
కళ్ళప్పగించుక చూచే శ్రీభ్రష్టలనులు
విటులు వీధి విరాట్టులు
నటులు నగరం మూలపెరాట్టులు
ఖర్వాటులు ఖద్దరు టోపీలు
లీడర్లు లమ్డీకొడుకులు
దుర్మార్గులు ధౌడీ కొడుకులు
మందిర మ్లేచ్ఛులు
మసీదు కాఫిర్లు
గురుద్వారం గుండాలు
చర్చ్ సిన్నర్లు
శాంతిచారులు

వార్తా చోరులు
పత్రికా శూరులు
రాగులు రోగులు బై రాగులు
అన్నిరకాల బద్మాష్‌లు
అంతా జనం
రకరకాల జనం
చదువు జనం
సచివాలయ జనం
అంతా భయ విభ్రాంత జనం
కాదు
మంద
ఆయుధాల మంద
ఈ దోపిడీ వ్యవస్థా నిశీధిని
కాపలా కాస్తున్న మాదర్చోదీమంద
అందరికీ
మందపొట్టేళ్ళందరికీ
పిచ్చికుక్క భయం
కుక్క చావు చచ్చే భయం
తమ పూర్ణ నగ్నవీధుల్లోకి
నిత్య రత్యాలింగనం జారుబండల్లోకి
అసహ్యపు పిచ్చికుక్క జొరబడుతుందనే భయం
దోపిడీతో కొవ్వెక్కిన బొజ్జల్ని
పొలిటిక్సు పడుపులో కై పెక్కిన పిరుదుల్ని
బ్లాక్‌మేల్ బ్రాసరీల్లో కసినింపిన రొమ్ముల్ని
దొంగబలంతో బలిసిన పిక్కల్ని
కాంట్రాక్టుల్లో మదించిన తొడల్ని
అరువు నవ్వుల్తో ఉబ్బిన చెంపల్ని

పదవీపానంలో తడసిన కరప్షన్ కంపు పెదవుల్ని
అధికార కావరమెక్కిన కండల్ని
నిత్య రాజకీయ దుర్గంధ వ్యాపారంలో
తడిసిన తీర్థాల భయంకర గిరాకీ మర్మాంగాల్ని
పుచ్చిన గజ్జికుక్క
రెచ్చిన పిచ్చికుక్క
ఖటిక్కున కొరుకుతుందనే భయం
కాటు భయం
ఒక్కటే భయం
ప్రాణ భయం
మానభయం
కుక్క చావు చచ్చే భయంకర భయం

భయంతో బలిసిన మంద
భయంతో వెంటబడిన మంద
క్రూర హత్యా దళం
నిత్య హత్యాదళం
నాగరిక హదిత్యాదళం
రాళ్ళతో రప్పలతో
బరిసెలతో బడితెలతో
లాఠీల్తో బూతుల్తో
ఒకేసారి
ఎగబడింది మనుషులమంద
పనికిరాని పిచ్చికుక్కపై దాడి

పిచ్చికుక్క మూల్గింది మొరిగింది
ప్రతి వేటునూ తప్పుక ఎగిరింది
వేడుతున్నట్లు మోకరిల్లింది
చేసిన తప్పేమిటోనని గుడ్లురిమి చూసింది

బతకనీయమని బామాలుతూ సుళ్లు పోయింది
స్వాతంత్ర్యం నా జన్మ హక్కని గర్జించింది
మీ స్వాతంత్ర్యం నా ప్రాణం తీయడానికేనా అని మూల్గింది
రాజ్‌ఘాట్ చుట్టూ తిరిగి రక్షణకు పాకులాడింది
రాయిమీద రాయి
దెబ్బపై దెబ్బ
పొడుపుపై పొడుపు
దాడిపై దాడి
ఖాన్‌గాడి కసాయి కత్తి నుండి
సర్దార్జీ లావైన లాఠీ నుండి
ఫాదర్ గాడి సిలువ చెక్క నుండి
నామాలగుండు కమండలం నుండి
విలాసం వేటగాడి తుపాకీ మడమ నుండి
ఆడవాళ్ళ ఆయుధాల నుండి
మగరాయళ్ళ పద్మవ్యూహాల నుండి
తప్పించుక తిరుగుతూంది పిచ్చి కుక్క
తన బతుకును తాబతికే ప్రాణిపై
బలిసిన మనుషుల మంద ఒక్కుమ్మడి దాడి

పూజారి రాయి నుదుటిపై నెత్తురు నామం పెట్టింది
ముర్షద్ రాయి మూతి పగులగొట్టి నెత్తురు గడ్డం చూసింది
ఒక స్త్రీ శౌర్యం కుక్క పొట్ట క్రింద దాడిచేసింది
ఒక పౌరుషం కుక్క కాలిపై గురిచూచి గెలిచింది
అందరు తమ తమ అభిమాన అంగాలపై
ఎగబడి కసితీర్చుకుంటున్నారు
పిచ్చికుక్క మొరిగింది మొరిగింది
తప్పుక తిరిగి తిరిగి అలిసింది
మొరగడంలో చావు తప్పదనుకుంది

మందబలాన్ని పసిగట్టి చూచింది
పిచ్చికుక్క పిచ్చిదైంది
పీడనలో ఓరిమి బద్దలైంది
తాడనలో భీతి తిరగబడింది
భయం విలయమై విధ్వంసానికి ఎగబడింది
పిచ్చికుక్క వీరజాగిలమై తిరగబడింది
ఒక్క గెంతులో
బొజ్జవాడి పొట్ట పేగులు తీసింది
మరో గెంతులో
నామాల పూజారినంతా కొరికి
వాడి జంధెం తెంపి కాలరాచింది
ముర్షద్ మియా గడ్డం పీకివేసింది
ఫాదర్ చేతులకు సిలువ గుర్తులు వేసింది
సింగ్‌జూలు నంతా పీకి బరబరా ఈడ్చింది
చళ్ళదానిపై లంఘించి చన్ను నూడ బెరికింది
పిచ్చికుక్క రెచ్చి వీరజాగిలమైంది
బుడ్డవాడు మరో గెడ్డం వాడు
మందలోని హతశేషులు క్షతగాత్రులు
కండబలం పనికిరాదని
పిక్కబలం చూపారు
కల్లోలం గావు కేకలు
భీతావహం పెడబొబ్బలు
ఆక్రందనలు ఆర్తనాదాలు
హాయ్‌రామ్‌లు
హాయ్ అల్లాలు
ఓహోగాళ్లు
ఒకే కేకలు ఒకే అరుపులు

అంతా ఒకే పరుగులో బతుకు తీపిని చూచారు

ఈ పోరాటాన్ని
ఈ తిరుగుబాటును
ఈ అభిమానాన్ని
ఈ అస్తిత్వకాంక్షని
ఈ బ్రతుకు సంగ్రామాన్ని
వీరజాగిలం ఆత్మ విశ్వాసాన్ని
మరో మూలలో
ఓటమి వాతలో
ఆత్మహత్య దరిదాపులో
నక్కినవాడు చూచాడు
వాడు
ఓడినవాడు
మాడినవాడు
వాడబడినవాడు
వంగి నడచినవాడు
సమాజం కుష్ఠుకు గురైన వాడు
ఇపుడు
ఈ భయసంభ్రమావిష్కరణలో
అనూహ్య పరిణామం ప్రతాడనలో
పూర్ణ పులకాంకితుడు

ఓటమిని సాహసంపైకి విసిరి
ఆలోచనల వెలుగు రవ్వల్ని చూచాడు
"దైన్యంతో దిగజారిన పశువుసైతం"
ఆత్మహత్య నాశ్రయించదు
మనిషి ఓటమి ఆత్మహత్య
అవును

మనిషి ఆత్మహత్య
పశువు పోరాటం
మనిషి ఓటమి
పశువు తిరుగుబాటు
మనిషి పశువుల మధ్య తెలియని తేడా ఇది
ఓటమి తిరుగుబాటుల నిస్తుల నిర్వచనం ఇది
మనిషిభయం
పశువు సాహసం
మనిషి లొంగుబాటు
అవును
కాదు
కాకూడదు
ఆత్మహత్య పోరాటం సాగించాలి
ఓటమి తిరుగుబాటు చేయాలి
ఆత్మహత్య తిరగబడి హత్యచేయాలి
దేశంలోని కాలుష్యానికి
బలైన బతుకు వికారిన్నేను
పేరిన పేదరికం కుష్ఠు ముష్ఠిన్నేను
బలిలో తిరగబడి బరికింది కుక్క
పోరాటంతో నిలిచి బతికింది కుక్క

ఈ కుక్క ఊరూరా తిరిగి పోరాటం నేర్పాలి
ఈ కుష్ఠు వ్యవస్థపై తిరుగుబాటు చేయాలి

మళ్ళీ దూరాన
అరుపుల సమీపాగమనాలు
ఎన్నో మందల పరుగుల అరుపులు
పోలీసు సైరన్ సమీపిస్తున్నది
మెరిసే కత్తులు కఠార్లు

తుపాకులు తూటాలు
అన్నీ వేడెక్కిన మెదడులో పిలుపులు
వీరుడు నాలుక జాస్తున్నాడు
బతికి బయటపడినందుకు
శ్వాసకు విశ్వాసం సమకూరుస్తున్నాడు
నా దేశం ఏకైక వీరుడు చావరాదు
వీర మరణం ధర్మం కారాదు
ఎన్నేళ్ళకో దొరికిన ఒకే ఒక బతుకుసాథే
అసలే చావకూడదు
అక్కడే
ఓడిన దాడిలో
పడిపోయిన తుపాకీ నెత్తిచూచాడు
తుపాకీ గొట్టంలో దాగిన విప్లవ సామ్రాజ్యాల
విజయ దుందుభుల ప్రతిధ్వనులు ఆహ్వానించాయి
మూలనున్న విశ్వాసం క్షతగాత్రుణ్ణి
తన ఏకైక తిరుగుబాటు వీరుణ్ణి
తనలోకి లేవనెత్తి
తూపాకీని చేతికాధారం చేసుకొని
చరచరా ముందుకు నడిచాడు

వాడు
ఎవడు
వాడు
వాడంటేవాడు

తూర్పు పేలి పగులుతూన్న చప్పుడు
ఎరుపై దగ్గరలో వినబడుతున్నది
భరతవాక్యం బలంగా కనబడుతున్నది. ●

# చెరబండరాజు

## జగద్గురువులొస్తున్నారు జాగ్రత్త

పల్లకీలలో తప్ప ప్రయాణం చేయరు
ధనవంతుల మేడల్లో తప్ప పూరిగుడిశెల ఊసెత్తరు
కాళ్ళుండీ కుంటివాళ్ళు
మనుషుల బుజాల్ని తప్ప ఇంకేమీ ఎక్కరు
కాషాయాంబరాలు మానరు
ఆధ్యాత్మిక చింతన పేర
నవీన పతివ్రతల్ని పావనం చెయ్యందే వదలరు

ఎవరయ్యా ఎవరీ రసరాట్టులు
బతుకంతా మోసంతో రసరాట్టులు
జనాన్నీ జాతి నరనరాన్నీ మతమౌఢ్యానికి తీర్చి తీర్చి
వయసులో నానా పాయసాలూ మరిగి మరిగి
కొవ్వెక్కిన పిట్టగూళ్ళ తలబుట్టల బాబాలే
చక్రవర్తుల్లా ఊరేగే జగద్గురు సాములార్లే
ఈ కుష్ఠు వ్యవస్థకు మూల విరాట్టులు

చీకటి బజారు జలగల్ని
రాజకీయ బొద్దింకల్ని
పదవీ మదాంధుల్ని
సాహిత్య వందిమాగధుల్ని
అభయ హస్తంతో కాపాడే కంకణం కట్టుకున్నారు
నిర్వీర్యాన్ని దేశం నలుమూలలా
కాలవలనిండా పారిస్తున్నారు
భయంకర కుష్ఠు సంస్కృతిని దేశమంతా పంచుతున్నారు

నమ్మకు ఈ మతాల సుఖరోగుల్ని

వర్ణాశ్రమ ధర్మ ద్వేషాలు రేపే అడ్డగాడిదల్ని
బహిరంగంగా సభల్లో వ్యభిచరించే ఆబోతుల్ని
రంకూ బొంకూ పురాణాల బంకను
వేదికలెక్కి కుక్కల్లా కక్కే వెధవల్ని
మన్నించకు

మనిషిని ఏనాడో మరచిపోయి
మంచితనాన్ని అంటరానితనంగా ఎంచే తుచ్ఛులకు
చిలక జోస్యాల పిలకగుల్లు
వంటింటి కుందేళ్ళు
పట్టెనామాల పొట్టేళ్ళు
బిళ్ళగోచీ బల్లలు
జందెంపోగుల పందులు
బ్రహ్మరథం పడుతుంటే
కళ్ళుండీ కంటూనే
చెవులు పోటెక్కేట్టు వింటూనే
కదలకుండా మౌనంగా నిలబడకు

దేవుళ్ళ దేవులాటలో
మహా మహా మాయల నాయాళ్ళ సన్నాసుల
జోగుల మోజుల్లో
పడిపోయిన దేశాన్ని
భవిష్యత్కాలాన్ని
కాపాడడానికి నడుం కట్టు

పాతిపెట్టు
మైలురాయివే కాదు
మంచికి పతాకాన్నెత్తే మనిషినని
మరోసారి రుజువు చెయ్యి. ●

## శస్త్ర చికిత్స

ఎదుగుతూన్న ఎత్తుగా
ఏదో అసహ్యపు వాపుగా
పశ్చిమ సంధ్యానంతర చీకటి సమస్యా ఫలితంగా
వికృత వికార విక్షుబ్ధ గోళంగా
లేవిళ్ళ ఇరుసుపై
ఆయాసపు దీర్ఘ గర్భం
తనలోతాను తిరుగుతూంది

చరమరాత్రి కరాళ మేఘం
కశ్మలమై ఘనీభవించి
ఆశల సమతా సూర్యోదయానికి
తొలగని తోలు తెరయై
జాడ్యంలా జారిపడింది

ప్రవర్థమాన ప్రసవ వేదన
చావు పుట్టుకల మధ్య
నీరెత్తిన నిరంతర సంధ్యా శోకమై
విచిత్ర వ్యాధి వికారరూపమై
గడ్డకట్టిన వ్రణమై బాధిస్తున్నది
వేవిళ్ళు
లేవిళ్ళ సరదాలుగా మిగిలి
కన్నీళ్ళు
కంటిరోగాల పుండ్లుగా పగిలి

విషజ్వరం
విజ్ఞాన చర్చగా మారి
ఘర్మ జన ప్రవాహాలు
కర్మ సిద్ధాంత సోపానాలుగా జారి
నిర్జీవ నిశ్చల అవయవాలు
తప్పిదాల పక్షవాతంగా పేరి
పూర్ణ గర్భిణి
స్థాణువై
శ్వాసిస్తున్నది
మాతృత్వపు మహదాకాంక్షలో
మనుగడకై పోరాడిన
శీలవతి
గర్భవతి
ఊపిరిపై పీడన పరిపాలన
వేదనలో
నిరాశ స్థిర నివాసం
బతుక్కు
క్షణాలు
కుల ధర్మం భిక్షా పాత్రలో
దక్కిన ముక్కిన గింజలు
అవినీతి అధినేతల
కొరడా రుచుల కవాతులో
చూలాలి దైన్యపు చూపులు
ఓరిమి ఒంటెల పరుగులై
ఆశా శైశవ ఒయాసిస్సుకై

విరామ మెరుగని వెతుకులాట
చెలరేగిన
చీకటిజాతి దొంగల
దోపిడీ దూమారంలో
ఆరిపోతున్న
కాంతికళికకు
పిచ్చెత్తిన దేవులాట
దిక్కు మొక్కూలేని
మన రాజ్యపు మందుటెడారిలో
మంచి మజిలీకై పాకులాట

అలసిన నిరీక్షణ
ప్రాణాంతకమైన ప్రసవ వేదన
విషమై వేధించే గర్భభారం
స్మృతి జారిన దుర్బల మమత
భరతమాతను
కొండకెక్కిస్తున్నది

ఆమె కనుపాపలలో
కలల కలిమికోటలు పగిలి
కన్నీటి పెంకులై రాలి
నిండిన నైరాశ్యపు పాలిండ్లపై కూలి
మమతా మురిపెం తీర్చుకుంటున్నాయి

ఇరవై యేళ్ళ కడుపు
పురుడు లేక
కరడుగట్టి పెరుగుతూంది

నలుగురిలో
నవ్వులపాలై
తిరుగుతూంది
నెల తప్పడం
నీతి తప్పినట్లయింది
భరతమాత బతుకు
పశ్చిమ ప్రవాస ద్వీపమైంది

పండుగ జనసందోహంలో
విచిత్ర వికార గర్భిణై
చోద్యపు జంతువై ప్రదర్శింపబడుతూంది
భరతమాత
కన్నీళ్ళింకిన భరతమాత
కఠోర కర్కశ గర్భం
కాయగాసి విషమెక్కిన గర్భకుహరం
పడమటి కెమేరా బద్మాష్‌ల
పరాచికాల ప్రయోగాల
తెరలేవని రంగస్థలమైంది
వళ్ళంతా వాచి
కళ్ళంతా కాచి
నోరంతా పూసి
బతుకంతా మాసి
అవయవాలు మొద్దుబారి
అస్తిత్వానికి
ఆనవాలుపోయి

నొప్పులతో ఆగలేక
పొడుపులతో వేగలేక
నీరు లేక
నిద్రలేక
మెతుకులేక
మనుసు లేక
చావు లేక
బతుకు లేక
అపస్మారకంలో అరుస్తూంది
బజారున పడ్డ
భరతమాత

జాతి భిషగ్వర్యుల భేషజాల గుళికలు
ఇమడని ఆదర్శాల ఆరోచికం కషాయాలు
సరిపడని సిద్ధాంతాల అసహ్యాపు లేహ్యాలు
దోపిడీ ధర్మకర్తల దాక్షిణ్యపు ద్రావకాలు
భూతవైద్యుల మంత్ర తంత్ర మహేంద్ర జాలాలు
బోసితాతయ్య జపసూత్ర ధర్మాలు
ప్రణాళికా వైద్యుల నాడీ నిదానాలు
పార్లమెంటు చర్చల రోగ నిర్ణయాలు
గురులేని శాసనాల చికిత్సా విధానాలు
దురభిమానపు సాంప్రదాయక పథ్యాలు
ప్రజాస్వామ్య ప్రసూతి గృహాల అందమైన ఆర్భాటాలు
అంగిట్లో ఆగిన ఇంగ్లీషు తీపి మాత్రలు
అనుక్షణం పొడుపులతో వేధించే
డాలరు డాక్టర్ విటమిను ఇంజెక్షన్లు

అదనంగా ఎక్కిన అరువు నెత్తురు ఆటుపోటులు
రక్షణ పేర బ్యాండేజి ప్లాస్టర్ల ఉక్కపోతలు
బిర్లా ప్రాణవాయువు వినియోగ పరంపరలు
గూడుపుఠాణీగాళ్ళ కాంట్రాక్టు గ్లూకోసు ధారలు
ఖరీదైన స్వదేశీ తమాషా టానిక్‌లు
రకరకాల రంకు రాజకీయాల మిక్స్చర్లు
నాయకత్వం మంగల్దాని చివరి క్షణం చిట్కాలు
జ్యుడిసియరీ గంధర్వుల సాంత్వన వాక్యాలు
ఐ ఏ ఎస్ బ్యూరోక్రసీ నర్సుల అందమైన మందహాస ప్రమాదాలు
విశ్వవిద్యాలయాల నిద్రామాత్ర ప్రసాదాలు
పుణ్యక్షేత్రాల వర్తకపు హుండీ దోపిడీ ముడుపులు
మఠాధిపతుల మహా మహా నైవేద్యపు టూరిస్టు కైంకర్యాలు
భరతమాతను శాశ్వత రోగిని చేసి వదిలాయి
పదిమంది పరిశీలనలో కొనవూపిరి కొలువబడుతూంది
ప్రాణమానాలు ప్రదర్శనలై పాడబడుతున్నాయి
కాళ్ళు జాచిన
భరతమాతకు
బ్రతుకు భారమైంది
గర్భాయాసం ఘోరమైంది
దైన్యం రక్తస్రావమైంది
భరతమాత బతకాలి
బతికించాలి
రక్తసిక్త విప్లవ భానుడు
బయటపడి పిడికిలి బిగించాలి
ఇరవై యేళ్ళుగా అదిమి పట్టిన

మూఢనమ్మకాల యజ్ఞోపవీతాన్ని
బొడ్డు నుండి కోసి
కలయబారిన
కశ్మల మాయ నంతా కడిగి
తల్లీ బిడ్డల్ని రక్షించాలి
నెత్తురులో
పురుడు స్నానమాడి
హింస విప్లవానికి మంత్రసాని కావాలి
దుస్సహ దుర్గంధ దీర్ఘ క్రూర గర్భాయాసం నుండి
భరతమాతకు విముక్తి కలగాలి
భారతి తల్లయి తలెత్తుకు తిరగాలి
మమతాసాగరం స్తన్యమై
పొంగులెత్తి పారాలి
నెత్తురు పొత్తిళ్ళలో
విప్లవ శైశవం
చండ ప్రచండమై
మధ్యందిన మార్తాండతేజమై ప్రజ్వరిల్లాలి

ముంగిట మౌనంగా
మెరుస్తూనే
శస్త్ర వైద్యుని పదును కత్తులు
అనివార్యంగా ఆహ్వానిస్తున్నాయి
మెరుపు కత్తులు
పురిటి కానుకలు
హింస విప్లవానికి మంత్రసాని
హింస విప్లవానికి మంత్రసాని. ●

## నేను దేవుణ్ణి నమ్ముతున్నాను

అవును
నేను దేవుణ్ణి నమ్ముతున్నాను
దేవుడంటే
పటాటోపాలతో మత్తెక్కి నిర్వికారులమని చెప్తూ
అరిషడ్వర్గాలకీ మరింత సన్నిహితంగా చరించే
అహంకార భూయిష్టులైన స్వాములార్లు కాదు
పులిహోర దద్ధోజనాలతో శరీరాన్ని చిద్విలాసంగా
పెంచుతున్న జియ్యరుకాదు
షోడశవర్ష కన్యల పవళింపు సేవలతో మతాన్నీ
దేశాన్నీ ఉద్ధరించే బాబాలు కాదు
వీళ్ళంతా స్వకుచ మర్ధనోత్సాహులు
హస్త ప్రయోగంతో హఠయోగం సాధించిన వాళ్లు
వీళ్ళంతా పోరంబోకులు
లోక్‌సభలో చోటుకోసం
నల్లబజార్లో లాభాల కోసం
ఆలినర్పించి పొందే ప్రమోషన్ల కోసం
ముడుపులందుకొనే వాడు కాదు నా దేవుడు
సరదా కోసం, గ్లామరు కోసం
పూజలందుకొనేవాడు కాదు నా దేవుడు
నవరత్న ఖచిత సువర్ణ కిరీటం కోసం
నిలువు దోపిడీల కోసం

నెత్తిమీద జుత్తు కోసం
అమ్ముడు పోయేవాడు కాదు నా దేవుడు.
మెడమీద తలకాయ కోసం
ఎట్టిదైనా, దేనిదైనా రక్తం కోసం
ప్రత్యక్షమయ్యే వాడు కాదు నా దేవుడు
రూపాయలకీ, అంగాల పొంగులకీ భగవిశ్వాసాలకీ
నా దేవుడు తాకట్టుపోడు
జీవితాన్ని నిర్వచించే వాళ్ళన్నా శాసించే వాళ్ళన్నా
మానవోద్ధారణోపన్యాలతో
మారణాయుధాన్ని మించిన మాటలతో
మానవ జాతిమీద పడి బతికే
అశుద్ధాస్వాదనా పరులైన పందులన్నా
నా దేవుడి కసయ్యం
మానినీ మానస చోరుడు
చిద్విలాస రూపుడు
ఆర్తత్రాణ పరాయణుడు
గోపీ పీన పయోధర మర్దనుడు
అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు
మొదలైన చచ్చుపీనుగ కాదు నా దేవుడు
వేదికలెక్కి వీరంగణాలు పోతూ
తిరుగుబాటు జరగాలని
తిరుగులేనిది మానవజాతి కావాలని
గొంతులు చించుకుంటూ
రహస్యంగా వెన్నుపోటు పొడిచే
అపక్వ స్ఖలనం చేసుకునే నెలతక్కువ నాపల్ని

నా దేవుడు క్షమించడు
వడిలిపోయిన జీవితాల కుదుళ్ళలో ఆత్మీయతని విదిల్చి
మనిషిని మనిషిగా గుర్తించి
మనిషిగా బ్రతకడమే నా దేవుడి కిష్టం.
ఎవరికీ కాని కుక్క పిల్లమీంచి కారు నడిచినప్పుడు
మెతుకుకోసం మానాన్ని కాల్చుకున్నప్పుడు
జాలిబడ్డ గుండెలో నా దేవుడున్నాడు
నా దేవుడు
చీమూ నెత్తురూ వున్న మానవుడు
మానవత్వాన్ని తప్ప మరో మతాన్ని అంగీకరించడు. ●

# భైరవయ్య

## దద్ధోజనం

**మొ**న్న మధ్యాహ్నం
నిజమే సుమా!
ముక్కలు ముక్కలుగా
పెద్దవాళ్ళు
హిమాలయోత్తుంగ శృంగాలమని
భ్రమిస్తూ నటిస్తున్న వాళ్ళు
మైసూరుపాకు ముక్కల్లా ప్రపంచాన్ని చప్పరిస్తున్నారని
వేసం కాలంలో
కడప జిల్లా పుచ్చకాయ ముక్కల్లా
కోసుకుతింటున్నారని
మనుషుల్నీ – మంచితనాన్నీ దోరగా వేయించి
నిజాన్నీ – ఇజాన్నీ నంజుకుంటున్నారనీ
మొన్ననే కదూ గుర్తుకొచ్చింది!
అద్దె గదిలో మంచంమీద
అప్పుడే లేచి
ఎండని వెన్నెలనుకుని
సిగరెట్టు ముట్టించుకున్నప్పుడు
అందమైన అతివ పరిపూర్ణాంగ పరిమళంలా
కొత్త పెళ్ళాం కాచిన కరివేపాకు చారులా
సిగరు ధూమం గుబాళించాల్సిందిపోయి
ఉత్త గడ్డిలా మండినప్పుడు కదూ
నాకా విషయం గుర్తుకొచ్చింది!

అవును
వసుధైక కుటుంబంలో
సుధా ధారలు పాలు వారాల్సిందిపోయి
స్పర్థలు – చీకాకులు
నిరంత వేదనా సముద్రాలు
విషపు చుక్కలు
జాలువారి
జీవితం
నీరు కావిడి బట్టలా
నేలవిడిచిన సాములా
ఎన్నిక ప్రచారోపన్యాసంలో
మారిందని
విలువలు విస్తరించాల్సిన మానవత్వం
డి వాల్యుయేషన్ రూపాయిలా
దెయ్యపు కొబ్బరికాయలా
అయిపోయిందని
నిన్న గాక మొన్న మధ్యాహ్నం కదూ
ఎదిరింటి కిటికీ దగ్గర
గాజుల చప్పుడవుతే
ఆత్రపడ్డ నా కళ్ళకి
నైట్‌మేర్ కనిపించినప్పుడు కదూ గుర్తుకొచ్చింది!
ఇలా
ఏదో జీవితం గురించి
తత్ప్రాధాన్యం గురించి
ప్రపంచం గురించి
తదనుగుణమైన సమస్యల గురించి

ఆలోచించి
సిగరెట్లు వెలిగించి
అలా చాలా చాలా - ఇంచి
ఏం చేశానూ !
మధ్యాహ్నం సాయంత్రానికి
అక్కడ్నించి - రాత్రిలోంచి ఉదయం లోంచి
మధ్యాహ్నానికి మారగా
ఆ కాల ప్రవాహంలో పడిపోయి
వేడి వేడి శపథాలు
వేడి కాఫీతో సేవించి
గతించిన రాకుమార్తెల సౌందర్యాలు
రాకుమారుల ధైర్యాలు
రాయల కాలంలో రాసులైన రతనాలు
మా మామ్మ చెప్పే రూపాయకి బియ్యపు బస్తా బంగారు కాలాలు
నెమరు వేసుకుని
తాతలు తాగిన నేతులు గుర్తుకొచ్చి
పెదాలు నాక్కుని
తడారిన పెదాల మధ్య సిగరెట్ల కగ్గిపుల్ల లంటించి
"ఈ ప్రపంచం మారదబ్బాయ్
చాలామంది ప్రయత్నించారు"
అని ఒక్క ముక్కలో తేల్చేసి
'ఇంగ్లీషువాడు గొప్పవాడోయ్'
అనే సిసలైన ఆంధ్రుణ్నై
'వరల్డ్ బై నైట్' సినిమా కెళ్ళాను కదూ!
అవును
ఆ రోజు నాకు బాగా గుర్తుంది. ●

# నగ్నముని

## కుష్ఠుదేవుళ్లు

ఎన్నటికీ మనం తిరగబడలేం కాబట్టి
ఎప్పటికీ మనకి తిరగబడడం చాతకాదు కాబట్టి
మన రక్తం నిండా కులాల మతాల మూత్రం ప్రవహిస్తున్నది కాబట్టి
మనం పిరికి కుక్కలం పందులం కాబట్టి
మన జీవితాల్ని శాశ్వతంగా కొనేసి పరిపాలిస్తున్న
రకరకాల కుష్ఠుదేవుళ్ళని కొలవడానికే అంకితమవుదాం
కుష్ఠుదేవుళ్ళు నానా రకాలుగా గొప్పవాళ్ళు కాబట్టి
వాళ్ళు తల్చుకుంటే ధరలింకా ఆకాశాన్ని దాటి పెరిగిపోవచ్చు కాబట్టి
వాళ్లు కన్ను తెరిస్తే మనం మాడి మసై పోగలం కాబట్టి
వాళ్ళు తల్చుకుంటే ధర్మ శాస్త్రాలు కోట్‌చేసి
లాఠీల్తో మన ఎముకలు విరగ్గొట్టేయ్యగల్రు కాబట్టి
వాళ్ళ దయా దాక్షిణ్యాల వల్లే
మనమింకా శవాలుగానైనా బతగ్గలుగుతున్నాం కాబట్టి
వాళ్ళకవసరమనిపిస్తే మన తల్లుల్నీ పెళ్ళాల్నీ
పుట్టిన పుట్టబోయే జనాభానంతా తాకట్టు పెట్టెయ్యగల్రు కాబట్టి
వాళ్ళ వ్యాపారానికి సవాలక్ష సమస్యల్ని
మన గొంతుమీదికి ఉసిగొల్పగల్రు కాబట్టి
మనం కుష్ఠుదేవుళ్ళ గొప్పదనమే చాటాలి
వాళ్ళ శక్తిని భక్తితో పత్రికల్లో పూజించాలి

మనుషులుగా అందరూ ఒకే శ్వాసగా బతకాలనే వెర్రి కోర్కెతో
మత గ్రంథాలన్నీ మనం బాహాటంగా తగలెయ్యడాన్కి

పూనుకోకూడదు

దేన్నీ ప్రశ్నించ కూడదు

కుష్ఠుదేవుళ్ళకీ ఆస్తులు

ఎక్కడి వనకూడదు

కుష్ఠుదేవుళ్ళకి కోపం తెప్పించే పనిచేస్తే

మనకింక పుట్టగతులుండవు

నరక ద్వారాలు తెరుచుకుంటాయి

ఎన్నటికీ మనం తిరగబడలేం

రండి

మనమంతా కుష్ఠుదేవుళ్ళ నానా

ముఖాల నానా వేషాలు తిలకిస్తూ

భక్తితో భజన చేద్దాం !

కుష్ఠుదేవుళ్ళ విరాట్ స్వరూపాన్ని కాకాపడుతూ

కొలుద్దాం ! ●

ఈ దేశంలో

## ఈ ఇరవయ్యేళ్ల స్వాతంత్ర్యంలో

భయంకరంగా విజృంభించిన

కులమత దురహంకారానికి

ధనమదంతో యధేచ్ఛగా

ప్రజాస్వామ్యాన్ని వాడుకుంటున్న గూండాయిజానికి,

సినిమా రొంపిలో ఈదులాడుతూన్న

యువతరం బలహీనతకి,

స్తోత్ర పాఠాల కుడితిలో పడిపోయిన

పత్రికా లోకం పడుపు జీవనానికి,

అతీత జీవనంతో తప్పించుకు బతుకుతున్న

మేధావుల అనాసక్తతకి,

నాయకుల ఊసరవెల్లి ఆదర్శాలకి, పదవీ వ్యాపారాలకి,

నేటి

## ఈ 'కుష్ఠు వ్యవస్థ'కి క్రూరంగా బలైన

# 'కంచికచెర్ల' కోటేశు

## స్మృతిలో



కోల్పోయిన, పరిహరింపబడిన, కాలుష్యానికి గురైన స్వేచ్ఛను తిరిగి పొందటంలో భాగంగా తనని తాను స్వచ్ఛ పరచుకోవటం, స్వస్థత పొందటం అనే భారం దిగంబర కవిత మోయక తప్పలేదు. ఈ భారాన్ని మోయటమనే విషయంలో దిగంబరులు గుండె దిటవు గొప్పది. ఈ క్రమంలో దిగంబరులు కీర్తిని, అపకీర్తిని సరిసమానంగానే పొందారు.

ఏ సామాజిక, సాహిత్య ఉద్యమమైనా ప్రజా బాహుళ్యాన్ని కదిలించటానికి మూడు పనులు తప్పనిసరిగా చేయాల్సి ఉంటుంది. ఒకటి : భావాలను సరళీకరించటం. రెండు : సత్యాన్ని ఆవిష్కరించటం, మూడు : ఈ రెండిటి కలయికతో నిబద్ధతతో కూడిన ఆచరణను ఆశించటం. దిగంబరులు ఆశించింది, ఆకాంక్షించింది ఇదే కదా!